
'సంక్షేమ పథకాల అమలే సర్కారు పని తీరుకు కొలమానం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16+4+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17 సంచిక: 22

ఆదివారం 14-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

విశ్వశాంతి విద్యార్థుల విజయాలు

ప్రతి ఫలితం వెనుకాఉంది అంకితభావం !

ప్రతి విజేత వెనుకాఉంది శ్రీ విశ్వశాంతి !!

SRI VISWASANTHI SCHOOL & COLLEGE


Madala Subrahmaneyswara Rao
Founder & Managing Director


Dr. M. SURYASEKHAR
M.B.B.S., M.B.A.,
Chief Executive Director


M. SUSHMA
MSIS., M.B.A.,
Executive Director

• LKG to Intermediate - State Syllabus • LKG to +1 & +2 CBSE Syllabus • Co-education • Residential School & College

SRI VISWASANTHI
EDUCATIONAL INSTITUTIONS

• Recognised by Govt. of A.P.
• Affiliated to B.I.E., A.P.

STATE & CBSE

• Affiliated to CBSE, Delhi.

LKG to 10th, Inter (MPC & BiPC) | LKG to X & XI, XII (PCM & PCB)

IIT & Medical Foundation from VI to X Classes


Madala Prameela Rani
Founder


Dr. M. RAJASEKHAR
M.B.B.S., M.S. (Ortho)
Director


Dr. M. NEELIMA
M.B.B.S.,
Director

Separate Sections & Hostel for...BOYS & GIRLS

A.C. CAMPUS

శ్రీ విశ్వశాంతి జూనియర్ కాలేజి

VUYYURU (Near Vijayawada), Krishna Dt., ANDHRA PRADESH.

Cell : 994 898 4444, 913 331 8502, 924 745 6148, 991 277 5666, 833 300 0899.

Web Site : www.sriviswasanthischools.in E - mail Id : director.sriviswasanthi@gmail.com

ADMISSIONS ARE IN PROGRESS

NCC "A" & "B" Certificates

AP STATE LEVEL SENIOR INTER MPC
above 980/1000 marks


AP STATE LEVEL 988
PARUPUDI PARDHU SRI
H.T. No. : 2412228033

Marks	Name	H.T. No.
984/1000	JAMPANI MADHU PRIYA	2412227898
984/1000	BODDU ARUSH MISRA	2412228541
982/1000	VINAYAKAM NIKHIL	2412221509
981/1000	R. LALITHA CHOWDARI	2412228608
981/1000	K. SAHEB GARI SYED ALI	2412227365
980/1000	K. MOHANA RUPA	2412227853
980/1000	M. SRI POOJITHA	2412228168

AP STATE LEVEL SENIOR INTER BiPC
above 965/1000 marks


AP STATE LEVEL 983
AVULA NAGA KARTHIK
H.T. No. : 2412227217

Marks	Name	H.T. No.
980/1000	K. VENKATA NAVYA SRI	2412227208
975/1000	R. SREE HARITHA	2412221311
966/1000	S. I. MANOJ KUMAR	2412228344
965/1000	E. SAI RISHIKA	2412221388

AP STATE LEVEL JUNIOR INTER BiPC
above 422/440 marks


AP STATE LEVEL 432
CHAVALA PRANITHA
H.T. No. : 2412130173

Marks	Name	H.T. No.
427/440	BATTULA TRILOKYA	2412131222
426/440	D. SNEHA REDDY	2412129440
424/440	N. CHETHANA SRI	2412130500
422/440	B. GNANA DEEPIKA	2412131225

DUE TO LACK OF SPACE WE PRINT LIMITED STUDENTS.... MANY MORE TOPPERS...PLEASE CONTACT FRONT OFFICE.

AP STATE LEVEL JUNIOR INTER MPC
above 460/470 marks



AP STATE LEVEL 465
AKUNURI YAMINI MUKUNDA
H.T. No. : 2412131126

Marks	Name	H.T. No.
464/470	K. Y. V. ASHOK REDDY	2412130520
464/470	PUSUNURU SARANYA	2412129611
463/470	PUTTA LAHARI	2412131151
463/470	J.C.N. S. DHARMA TEJ	2412123217
463/470	G.P. KUMAR REDDY	2412130734
463/470	CHINTHAKAYALA TEJA	2412130996
462/470	BANDA VYSHNAVI	2412123186
462/470	TUMMALACHERLA HARIKA	2412129507
462/470	M.Y. GOWTHAM KRISHNA	2412130759
462/470	V.SREE SHANTH REDDY	2412129638
462/470	KARAKA LOKESH	2412130559
462/470	K. SAGAR BABU	2412130971
462/470	V. KRISHNA PRASAD	2412130984
461/470	EDE ADITYA RAM	2412129680
461/470	KATURI ADHYA	2412131204
461/470	NALLURI SANDEEP	2412130880
461/470	CHINTHAKULA ROHITH	2412131115
461/470	T. KAMALINI JASWANTHI	2412131139
460/470	D. G. RAMA RAJU	2412129663
460/470	CHINTALACHERUVU SUSHITH	2412130762
460/470	V. RAGHUVEERA REDDY	2412131130
460/470	ABBIREDDY LAVANYA	2412131186

2024 ఇంటర్ పరీక్షలలో మా ఫలితాలు విద్యా సేవలో... 50వ సంవత్సరం.

మా వద్ద విద్యనభ్యసించిన వేలాది మంది విద్యార్థినీ... విద్యార్థులు దేశ విదేశాలలో అత్యున్నత స్థానంలో ఉండటం మా సంస్థకు ఎంతో గర్వకారణం

JAYA GRAPHICS - 984 834 3105



సెమీఫైనల్లో రిత్విక్ జోడీ పరాజయం

మొరెలోస్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్–75 టెన్నిస్ టోర్నీ పురుషుల డబుల్స్ విభాగంలో భారత క్రీడాకారులకు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మెక్సికోలో జరుగుతున్న ఈ టోర్నీ తొలి సెమీ ఫైనల్లో హైదరాబాద్‌కు చెందిన బొల్లిపల్లి రిత్విక్–నిక్కీ పునాచా జోడీ 4–6, 6–3, 7–10తో మత్సుజెవ్‌స్కీ (పోలాండ్)–మాథ్యూ రొమియోస్ (ఆస్ట్రేలియా) జంట చేతిలో ఓడిపోయింది. రెండో సెమీఫైనల్లో అర్జున్–జీవన్ (భారత్) ద్వయం 4–6, 7–6 (7/5), 10–8తో జాన్సన్ (బ్రిటన్)–మన్సూరి (ట్యూనిషియా) జంటపై నెగ్గి ఫైనల్ చేరింది.

జొకోవిచ్‌కు చుక్కెదురు

మోంటెకార్లో ఓపెన్ మాస్టర్స్ సిరీస్–1000 టెన్నిస్ టోర్నీలో ప్రపంచ నంబర్‌వన్, టాప్ సీడ్ నొవాక్ జొకోవిచ్ (సెర్బియా) పోరాటం సెమీఫైనల్లో ముగిసింది. 2015 తర్వాత ఈ టోర్నీలో మళ్లీ సెమీఫైనల్ ఆడిన జొకోవిచ్ 4–6, 6–1, 4–6తో కాస్పర్ రూడ్ (నార్వే) చేతిలో ఓడిపోయాడు. జొకోవిచ్‌పై రూడ్‌కిదే తొలి విజయం కావడం విశేషం. గతంలో ఈ సెర్బియా స్టార్‌తో ఆడిన ఐదుసార్లూ రూడ్ ఓటమి చవిచూశాడు. మరో సెమీఫైనల్లో సిట్సిపాస్ (గ్రీస్) 6–4, 3–6, 6–4తో యానిక్ సినెర్ (ఇటలీ)పై గెలిచాడు.



రజతం నెగ్గిన రాధిక

శివాని, ప్రియాలకు కాంస్య పతకాలు



బిష్కెక్ (కిర్గిస్తాన్): ఆసియా సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ మహిళల ఫ్రీస్టయిల్ విభాగంలో భారత్‌కు మూడు పతకాలు లభించాయి. రాధిక (68 కేజీలు) రజత పతకం సొంతం చేసుకోగా... శివాని పవార్ (50 కేజీలు), ప్రియా (76 కేజీలు) కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. 68 కేజీల విభాగం ఫైనల్లో రాధిక 2–15తో నొనోకా ఒజాకి (జపాన్) చేతిలో ఓడిపోయింది. కాంస్య పతకాల బౌట్‌లలో శివాని 9–7తో ఒట్గాన్‌జర్గల్ డొల్గొర్‌జవ్ (మంగోలియా)పై, ప్రియా 4–2తో ఎల్మీరా సిద్దికోవా (కజకిస్తాన్)పై గెలుపొందారు. 59 కేజీల విభాగం కాంస్య పతక బౌట్‌లో భారత రెజ్లర్ పుష్పా యాదవ్ 8–11తో దయానా కయుమోవా (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

ఆసియా గ్రూప్‌లోనే భారత్

చాంగ్షా (చైనా): బిల్లీ జీన్ కింగ్ కప్ మహిళల టీమ్ టెన్నిస్ టోర్నీలో భారత జట్టు వచ్చే ఏడాది కూడా ఆసియా ఓసియానియా గ్రూప్–1లోనే కొనసాగనుంది. వరల్డ్ గ్రూప్ ప్లే ఆఫ్స్ దశకు అర్హత సాధించాలంటే... తప్పనిసరిగా గెలవాల్సిన చివరి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు 1–2తో న్యూజిలాండ్ చేతిలో ఓడిపోయింది.



తొలి మ్యాచ్‌లో రుతుజా భోస్లే 6–2, 7–6 (7/5)తో మోనిక్ బ్యారీపై నెగ్గింది. రెండో మ్యాచ్‌లో భారత నంబర్‌వన్ అంకిత రైనా 2–6, 0–6తో లులూ సన్ చేతిలో ఓడిపోయింది. నిర్ణాయక డబుల్స్ మ్యాచ్‌లో అంకిత–ప్రార్థన ద్వయం 1–6, 5–7తో పైగి హురిగాన్–ఎరిన్ రూట్లిఫ్ జోడీ చేతిలో పరాజయం పాలవ్వడంతో భారత్‌కు ఓటమి ఖరారైంది. తొలి రెండు స్థానాల్లో నిలిచిన చైనా, కొరియా ప్లే ఆఫ్స్‌కు అర్హత పొందాయి.

6,6,6,6,6,6

ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన నేపాల్ బ్యాటర్ దీపేంద్ర సింగ్



అల్ అమారత్ (ఒమన్): యువరాజ్ సింగ్, కీరన్ పొలార్డ్ తర్వాత అంతర్జాతీయ టి20 క్రికెట్‌లో ఒకే ఓవర్లో 6 సిక్స్‌లు కొట్టిన మూడో బ్యాటర్‌గా నేపాల్ ప్లేయర్ దీపేంద్ర సింగ్ ఘనత సాధించాడు. ఆసియా క్రికెట్ కౌన్సిల్ పురుషుల ప్రీమియర్ కప్ టి20 టోర్నీలో భాగంగా ఖతర్‌తో జరిగిన మ్యాచ్‌లో 24 ఏళ్ల దీపేంద్ర (21 బంతుల్లో 64; 3 ఫోర్లు, 7 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ఖతర్ బౌలర్ కమ్రాన్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ చివరి ఓవర్లో దీపేంద్ర ఆరు సిక్స్‌లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మొదట నేపాల్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 210 పరుగులు చేసింది. ఖతర్ 9 వికెట్ల నష్టానికి 178 పరుగులకే పరిమితమైంది.

శ్రీనిధి డెక్కన్ ఎఫ్‌సీ జట్టుకు రెండో స్థానం



సాక్షి, హైదరాబాద్: ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ లీగ్ చాంపియన్‌షిప్‌ను హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు విజయంతో ముగించింది. శనివారం ఇక్కడ జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 3–2 గోల్స్ తేడాతో షిల్లాంగ్ లాజోంగ్ ఎఫ్‌సీ జట్టును ఓడించింది. శ్రీనిధి జట్టు తరఫున విలియమ్ అల్వెస్ ఒలీవీరా (4వ ని.లో), గేబ్రియల్ రోసెన్‌బర్గ్ (16వ ని.లో), డేవిడ్ కాస్టనెడా మునోజ్ (84వ ని.లో) ఒక్కో గోల్ చేశారు. షిల్లాంగ్ జట్టుకు ఫ్రాంగీ బువామ్ (46వ, 87వ ని.లో) రెండు గోల్స్ అందించాడు. 13 జట్లు పోటీపడ్డ ఐ–లీగ్‌లో శ్రీనిధి జట్టు నిర్ణీత 24 మ్యాచ్‌లు పూర్తి చేసుకుంది. 14 మ్యాచ్‌ల్లో నెగ్గిన శ్రీనిధి జట్టు ఆరు మ్యాచ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు మ్యాచ్‌ల్లో ఓడిపోయి మొత్తం 48 పాయింట్లతో రెండో స్థానాన్ని దక్కించుకుంది. గత సీజన్‌లోనూ శ్రీనిధి జట్టు రెండో స్థానంలోనే నిలిచింది. 52 పాయింట్లతో ఐ–లీగ్ చాంపియన్‌గా నిలిచిన మొహమ్మదాన్ స్పోర్టింగ్ క్లబ్ ఇండియన్ సూపర్ లీగ్‌కు అర్హత సాధించింది.

హై హై హెట్‌మైర్...

- రాజస్తాన్ రాయల్స్‌ను గెలిపించిన హిట్టర్
- 10 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్స్‌లతో 27 నాటౌట్
- పంజాబ్ కింగ్స్‌కు మరో ఓటమి


హెట్‌మైర్

ముల్లాన్‌పూర్: ఇరుజట్ల బౌలర్లు శాసించిన మ్యాచ్‌లో... హెట్‌మైర్‌లాంటి హిట్టర్ చివరి ఓవర్ ఆడటంతో పంజాబ్ కింగ్స్‌పై రాజస్తాన్ రాయల్స్ పైచేయి సాధించింది. మొత్తమ్మీద కేశవ్ మహరాజ్ స్పిన్, ఆవేశ్ పేస్, హెట్‌మైర్ మెరుపులు వెరసి రాజస్తాన్ ఖాతాలో ఐదో విజయం చేరింది. శనివారం జరిగిన ఈ పోరులో రాజస్తాన్ రాయల్స్ 3 వికెట్ల తేడాతో పంజాబ్ కింగ్స్‌పై గట్టెక్కింది. మొదట పంజాబ్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 147 పరుగులు చేసింది. అశుతోష్ శర్మ (16 బంతుల్లో 31; 1 ఫోర్, 3 సిక్స్‌లు) ఇన్నింగ్స్ టాప్ స్కోరర్‌గా నిలిచాడు! కేశవ్ మహరాజ్, ఆవేశ్ ఖాన్ చెరో 2 వికెట్లు తీశారు. అనంతరం లక్ష్యఛేదనకు దిగిన రాజస్తాన్ 19.1 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసి గెలిచింది. యశస్వి జైస్వాల్ (28 బంతుల్లో 39; 4 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హెట్‌మైర్ (10 బంతుల్లో 27 నాటౌట్; 1 ఫోర్, 3 సిక్స్‌లు) మెరిపించారు.

బోర్ కొట్టించిన కింగ్స్ ఇన్నింగ్స్

అథర్వ (15), బెయిర్‌స్టో (15), ప్రభ్‌సిమ్రాన్ (10), తాత్కాలిక కెప్టెన్ స్యామ్ కరన్ (6)... పంజాబ్ ఇన్నింగ్స్‌లో టాప్–4 బ్యాటర్ల స్కోరు! 12.1 ఓవర్లలో 70/5 వద్ద కింగ్స్ ఆటతీరు! దీంతో పవర్ ప్లే సహా ఆఖరి దాకా పంజాబ్ ఇన్నింగ్స్‌లో ఆదరగొట్టింది... ఆకట్టుకుంది ఏ ఒక్కటీ లేదు. జితేశ్ 29 పరుగులు చేసినా... 24 బంతులు ఆడాడు. అశుతోష్ బాదిన ఆ మాత్రం మెరుపులే పంజాబ్ కొద్దోగొప్పో స్కోరుకు దోహదపడ్డాయి.

తడబడినా... ఉత్కంఠకు నిలబడి...

లక్ష్యం కష్టమైంది కాదు! ఓపెనర్లు తొలి వికెట్‌కు 56 పరుగుల శుభారంభం ఇచ్చారు. అయినా కూడా రాజస్తాన్ తడబడింది. యశస్వి జైస్వాల్ ఓపెనింగ్‌లో 'ఇంపాక్ట్' చూపగా, తనుశ్ కొటియన్ (31 బంతుల్లో 24; 3 ఫోర్లు) మోస్తరు పరుగులు చేశాడు. రబడ నిప్పులు చెరిగే బౌలింగ్‌తో యశస్వి, సంజు సామ్సన్ (18)లను అవుట్ చేసి ఒత్తిడి పెంచాడు. పడుతూ... లేస్తూ జట్టు వంద స్కోరు దాటాక హిట్టర్ రియాన్ పరాగ్ (18 బంతుల్లో 23; 1 ఫోర్, 1 సిక్స్), ధ్రువ్ జురెల్ (6)లు కూడా రెండు పరుగుల వ్యవధిలో పెవిలియన్ చేరడంతో 14 బంతుల్లో 30 పరుగుల సమీకరణం గుదిబండగా మారింది. ఈ దశలో హెట్‌మైర్ 17వ ఓవర్ చివరి రెండు బంతుల్లో 4, 6 కొట్టాడు. తర్వాత స్యామ్ కరన్ 2 బౌండరీలు ఇచ్చినా పావెల్ (11), కేశవ్ (1)లను అవుట్ చేశాడు. అర్ష్‌దీప్ ఆఖరి ఓవర్లో తొలి 2 బంతులకు పరుగే ఇవ్వలేదు. కానీ హెట్‌మైర్ 6,2,6లతో మరో బంతి మిగిలుండగానే మ్యాచ్‌ను ముగించాడు.

స్కోరు వివరాలు

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: అథర్వ (సి) కుల్దీప్ సేన్ (బి) ఆవేశ్ 15; బెయిర్‌స్టో (సి) హెట్‌మైర్ (బి) కేశవ్ 15; ప్రభ్‌సిమ్రాన్ (సి) జురెల్ (బి) చహల్ 10; స్యామ్ కరన్ (సి) జురెల్ (బి) కేశవ్ 6; జితేశ్ (సి) పరాగ్ (బి) ఆవేశ్ 29; శశాంక్ (సి) జురెల్ (బి) కుల్దీప్ సేన్ 9; లివింగ్‌స్టోన్ (రనౌట్(21; అశుతోష్ (సి) కేశవ్ (బి) బౌల్ట్ 31; హర్‌ప్రీత్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 8; మొత్తం (20 ఓవర్లలో 8 వికెట్లకు) 147. వికెట్ల పతనం: 1–27, 2–41, 3–47, 4–52, 5–70, 6–103, 7–122. బౌలింగ్: బౌల్ట్ 4–0–22–0, కుల్దీప్ సేన్ 4–0–35–1, ఆవేశ్ ఖాన్ 4–0–34–2, చహల్ 4–0–31–1, కేశవ్ మహరాజ్ 4–0–23–2.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) హర్షల్ (బి) రబడ 39; తనుశ్ (బి) లివింగ్‌స్టోన్ 24; సామ్సన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) రబడ 18; పరాగ్ (సి) రబడ (బి) అర్ష్‌దీప్ 23; జురెల్ (సి) శశాంక్ (బి) హర్షల్ 6; హెట్‌మైర్ (నాటౌట్) 27; పావెల్ (సి) జితేశ్ (బి) స్యామ్ కరన్ 11; కేశవ్ (సి) లివింగ్‌స్టోన్ (బి) స్యామ్ కరన్ 1; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 3; మొత్తం (19.5 ఓవర్లలో 7 వికెట్లకు) 152. వికెట్ల పతనం: 1–56, 2–82, 3–89, 4–113, 5–115, 6–136, 7–138. బౌలింగ్: అర్ష్‌దీప్ 3.5–0–45–1, రబడ 4–0–18–2, సామ్ కరన్ 4–0–25–2, లివింగ్‌స్టోన్ 3–0–21–1, హర్షల్ 2–0–21–1, హర్‌ప్రీత్ బ్రార్ 3–0–22–0.

ఐపీఎల్‌లో నేడు

కోల్‌కతా X లక్నో
వేదిక: కోల్‌కతా
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

ముంబై X చెన్నై
వేదిక: ముంబై
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	6	5	1	10	0.767
కోల్‌కతా	4	3	1	6	1.528
చెన్నై	5	3	2	6	0.666
లక్నో	5	3	2	6	0.436
హైదరాబాద్	5	3	2	6	0.344
గుజరాత్	6	3	3	6	-0.637
ముంబై	5	2	3	4	-0.073
పంజాబ్	6	2	4	4	-0.218
ఢిల్లీ	6	2	4	4	-0.975
బెంగళూరు	6	1	5	2	-1.124

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

అమిత్‌కు పిలుపు హుసాముద్దీన్‌పై వేటు

ఒలింపిక్ క్వాలిఫయింగ్ టోర్నీకి భారత బాక్సింగ్ జట్టు ప్రకటన



న్యూఢిల్లీ: పారిస్ ఒలింపిక్స్ వరల్డ్ క్వాలిఫయింగ్ బాక్సింగ్ చివరి టోర్నీలో పాల్గొనే భారత జట్టును ప్రకటించారు. గత నెలలో జరిగిన తొలి క్వాలిఫయింగ్ టోర్నీలో భారత బాక్సర్లు తొమ్మిది కేటగిరీల్లో బరిలోకి దిగినా ఒక్కరు కూడా ఒలింపిక్స్ బెర్త్‌ను దక్కించుకోలేకపోయారు. తొలి టోర్నీలో పాల్గొన్న ఐదుగురు బాక్సర్లపై (దీపక్ భోరియా, హుసాముద్దీన్, శివ థాపా, లక్ష్య చహర్, జాస్మిన్) వేటు పడింది. దీపక్ స్థానంలో 2022 కామన్వెల్త్ గేమ్స్ స్వర్ణ పతక విజేత అమిత్ పంఘాల్‌కు మళ్లీ జాతీయ జట్టులో చోటు దక్కింది. తెలంగాణ బాక్సర్ హుసాముద్దీన్ స్థానంలో సచిన్ సివాచ్‌ను ఎంపిక చేశారు. చివరి క్వాలిఫయింగ్ టోర్నీ మే 25 నుంచి జూన్ 2 వరకు బ్యాంకాక్‌లో జరుగుతుంది. ఇప్పటి వరకు భారత్ నుంచి మహిళల విభాగంలో నలుగురు బాక్సర్లు (నిఖత్ జరీన్, ప్రీతి, పర్వీన్, లవ్లీనా) పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించారు.

భారత బాక్సింగ్ జట్టు: పురుషుల విభాగం: అమిత్ పంఘాల్ (51 కేజీలు), సచిన్ సివాచ్ (57 కేజీలు), అభినాష్ జమ్వాల్ (63.5 కేజీలు), నిశాంత్ దేవ్ (71 కేజీలు), అభిమన్యు (80 కేజీలు), సంజీత్ (92 కేజీలు), నరేందర్ (ప్లస్ 92 కేజీలు). మహిళల విభాగం: అంకుశిత (60 కేజీలు), అరుంధతి (66 కేజీలు).

విజయం లేకుండానే...



పెర్త్: ఆస్ట్రేలియాలో ఐదు మ్యాచ్‌ల హాకీ సిరీస్‌ను భారత జట్టు పరాజయంతో ముగించింది. శనివారం జరిగిన చివరి మ్యాచ్‌లో టీమిండియా 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. వరుసగా ఐదో విజయంతో ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 5–0తో క్లీన్‌స్వీప్ చేసింది. ఆఖరి మ్యాచ్‌లో భారత్ తరఫున కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ (4వ ని.లో), బాబీసింగ్ ధామి (53వ ని.లో)... ఆస్ట్రేలియా తరఫున జెరెమి హేవార్డ్ (20వ ని.లో), కి విలోట్ (38వ ని.లో), టిమ్ బ్రాండ్ (39వ ని.లో) ఒక్కో గోల్ సాధించారు.

సినిమా


సల్మాన్ ఖాన్ • రణ్‌వీర్ సింగ్ • షాహిద్ కపూర్ • వరుణ్ ధావన్ • అక్షయ్ కుమార్

బాహుబలి, ఆర్‌ఆర్‌ఆర్, కేజీఎఫ్ వంటి చిత్రాలతో దక్షిణాది సినిమా ప్రపంచవ్యాప్తంగా పాపులర్ అయింది. సౌత్ డైరెక్టర్ల క్రేజ్ కూడా బాగా పెరిగింది. అందుకే బాలీవుడ్ హీరోలు సౌత్ డైరెక్టర్లతో సినిమాలు చేయడానికి సై అంటున్నారు. ఈ మధ్యకాలంలో తెలుగు దర్శకుడు సందీప్ రెడ్డి వంగా, తమిళ దర్శకుడు అట్లీ వంటి వారు బాలీవుడ్‌లో సక్సెస్ అయ్యారు. ఈ నేపథ్యంలో దక్షిణాది దర్శకులతో ఉత్తరాది హీరోలు చేస్తున్న సినిమాల గురించి తెలుసుకుందాం.

సౌత్ డైరెక్షన్‌కి సై

సికందర్ సిద్ధం


మురుగదాస్

దాదాపు పదిహేనేళ్ల క్రితమే హిందీ 'గజిని' కోసం హిందీ హీరో సల్మాన్ ఖాన్, తమిళ దర్శకుడు ఏఆర్ మురుగదాస్ కలిసి పని చేయాల్సింది. అయితే ఆ చిత్రంలో ఆమిర్ ఖాన్ హీరోగా నటించగా మురుగదాస్ దర్శకత్వం వహించారు. 'గజిని' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. కానీ మురుగదాస్ మాత్రం సల్మాన్ ఖాన్‌తో ఎలాగైనా ఓ సినిమా చేయాలని అనుకుంటూనే ఉన్నారు. ఈ క్రమంలో ఐదేళ్ల క్రితం సల్మాన్ ఖాన్‌కు ఓ కథ చెప్పారు మురుగదాస్. ఈ కథ సల్మాన్‌కు నచ్చలేదట. దీంతో సెట్ కాలేదు. కానీ తనతో సినిమా చేయాలనుకుంటున్న మురుగదాస్‌కు మరో నరేషన్ ఇచ్చే చాన్స్ ఇచ్చారు సల్మాన్. ఈసారి సల్మాన్‌కు కథ నచ్చడంతో సినిమా సెట్ అయ్యింది. ఈ సినిమాకు 'సికందర్' టైటిల్ పెట్టారు. ఈ చిత్రం షూటింగ్ ఈ వేసవిలో ఆరంభం కానుందట. వచ్చే ఏడాది ఈద్‌కి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయనున్నారు. అలాగే సల్మాన్ ఖాన్ 'ది బుల్' అనే సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. హిందీ హీరో సిద్ధార్థ్ మల్హోత్రాకు 'షేర్షా' వంటి హిట్ ఇచ్చిన తమిళ దర్శకుడు విష్ణువర్ధన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నారని సమాచారం.

బాలీవుడ్ అపరిచితుడు


శంకర్

విక్రమ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహించిన 'అన్నియన్' ('అపరిచితుడు') సినిమా బ్లాక్‌బస్టర్. ఈ సినిమాను రణ్‌వీర్ సింగ్‌తో హిందీలో రీమేక్ చేయాలనుకున్నారు శంకర్. దాదాపు మూడేళ్ల క్రితం ఈ సినిమా ప్రకటించినా ఇంకా సెట్స్‌పైకి వెళ్లలేదు. ప్రస్తుతం 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' సినిమాల పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్, 'గేమ్ చేంజర్' సినిమాతో బిజీగా ఉన్నారు శంకర్. ఈ సినిమాలు విడుదలయ్యాక రణ్‌వీర్ సింగ్‌తో శంకర్ సినిమా ఉంటుందట. అయితే 'అన్నియన్' రీమేక్ రైట్స్ విషయంలో వివాదం నడుస్తున్న నేపథ్యంలో రణ్‌వీర్‌తో 'అన్నియన్' సినిమానే శంకర్ చేస్తారా? లేక కొత్త కథతో సెట్స్‌పైకి వెళ్తారా? అనే విషయం తెలియాల్సి ఉంది.

దసరాకు దేవా

ఈ దసరాకి షాహిద్ కపూర్‌ను 'దేవా'గా థియేటర్స్‌కు తీసుకురావాలనుకుంటున్నారు మలయాళ దర్శకుడు రోషన్ ఆండ్రూస్. షాహిద్ కపూర్ టైటిల్ రోల్ చేస్తున్న ఈ యాక్షన్ ఫిల్మ్‌లో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తున్నారు. హిందీలో రోషన్ ఆండ్రూస్‌కు 'దేవా' తొలి చిత్రం. కాగా షాహిద్ కపూర్ నెక్ట్స్ ఫిల్మ్ కూడా దక్షిణాది దర్శకుడుతోనే ఖరారైంది. కన్నడ దర్శకుడు సచిన్ రవితో 'అశ్వత్థామ: ది సాగా కంటిన్యూస్' ఫిల్మ్ కమిటయ్యారు షాహిద్. 'దేవా' పూర్తి కాగానే 'అశ్వత్థామ: ది సాగా...' షూటింగ్ ఆరంభం అవుతుందట.


సచిన్ రవి


రోషన్ ఆండ్రూస్

బేబీ జాన్ వస్తున్నాడు


కాలిస్

వరుణ్ ధావన్‌ను 'బేబీ జాన్'గా మార్చేశారు తమిళ దర్శకుడు కాలిస్. వరుణ్ ధావన్ హీరోగా తమిళ దర్శకుడు అట్లీ నిర్మిస్తున్న సినిమా 'బేబీ జాన్'. కాలిస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో కీర్తీ సురేష్, వామికా గబ్బి హీరోయిన్లు. ఈ సినిమా మే 31న రిలీజ్ కానుంది.

హిట్ రీమేక్‌తో...


సుధ కొంగర

తమిళ చిత్రం 'సూరరై పోట్రు' బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఈ మూవీ హిందీలో 'సర్ఫిరా'గా రీమేక్ అవుతుండగా, అక్షయ్ కుమార్ హీరోగా నటిస్తున్నారు. మాతృకకు దర్శకత్వం వహించిన సుధ కొంగరయే 'సర్ఫిరా'కు దర్శకత్వం వహిస్తున్నారు. అలాగే 'సూరరై పోట్రు'లో నటించిన సూర్య 'సర్ఫిరా'కు ఓ నిర్మాతగా ఉంటూ, గెస్ట్ రోల్ చేయడం విశేషం. ఈ చిత్రం జూన్‌లో విడుదల కానుంది.

ఇంకా తెలుగు దర్శకులు తేజ, గోపీచంద్ మలినేని, ప్రశాంత్ వర్మ, తమిళ దర్శకుడు పా. రంజిత్ తదితరులు చెప్పిన కథలను హిందీ హీరోలు విన్నారని సమాచారం.

చిన్నారి దేవత వచ్చింది


మంచు మనోజ్

''ఆ దేవతల ఆశీర్వాదంతో మా ఇంటికి చిన్నారి దేవత వచ్చింది. మనోజ్, మౌనికకు కుమార్తె పుట్టిందని చెప్పడం మాకెంతో హ్యాపీగా ఉంది'' అంటూ సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు మంచు లక్ష్మి. మంచు మనోజ్ భార్య మౌనిక శనివారం కుమార్తెకు జన్మనిచ్చారు. ''మేం పాపను ఎమ్ఎమ్ పులి (మంచు మనోజ్ పులి అయ్యుండొచ్చు) అని ముద్దుగా పిలుస్తున్నాం'' అని కూడా లక్ష్మి పేర్కొన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే.. మనోజ్ నటిస్తున్న తాజా యాక్షన్ చిత్రం షూటింగ్ జరుగుతోంది. ఈ చిత్రం గ్లింప్స్‌ని మనోజ్ పుట్టినరోజు సందర్భంగా మే 20న విడుదల చేయాలనుకుంటున్నారు.

ఆ సమాధానాలు మూడో భాగంలో చెబుతాం

– దర్శకుడు శివ తుర్లపాటి

హీరోయిన్ అంజలి నటించిన చిత్రం 'గీతాంజలి మళ్ళీ వచ్చింది'. 'గీతాంజలి' సినిమాకు సీక్వెల్ ఇది. ఈ సీక్వెల్‌లో శ్రీనివాస రెడ్డి, సునీల్, సత్య, అలీ, 'సత్యం' రాజేశ్, 'షకలక' శంకర్, రాహుల్ మాధవ్ కీలక పాత్రలు పోషించారు. సినిమాటోగ్రాఫర్ శివ తుర్లపాటిని దర్శకుడిగా పరిచయం చేస్తూ, కోన వెంకట్, ఎంవీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 11న విడుదలైంది. ఈ సందర్భంగా శివ తుర్లపాటి మాట్లాడుతూ – ''మా సినిమాలోని కొన్ని ప్రశ్నలకు సమాధానాలు లేవని కొందరు సినీ విమర్శకులు అభిప్రాయపడ్డారు. ఆ ప్రశ్నలకు సమాధానాలు 'గీతాంజలి' పార్టు 3లో ఉంటాయి. ఇక బ్యాక్‌గ్రౌండ్ డ్యాన్సర్‌గా కెరీర్ స్టార్ట్ చేసి, ఆ తర్వాత దర్శకుడు తేజగారి 'జై' సినిమాతో కొరియోగ్రాఫర్‌గా మారాను. వ్యక్తిగత కారణాల వల్ల అమెరికా వెళ్లి, అక్కడ డ్యాన్స్ స్కూల్ రన్ చేస్తున్నాను. నేను అమెరికాలో చేసిన ఓ కవర్ సాంగ్ ద్వారా కోన వెంకట్‌గారు నాకు పరిచయం అయ్యారు. ఇక దర్శకుడిగా నా తదుపరి సినిమా కోసం రెండు కథలు రెడీగా ఉన్నాయి'' అని చెప్పుకొచ్చారు.



అప్పుడు కన్నీళ్లొచ్చాయి

– 'సత్యం' రాజేశ్

'సత్యం' రాజేశ్ హీరోగా నటించిన ఫ్యామిలీ ఎమోషనల్ మూవీ 'టెనెంట్'. మేఘా చౌదరి హీరోయిన్‌గా, చందన పయావుల, భరత్ కాంత్ కీలక పాత్రల్లో నటించిన ఈ సినిమాకు వై. యుగంధర్ దర్శకుడు. మోగుళ్ళ చంద్రశేఖర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో నటుడు ప్రియదర్శి అతిథిగా పాల్గొని ఈ సినిమా విజయం సాధించాలన్నారు. 'సత్యం' రాజేశ్ మాట్లాడుతూ – ''ఈ సినిమా క్లైమాక్స్‌కు డబ్బింగ్ చెబుతున్నప్పుడు కన్నీళ్లు వచ్చాయి'' అన్నారు. ''సహజత్వంతో కూడిన ఎమోషన్స్ ఉన్న సినిమా ఇది'' అన్నారు చంద్రశేఖర్ రెడ్డి. ''టెనెంట్' చూసిన మహిళలు ఈ చిత్రాన్ని చూడాల్సిందిగా అబ్బాయిలకు చెబుతారు'' అని వై. యుగంధర్ అన్నారు.


'సత్యం' రాజేశ్

జీరో బడ్జెట్‌తో...


నవీన్, లయ

ఓ సినిమాకు సంబంధించి, ఆ చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరి ఖర్చులు వారే సొంతంగా భరిస్తూ ఓ సినిమాను రూపొందిస్తే ఆ మూవీని 'జీరో బడ్జెట్' అంటుంటారు. ఈ కోవలో రూపొందిన తాజా చిత్రం 'శరపంజరం'. నవీన్‌కుమార్ గట్టు దర్శకత్వంలో రూపొందించి, హీరోగా నటించిన ఈ చిత్రంలో లయ హీరోయిన్. టి. గణపతిరెడ్డి సహకారంతో మామిడి హరికృష్ణ ఆశీస్సులతో షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మాట్లాడుతూ– ''ఇది మట్టిమనుషుల కథ. సామాజిక చైతన్యం కోసం పాటు పడే కథను ఎంచుకున్న చిత్రయూనిట్‌కు నా అభినందనలు'' అన్నారు. ''ఈ సినిమా లొకేషన్‌కు వెళితే ఎవరి టిఫిన్‌లు, భోజనాలు వారే తెచ్చుకోవడం చూశాను. ఇలాంటి చిత్రాలు మరిన్ని వస్తేనే అనేక వర్గాలు, జాతుల ప్రజల నిజ జీవితాలు ప్రపంచానికి తెలుస్తాయి'' అన్నారు టి. గణపతిరెడ్డి. ''జీరో బడ్జెట్‌తో, స్నేహితుల సహకారంతో మొదలు పెట్టిన ఈ సినిమా విడుదల వరకు రావడం హ్యాపీ'' అన్నారు నవీన్.




ఈ డాక్టరేట్ వారికే చెందుతుంది

– రామ్‌చరణ్

''నాపై ఇంత ప్రేమాభిమానాలు చూపించి గౌరవంతో డాక్టరేట్ బహుకరించిన వేల్స్ యూనివర్సిటీ వారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. నేను ఈరోజు ఈ వేదికపై ఉండటం సంతోషంగా ఉంది'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. చెన్నైకి చెందిన ప్రముఖ విశ్వ విద్యాలయం వేల్స్ ఇటీవల రామ్‌చరణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ విశ్వ విద్యాలయం చైర్మన్ ఐసరి గణేష్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం చెన్నై, పల్లావరంలోని వేల్స్ విశ్వ విద్యాలయంలో జరిగిన 34వ స్నాతకోత్సవంలో వివిధ రంగాలలోని స్థానికులకు గౌరవ డాక్టరేట్ పట్టం ప్రదానోత్సవం జరిగింది. ఢిల్లీకి చెందిన ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ చైర్మన్ టీజీ సీతారామ్ ముఖ్య అతిథిగా హాజరై గౌరవ డాక్టరేట్ పట్టాలను ప్రదానం చేశారు. కాగా సినీ రంగంలో (నటుడిగా, నిర్మాతగా), లైన్స్ క్లబ్ ద్వారా విశేష సేవలు అందిస్తున్నందుకు గాను రామ్‌చరణ్‌కు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ – ''చెన్నై విజయా ఆస్పత్రిలో పుట్టాను. ఇక్కడే పద్మ శేషాద్రి పాఠశాలలో చదువుకున్నాను. ఇదే చెన్నైలో గౌరవ డాక్టరేట్ బిరుదును అందుకోవడం చాలా సంతోషంగా ఉంది. చెన్నై నాకు ఎప్పుడూ ప్రత్యేకం. మా నాన్నగారు (హీరో చిరంజీవి) నటుడిగా తన ప్రయాణాన్ని ఇక్కడ్నుంచే ప్రారంభించారు. నా భార్య ఉపాసన తాత, అపోలో ఆస్పత్రి అధినేత ప్రతాప్ సి. రెడ్డి చెన్నైలోనే తన వ్యాపారాన్ని ప్రారంభించి, విస్తరింపజేశారు. కలలు కనేవారికి చెన్నై సాకారం చేస్తుంది. ఈ గౌరవ డాక్టరేట్ నాకన్నా నా దర్శక–నిర్మాతలు, సహ నటీనటులు, సాంకేతిక వర్గం, అభిమానులకే చెందుతుంది. సినిమాల విషయానికి వస్తే డైరెక్టర్ శంకర్‌గారితో 'గేమ్ ఛేంజర్' సినిమా చేస్తున్నాను. డిఫరెంట్ స్టోరీతో ఈ పొలిటికల్ థ్రిల్లర్ తెరకెక్కుతోంది. ఐదు భాషల్లో పాన్ ఇండియా మూవీగా సెప్టెంబర్ లేదా అక్టోబరులో విడుదల చేయాలని అనుకుంటున్నాం'' అన్నారు.

– 'సాక్షి' ప్రతినిధి, చెన్నై

సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16+4+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 22
SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | BANGALORE | CHENNAI | DELHI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


'ప్రభుత్వ పథకాలు మరింత వేగంగా మారుమూల పల్లెలకు వెళ్లాలి'

అడుగడుగునా నీరాజనాలతో సాగుతున్న అపూర్వ యాత్రను చూసి ఓర్వలేక

సీఎం జగన్‌పై హత్యాయత్నం

సాయంత్రం 5 నుంచి విజయవాడలో సాగిన అపూర్వ యాత్ర
వారధి దాటిన దగ్గర్నుంచీ అడుగడుగునా జనం నీరాజనాలు

రాత్రి 8.10 సమయంలో సింగ్‌నగర్లో జగన్ టార్గెట్‌గా దుశ్చర్య

- పథకం ప్రకారం ఒక స్కూల్ రెండో అంతస్తులో దాక్కున్న ఆగంతకుడు
- అక్కడి నుంచి జగన్ కణతకు గురిచూసి పదునైన వస్తువుతో దాడి
- ప్రజలకు అభివాదం చేస్తూ జగన్ పక్కకు తిరగటంతో.. తప్పిన గురి
- కనుబొమపై తీవ్ర గాయం.. పక్కకు తూలి.. గాయాన్ని అదిమి పట్టుకున్న జగన్
- జనానికి అభివాదం చేస్తూనే బస్సులోకి.. ఆ వెంటనే ప్రథమ చికిత్స
- అనంతరం గాయంతోనే యాత్రను కొనసాగించిన ముఖ్యమంత్రి
- జగన్ కనుబొమ పైన తగిలాక.. పక్కనున్న వెలంపల్లికీ గాయం
- ఆ వస్తువు పదును, వేగాన్ని బట్టి... పలు రకాలుగా నిపుణుల వ్యాఖ్యలు
- రాయి, గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్... ఏదైనా కావచ్చని వ్యాఖ్యలు
- ఆ వేగాన్ని బట్టి చూస్తే.. అది కచ్చితంగా హత్యాయత్నమేనన్న వెలంపల్లి
- ఈ దురాగతానికి పాల్పడింది చంద్రబాబు నాయుడేనంటూ విమర్శలు
- 'టప్'మనే శబ్దాన్ని తాను స్పష్టంగా విన్నానన్న ఎంపీ కేశినేని నాని
- షెడ్యూలు ప్రకారం రాత్రి 10.38 వరకూ సాగి... ముగిసిన యాత్ర
- అనంతరం నేరుగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్
- లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేసిన వైద్యులు
- విశ్రాంతి తీసుకోవాలని జగన్‌కు సూచన.. నేడు యాత్రకు విరామం
- దాడిని.. బాబు వైఖరిని మూకుమ్మడిగా ఖండించిన వైఎస్సార్‌సీపీ నేతలు
- రాష్ట్రవ్యాప్తంగా మిన్నంటిన వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసనలు
- ప్లాన్ చేసి చేయాల్సిన అవసరం రాజకీయ ప్రత్యర్థులదేనని వ్యాఖ్యలు
- దాడిని తీవ్రంగా ఖండించిన తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్
- జగన్ త్వరగా కోలుకోవాలని ప్రధాని మోదీ, బెంగాల్ సీఎం మమత ఆకాంక్ష

'సిద్ధం' అంటూ నగారా మోగించి.. జన క్షేత్రంలో అడుగడుగునా నీరాజనాలు అందుకుంటూ బస్సు యాత్రను కొనసాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసి రాజకీయ ప్రత్యర్థులు తట్టుకోలేకపోయారు. విజయవాడ నగరంలో శనివారం సాయంత్రం 5 గంటల నుంచీ కనీవినీ ఎరుగని అశేష జన స్పందనతో సాగిన యాత్రలో... సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని లక్ష్యంగా చేసుకొని హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఏ దారిలో వెళతారు? ఎక్కడెక్కడ ఆగుతారు? యాత్ర వెళ్లేటపుడు కరెంటు వైర్లు తగలకుండా కరెంటు తీసేస్తారు కనుక చీకటిగా ఉన్నపుడు ఎక్కడైతే బాగుంటుంది? అనే అంశాలన్నిటినీ అధ్యయనం చేసి... విజయవాడ సింగ్‌నగర్లో ఓ పాఠశాల కేంద్రంగా పక్కా ప్లాన్‌తో ఆయన్ను అంతమొందించడానికి ప్రయత్నం చేశారు. స్కూల్లో నక్కి ఉండి.. ఆయన బస్సుపై నుంచి అభివాదం చేస్తున్నపుడు... కరెంటు లేని సమయాన్ని ఆసరాగా చేసుకుని... బస్సుపై ఫ్లడ్ లైట్ల వెలుగుల్లో ఉన్న జగన్‌ను గురిచూసి పదునైన వస్తువుతో కొట్టారు. జగన్ కణతకు గురిపెట్టి సంధించిన ఆ వస్తువు గనుక ఆయనకు అదే ప్రాంతంలో తగిలి ఉంటే ఏమయ్యేదో అనేది ఊహించడానికే భయం వేసే పరిణామం. అదృష్టవశాత్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఆయన పక్కకు తిరగటంతో... ఆ వస్తువు ఆయన కణతకు బదులు ఆయన ఎడమ కనుబొమపై తగిలింది. లోపలికంటా చర్మం చీలిపోయి బలమైన గాయం అయ్యింది. అంతేకాక... ఆయనకు గాయం చేశాక... అదే వస్తువు ఆయన పక్కనే నిల్చున్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్ ఎడమ కంటికి కూడా తగిలింది. ఆయన కన్ను వాచింది. వైఎస్ జగన్‌కు వస్తువు బలంగా తగలటంతో... ఆయన ఒక్కసారిగా విలవిలలాడుతూ పక్కకు ఒరిగారు. తరవాత తమాయించుకుని నిలబడి గాయాన్ని గట్టిగా చేత్తో

మిగతా 2వ పేజీలో ▶


ఆగంతకుడి హత్యాయత్నంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ కనుబొమపై అయిన తీవ్ర గాయం

కృష్ణా తీరం.. పోటెత్తిన జనప్రవాహం

విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు జననీరాజనం
గుంటూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లాలోకి అడుగుపెట్టిన యాత్ర


విజయవాడ కనకదుర్గమ్మ వారధి వద్ద సీఎం జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనవాహినిలో ఓ భాగం

దుర్గమ్మ నీడలో కృష్ణమ్మ సాక్షిగా కిక్కిరిసిన కనకదుర్గమ్మ వారధి
వీడ్కోలు పలికిన గుంటూరు జిల్లా వాసులు
గుండెల నిండా ప్రేమను నింపుకుని స్వాగతం పలికిన ఎన్టీఆర్ జిల్లా నేతలు.. అభిమానులకు అభివాదం చేస్తూ ముందుకు సాగిన సీఎం జగన్.. అడుగడుగునా హారతులు పట్టిన అక్కచెల్లెమ్మలు
మండుటెండను.. జోరు వానను లెక్కచేయకుండా వెంట నడిచిన యువత
చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ జై జగన్ అంటూ దిక్కులు పిక్కటిల్లేలా నినాదాలు

11లో

నేతన్నకు నాయకత్వం

10లో

చేనేతలతో ముఖాముఖిలో సీఎం జగన్
రాజకీయంగా ఎదిగేలా అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తున్నాం.. కుప్పం, మంగళగిరిలో బీసీలకే సీట్లు ఇచ్చాం
సూర్యోదయాన్ని, పేదల జీవితాలు బాగుపడటాన్ని ఎవరూ ఆపలేరు

రాజధానిని మింగేసిన బాబు భూదందా
బెజవాడ సెంట్రల్లో 'కాల్'కేయుడు
ప్రగతి పథం.. శ్రీకాకుళం గమనం

- వివరాలు I, II, III, IVలో

గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

89 పోస్టులకు 4,496 మంది అర్హత..



1:50 నిష్పత్తిలో మెయిన్స్‌కు ఎంపిక
సెప్టెంబర్ 2 నుంచి 9వ తేదీ వరకు మెయిన్స్ పరీక్షలు.. రికార్డు సమయంలో ప్రక్రియ పూర్తి

సాక్షి, అమరావతి: గ్రూప్–1 ప్రిలిమ్స్ ఫలితాలను ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) విడుదల చేసింది. మెయిన్స్‌కు 4,496 మంది అభ్యర్థులు అర్హత సాధించారు. వీరికి మెయిన్స్ పరీక్షలను సెప్టెంబర్ 2–9వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కమిషన్ కార్యదర్శి ప్రదీప్ కుమార్ శనివారం తెలిపారు. మెయిన్స్‌కు 1:50 నిష్పత్తిలో 4,496 మంది అభ్యర్థులను ఎంపిక చేశారు. కేవలం 26 రోజుల్లోనే మొత్తం ప్రక్రియ పూర్తి చేసి ఫలితాలు వెల్లడించడం విశేషం. రాష్ట్ర ప్రభుత్వంలో

మిగతా 12వ పేజీలో ▶

వారిద్దరిదీ అసూయ, ద్వేషం

షర్మిల, సునీతపై వైఎస్సార్ సోదరి విమలమ్మ
వైఎస్సార్ శత్రువుల చేతుల్లో వాళ్లు కీలుబొమ్మలయ్యారు

- వైఎస్ కుటుంబ పరువును రోడ్డుకీడుస్తున్నారు.. వైఎస్ ఇంటి ఆడపడుచుల తీరు అన్యాయంగా ఉంది
- వారిద్దరూ నోరుమూసుకోవాలి.. ఇంటి ఆడపడుచుగా నేను చెబుతున్నా
- వివేకానందరెడ్డి హత్యతో అవినాశ్, భాస్కర్‌రెడ్డిలకు సంబంధంలేదు
- హత్య చేసిన దస్తగిరి మాత్రం దర్జాగా తిరుగుతున్నాడు.. అతని మాటలు విని అవినాష్‌ను వేధిస్తారా



- షర్మిల, సునీత ఇప్పటికైనా తమ తీరు మార్చుకోవాలి.. ప్రజలకు మంచిచేసే జగన్ మళ్లీ సీఎం కావాలి
- మీడియాతో వైఎస్సార్ సోదరి విమలమ్మ

సాక్షి, అమరావతి: 'వైఎస్ కుటుంబ ఆడపడుచులు షర్మిల, సునీత అన్యాయంగా మాట్లాడుతున్నారు. దివంగత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కుటుంబ గౌరవానికి భంగం కలిగిస్తున్నారు. నేనూ వైఎస్ కుటుంబ ఆడపడుచునే. వివేకానందరెడ్డి అందరికంటే నాకే ఎక్కువ సన్నిహితుడు. ఆ కుటుంబ ఆడపడుచుగా చెబుతున్నా.. మా అన్నయ్య వైఎస్ వివేకానందరెడ్డి హత్యతో ఎంపీ అవినాష్‌రెడ్డికిగానీ వైఎస్ భాస్కర్ రెడ్డికిగానీ ఎలాంటి సంబంధంలేదు'.. అని వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సోదరి విమలమ్మ విస్పష్టంగా ప్రకటించారు. 'కొంగు పట్టుకుని షర్మిల ఓట్లు అడుగుతున్న వీడియో చూసి చాలా బాధపడ్డాను. వైఎస్ కుటుంబ పరువును ఆమె రోడ్డుకీడుస్తున్నారు. ఆమెలో నాయకత్వ లక్షణాల్లేవు. నిత్యం వైఎస్ అవినాష్‌ను విమర్శిస్తున్నారు. అతను హత్య చేయడంగానీ చేయించడంగానీ

మిగతా 14వ పేజీలో ▶

జగన్ త్వరగా కోలుకోవాలి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాను.
– 'ఎక్స్'లో ప్రధాని మోదీ

ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు



రాజకీయ విభేదాలు ఎప్పుడూ హింసాత్మకంగా మారకూడదు. మనం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నాం, పరస్పర గౌరవాన్ని కాపాడుకుందాం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను.
– స్టాలిన్, తమిళనాడు ముఖ్యమంత్రి

సీఎం జగన్‌పై దాడి గురించి విని షాక్ అయ్యా..



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై జరిగిన దాడి గురించి విని షాక్ అయ్యా. ఆయన త్వరగా కోలుకోవాలని పార్థిస్తున్నా.
– మమతా బెనర్జీ, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి

హింసకు తావు లేదు



ప్రజాస్వామ్యంలో హింసకు తావు లేదు. కేంద్ర ఎన్నికల సంఘం అత్యంత కఠినమైన ముందస్తు చర్యలు తీసుకుంటుందని ఆశిస్తున్నాను. మీరు క్షేమంగా ఉండాలని కోరుకుంటున్నా. జగనన్నా.. జాగ్రత్తగా ఉండండి
– కేటీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్

చంద్రబాబు ప్రోద్బలంతోనే దాడి




చంద్రబాబు ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై దాడి జరిగింది. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదు. చంద్రబాబు దుర్మార్గమైన ఆలోచనలు చేస్తున్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే దాడి చేస్తున్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, బీజేపీ కలిసినా జగన్‌ను ఏమీ చేయలేకపోతున్నామని, చివరికి దాడులకు పాల్పడుతున్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వచ్చే ఫలితాలతో చంద్రబాబుకు రాజకీయ సమాధి తప్పదు.
– అంబటి రాంబాబు, జలవనరులశాఖ మంత్రి

ఓటమి భయంతోనే సీఎం జగన్‌పై దాడి



ఓటమి భయంతోనే సీఎం వైఎస్ జగన్‌పైన టీడీపీ దాడులకు తెగబడుతోంది. సిద్ధం బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తుండటాన్ని తట్టుకోలేక ప్రతిపక్షాలు ఎన్నో కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయి. ఇలాంటి దాడులకు, ఉడత ఊపులకు సీఎం భయపడరు. రాజకీయంగా జగన్‌ను ఒంటరిగా ఢీకొట్టలేని టీడీపీ.. జనసేనను, బీజేపీని వెంట తెచ్చుకుంది.
– తానేటి వనిత, హోం శాఖ మంత్రి

నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి



సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన దాడిపై ఎన్నికల సంఘం నిష్పక్షపాతంగా విచారణ చేపట్టాలి. ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నాను. బాధ్యులైన వారిని శిక్షించాలి.
– చంద్రబాబు, టీడీపీ అధ్యక్షుడు

సీఎం జగన్‌పై దాడి దురదృష్టకరం



సీఎం జగన్‌పై దాడి దురదృష్టకరం. దాడిలో సీఎం జగన్ ఎడమ కంటిపైన గాయం కావటం బాధాకరం. ఇది ప్రమాదవశాత్తు అయిందని అనుకుంటున్నాం. అలా కాకుండా ఎవరైనా కావాలని చేసి ఉంటే ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా ఖండించాల్సిందే. సీఎం త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నా.
– షర్మిల, ఏపీసీసీ అధ్యక్షురాలు

జగన్‌పై హత్యాయత్నం



▶ మొదటి పేజీ తరువాయి

అదిమి పట్టుకున్నారు. అలాగే చుట్టూ ఉన్న జనానికి అభివాదం చేస్తూ... సెక్యూరిటీ సిబ్బంది తోడురాగా బస్సులోపలికి వెళ్లారు. కనుబొమ వాచిపోవటంతో... గాయాన్ని శుభ్రం చేసి, రక్తాన్ని తుడిచి బస్సులో ఆయనకు వైద్యులు ప్రథమ చికిత్స అందించారు. కాసేపు ఆగిన తరవాత వైఎస్ జగన్ యథా ప్రకారం యాత్ర కొనసాగించారు. దాదాపుగా రాత్రి 8.10 సమయంలో ఈ దుర్ఘటన జరగ్గా... కాసేపు ఆగాక యాత్రను రాత్రి 10.39 వరకూ షెడ్యూలు ప్రకారం కొనసాగించాక... నైట్ హాల్టు ప్రాంతమైన కేసరపల్లికి చేరుకున్నారు సీఎం వైఎస్ జగన్. యాత్ర ముగిశాక గాయానికి చికిత్స చేయించుకోవటం కోసం ముఖ్యమంత్రి జగన్ నేరుగా విజయవాడ ప్రభుత్వాసుపత్రికి వెళ్లారు. అక్కడకు ఆయన సతీమణి వైఎస్ భారతి కూడా చేరుకుని ఆసుపత్రిలో ఆయనకు తోడుగా ఉన్నారు. వైద్యులు గాయాన్ని పరీక్షించాక, వైఎస్ జగన్‌కు లోకల్ అనస్తీషియా ఇచ్చి... కుట్లు వేశారు. కొంత విశ్రాంతి అవసరమని సూచించారు. చికిత్స అనంతరం జగన్ తిరిగి తన నైట్ హాల్టు ప్రాంతానికి వెళ్లారు. ఆదివారం నాడు బస్సు యాత్రకు విరామంగా ప్రకటించారు. తదుపరి షెడ్యూలును ఆదివారం రాత్రి ప్రకటించే అవకాశం ఉంది.

సాక్షి, అమరావతి: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో ఉన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఒక ఆగంతకుడు హత్యాయత్నానికి తెగబడ్డాడు. యాత్రలో భాగంగా శనివారం రాత్రి 8.10 గంటలకు సీఎం వైఎస్ జగన్ విజయవాడ సింగ్ నగర్ డాబా కొట్ల సెంటర్‌కు చేరుకోగానే హత్యకు ప్రయత్నించాడు. సీఎం జగన్ కణతకు గురిచూసి పదునైన వస్తువుతో దాడి చేశాడు. అయితే ప్రజలకు అభివాదం చేస్తూ సీఎం జగన్ పక్కకు తిరగడంతో ఆయన ఎడమ కంటి కనుబొమ పై భాగాన బలమైన గాయమైంది. దీంతో సీఎం పక్కకు తూలి.. ఎడమ కంటిని బలంగా అదిమి పట్టుకున్నారు. ఆయన ఎడమ కన్ను పైభాగం వాచిపోయింది. బలమైన గాయం కావడంతో రక్తం కారింది. అయినప్పటికీ బాధను పంటి బిగువన భరిస్తూనే సీఎం వైఎస్ జగన్ ప్రజలకు అభివాదం చేసి.. బస్సుపై నుంచి దిగి లోపలకి వెళ్లారు. డాక్టర్ హరికృష్ణ ఆయనకు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం సీఎం జగన్ యథావిధిగా బస్సు యాత్రను కొనసాగించారు. కాగా ఆ వస్తువు పదును, వేగాన్ని బట్టి అది రాయి, గ్రానైట్ పలక, పెల్లెట్, ఎయిర్ బుల్లెట్ ఏదైనా కావచ్చని నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు. సీఎం జగన్ ఎడమ కంటి పై భాగాన గాయమయ్యాక.. ఆ పదునైన వస్తువు మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాస్‌కూ తగలడంతో ఆయనకు కూడా గాయమైంది.

ముందస్తు కుట్ర, పక్కా ప్రణాళికతోనే..

సీఎం వైఎస్ జగన్ షెడ్యూల్ ప్రకారం శనివారం రాత్రి విజయవాడ చేరుకుంటారని ముందే తెలుసుకున్న ఆగంతకుడు ఇందుకు తగ్గట్టే ముందస్తు కుట్ర, ప్రణాళికను సిద్ధం చేసుకున్నాడనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. బస్సు యాత్ర విజయవాడలోకి శనివారం సాయంత్రం 5 గంటలకు ప్రవేశించింది. బస్సు యాత్ర సాగే మార్గంలో విద్యుత్ సరఫరాను నిలిపేస్తుండటాన్ని ఆగంతకుడు ఆసరాగా చేసుకున్నాడు. సీఎం జగన్‌ను హత్య చేయాలనే ముందస్తు వ్యూహంలో భాగంగానే సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లోని వివేకానంద స్కూల్ రెండో అంతస్తులో ఓ గదిలో నక్కాడు. తాము ఉన్న గది కిటికీ తలుపులను తెరిచే ఉంచాడు. రోడ్ షో అక్కడికి చేరుకోగానే సీఎం జగన్ లక్ష్యంగా హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అత్యంత వేగంగా దూసుకొచ్చిన పదునైన వస్తువు సీఎం జగన్ ఎడమ కంటి కనుబొమ పైభాగాన తగలడంతో ఆయనకు తీవ్ర గాయమైంది. ఎడమ కన్ను వాచిపోయింది. ఎడమ కంటి కనుబొమ పైభాగాన బలమైన గాయం నుంచి రక్తం కారిపోతున్నా చలించక సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేసి బస్సుపై నుంచి కిందకు దిగి లోపలకి వెళ్లారు.

ఎయిర్ గన్ వినియోగించారా..

సీఎం జగన్‌పై ఎయిర్ గన్ తో హత్యాయత్నం చేసి ఉండొచ్చని అంటున్నారు. విజయవాడ ఎంపీ కేశినేని నాని సౌండ్ విన్నానని చెబుతుండటంతో సీఎంపై హత్యాయత్నానికి ఎయిర్ గన్‌నే వినియోగించి ఉండవచ్చని బలంగా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనలో గాయపడ్డ విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు కూడా సీఎం వైపు దూసుకొచ్చిన పదునైన వస్తువు వేగాన్ని బట్టి ఇది హత్యాప్రయత్నమేనన్నారు. చంద్రబాబు నాయుడే ఈ దురాగతానికి పాల్పడ్డారని ఆయన ఆరోపించారు. కొందరు క్యాటర్ బాల్‌ను వినియోగించారని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో 175కి 175 అసెంబ్లీ స్థానాలు, 25కి 25 పార్లమెంటు స్థానాలు సాధించడమే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ నిర్వహించిన సిద్ధం సభలు చరిత్రలో కనీవినీ ఎరుగని స్థాయిలో జరిగాయి. ఈ సభలకు లక్షల సంఖ్యలో ప్రజలు పోటెత్తారు. సిద్ధం సభల తర్వాత మేమంతా సిద్ధం పేరుతో ముఖ్యమంత్రి జగన్ బస్సు యాత్రను నిర్వహిస్తున్నారు. దీనికి సైతం రాష్ట్ర ప్రజలు హారతులు పడుతున్నారు. చిన్నా పెద్ద, యువత, మహిళలు అనే తేడా లేకుండా వెల్లువలా సీఎం జగన్‌కు సంఘీభావం ప్రకటిస్తున్నారు. దీంతో ఈ ఆదరణను తట్టుకోలేక.. ముందస్తు కుట్రలో భాగంగానే ముఖ్యమంత్రిపైన హత్యాయత్నం జరిగిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సీఎం వైఎస్ జగన్



చికిత్స అనంతరం ఆస్పత్రి నుంచి బయటకు వస్తున్న సీఎం జగన్, సతీమణి భారతి

సీఎం జగన్‌పై హత్యాయత్నం ఘటన తెలిసిన వెంటనే ఆయన సతీమణి వైఎస్ భారతి కేసరపల్లిలోని రాత్రి బస కేంద్రానికి చేరుకున్నారు. వైద్యుల సూచనల మేరకు చికిత్స కోసం సీఎం జగన్ తన సతీమణి భారతితో కలిసి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లారు. ప్లాస్టిక్ సర్జరీ, అనస్తీషియా, ఇతర వైద్యుల బృందం పలు వైద్య పరీక్షలు చేసి సీఎం జగన్‌కు చికిత్స అందించారు. ఎడమ కంటి కనుబొమ పైభాగాన లోతైన గాయానికి కుట్లు వేశారు. అనంతరం గాయం మానేంత వరకూ తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించి, మందులను ప్రిస్క్రైబ్ చేశారు. సీఎం వద్దకు చేరుకున్న నర్సులు, ఇతర సిబ్బంది 'మీరు జాగ్రత్తగా ఉండండి అన్నా' అంటూ పలకరించారు. ఈ క్రమంలో వారందరినీ సీఎం జగన్ ఆప్యాయంగా పలకరించారు. ఇక సీఎం జగన్‌తో పాటు దాడిలో గాయపడిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే వెల్లంపల్లి శ్రీనివాస్‌కు కూడా వైద్యులు చికిత్స చేశారు. సీఎం జగన్‌కు కనుబొమ పైభాగాన లోతైన గాయమైనట్టు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ వివరించారు. ఆది, సోమవారాల్లో గాయం తగిలిన ప్రాంతంలో వాపు ఉంటే అందుకనుగుణంగా చికిత్స చేయాల్సి ఉంటుందన్నారు. కాగా ఆస్పత్రిలో సీఎం జగన్ వెంట ఎంపీలు కేశినేని నాని, అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్యేలు వల్లభనేని వంశీ, కైలే అనిల్‌కుమార్, మొండితోక జగన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీలు తలశీల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, రుహుల్లా, దేవినేని అవినాశ్ ఉన్నారు. కాగా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స చేయించుకున్న అనంతరం సీఎం జగన్ రాత్రి బసకు తిరిగి కేసరపల్లికి చేరుకున్నారు.

చంద్రబాబు, లోకేశ్‌ల ప్రోద్బలంతోనే..

కాగా టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్ ప్రోద్బలంతోనే సీఎం వైఎస్ జగన్‌పై హత్యాయత్నం జరిగిందని వైఎస్సార్‌సీపీ వర్గాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచే వీరిద్దరూ తమ మాటల ద్వారా, సోషల్ మీడియా పోస్టుల ద్వారా సీఎం వైఎస్ జగన్‌పై తీవ్ర వ్యతిరేకతను వెళ్లగక్కుతున్నారని గుర్తు చేస్తున్నాయి. ఐదేళ్ల పాలనలో సీఎం వైఎస్ జగన్ నవరత్న పథకాలతోపాటు ఇవ్వని హామీలను కూడా నెరవేర్చారు. కులమతాలు, పార్టీలు, ప్రాంతాలకతీతంగా అర్హతలున్న ప్రతి ఒక్కరికీ ఒక్క రూపాయి అవినీతికి ఆస్కారం లేకుండా సంక్షేమ పథకాలను అందించారు. దీంతో మరోమారు సీఎం వైఎస్ జగన్‌కు అధికారం కట్టబెట్టాలని ప్రజలంతా నిర్ణయించుకున్నారు. దీంతో ఒంటరిగా సీఎం వైఎస్ జగన్‌ను ఎదుర్కోలేమని టీడీపీ.. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకుందని వైఎస్సార్‌సీపీ వర్గాలు గుర్తు చేస్తున్నాయి. జనసేన, బీజేపీలతో పొత్తు పెట్టుకున్నప్పటికీ టీడీపీకి ఆశాజనకమైన పరిస్థితులు కనిపించకపోవడం, కూటమి నేతలతో కలిసి నిర్వహించిన సభలు విఫలం కావడం, మరో వైపు ముఖ్యమంత్రి జగన్ సభలకు ప్రజలు లక్షల సంఖ్యలో పోటెత్తడం తట్టుకోలేకే ఇలా హత్యాయత్నాలకు చంద్రబాబు, లోకేశ్ పురమాయిస్తున్నారని వైఎస్సార్‌సీపీ శ్రేణులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి.

భయోత్పాతంతో బస్సు యాత్ర ఆపాలనే..

సీఎం జగన్ బస్సు యాత్రకు ప్రజలు హారతులు పడుతున్నారు. లక్షల్లో ప్రజలు ఆయన సభలకు హాజరవుతున్నారు. ఇదే చంద్రబాబు, లోకేశ్, పవన్ కళ్యాణ్‌ల వెన్నులో వణుకు పుట్టిస్తోంది. జైత్రయాత్రలా సాగుతున్న బస్సు యాత్రను ఆపడం ద్వారా రాజకీయ ఉనికి చాటుకోవడానికే చంద్రబాబు, లోకేష్‌లు ఆపార్టీ శ్రేణులను సీఎం జగన్‌పై హత్యాయత్నం చేసేందుకు పురిగొలిపారనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. భయోత్పాతం సృష్టించడం ద్వారా సీఎం జగన్ బస్సు యాత్రను ఆపేయడానికే ఈ దారుణం చేయించినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

చలించని సీఎం... యథాతథంగా యాత్ర కొనసాగింపు

తనపై హత్యాయత్నానికి తెగబడినప్పటికీ సీఎం జగన్ ఏమాత్రం వెరవలేదు. వాహనంలోకి వెళ్లి ప్రథమ చికిత్స చేయించుకున్న వెంటనే ఆయన మళ్లీ వాహనం పైభాగానికి చేరుకున్నారు. ప్రజలకు అభివాదం చేస్తూ యాత్రను కొనసాగించారు. ముందుగా నిర్ణయించిన షెడ్యూల్ మేరకు విజయవాడ సింగ్‌నగర్ డాబా కొట్ల జంక్షన్ నుంచి కృష్ణా హోటల్ సెంటర్, పైపుల రోడ్, ప్రకాశ్ నగర్, పాయకాపురం, కండ్రిగ, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి మీదుగా కేసరపల్లి వరకు అంటే 20 కి.మీ. వరకు యాత్రను కొనసాగించారు. శనివారం రాత్రి కేసరపల్లిలో ముందుగా నిర్ణయించిన ప్రదేశంలోనే రాత్రి బస చేశారు.

అన్ని కోణాల్లో దర్యాప్తు

సీఎం వైఎస్ జగన్‌పై జరిగిన హత్యాయత్నం ఘటనపై సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నాం. దాడి జరిగిన ప్రదేశాన్ని, అక్కడ ఉన్న స్కూల్ భవనం, పరిసర ప్రాంతాలను పరిశీలించాం. యాత్ర నిర్వహిస్తున్న సమయంలో కరెంట్ వైర్లు తగులుతాయనే ఉద్దేశంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో చీకటిగా ఉన్న పరిస్థితిని ఆసరాగా చేసుకుని దుండగులు దాడికి పాల్పడ్డారని తెలుస్తోంది. ఆ ప్రదేశంలో సీసీ టీవీ కెమెరాలను పరిశీలిస్తున్నాం. అనుమానితుల కదలికలపై ఆరా తీస్తున్నాం. ప్రత్యేక బృందాలను నియమించాం. దుండగులను త్వరలోనే గుర్తించి అరెస్ట్ చేస్తాం.
–కాంతి రాణా టాటా, విజయవాడ పోలీస్ కమిషనర్

రక్తమోడినా సడలని సంకల్పం



తనపై దాడి అనంతరం రోడ్ షోలో సీఎం జగన్ అభివాదం

ఇక 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు వస్తున్న జనాదరణను చూసి కొందరి కళ్లు 'పచ్చ'బడ్డాయి. జగన్‌ను జనం నుంచి దూరం చేయాలనే కుట్రతో బస్సుయాత్ర సింగ్‌నగర్, డాబాకొట్లు సెంటర్ దాటగానే గుర్తుతెలియని ఆగంతకులు ఆయనపై రాయి విసిరారు. రాయి తగిలి ఎడమ కంటిపై గాయమైంది. రక్తం కారుతుంటే వైద్యులు ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం యాత్రను ఆపకుండా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అక్కడ నుంచి పైపుల రోడ్డు, కండ్రిక మీదుగా రామవరప్పాడు రింగ్ రోడ్డుకు చేరుకోగానే ప్రజలు పెద్దఎత్తున ఎదురొచ్చి స్వాగతం పలికారు. రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, గూడవల్లి మీదుగా కేసరపల్లిలో రాత్రి బస వద్దకు 10.38 గంటలకు జగన్ చేరుకున్నారు. మండుటెండను లెక్కచేయక, జోరు వానలోనూ తడుస్తూ ఒక్క విజయవాడలోనే 5 గంటల పాటు యాత్రలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ జగన్ 14వ రోజు బస్సుయాత్రను ముగించారు.



ఇది కూటమి కుట్రే..

- ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకే దాడులు
- కుట్రలు, కుతంత్రాలు పన్నినా జగన్‌ను ఎదుర్కొనటం సాధ్యం కాదు
- జగన్‌కు భద్రత పెంచాలి
- ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి



మీడియాతో మాట్లాడుతున్న వెలంపల్లి, కేశినేని..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వెలంపల్లి

సాక్షి, అమరావతి/గన్నవరం/కంకిపాడు: సీఎం జగన్‌పై జరిగిన దాడి ముమ్మాటికీ చంద్రబాబు, ఆయన మిత్రపక్షాల కుట్రేనని విజయవాడ ఎంపీ కేశినేని నాని, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆరోపించారు. విజయవాడ చేరుకున్న మేమంతా సిద్ధం బస్సుయాత్రలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై దాడిచేయటాన్ని తీవ్రంగా ఖండించారు. జగన్ ప్రాణాలే లక్ష్యంగా కూటమి దాడికి తెగపడిందని, దీనిపై ఎన్నికల సంఘం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఎం జగన్‌కు భద్రత లేకుండా పోయిందన్నారు. ఆయన ప్రాణాలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. కేసరపల్లి బస ప్రాంగణం వద్ద శనివారం రాత్రి వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా కలిసినప్పటికీ జగన్‌కు ప్రజల్లో లభిస్తున్న ఆదరణ చూసి ఓర్వలేకపోతున్నాయని విమర్శించారు. చంద్రబాబే తన తొత్తులతో జగన్‌పై దాడి చేయించారని ఆరోపించారు. కరెంటు లేని ప్రాంతాన్ని ఎంచుకుని జగన్‌పై దాడిచేసి, ఆయన ప్రాణాలు తీయాలనుకున్నారని మండిపడ్డారు. వారు ఎన్ని హామీలిచ్చినా ప్రజలు వారివెంట లేరని తెలిసి జగన్‌ను ఏదో విధంగా అంతమొందించలనే కుట్ర పన్ని ఆయనపై హత్యాయత్నం చేశారన్నారు. సీఎం జగన్‌కు చాలా పెద్ద దెబ్బ తగిలిందని, బ్లడ్ కారిందని, పక్కనే ఉన్న తన కంటికి కూడా గాయమైందని వెలంపల్లి చెప్పారు. ఇది కచ్చితంగా హత్యాయత్నమేనని, ఆ వస్తువు తాలూకు పదును, వేగం చూస్తే ఇదే అర్థమవుతోందని తెలిపారు. సీఎం జగన్‌కు తగిలాక.. పక్కనున్న తనకు అదే వస్తువు తగిలిందని, తనకు కూడా గాయమైందంటేనే దాని వేగాన్ని అర్థం చేసుకోవచ్చని చెప్పారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు చేసినా గాయాన్ని తట్టుకుని జగన్ చిరునవ్వుతో ప్రజలకు నేనున్నా అనే భరోసా కల్పించారని చెప్పారు. జగన్‌లాంటి గొప్పవ్యక్తి రక్తం కళ్లజూసిన చంద్రబాబుకు పుట్టగతులుండవన్నారు. ఇప్పటివరకు పదికిపైగా సర్వేలు వచ్చాయని, జగన్ ఈ ఎన్నికల్లో స్వీప్ చేయబోతున్నారని చెబుతున్నాయని, దీంతో చంద్రబాబు ఈ కుట్రకు తెరలేపారని చెప్పారు. చంద్రబాబు నీచపు, వెన్నుపోటు, దుర్మార్గపు రాజకీయాలకు తెరతీశారని, గతంలోను విజయవాడలో అనేక కుట్రలు, కుతంత్రాలు చేశారని చెప్పారు. వంగవీటి రంగా హత్య ఘటనలో చంద్రబాబు పాత్ర ఉందని ఆరోపించారు. జగన్‌పై జరిగిన దాడిలో చంద్రబాబు, కూటమి మూల్యం చెల్లించుకోకతప్పదని హెచ్చరించారు. పోలీసులు వెంటనే సమగ్ర దర్యాప్తు జరిపి నిందితులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కేంద్రానికి, ఎన్నికల సంఘానికి ఫిర్యాదు

ఇది ప్రతిపక్షాల కుట్ర కోణంగానే భావిస్తున్నట్లు ఎంపీ కేశినేని నాని చెప్పారు. ఇది చాలా తీవ్ర పరిణామమన్నారు. ఈ సంఘటనపై పోలీసులు విచారించాలని, ఎన్నికల కమిషన్ కూడా స్పందించి దీనిపై నిజాలను నిగ్గుతేల్చాలని కోరారు. ఈ దుశ్చర్యకు పాల్పడినవారిని పోలీసులు అరెస్ట్ చేసి ఎవరు చేయించారో బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. ఈ దుర్ఘటనపై ఢిల్లీలో కూడా ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని, సీఎం జగన్‌కు సరైన సెక్యూరిటీ కూడా ఇవ్వాలని కేంద్రం దృష్టికి తీసుకెళతామని చెప్పారు. జగన్‌కు వస్తున్న ప్రజాదరణను తట్టుకోలేకపోతున్నారని, ముఖ్యంగా విజయవాడలో ఈ తీరు విపరీతంగా ఉందని తెలిపారు. ఈ పరిస్థితుల్లో సీఎం భద్రత పెంచాలని కోరారు. గాయం చాలా లోతుగా అయిందని, నొప్పికి సీఎం జగన్ విలవిల్లాడారని, అయినా యాత్రను కొనసాగించారని చెప్పారు. సీఎం జగన్‌కు ఆ వస్తువు తగిలే సమయంలో 'టప్'మనే శబ్దాన్ని తాను స్పష్టంగా విన్నానని, అది రాయి కాకపోవచ్చని పేర్కొన్నారు.

పాఠశాల నుంచే దాడి?

- దాడి జరిగిన ప్రాంతానికి 20 అడుగుల దూరంలోనే వివేకానంద స్కూలు
- మొదటి అంతస్తులో 6వ కిటికీ, రెండో అంతస్తులో 4వ కిటికీ తెరిచి ఉన్నట్లు గుర్తింపు
- పాఠశాలకు 200 మీటర్ల దూరంలోనే సెంట్రల్ టీడీపీ ఆఫీసు
- ఓ టీడీపీ నేత అనుచరుల వద్ద ఎయిర్‌గన్ వంటి మారణాయుధాలు



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై విజయవాడ సింగ్‌నగర్ డాబాకొట్ల సెంటర్‌లో వివేకానంద సెంటినరీ హైస్కూల్ నుంచే ఎయిర్‌గన్‌తో దాడికి పాల్పడి ఉంటారని పోలీసు అధికారులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. దాడి సమయంలో ఈ పాఠశాల వెనుక వైపున రోడ్డులోనే సీఎం జగన్ యాత్ర సాగుతోంది. సీఎం జగన్ ఉన్న బస్సుకు, పాఠశాల కేవలం 20 అడుగుల దూరంలోనే ఉంది. పాఠశాల ఉన్న రామకృష్ణ సమితికి చెందిన ఈ జీ+2 భవనం మొదటి అంతస్తులో 6వ కిటికీ, రెండో అంతస్తులో 4వ కిటికీ తెరిచి ఉండటాన్ని పోలీసులు గుర్తించారు. పాఠశాలకు వాచ్‌మెన్ భద్రత లేదు. దీంతో గేటు దూకి ఎవరైనా సులభంగా లోపలికి ప్రవేశించే అవకాశం ఉంది. అక్కడి నుంచే దాడికి పాల్పడి, సులభంగా తప్పించుకొని పోయే అవకాశం ఉంది. ఈ పాఠశాలకు 200 మీటర్ల దూరంలోనే విజయవాడ సెంట్రల్ నియోజకవర్గం టీడీపీ ఆఫీసు ఉండటం కూడా అనుమానాలకు బలం చేకూరుస్తోంది. 59వ డివిజన్‌కు చెందిన ఓ టీడీపీ నాయకుడి అనుచరుల్లో బ్లేడ్ బ్యాచ్, ఎయిర్‌గన్‌లు, క్యాటర్ బాల్, ఇతర మారణాయుధాలు వాడేవాళ్లు ఉన్నట్టు తెలుస్తోంది. దాడి జరిగిన సమయంలో సీఎం జగన్ రోడ్‌షోను చిత్రీకరించిన స్థానికుల నుంచి వీడియోలు సేకరించి పోలీసులు పరిశీలిస్తున్నారు.

ఇది ముమ్మాటికి కుట్రే..

సీఎం వైఎస్ జగన్‌పై దాడిని నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ శ్రేణుల ఆందోళన

పొన్నూరు/పిడుగురాళ్ల/మార్కాపురం/తణుకు అర్బన్ : 'మేమంతా సిద్ధం' యాత్రలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై జరిగిన దాడిని వ్యతిరేకిస్తూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో నిరసనలు వెల్లువెత్తాయి. గుంటూరు జిల్లా పొన్నూరులోని అంబేద్కర్ సెంటర్లో దాడిని ఖండిస్తూ శనివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల పట్టణంలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. అక్కసుతో టీడీపీ గుండాలతో దాడిచేయించిందని వైఎస్సార్‌సీపీ నేతలు ఆరోపించారు. చంద్రబాబుకు బుద్ధి చెప్పే సమయం దగ్గర్లోనే ఉందన్నారు. గుత్తికొండ గ్రామంలోని పాఠశాల సెంటర్‌లో కూడా వైఎస్సార్‌సీపీ నేతలు చంద్రబాబు దిష్టిబొమ్మను దహనం చేశారు. దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈ సంఘటనకు నిరసనగా శనివారం రాత్రి 11 గంటలకు ప్రకాశం జిల్లా మార్కాపురం-కంభం జాతీయ రహదారిపై ఉన్న చింతగుంట్ల గ్రామం వద్ద ధర్నా చేశారు. అర్ధరాత్రి ప్రజలు స్వచ్ఛందంగా బయటకొచ్చి నిరసనలో పాల్గొన్నారు. తిరుపతిలో అంబేద్కర్ విగ్రహం వద్ద చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్ చిత్రపటాలను వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు తగులబెట్టారు. విశాఖపట్నం, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో ఆందోళన నిర్వహించారు.



పిడుగురాళ్లలో చంద్రబాబు దిష్టిబొమ్మ దహనం



పొన్నూరు అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న అంబటి మురళీకృష్ణ, ఇతర నాయకులు



విశాఖలో నిరసన వ్యక్తంచేస్తున్న ఉత్తర నియోజకవర్గ అభ్యర్థి కె.కె. రాజు, డిప్యూటీ మేయర్ సతీష్ తదితరులు

బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అనడం పెద్ద అబద్ధం

మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ



రాజమహేంద్రవరం రూరల్: బీసీలకు 50 ఏళ్లకే పెన్షన్ అని చంద్రబాబు చెప్పడం పెద్ద అబద్ధమని మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ అన్నారు. రాజమహేంద్రవరంలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గతంలో బాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పెన్షన్ల విషయంలో జన్మభూమి కమిటీలతో ఆడిన వికృత క్రీడను ప్రజలు మరచి పోలేదన్నారు. అధికారంలో ఉన్న ఐదేళ్లలో బాబు పెన్షన్ పెంపు గురించి ఏనాడైనా ఆలోచించారా అని ప్రశ్నించారు. ఇప్పటికే చేనేత కార్మికులకు, మత్స్యకారులకు, కల్లుగీత కార్మికులకు సీఎం జగన్ 50 ఏళ్లకే పెన్షన్లు ఇస్తున్నారని చెప్పారు. మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా బీసీలను అవమానించే భావనతో చంద్రబాబు మాట్లాడారని గుర్తుచేశారు. గతంలో తోకలు కత్తిరిస్తానంటూ నాయీ బ్రాహ్మణులను, తోలుతీస్తానంటూ మత్స్యకారులను, ఎస్సీలుగా పుట్టాలని ఎవరైనా అనుకుంటారా అని దళితులను అవమానించిన బాబు ఇప్పుడు సూక్తులు చెబుతున్నారని విమర్శించారు. తన కొడుకును ఎలా ముఖ్యమంత్రి చేయాలి, ఇతర పార్టీలతో బేరసారాలు ఎలా చేయాలన్నవే తప్ప ఆయనకు మరో ఆలోచన లేదన్నారు. బాబు మాట్లాడేవన్నీ అబద్ధాలేనని చెప్పారు. స్థానికసంస్థల రిజర్వేషన్లు తగ్గడానికి కారణమైన బాబు.. రిజర్వేషన్లు తగ్గిన నెపాన్ని అధికార పార్టీపై నెట్టి లాభం పొందాలని అనుకోలేదా అని నిలదీశారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని కోర్టుకెళ్లి అడ్డుకున్నది ఎవరని ప్రశ్నించారు. బాబు ఏనాడైనా బీసీలకు రాజ్యసభ స్థానాలు కేటాయించారా అని ప్రశ్నించారు. సీఎం జగన్ బీసీలకు నాలుగు రాజ్యసభ స్థానాలు ఇచ్చారని, సోషల్ ఇంజినీరింగ్ చేస్తానన్న పవన్‌కళ్యాణ్ కనీసం ఒక్క సీటు కూడా శెట్టిబలిజలకు కేటాయించలేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో కులాల మధ్య గొడవలు సృష్టించడం ద్వారా అధికారంలోకి రావాలనుకోవడం బాబు దుర్మార్గపు ఆలోచనని చెప్పారు.

ధ్వంస రచనే కూటమి కుతంత్రం

సీఎం జగన్‌పై దాడి వెనుక చంద్రబాబు ముఠా భారీ కుట్ర

- ముందస్తు పన్నాగంతోనే పోలీసు అధికారులపై ఫిర్యాదులు
- పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొనే లక్ష్యం
- తద్వారా ఎన్నికల్లో అక్రమాలకు పాల్పడేందుకు వ్యూహ రచన
- అందులో భాగంగానే ఐపీఎస్‌లపై పురందేశ్వరి ద్వారా చంద్రబాబు ఫిర్యాదు
- ఎవర్ని నియమించాలో కూడా చెప్పిన పచ్చ ముఠా
- తీవ్రంగా స్పందించిన అధికారులు.. పారని బాబు పాచిక
- దాంతో సీఎం యాత్రలో దాడులకు కుతంత్రం
- తద్వారా శాంతిభద్రతల సమస్య సృష్టించే కుట్ర
- దెబ్బ తగిలినా చిరునవ్వుతో సీఎం జగన్ శాంతి సందేశం
- సీఎం జగన్ సందేశంతో సంయమనం పాటించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- బెడిసికొట్టిన చంద్రబాబు కూటమి కుతంత్రం



దాడి అనంతరం బస్సులోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రథమ చికిత్స



ప్రథమ చికిత్స అనంతరం సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: ఈ ఎన్నికల్లో ఘోర పరాజయం తథ్యమని గుర్తించిన విపక్ష కూటమి టీడీపీ అధినేత చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రంలో భారీ కుట్రకు బరితెగించింది. అందుకోసం పక్కా పన్నాగంతో పోలీసు వ్యవస్థను లక్ష్యంగా చేసుకుంది. పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకొనేందుకు రాష్ట్రంలో శాంతి భద్రతల సమస్య సృష్టించడానికి కుట్ర పన్నింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై శనివారం రాత్రి విజయవాడలో జరిగిన దాడి దీనికి బలం చేకూరుస్తోంది. సీఎం జగన్‌పై జరిగిన ఈ దాడి ఆషామాషీగానో, ఆకతాయిగానో చేసింది కాదని, దాని వెనుక భారీ కుట్రే ఉందన్నది తేటతెల్లమవుతోంది. రెండు నెలలుగా రాష్ట్ర పోలీసు యంత్రాంగానికి వ్యతిరేకంగా టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చేస్తున్న దుష్ప్రచారం వెనుక గూడుపుఠాణి ఉందన్న విషయం ఈ దాడితో బట్టబయలైంది.

పోలీసు వ్యవస్థపైనే గురిపెట్టిన పచ్చ ముఠా

నిత్యం ప్రజాదరణతో దూసుకుపోతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీని ఎన్నికల్లో ప్రజాస్వామ్యబద్ధంగా ఓడించలేమని చంద్రబాబు ఏనాడో గుర్తించారు. అందుకే పవన్, పురందేశ్వరితో కూటమి కట్టారు. రాష్ట్రంలో ధ్వంస రచనకు కుట్ర పన్నారు. అందులో భాగంగానే కీలకమైన పోలీసు వ్యవస్థను లక్ష్యంగా చేసుకున్నారు. చంద్రబాబు, లోకేశ్ ఐపీఎస్ అధికారుల నుంచి ఎస్సైస్థాయి అధికారుల వరకు అందరిపై నిరాధార ఆరోపణలకు తెరతీశారు. వలంటీర్లు రాష్ట్రంలో యువతులను అపహరిస్తున్నారని పవన్ జుగుప్సాకరమైన ఆరోపణలకు కూడా దిగారు. అయినా పోలీసు వ్యవస్థ చేష్టలుడిగి చూస్తోందని అవాకులు చవాకులు పేలారు. ఇక బీజేపీతో పొత్తు కుదరగానే చంద్రబాబు ముందస్తు వ్యూహంతో పురందేశ్వరిని రంగంలోకి దింపారు. చంద్రబాబు ఇచ్చిన జాబితా ప్రకారం ఆమె ఏకంగా రాష్ట్రంలో 20 మందికిపైగా సీనియర్ ఐపీఎస్ అధికారులపై నిరాధార ఆరోపణలతో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. వారందరినీ ఎన్నికల విధుల నుంచి తొలగించాలని, వీలైతే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. అంతే కాదు.. వారి స్థానాల్లో ఎవర్ని నియమించాలో కూడా దగ్గుబాటి పురందేశ్వరే నిర్దేశించడం కూటమి కుట్రకు పరాకాష్ట. అంటే పోలీసు వ్యవస్థను పూర్తిగా తమ గుప్పిట్లో ఉంచుకొని, ఎన్నికల్లో యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడాలన్నది చంద్రబాబు ముఠా లక్ష్యమన్నది సుస్పష్టమైంది.

తీవ్రంగా స్పందించిన పోలీసు వ్యవస్థ

రాష్ట్రంలో పోలీసు వ్యవస్థపై టీడీపీ కూటమి చేస్తున్న దుష్ప్రచారంపై యావత్ ఐపీఎస్ అధికారులు తీవ్రంగా స్పందించారు. ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకుని ఏకంగా ఎన్నికల కమిషన్ అధికార పరిధిలోకి జోక్యం చేసుకోవడాన్ని తీవ్రంగా ఖండించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కుట్రలపై ఎన్నికల కమిషన్‌కు ఐపీఎస్ అధికారుల సంఘం ఫిర్యాదు చేసింది. దాంతో తమ పన్నాగం బెడిసికొట్టిందని పచ్చ కూటమి అహం దెబ్బతింది.

శాంతిభద్రతలను దెబ్బతీసే కుట్ర

మరోవైపు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రకు ప్రజాదరణ వెల్లువెత్తుతుండటంతో చంద్రబాబు ముఠా మరింత బెంబేలెత్తింది. దాంతో రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ వైఫల్యం చెందిందని, శాంతిభద్రతలు గాడి తప్పాయన్న తమ దుష్ప్రచార కుట్రను పతాక స్థాయికి తీసుకెళ్లడానికి వ్యూహం పన్నింది. అందుకు సీఎం బస్సు యాత్రను అవకాశంగా మలచుకొన్నారు. విజయవాడలో సీఎం జగన్‌పైనే దాడికి పాల్పడాలని కుట్ర పన్నారు. శనివారం రాత్రి అదే పని చేశారు. ఈ దాడికి క్షణికావేశంలో ఎవరైనా స్పందిస్తే.. దాన్ని అవకాశంగా చేసుకుని రాష్ట్రవ్యాప్తంగా దాడులు, ప్రతిదాడులకు పురికొల్పి, పెను విధ్వంసానికి పాల్పడాలన్నది పచ్చ ముఠా కుతంత్రం. తద్వారా రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యను సృష్టించడానికి చంద్రబాబు ముఠా బరితెగించింది. ఈ పరిస్థితులను ఎత్తి చూపుతూ తాము లక్ష్యంగా చేసుకున్న పోలీసు అధికారులకు వ్యతిరేకంగా మరోసారి ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసేందుకు రంగం సిద్ధం చేస్తోంది. దాంతో అధికార వ్యవస్థను బ్లాక్‌మెయిల్ చేసి ఎన్నికల్లో అక్రమాలకు బరితెగించాలన్నది చంద్రబాబు ముఠా అంతిమ లక్ష్యం. కానీ దాడికి గురై, గాయపడినప్పటికీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిరునవ్వుతోనే యాత్రను కొనసాగించడం ద్వారా పార్టీ శ్రేణులన్నీ పూర్తి సంయమనం పాటించాలనే సందేశాన్ని ఇచ్చారు. సీఎం జగన్ సందేశాన్ని అందిపుచ్చుకొన్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు పూర్తి సంయమనం పాటించాయి. దాంతో రాష్ట్రంలో ఎక్కడా ఎలాంటి ఉద్రిక్త పరిస్థితి తలెత్తలేదు. చంద్రబాబు కుట్రలు బెడిసికొట్టాయి.

మత్స్యకారులకు అండగా జగన్ సర్కార్

- ఆ వర్గానికి ఒక రాజ్యసభ, రెండు ఎమ్మెల్సీ, నాలుగు ఎమ్మెల్యే సీట్లు
- రాష్ట్రంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం
- మత్స్యకారుల ఆత్మీయ సమావేశంలో ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి
- సీఎం జగన్ చెప్పింది చేస్తారు: మంత్రి బొత్స



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మంత్రి బొత్స,కోలా గురువులు, ఎమ్మెల్యే అభ్యర్థులు వాసుపల్లి గణేష్‌కుమార్, ఎంవీవీ సత్యనారాయణ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: చట్టసభల్లోనే కాకుండా సంక్షేమం, అభివృద్ధిలో కూడా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారులకు అండగా నిలిచారని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్, ఎంపీ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. ఆ వర్గానికి ఒక రాజ్యసభ సభ్యుడితో పాటు రెండు ఎమ్మెల్సీ, నాలుగు ఎమ్మెల్యే సీట్లు కేటాయించి మత్సకారుల పక్షపాతిగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో శనివారం పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు ఆధ్వర్యంలో మత్స్యకారుల ఆత్మీయసదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వై.వి.సుబ్బారెడ్డి, మంత్రి బొత్స సత్యనారాయణ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డి మాట్లాడుతూ విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో బోట్లు కాలిపోతే 24 గంటల్లోపే వారికి పరిహారం అందజేసిన ఏకైక సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. రాష్ట్రంలో 10 ఫిషింగ్ హార్బర్ల నిర్మాణం చేపట్టారని గుర్తుచేశారు. గంగపుత్రులు వేట సమయంలో దురదృష్టవశాత్తు మరణిస్తే పరిహారాన్ని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచారని చెప్పారు. హుద్‌హుద్ సమయంలో నష్టపోయిన బోట్లకు పరిహారం ఇచ్చినట్లు తెలిపారు. వేట విరామసమయంలో రూ.10 వేల ఆర్థిక సహాయం ఇచ్చామని, డీజిల్ సబ్సిడీ కల్పించామని గుర్తుచేశారు. మత్స్యకారులను చంద్రబాబు అవమానించిన విషయాన్ని గుర్తుంచుకునిమనకు మేలుచేసిన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని వచ్చే ఎన్నికల్లో గెలిపించుకోవాలని ఆయన కోరారు.

బాబు, పవన్‌లది పూటకోమాట

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పింది చేస్తారని, చేసేదే చెబుతారని తెలిపారు. చంద్రబాబు, పవన్ మాటమీద నిలబడరని, పూటకోమాట, గడియకొక అబద్ధం చెబుతారని విమర్శించారు. బీసీలంటే వైఎస్సార్‌సీపీకి బ్యాక్‌బోన్ లాంటివారని అభివర్ణించారు. బలహీనవర్గాలంటే చంద్రబాబుకు, పవన్ కళ్యాణ్‌కు చిన్న చూపని చెప్పారు. విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ మాట్లాడుతూ గత ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో మేలు జరిగిన ప్రతి మత్స్యకార సోదరుడు మరోమారు సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు కృషిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, విశాఖ సౌత్ ఎమ్మెల్యే అభ్యర్థి వాసుపల్లి గణేష్ మాట్లాడుతూ చంద్రబాబు మత్స్యకారులను ఎస్టీలో చేరుస్తామని హామీ ఇచ్చి మోసం చేశాడని గుర్తుచేశారు. ఈ సదస్సులో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయ్‌చందర్, మత్స్యకార మహిళా నేత గరికిన గౌరి, కార్పొరేటర్లు, మత్స్యకార నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉండిలో నిరసనలతో రగులుతున్న టీడీపీ

- నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించిన టీడీపీ జిల్లా అధ్యక్షురాలు సీతారామలక్ష్మి



సీతారామలక్ష్మిని చుట్టుముట్టిన నాయకులు, కార్యకర్తలు

ఉండి: పశ్చిమ గోదావరి జిల్లా ఉండి నియోజకవర్గం టీడీపీలో టికెట్ కేటాయింపుపై చంద్రబాబు రాజేసిన కుంపటి రగులుతూనే ఉంది. న్యాయం చేయకపోతే నిరసనలు మరింత ఉధృతం చేస్తామని ఎమ్మెల్యే రామరాజు హెచ్చరించారు. ఎంపీ రఘురామకృష్ణరాజుకు ఉండి టికెట్ కేటాయిస్తున్నారంటూ కథనాలు వస్తున్న నేపథ్యంలో ఉండిలో స్థానిక నేతలు నాలుగు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తున్నారు. ఈ దీక్షల శిబిరాన్ని టీడీపీ జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి శనివారం సందర్శించారు. వేసవి ఎండలను దృష్టిలో ఉంచుకుని దీక్షలు విరమించాలని ఆమె కోరారు. ఈ సందర్భంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను చుట్టుముట్టారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉండి టికెట్ రామరాజుకే ఇవ్వాలని, వేరొకరికి ఇస్తే అంగీకరించబోమని తేల్చి చెప్పారు. తమకు తప్ప మరెవరికైనా టికెట్ ఇస్తే సహించేది లేదన్నారు. నాయకులు, కార్యకర్తలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రఘురామకృష్ణరాజుపై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం నిరాహార దీక్ష చేస్తున్న నాయకులకు సీతారామలక్ష్మి, ఎమ్మెల్యే రామరాజు కూల్ డ్రింక్ ఇచ్చి నిరాహార దీక్ష విరమింపజేశారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ కూటమి విజయం సాధించాలంటే పరిస్థితులను అర్థం చేసుకుని సహకరించాలని కోరారు.

గిద్దలూరు జనసేనలో ముదురుతున్న వర్గ పోరు

బేస్తవారిపేట: ప్రకాశం జిల్లా గిద్దలూరు నియోజకవర్గంలో జనసేన వర్గ విభేదాలు రోజురోజుకూ ముదురుతున్నాయి. క్షేత్ర స్థాయిలో పార్టీ అభివృద్ధి కోసం పనిచేయని వ్యక్తికి పదవి కట్టబెట్టడంపై కొద్ది నెలలుగా రగిలిపోతున్న ఆ పార్టీ నాయకుడు ఆమంచి స్వాములు ఇప్పుడు తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమయ్యారు. తానే పోటీలోకి దిగుతానని చెప్పడంతో అసలుకే ఎసరు వస్తుందని కూటమి అభ్యర్థి ఆందోళన చెందుతున్నారు.

మూడు ముక్కలాటకు రాష్ట్రం బలి

- విశాఖను ఆర్థిక రాజధానిగా చేస్తా
- కర్నూలును మరోలా అభివృద్ధి చేస్తా
- జూన్ 4న జగనాసుర వధ జరుగుతుంది
- తాడికొండలో చంద్రబాబు వికృత విమర్శలు



బాబు ప్రసంగిస్తుండగా జనం లేక వెలవెలబోయిన ప్రాంగణం

తాడికొండ: తిక్కలోడి మూడు ముక్కలాటకు రాష్ట్రం బలైపోయిందని టీడీపీ అధినేత చంద్రబాబు అనుచిత వ్యాఖ్యలు చేశారు. గుంటూరు జిల్లా తాడికొండ, ప్రత్తిపాడులో శనివారం నిర్వహించిన ప్రజాగళం సభలో ఆయన ప్రసంగిస్తూ మూడు రాజధానులు కట్టేశానంటూ వాగుతున్నాడని, అలాంటి తిక్కలోడికి వాతలు పెట్టడానికి సిద్ధంగా ఉండాలన్నారు. అమరావతిని ఇంచుకూడా కదపలేరన్నారు. ఇప్పటికే ఆర్థిక రాజధానిగా అభివృద్ధి చెందిన విశాఖపట్నాన్ని ఆర్థిక రాజధానిగా చేస్తానంటూ ప్రగల్భాలు పలికారు. కర్నూలును మరోలా అభివృద్ధి చేస్తానని అన్నారే కానీ, అదెలాగో బాబు చెప్పలేదు. తన గురించి, తాను హైదరాబాద్‌ను అభివృద్ధి చేశానంటూ ఊకదంపుడు ఉపన్యాసం ఇచ్చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్మించిన హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు కూడా తానే నిర్మించానంటూ అబద్ధాలాడేశారు. జూన్ 4న జగనాసుర వధ జరుగుతుందని, సగర్వంగా అమరావతే రాజధాని అని మీరు ఉత్సవాలు చేసుకోవాలంటూ వాచాలత్వాన్ని ప్రదర్శించారు.

బాబు సభకు జనం లేక అట్టర్ ఫ్లాప్ షో

రాజధాని నడిబొడ్డున నిలబడి మాట్లాడుతున్నా అంటూ తాడికొండలో బాబు నిర్వహించిన రోడ్ షోకు రాజధాని ప్రజలే ముఖం చాటేశారు. జనం లేక ఈ సభ అట్టర్ ఫ్లాప్ అయింది. ప్రత్తిపాడులో నిర్వహించిన సభకూ జనం కరువయ్యారు.

మన సభలకు జనం రారేంటి!



చంద్రబాబు సభలపై టీడీపీ శ్రేణులు, నేతల్లో ఆందోళన

- మరోపక్క సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రకు పోటెత్తుతున్న ప్రజలు
- చంద్రబాబు ప్రజాగళం సభలకు రాని జనం
- ఎంత ప్రయత్నించినా జనం రావడంలేదంటున్న టీడీపీ నేతలు
- పవన్ కళ్యాణ్‌ని తెచ్చినా కన్నెత్తి చూడని జనం
- కూటమి పేరుతో నిర్వహించే సభలూ ఫ్లాపేనని ఆవేదన
- చిన్న సెంటర్లు, రోడ్లలో పెట్టి జనం వచ్చినట్లు చిత్రీకరించేందుకు ఆపసోపాలు
- ప్రజాభిప్రాయానికి ఇదే నిదర్శనమంటున్న విశ్లేషకులు

సాక్షి, అమరావతి: ఓ పక్క ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర అశేష ప్రజానీకంతో సాగుతోంది. అంతకు ముందు సీఎం జగన్ పాల్గొన్న సిద్ధం సభలూ ఘన విజయం సాధించాయి. మరి మన బాబు సభలేమిటి ఇంతగా తేలిపోతున్నాయి.. టీడీపీ నేతల్లో అంతర్మథన మిది. 14 ఏళ్లు సీఎంగా చేసిన బాబు నిర్వహిస్తున్న ప్రజాగళం సభలకు కనీస స్థాయిలో జనం రావడంలేదు. బాబు సభలకు ప్రజల నుంచి స్పందన లేదని పవన్ కళ్యాణ్‌ని తీసుకు వచ్చినా ఫలితం సున్నా. నాలుగు రోజులక్రితం తూర్పు గోదావరి జిల్లా నిడదవోలులో జరిగిన కూటమి సభలో చంద్రబాబు, పురందేశ్వరితో పాటు పవన్ కూడా పాల్గొన్నారు. అయినా ఈ సభకు నాలుగైదు వేల మంది కూడా రాలేదు. దీంతో ఏం చేయాలో పాలుపోక కూటమి నేతలు తలలు పట్టుకుంటున్నారు. అంతకు ముందు తణుకు సభకూ జనం ఆశించిన స్థాయిలో రాలేదు. మూడు పార్టీల నేతలు వస్తుండడంతో జన సమీకరణ భారీగా చేయాలని ఆ జిల్లా నాయకులపై ఒత్తిడి తెచ్చారు. జిల్లా నాయకులు ఎంతగా ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. తమ పార్టీ సభలకి ప్రజల్ని తీసుకురావడం కష్టంగా మారిందని, ఎంత చెప్పినా, ప్రలోభపెట్టినా రావడంలేదని స్థానిక నేతలు వాపోతున్నారు. బాబు ఒక్కడే విడిగా పెడుతున్న సభల పరిస్థితి ఇంకా దయనీయంగా ఉంటోందని చెబుతున్నారు. రోజుకి రెండు, మూడు సభలు పెడుతున్నా, ఒక్క చోట కూడా అనుకున్న స్థాయిలో ప్రజలు రావడంలేదని టీడీపీ నేతలే చెబుతున్నారు. పలుచగా ఉన్న సభల్ని చూసి మిగిలిన ప్రాంతాల్లోని కేడర్ నీరుగారిపోతుందనే ఉద్దేశంతో ఎక్కువ మంది వచ్చినట్లుగా కనిపించేందుకు చిన్న సెంటర్లు, చిన్న రోడ్లను ఎంచుకుని సభలు పెడుతున్నారు. అక్కడికి అతి కష్టం మీద కొద్దిపాటి జనాన్ని తీసుకువచ్చి ఫొటోలు, వీడియోలతో వాటినే గొప్పగా ఉన్నట్లు చూపిస్తున్నారు.

బాబు స్పీచ్ మొదలైతే.. జనమూ జంపే...

మరోవైపు సభలకు వచ్చిన కొద్దిపాటి జనం కూడా బాబు ప్రసంగం మొదలవగానే వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. బాబు ప్రసంగం అంటేనే గంటా గంటన్నరపాటు ఊకదంపుడు స్పీచ్ ఉంటుంది. అందులోనూ విషయం లేకపోవడంతో వినేందుకు ఎవరూ ఇష్టపడటంలేదు. వైఎస్ జగన్‌పై అదే పనిగా అక్కసు వెళ్లగక్కుతుండడంతో ప్రజలు పట్టించుకోవడంలేదు. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో జరిగిన నాలుగు సభలను చూస్తే బాబు మాట్లాడుతున్నప్పుడు వింటున్నవారి సంఖ్య చాలా స్వల్పం. ఆయన మాటలను ప్రజలు నమ్మడం లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. జగన్‌ను తిట్టడం, ఈర్ష్య, ద్వేషాలను బయటపెట్టుకోవడం తప్ప బాబు ప్రసంగాల్లో కొత్తదనం కనిపించడంలేదని చెబుతున్నారు. దానివల్లే జనం ఏమీ పట్టించుకోవడంలేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బాబు మాత్రం అవేమీ పట్టించుకోకుండా తన కడుపు మంటనంతా వెళ్లగక్కి, కళ్లు మూసుకుని గంటల తరబడి అబద్ధాలను చెబుతూ వాటినే గొప్ప ప్రసంగాలుగా ఫీల్ అవుతున్నారని పరిశీలకులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఈసారి ఎలాగైనా జనాన్ని తీసుకురండి.. నేతలకు హెచ్చరికలు

గత నెలలో చిలకలూరిపేటలో ప్రధాని నరేంద్ర మోడీతో నిర్వహించిన సభను కూడా టీడీపీ విజయవంతం చేయలేకపోయింది. ఎన్నో ఆశలతో నిర్వహించిన ఆ సభలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను మోదీ పెద్దగా పట్టించుకోకపోవడం, సభ కూడా అట్టర్‌ఫ్లాప్ అవడంతో బాబుకు షాక్ తగిలినట్లయింది. ఆ తర్వాత నుంచి 'ప్రజా గళం' పేరుతో నిర్వహించిన సభలేవీ జనాన్ని ఆకర్షించలేదు. అంతకు ముందు 'రా కదలిరా' పేరుతో పార్లమెంటు నియోజకవర్గాల్లో నిర్వహించిన సభలూ తేలిపోయాయి. దీంతో ఏం చేయాలనే దానిపై కూటమి అగ్ర నేతలు మల్లగుల్లాలు పడుతున్నారు. శుక్రవారం చంద్రబాబు నివాసంలో జరిగిన కూటమి నేతల సమావేశంలో సభలు విఫలమవడంపైనా చర్చించారు. ఈసారి ఎలాగైనా కొన్ని సభలకు జనాన్ని భారీగా తరలించాలని పార్టీ సీనియర్ నేతలకు చంద్రబాబు చెప్పారు. రాబోయే వారం రోజుల్లో వరుసగా 13 సభలకు ప్రణాళిక రూపొందించి అక్కడి నేతలకు ముందుగానే హెచ్చరికలు చేశారు. జన సమీకరణ బాగా ఉండాలని, లేకపోతే బాబు గారు తిడతారని పరిశీలకులు అక్కడి ఇన్‌ఛార్జిలను బెదిరించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే నియోజకవర్గాల నేతలు మాత్రం జనం రాకపోతే తామేం చేయలేమంటూ చేతులెత్తేస్తున్నారు.



దుష్కార్యము చేయు ప్రతివాడు వెలుగును ద్వేషించును, తన క్రియలు దుష్క్రియలుగా కనబడకుండునట్లు వెలుగునొద్దకు రాడు. సత్యవర్తనుడైతే తన క్రియలు దేవుని మూలముగా చేయబడియున్నవని ప్రత్యక్షపరచ బడునట్లు వెలుగునొద్దకు వచ్చును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం
ఉత్తరాయణం, వసంత ఋతువు
చైత్ర మాసం, **తిథి:** శు.షష్ఠి ప.3.46 వరకు తదుపరి సప్తమి, **నక్షత్రం:** ఆరుద్ర తె.5.17 వరకు (తెల్లవారితే సోమవారం), తదుపరి పునర్వసు, **వర్జ్యం:** ప.1.23 నుండి 3.01 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.31 నుండి 5.20 వరకు, **అమృతఘడియలు:** రా.7.07 నుండి 8.06 వరకు.

సూర్యోదయం : 5.49
సూర్యాస్తమయం : 6.11
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ లీడర్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

కోసీ నదీ ప్రాంతంలో దొరికే చేత్రా రకం చేపల్ని తినే అదృష్టం ఈ దేశంలో కొద్దిమందికి మాత్రం లభించదు.

అంతటి ధారాళమైన అదృష్టాన్ని నాకు నా మిత్రుడు ముఖేష్ సహనీ.. సమృద్ధిగా ప్లేటులో అమర్చి నా చేతికి అందించాడు! ఆ సమయంలో మేము గాలిలో అవకతవగ్గా ఈత కొడుతున్నట్లు ఎగురుతున్న చాపర్‌లో ఉన్నాం.

"ఇలా తినటం బాగుంది కదా తేజ్!" అన్నాడు ముఖేష్ నవ్వుతూ. వికాస్‌శీల్ పార్టీ అధ్యక్షుడు అతడు. ఐదేళ్ల క్రితమే పార్టీ పెట్టాడు. అంతకుముందు బాలీవుడ్ సెట్ డిజైనర్.

"ఎలా తినటం బాగుంది ముఖేష్? మోదీజీకి, బిహార్‌లోని ఆయన సంకీర్ణ 'దళానికి'... బాగా వేయించి, మసాలా దట్టించిన చేత్రాను చూపించుకుంటూ తినటమా?" అని పెద్దగా నవ్వాన్నేను... సెల్ఫీలో ముఖేష్‌ను కూడా పట్టిస్తూ.

"తరిగిన ఉల్లి ముక్కల్ని, ఘాటైన పచ్చి మిరపను నంజుకుంటూ, చేత్రా చేప వేపుడును తినడం బాగుంటుంది కదా అని తేజ్... నేను అనటం..." అని నవ్వాడు ముఖేష్.



చాపర్ ఎగురుతూ ఉంది. చేత్రాను మేము కొద్దికొద్దిగా కొరికి తింటూ ఉన్నాం. నిజానికి తినడం మా అదృష్టం కాదు. తినటానికి టైమ్ దొరకటం... అదీ అదృష్టం! ఎన్నికల ప్రచారం దేనికీ సందు ఇవ్వటం లేదు. ఆఖరికి చాపర్‌ను ఒకచోట నిలిపి మోదీజీ గురించి ఒక మంచి మాట మాట్లాడుకోవటానికి కూడా!

ఒక విడతలో అయ్యే పనికి ఎలక్షన్ కమిషన్ బిహార్‌కు ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లతో పాటుగా ఏడు విడతల పోలింగ్ పెట్టింది. ఏప్రిల్ 19, 26 ; మే 7, 13, 20, 25 ; జూన్ 1. తర్వాత రెండు రోజులకు జూన్ 4న కౌంటింగ్. ఆ తర్వాత సరిగ్గా వారానికి జూన్ 11న నాన్నగారి పుట్టిన రోజు!

ఆర్జేడీకి లోక్‌సభలో ఇప్పుడున్న జీరో సీట్లను 20కి, లేదంటే కనీసం 10కి పెంచి నాన్నగారి పుట్టిన రోజుకు కానుకగా ఇవ్వాలి. అలా కాకపోయినా బిహార్‌లో బీజేపీకి ఇప్పుడున్న 17 సీట్ల కన్నా కనీసం ఒకటెక్కువగా, లేదంటే జేడీయూకి ఇప్పుడున్న 16 సీట్ల కన్నా ఒకటెక్కువగా సీట్లు గెలిచి నాన్నగారికి బహుమతిగా ఇవ్వగలిగినా బాగుంటుంది. ఆయనెంతో సంతోషిస్తారు. ఆయనతో పాటు అమ్మ కూడా!

ఆర్జేడీ, కాంగ్రెస్, లెఫ్టిస్టులు, వికాస్‌శీల్ పార్టీ ఒక జట్టుగా పోటీ చేస్తున్నాం కాబట్టి నాన్నగారి బర్త్ డే గిఫ్ట్ ఆల్రెడీ రెడీ అయినట్లే. మొత్తం 40 సీట్లలో ఆర్జేడీ 23, కాంగ్రెస్ 9, లెఫ్టిస్టులు 5, వికాస్‌శీల్ 3 సీట్లలో చేయీ చేయీ పట్టి నిలబడితే... బీజేపీకి, జేడీయూకి లోక్‌సభలో కూర్చోటానికి చోటు ఉంటుందా?

రెండోరోజు సాయంత్రం – నేలపై కాసేపు అడుగులు వేయటానికి జనం లేని చోటు చూసుకుని చాపర్ నుంచి కిందికి దిగాం.

"తేజ్... మనం చేత్రాను తింటున్న వీడియోను మీరెప్పుడు ట్వీట్ చేశారు!! కింద కామెంట్స్ చూశారా... ఎంత వైల్డ్‌గా ఉన్నాయో..." అని తన ఫోన్ నా చేతికి ఇచ్చాడు ముఖేష్ ఆశ్చర్యపోతూ.

నవ్వాను. అప్పటికి కొద్దిసేపటి క్రితమే ఆ వీడియోను అప్లోడ్ చేశాన్నేను. 'సనాతనులమని చెప్పుకుంటున్న వారెవరైనా చైత్ర మాస నవరాత్రులలో నాన్-వెజ్ తింటారా?!!' అని బీజేపీ లీడర్లు అప్పుడే మొదలుపెట్టేశారు.

వాళ్లంతే! నిరుద్యోగంపై స్పందించరు. పేదరికం మీద స్పందించరు. విద్య, ఆరోగ్యంపై స్పందించరు. మతం, మాంసం అంటే చాలు... స్టేట్‌మెంట్‌లు ఇవ్వటానికి, కామెంట్లు పెట్టటానికి ఒక్క దుముకు దుముకుతారు.

నిజానికి చైత్ర మాస నవరాత్రులు ఏప్రిల్ 9న ప్రారంభమై, 17న శ్రీరామనవమికి ముగుస్తాయి. మేము చేత్రాను తింటున్న వీడియో ఏప్రిల్ 8 నాటిది.

మాంసం తిన్నామని మెడలో ఎవరైనా ఎముకలు వేసుకుంటారా అన్నది కాదు... మాంసం తిన్నారని ఆరోపించటానికి ఎవరైనా మెడలో ఎముకలు వేసుకుంటారా అన్నదే ప్రశ్న ఇప్పుడు!!

రాజ్యాంగ స్ఫూర్తే రణ దుందుభి





జనతంత్రం

వర్ధెల్లి మురళి

అంబేడ్కర్‌ను తలుచుకునే ప్రతి సందర్భంలోనూ మనకు భారత రాజ్యాంగం తలపునకొస్తూనే ఉంటుంది. నాలుగు వేదాల్లోని సారమెల్లా మహాభారతంలో ఉన్నదని ప్రతీతి. మానవ హక్కులకు పట్టం కట్టిన ప్రతి చారిత్రక పత్రంలోని సారాంశమంతా మన రాజ్యాంగంలో ఉన్నది. ఎనిమిది శతాబ్దాల కిందటి 'మాగ్నాకార్టా' దగ్గరి నుంచి ఎనిమిది దశాబ్దాల నాటి 'విశ్వజనీన మానవ హక్కుల ప్రకటన' (యుఎన్) వరకు ఆ యా కాలాల్లోని డిక్లరేషన్లు ప్రజాస్వామ్య వ్యవస్థలకు ప్రాణ ప్రతిష్ఠ చేశాయి. ఈ డిక్లరేషన్లన్నిటిలోకి నిస్సందేహంగా అగ్రగణ్యమైనది, అత్యున్నతమైనది భారత రాజ్యాంగం. మానవ హక్కుల కథాగమనంలో పంచమవేదంలా పుట్టిన మహాకావ్యం భారత రాజ్యాంగం.

దేశంలో సాధారణ ఎన్నికల వడగాడ్పుల సందర్భం కూడా ఇది. రాజ్యాంగాన్ని మార్చడం అనే అంశంపై చెలరేగుతున్న వాదోపవాదాలు కూడా ఈ సందర్భాన్ని మరింత వేడెక్కిస్తున్నాయి. రెండేళ్ల కిందట కావచ్చు, అప్పటి తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మార్చవలసిన అవసరముందని అభిప్రాయపడ్డారు. ప్రజలు ఆయనకా అవకాశం ఇవ్వలేదు. ఆయన్నే మార్చేశారు. కాలపరిస్థితులను బట్టి రాజ్యాంగంలో స్వల్ప సవరణలు సహజమే. కానీ దాని మౌలిక స్వరూపాన్ని మార్చే అధికారం ఎవ్వరికీ లేదని ఇప్పటికే భారత సర్వోత్తమ న్యాయస్థానం ఘంటాపథంగా చాటిచెప్పింది. మౌలిక స్వరూపం అంటే ఏమిటో దాని పీఠికలో ఉన్న ఆరు వాక్యాలు చదివితే అర్థమవుతుంది.

బీజేపీ నాయత్వంలోని ఎన్డీఏ కూటమి మరోమారు గెలిస్తే రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చేస్తుందని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్ని బీజేపీ వాళ్లు మొక్కుబడిగా మాత్రమే ఖండిస్తున్నారు. అనంత హెగ్డే వంటి కొందరు నాయకులు బహిరంగంగానే రాజ్యాంగం మార్పుకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. బీజేపీ అనే రాజకీయ వేదికకు సొంతదారైన ఆరెస్సెస్‌కు మన రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ సదభిప్రాయం లేదన్నది సత్యదూరం కాదు. పైగా ఈసారి బీజేపీ వాళ్లు 400 సీట్లలో తమ కూటమి గెలవాలని తెగ ఆరాటపడుతున్నారు. ఈ ఆరాటం వెనుక ఉన్న మహాత్కార్యం రాజ్యాంగ మౌలిక మార్పులేనన్నది విమర్శకుల అభిప్రాయం.

భారత రాజ్యాంగంలో ధ్వనించే సమతా నినాదం సంఘ్ పరివార్‌కు ఏమాత్రం కర్ణపేయం కాదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వపు పదేళ్ల పదవీకాలంలో 40 శాతం దేశ సంపద ఒక్క శాతం కుబేరుల గుప్పెట్లోకి చేరిపోవడమే ఇందుకు ఉదాహరణ. వ్యవసాయరంగం నుంచి రైతు కూలీలను తరిమికొట్టి చీప్ లేబర్‌తో మార్కెట్లను నింపడం ఈ కూటమి విధానం. అందుకోసం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాల ప్రహసనం తెలిసిందే. బీజేపీకి భారీ మెజారిటీ వస్తే పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలు గ్యారంటీగా ఎగిరిపోతాయని చాలామంది భావన. 42వ రాజ్యాంగ సవరణ ద్వారా ఇందిరాగాంధీ ఈ పదాలను జొప్పించారు. ఈ పదాలను తొలగించినప్పటికీ ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లోని 39 అధికరణాల రూపంలో వాటి పునాదులు బలంగానే ఉంటాయి. అయితే ఆ పునాదులనే పెకిలించే అవకాశాలుండవచ్చని దేశంలోని బుద్ధిజీవులు భయపడుతున్నారు.

ఏ గూటి పక్షులు ఆ గూటికే చేరుతాయని సామెత. పెత్తందారీ వర్గాల తాబేదారు పాత్రలో జీవితాన్ని తరింపజేసుకుంటున్న చంద్రబాబు నాయుడు బీజేపీకి సహజ మిత్రుడు. ప్రస్తుత ఎన్నికలతో కలిసి గడిచిన ఆరు సాధారణ ఎన్నికల్లో నాలుగుసార్లు ఆయన బీజేపీ కూటమిలోనే ఉన్నారు. రెండుసార్లు మాత్రమే దూరంగా ఉన్నారు. బీజేపీపై జనంలో వ్యతిరేకత ఉందన్న అభిప్రాయంతో మాత్రమే ఆయన రెండుసార్లు దూరం జరిగారు. కాకుల్ని కొట్టి గద్దలకు వేసే ఆర్థిక విధానాల్లో ఆయన బీజేపీ కంటే నాలుగు ఆకులు ఎక్కువే చదివారు. పేద ప్రజల పట్ల, బలహీన వర్గాల పట్ల తన ఏహ్యభావాన్నీ, అసహ్యాన్నీ దాచుకునే ప్రయత్నం కూడా చంద్రబాబు పార్టీ చేయదు. పేద ప్రజలకు రాజధాని ప్రాంతాల్లో ఇళ్లు కేటాయిస్తే సామాజిక సమతుల్యత దెబ్బతింటుందని కేసులు వేసి

> బీజేపీ నాయత్వంలోని ఎన్డీఏ కూటమి మరోమారు గెలిస్తే రాజ్యాంగం మౌలిక స్వరూపాన్ని మార్చేస్తుందని ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేస్తున్నారు. ఈ ఆరోపణల్ని బీజేపీ వాళ్లు మొక్కుబడిగా మాత్రమే ఖండిస్తున్నారు. అనంత హెగ్డే వంటి కొందరు నాయకులు బహిరంగంగానే రాజ్యాంగం మార్పునకు అనుకూలంగా మాట్లాడుతున్నారు. బీజేపీ అనే రాజకీయ వేదికకు సొంతదారైన ఆరెస్సెస్‌కు మన రాజ్యాంగం పట్ల మొదటి నుంచీ సదభిప్రాయం లేదన్నది సత్యదూరం కాదు. పైగా ఈసారి బీజేపీ వాళ్లు 400 సీట్లలో తమ కూటమి గెలవాలని తెగ ఆరాటపడుతున్నారు. ఈ ఆరాటం వెనుక ఉన్న మహాత్కార్యం రాజ్యాంగ మౌలిక మార్పులేనన్నది విమర్శకుల అభిప్రాయం.
>
> భారత రాజ్యాంగంలో ధ్వనించే సమతా నినాదం సంఘ్ పరివార్‌కు ఏమాత్రం కర్ణపేయం కాదు. ప్రస్తుత ఎన్డీఏ ప్రభుత్వపు పదేళ్ల పదవీ కాలంలో 40 శాతం దేశ సంపద ఒక్క శాతం కుబేరుల గుప్పెట్లోకి చేరి పోవడమే ఇందుకు ఉదాహరణ. వ్యవసాయరంగం నుంచి రైతు కూలీలను తరిమి కొట్టి చీప్ లేబర్‌తో మార్కెట్లను నింపడం ఈ కూటమి విధానం. అందుకోసం తీసుకొచ్చిన వ్యవసాయ చట్టాల ప్రహసనం తెలిసిందే. బీజేపీకి భారీ మెజారిటీ వస్తే పీఠికలోని సెక్యులర్, సోషలిస్టు పదాలు గ్యారంటీగా ఎగిరిపోతాయని చాలా మంది భావన.

గుడ్డలూడదీసుకున్న వారి గురించి ఇంకేం మాట్లాడాలి?

కుల, మత, ప్రాంత, రాజకీయ, లింగ వివక్షలేవీ లేకుండా నాణ్యమైన అంతర్జాతీయ స్థాయి విద్యను ప్రజలందరికీ అందజేయాలనే ఒక బృహత్తరమైన యజ్ఞాన్ని జగన్ ప్రభుత్వం ప్రారంభించింది. చంద్రబాబు కూటమి ఈ యజ్ఞాన్ని చూసి కళ్లలో నిప్పులు పోసుకోవడం తెలిసిందే. ఇంగ్లిషు మీడియం విద్యకు వ్యతిరేకంగా, అంతర్జాతీయ స్థాయి బోధనా పద్ధతులకు వ్యతిరేకంగా, పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు వ్యతిరేకంగా యెల్లో పెత్తందార్లు నడిపిన కుట్రల సంగతి కూడా తెలిసిందే. అన్ని రంగాల్లోనూ ఇదే తంతు. పేద వర్గాలను, మహిళలను వారి కాళ్లపై నిలబెట్టడానికి జగన్ సర్కార్ చేస్తున్న ప్రతి ప్రయత్నాన్నీ యెల్లో పెత్తందార్లు వ్యతిరేకిస్తున్నారు. పరిపాలనా వికేంద్రీకరణ ఎంత పెరిగితే అంతగా పారదర్శకత పెరుగుతుంది. అచ్చమైన ప్రజాస్వామ్యానికి ఇది సిసలైన లక్షణం. జగన్ ప్రభుత్వం పారదర్శకతకు పెద్ద పీట వేసింది. ప్రభుత్వ పాలనను ప్రజల ఇంటి గడప వద్దకు చేర్చింది.

వికేంద్రీకరణకు పెత్తందార్లు ఎప్పుడూ వ్యతిరేకమే. పాలనా వ్యవహారాలన్నీ వారి గుప్పెట్లోనే ఉండాలి. పారదర్శకత అనే పదం వారి డిక్షనరీలోనే ఉండదు.

మాదాపూర్‌లో ఐటీ పార్క్ రాబోతున్నదనే రహస్యం వారికి మాత్రమే తెలియాలి. చుట్టూరా భూములన్నీ వారి వర్గం వారే కొనుగోలు చేయాలి. ఆ తర్వాతనే పార్క్ ప్రకటన రావాలి. రాజధాని ఎక్కడ వస్తుందో వారికి మాత్రమే తెలియాలి. వారి వర్గం అక్కడి భూములన్నీ కొనుగోలు చేయాలి. ఆ తర్వాతనే రాజధాని ప్రకటన చేయాలి. ఈలోగా ఇతర వర్గం ఔత్సాహికులను తప్పుదారి పట్టించడానికి తప్పుడు లీకులు వదలాలి. చంద్రబాబు నాయకత్వంలోని పెత్తందార్ల కూటమి అనుసరిస్తున్న ఈ తరహా రియల్ ఎస్టేట్ వ్యాపారానికే వారు అభివృద్ధి అనే ముద్దు పేరు పెట్టుకున్నారు.

భారత రాజ్యాంగం ప్రవచించిన ఆదేశిక సూత్రాలను శిరసావహించినందుకు జగన్ పాలన విధ్వంసకర పాలనని మన తోలుమందం పెత్తందార్లు ప్రచారం చేస్తున్నారు. యావత్తు ప్రపంచం వాంఛిస్తున్న సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను ఆదర్శంగా పెట్టుకున్నందుకు జగన్ పరిపాలన వారికి వినాశకరమైనదిగా కనిపిస్తున్నదట! దశాబ్దాలు గడిచిపోతున్నా అధికార పదవుల్లో ఆవగింజంత వాటా కూడా దొరకని వర్గాలను సమీకరించి సామాజిక న్యాయం బాట పట్టినందుకు జగన్ సర్కార్‌కు కొమ్ములు మొలిచాయట! కొవ్వు బలిసిన పెత్తందారీ వర్గాల ప్రచారం తీరు ఇది.

ఎన్డీఏ పదేళ్ల ఏలుబడిలో నిరుద్యోగ సమస్య జడలు విప్పి నర్తిస్తున్నది. మన తెలుగు పెత్తందార్లకు ఆ జడల దయ్యం ముద్దొస్తున్నది. ఐదేళ్ల కింద రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నాలుగు లక్షల మంది ఉంటే జగన్ సర్కార్ హయాంలో వారి సంఖ్య ఆరున్నర లక్షలకు పెరిగింది. ఎకాయెకిన యాభై శాతం ఉద్యోగాలు అదనంగా కల్పించిన జగన్ ప్రభుత్వం వారికి విలన్‌గా కనిపిస్తున్నది. ఈ సంఖ్యలో వలంటీర్లను చేర్చలేదు సుమా! పరిశ్రమల స్థాపనలోగానీ, మౌలిక వసతుల కల్పనలోగానీ, ఉపాధి కల్పనలోగానీ, సంక్షేమ కార్యక్రమాల అమలులోగానీ గణాంకాల ఆధారంగా జగన్ సర్కార్‌తో పోల్చడానికి ఈ పెత్తందార్లు ముందుకు రావడం లేదు. కేవలం విధ్వంసం, వినాశనం, సర్వనాశనం అనే పడికట్టు మాటలతో శాపనార్థాలు పెడుతూ పూట గడుపుకొస్తున్నారు.

యెల్లో మీడియా అనుసరిస్తున్న ఈ తరహా ఊకదంపుడు గోబెల్స్ ప్రచారం కాలం చెల్లిన చీప్ ట్రిక్. ప్రజల చైతన్యస్థాయి పెరిగింది. సమాచార మాధ్యమాలు పెరిగాయి. ఎవరు మిత్రుడో, ఎవరు శత్రువో గుర్తించగలిగే వివేచనా శక్తి జనంలో పెరిగింది. రాజ్యాంగబద్ధమైన తమ హక్కులను రక్షించుకోవడానికి ప్రజలు సంఘటితమవుతున్నారు. కేంద్రంలో ఒక విశ్వసనీయమైన ప్రతిపక్షం, విశ్వసనీయ ప్రతిపక్షనేత అందుబాటులో లేకపోవడం అనే ఒకే ఒక్క కారణం మరోసారి ఎన్డీఏను గద్దెనెక్కించవచ్చు. అదీ బొటాబొటీ మెజారిటీతో మాత్రమే! కూటమి ఆశిస్తున్నన్ని సీట్లు గెలవడం అసంభవం. పెత్తందారీ వర్గాలకు వ్యతిరేకంగా గట్టిగా నిలబడి రాజ్యాంగ లక్ష్యాల అమలుకు ప్రయత్నిస్తున్న జగన్ సర్కార్ బలంగా ఉన్నందువల్ల ఆంధ్రప్రదేశ్‌లో పేదవర్గాల జైత్రయాత్ర కొనసాగుతుందని అంచనాలు వెలువడుతున్నాయి. మొత్తం 25 లోక్‌సభ స్థానాలతో పాటు నూటాయాభైకి పైగా అసెంబ్లీ స్థానాలను వైసీపీ గెలుచుకున్నా ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు.

vardhelli1959@gmail.com

రాజ్యాంగ రక్షణ పండుగ

సందర్భం



మాడభూషి శ్రీధర్

రాజ్యాంగం మనం రచించుకున్న అద్భుత వ్యవస్థ. రాజ్యాంగం ఒక సజీవమైన వ్యవస్థ. అందులో కొన్ని విలువలు ఉన్నాయి. మనం నమ్ముకోవలసిన ప్రజాస్వామ్యం, స్వతంత్రం, సమానత సౌభ్రాతృత్వం, ఆలోచనా స్వేచ్ఛ, భావ ప్రకటన, బాధ్యతలు, అన్ని మతాలనూ గౌరవించడం, సామాజిక స్నేహం, జాతీయ సమైక్యత, సమగ్రత – ఇవీ ఆ విలువలు.

ఆ విలువల రాజ్యాంగాన్ని రచించుకోవడానికి 'రాజ్యాంగ సభ' ఏర్పాటయింది. ఎన్నికల్లో గెలిచిన ప్రతినిధులు మాత్రమే రాజ్యాంగ సభలో సభ్యులయ్యారు. రాజ్యాంగ రచనలో కీలక పాత్ర వహించిన అంబేడ్కర్‌ను బొంబాయి గెలిపించలేదు. బెంగాల్ నుంచి ముస్లింలీగ్ మద్దతుతో రాజ్యాంగ సభ సభ్యులైనారు. దళితులకు, మైనారిటీలకు సమాన హక్కులు సాధించడానికే వస్తున్నానన్నారు. కాని, దేశవిభజనతో ఆయన స్థానం పాకిస్తాన్‌లోకి వెళ్లిపోయింది. బొంబాయి రాష్ట్ర ప్రధాన మంత్రి (స్వాతంత్ర్యానికి ముందు ఆ యా రాజ్యాలకు ప్రధానమంత్రులు ఉండేవారు) బీఎస్ ఖేర్‌కు రాసిన ఒక ఉత్తరంలో అంబేడ్కర్‌ను బొంబాయి నుంచి గెలిపించాలని రాజేంద్ర ప్రసాద్ కోరారు. ఎంఆర్ జయకర్‌తో రాజీనామా చేయించి, అంబేడ్కర్‌ను గెలిపించుకుని రాజ్యాంగ సభకు పంపారాయన. అంబేడ్కర్ మహోన్నత విద్యావంతుడు, అటు ఆర్థిక శాస్త్రం, ఇటు న్యాయశాస్త్రం ఆపోశన పట్టినవారు. పాలనా వ్యవస్థల నిర్మాణం గురించే అధ్యయనం చేసిన వ్యక్తి. కనుక రజ్యాంగ రచనా ఉప సంఘంలో ఆయన ఉండాలని రాజేంద్రప్రసాద్ సూచించారు. ఈ డ్రాఫ్టింగ్ కమిటీలో అల్లాడి కృష్ణస్వామి అయ్యర్, ఎన్. గోపాలస్వామి అయ్యంగార్, కేఎం మున్షీ, మహ్మద్ సాదుల్లా, బీఎల్ మిట్టర్ (వీరు అనారోగ్యంతో రాజీనామా చేస్తే ఎన్. మాధవరావు సభ్యులైనారు), డీపీ ఖైతాన్ (వీరు 1948లో మరణిస్తే టీటీ కృష్ణమాచారి చేరారు)లు ఇతర సభ్యులు. ఈ సంఘం సభ్యులు 1947 ఆగస్టు చివర తొలి సమావేశంలో అంబేడ్కర్‌ను తమ కమిటీ అధ్యక్షులుగా ఎన్నుకున్నారు. గోపాలస్వామి అయ్యంగార్ రాజ్య వ్యవహారాల్లో తలమునకలై ఉన్నారు. సాదుల్లా, మాధవరావులకు ఢిల్లీ వాతావరణం సరి పడలేదు. పాలన, న్యాయ, రాజ్యాంగ రంగాలలో నిపుణుడైన బీఎస్ రావ్, ఆ యా దేశాల రాజ్యాంగాలను అధ్యయనం చేసి మన దేశంలో



అప్పుడున్న భారత ప్రభుత్వ చట్టం 1935ను విస్తరిస్తూ రాజ్యాంగం మొదటి చిత్తు ప్రతిని రూపొందించారు. ఆ తరువాత అందులో సూత్రాలను పునర్నిర్మించడంలో కీలకమైన కృషి చేశారు. ఆయన కూడా తరువాత విదేశాల్లో ఉండిపోవడం వల్ల అందుబాటులో లేరు. ఒకరిద్దరి పాత్ర లేనే లేదు. మరికొందరి పాత్ర స్వల్పం. దీంతో మొత్తం భారం అంబేడ్కర్ పైన పడిందని టీటీ కృష్ణమాచారి చెప్పారు.

అంబేడ్కర్ ఆ బాధ్యతను నిర్వహించి 'రాజ్యాంగ పిత' అయ్యారు. మరికొన్ని ఉపసంఘాలు కూడా చాలా సహకరించాయి. కేంద్ర అధికారాల కమిటీకి నెహ్రూ, రాష్ట్రాల అధికారాల కమిటీ నేతగా వల్లభాయ్ పటేల్, ప్రాథమిక హక్కుల కమిటీకి జేబీ కృపలానీ, ఇంకా అనేకానేక అంశాలపై ఎన్నో ఉపసంఘాలూ పనిని పంచుకున్నాయి. ప్రాథమిక హక్కుల కమిటీకి అంబేడ్కర్ ఇచ్చిన వివరమైన పత్రం చాలా కీలకమైంది.

భారత రాజ్యాంగం గురించి చర్చించుకునేటప్పుడు మనం 'గ్రాన్విల్ ఆస్టిన్' అనే అమెరికా పౌరుని గురించీ మాట్లాడుకోవాలి. ఈ భారత రాజ్యాంగ చరిత్రను అధ్యయనం చేసి, అర్థం చేసుకుని జీర్ణం చేసుకున్న వ్యక్తి ఆస్టిన్. 1940 నుంచి 2013 దాకా భారత రాజ్యాంగాన్ని చదువుకుని, పాఠాలు చెప్పుకుంటూ, ఒక్కో పదాన్ని రిసర్చ్ చేసిన వ్యక్తి ఆయన. నెహ్రూ, గాంధీ, అంబేడ్కర్ వంటివారు ఎందరితోనో మాట్లాడి, ప్రతి విషయాన్నీ డాక్యుమెంట్ చేసుకుని, ఫైళ్లు స్వయంగా చూసి, చదువుకుని, రాసిన వారితో మాట్లాడి, ఏమాట ఎందుకన్నారో, దాని వెనుక ఉద్దేశం ఏమిటో సవివరంగా రాసిన పుస్తకాలు రెండు ఉన్నాయి. చదువుకున్న ప్రతి వ్యక్తీ, న్యాయవాదీ, న్యాయశాస్త్ర విద్యార్థీ చదవవలసిన పుస్తకాలు ఇవి. వందేళ్లు బతికి మన రాజ్యాంగాన్ని క్షుణ్ణంగా అవగాహన చేసుకున్న ఆస్టిన్ 1966లో రాసిన 'ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్: కార్నర్ స్టోన్ ఆఫ్ ఎ నేషన్' చదివి తీరవలసిన పుస్తకం.

మన రాజ్యాంగం 'ఆబ్జెక్టివ్స్ రిసొల్యూషన్' (లక్ష్యాల నిర్దేశం)తో ప్రారంభమయ్యిందని అంటూ ఉంటారు. 1946 డిసెంబర్ 9న చరిత్రాత్మకమైన రాజ్యాంగ నిర్మాణ (రచన అని అన్నా, అనాల్సింది మాత్రం నిర్మాణం అని) కార్యక్రమం ఆరంభమైంది. ప్రముఖ రచయిత సుధీంద్ర కులకర్ణి రాజ్యాంగ పీఠికకు ముందున్న 'లక్ష్య నిర్ధారణ' అనేది రాజ్యాంగానికి ప్రాణం అనీ, ప్రాణప్రతిష్ఠ అనే మాట కూడా వాడారు.

లక్ష్య నిర్ధారణ మనం చేయదలచుకున్న మంచిపనులేమిటో నిర్ణయిస్తుంది. తత్వభూమికను వివరిస్తుంది. అయోధ్య భాషలో అయితే రాజ్యాంగానికి ప్రాణప్రతిష్ఠ లక్ష్య తీర్మానం 1947 జనవరి 22న ఏకగ్రీవంగా స్వీకరించారు. ఆ రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి. రాబోయే ఓట్ల పండుగను తిట్ల పండగగా కాకుండా, ఈ దేశాన్నీ, రాజ్యాంగాన్నీ రక్షించడానికి ఉపయోగించాలి. రాజ్యాంగం ప్రసాదించిన ఓటు హక్కును వినియోగించుకోవాలి. సరైన వ్యక్తులకు ఓటు వేయాలి.

వ్యాసకర్త మహేంద్ర యూనివర్సిటీ 'స్కూల్ ఆఫ్ లా'లో ప్రొఫెసర్

దేశ భవిష్యత్తుకు దిక్సూచి!

సందర్భం



డా॥ కత్తి పద్మారావు

ప్రపంచ మేధావి, ఆలోచనాపరుడు, తత్వవేత్త, భారత రాజ్యాంగ నిర్మాణ కర్త డా॥ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ప్రపంచవ్యాప్తంగా స్ఫూర్తిని నింపుతున్న ఒక చారిత్రక ఉత్సవం. అంబేడ్కర్ నిరంతర అధ్యయనం, విశ్లేషణ, తర్కం, హేతువాదం, మానవతావాదం; ఆర్థిక, సాంఘిక, రాజకీయవాదాలు; బౌద్ధ విప్లవ ప్రస్థానం... ఆయన విస్తృతినీ, వ్యాప్తినీ, ప్రాపంచిక తాత్విక దృక్పథాన్నీ మనకు సాక్షాత్కరింపజేస్తున్నాయి.

ఆయన ఒక వాల్టేర్ లాగా, రూసో లాగా ప్రపంచానికి ఒక నూతన దర్శనాన్ని అందించారు. ఆయన వ్యక్తిత్వంలో విద్యాజ్ఞానం, పరిశోధన, నైతికత, విమోచన కలిసి నడుస్తాయి. ఆయన బహుభాషా నిష్ణాతులు. మరాఠా భాష ఎంత బలంగా వచ్చో ఇంగ్లీషు, జర్మనీ కూడా అంతే నిశితంగా వచ్చు. ఆయన ఒక భాషా నిఘంటువు. ఆయన విద్యాభ్యాసంలో ఒక యుద్ధ ప్రక్రియ ఉంది. ఆయన ఆర్థిక శాస్త్ర నిపుణులు. అంబేడ్కర్ అపారమైన జ్ఞాపక శక్తి కలవారు. రాజ్యాంగ సభ డిబేట్స్‌లో కొన్ని వందల అంశాలు చూడకుండా చెప్పగలిగే వారు. ఆయన వాక్చాతుర్యానికీ, వాదనా పటిమకూ, విషయ పరిజ్ఞానానికీ బాబు రాజేంద్ర ప్రసాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభాయ్ పటేల్, రాజాజీ వంటి వారు అచ్చెరువొందేవారు.

అంబేడ్కర్ సున్నితమైన హాస్య చతురుడు. చక్కని చిరునవ్వుతో ఆయన కళ్ళు మెరుస్తూ ఉండేవి. ఆయన చూపుడు వేలు ప్రపంచానికి ఓ ప్రశ్నోపనిషత్తు వంటిది. అంబేడ్కర్ 1913లో న్యూయార్క్‌లోని కొలంబియా విశ్వవిద్యాలయంలో విద్యార్థిగా, పరిశోధకుడిగా 'బ్రిటిష్ ఇండియాలో ప్రొవెన్షియల్ ఫైనాన్స్ పరిణామం' అనే థీసిస్ రాసి ఎందరి మెప్పునో పొందారు. 1916లో లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌లో డాక్టరేట్ పట్టా పుచ్చుకోవడం కోసం రాత్రింబవళ్లు శరీరం శుష్కించే వరకూ చదివారు.

విద్య పట్ల అంబేడ్కర్ దృక్పథాన్ని గమనిస్తే ఆయన విద్య అంటే కేవలం అక్షరాస్యత అనో, చదువనో అనుకోలేదని స్పష్టమవుతుంది. విద్య మనిషిని సంపూర్ణంగా మార్చగలిగే సాధనమన్నది అంబేడ్కర్ నమ్మకం. ఈ విషయంలో ఆయనపై బౌద్ధ ధర్మ ప్రభావం ఉన్నట్లు అనిపిస్తుంది. బుద్ధుడి బోధనలు, తాత్విక చింతన కేంద్రంగానే అంబేడ్కర్ విద్యను అభ్యసించారు. విద్య పరమార్థం ప్రజ్ఞ, కరుణ, సమత అనీ, ఈ త్రిగుణాలు పెంపొందించినప్పుడే విద్యకు పరిపూర్ణత చేకూరుతుందనీ అంబేడ్కర్ భావించారు. సమాజంలో విద్య ద్వారా చైతన్యం వస్తుందన్న ఉద్దేశంతో ఆయన విద్యా వ్యాప్తి కోసం 1945 నుంచి ఒక ఉద్యమం ప్రారంభించారు.



'పీపుల్స్ ఎడ్యుకేషన్ సొసైటీ' పేరుతో ఒక సంస్థను ఏర్పాటు చేసి, అనేక విద్యాలయాలు, కళాశాలల ఏర్పాటుకు కృషి చేశారు. జ్ఞానం, కరుణ అనేవి తాను స్థాపించిన సొసైటీ ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్న అంబేడ్కర్ 'హక్కుల సాధన కోసం చదువుకోండి! సంఘటితం కండి! పోరాడండి! మీపైన మీరు విశ్వాసం పెంచుకోండి! ఏ రకంగా కూడా మనకు ఓటమి ఉండదు. ఇది విజయం కోసం చేస్తున్న పోరాటం, స్వేచ్ఛ కోసం సాగిస్తోన్న యుద్ధం, ఈ యుద్ధం మనం కోల్పోయిన వ్యక్తిత్వాన్ని తిరిగి పొందడానికి చేస్తున్నది' అని ఉద్బోధించారు. సామాజిక మార్పు పోరాటాల ద్వారా, పోరాటాలు విజ్ఞానం ద్వారా, విజ్ఞానం విద్య ద్వారా అందుతాయన్నది అంబేడ్కర్ మార్గం. అలాగే దళితులు చదువు కోవడం ద్వారా సంప్రదాయ వృత్తుల్లో స్థిరపడే అవకాశం ఉండదనీ, తద్వారా తమ తరతరాల కులవృత్తులు చేస్తున్నందువల్ల ఎదురవుతున్న చిన్నచూపు తప్పుతుందనీ అంబేడ్కర్ ఆలోచన.

అంబేడ్కర్ మనుస్మృతి భావజాలానికి ప్రత్యామ్నాయంగా భారత రాజ్యాంగాన్ని రూపొందించారు. ఆయన పాండిత్యం, విజ్ఞత, మానవతా దృష్టి, బౌద్ధనీతి, సమ సమాజ భావన, భారత రాజ్యాంగంలో సముచితంగా సమన్వయించబడ్డాయి. అంబేడ్కర్‌లో కుల నిర్మూలనా భావం, దార్శనికత, అహింసాతత్వం, భారతదేశాన్ని రక్తపాతం లేని దేశంగా సృష్టించగలిగింది. రాజ్యాంగంలో స్త్రీలందరికీ చదువుకునే హక్కు ఇవ్వటం ద్వారానూ, అస్పృశ్యులందరికీ రిజర్వేషన్ కల్పించడం ద్వారానూ, శూద్రులందరికీ హక్కులు కల్పించడం ద్వారానూ ఆయన సమ సమాజ నిర్మాణానికి పునాదులు వేశారు.

అంబేడ్కర్ విద్యా విప్లవంతో పాటు రాజకీయోద్యమాన్నీ నడిపారు. 1936 ఆగస్టులో దళిత జాతుల సముద్ధరణకు 'ఇండిపెండెంట్ లేబర్ పార్టీ'(ఐఎల్‌పీ)ని ఆయన స్థాపించారు. ఈ పార్టీ బొంబాయిలో షెడ్యూల్డ్ కులాలకు కేటాయించిన పదిహేను సీట్లలో పదమూడింటిని కైవసం చేసుకుంది. జనరల్ సీట్లను కూడా రెండింటిని కైవసం చేసుకుంది. ఆయన 'లేబర్' అనే పదానికి 'అణగదొక్కబడిన' అనే అర్థాన్ని రూపొందించారు. ఆర్థికంగా, సాంఘికంగా అణగదొక్కబడిన వారందరినీ ఈ పార్టీలోనికి తేవడానికి ప్రయత్నించారు. రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సుల్లో కాంగ్రెస్ వ్యవహరించిన తీరును బట్టి ఆ పార్టీ దళితులకు ప్రాతినిధ్యం వహించడం లేదని డా॥ అంబేడ్కర్ స్పష్టం చేశారు. ఆ పార్టీని విస్తృత పరచాలనే ఉద్దేశ్యంతో అంబేడ్కర్ 1942 జూలైలో ఆలిండియా షెడ్యూల్డ్ క్యాస్ట్స్ ఫెడరేషన్ (ఏఐఎస్‌సీఎఫ్)ను స్థాపించారు. ఆ సందర్భంగా దళితుల సాంఘిక, ఆర్థిక హక్కులను సాధించడానికి వారికి రాజకీయ అధికారం కావాలని ప్రబోధించారు.

1962లో విడుదల చేసిన ప్రణాళికలో ఆయన తన వామపక్షాల భావాలను ప్రకటించారు. భారతీయుడైన ప్రతివాడూ ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యాలను పొందాలని నొక్కి వక్కాణించారు. ప్రతి మనిషికీ నిర్భయంతో కూడిన స్వేచ్ఛను సాధించడం ప్రభుత్వ బాధ్యత అని ప్రతిపాదించారు. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళిక అణగదొక్కబడ్డ వారి సాంఘిక సమానత్వాన్ని నొక్కి చెప్పింది. ప్రభుత్వ ఉద్యోగస్తులకు బీమా పథకాన్ని తప్పనిసరిగా అమలు జరపాలని కోరారు. ఏఐఎస్‌సీఎఫ్ నుండి రిపబ్లికన్ పార్టీ వరకు నడిచిన దారిలో దళితుల కోసం ఆర్థిక, సాంఘిక, రాజకీయ సమానతల కోసం తన శక్తిని ధారపోశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియాను పార్టీగా ప్రకటించక ముందే ఆయన పరి నిర్వాణం చెందారు.

ఈ విధంగా అంబేడ్కర్ సామాజికంగా, సాంస్కృతికంగా, రాజకీయంగా, తాత్వికంగా, భారతీయ సమాజాన్ని పునః నిర్మించటానికి కృషి చేశారు. ఆయన ప్రపంచ మానవునిగా ఎదిగారు, ప్రపంచ తత్వవేత్తలలో ఒకరిగా నిలిచారు. భారతదేశానికి ఎనలేని కీర్తి తెచ్చారు. ఆయన నిర్మించిన రాజ్యాంగమే మన దేశ భవిష్యత్తుకు దిక్సూచి. ఆయన మార్గంలో నడుద్దాం.

వ్యాసకర్త దళితోద్యమ నాయకులు । 98497 41695

(నేడు డా॥ బీఆర్ అంబేడ్కర్ జయంతి)

తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు



ఆలయం వెలుపల ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి



ఆలయం వెలుపల ఇండియన్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్

తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి సత్తి, ఇండియన్ ఆర్మీ లెఫ్టినెంట్ జనరల్ ఏకే సింగ్ శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా.. టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

కూటమిపై చర్యలు తీసుకోండి

ఎన్‌హెచ్‌ఆర్‌సీకి ఆకుల ఫిర్యాదు



భవానీపురం (విజయవాడ పశ్చిమ): ఆంధ్రప్రదేశ్‌లో మానవ హక్కులకు భంగం వాటిల్లే విధంగా టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ప్రవర్తిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు ఆకుల శ్రీనివాస్‌కుమార్ న్యూఢిల్లీలోని (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) జాతీయ మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శనివారం సంఘానికి ఓ లేఖ పంపినట్లు ఆకుల తెలిపారు. రాష్ట్రంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రతి నెలా వలంటీర్ల ద్వారా ప్రభుత్వం అందించేదని తెలిపారు. అయితే నిమ్మగడ్డ రమేష్ ద్వారా చంద్రబాబు కూటమి ఎన్నికల కమిషన్‌కు పిటిషన్ వేయించి వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీ ప్రక్రియను నిలుపుదల చేయించారని వివరించారు. తద్వారా పింఛన్‌దారులు నానా అవస్థలు పడుతున్నారని తెలిపారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను తొలగించమని పిటిషన్ వేయించిన వారే ఇప్పుడు వారికి నెలకు రూ.10వేల వేతనం ఇస్తామని, వారిని కొనసాగిస్తామని ఎన్నికల వాగ్దానం చేయడం మోసపూరితంగా ఉందని పేర్కొన్నారు. కోవిడ్ కాలంలో వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివని, ఆ విపత్కర పరిస్థితుల్లో పక్క రాష్ట్రంలో ఉన్న కూటమి నాయకులకు ఎలా తెలుస్తుందని ప్రశ్నించారు. గతంలో మాదిరిగానే వలంటీర్లే ఇంటింటికీ వెళ్లి పింఛన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సంఘానికి విజ్ఞప్తి చేశారు.

అమ్ముడుపోయే అలవాటు సారథికే ఉంది

టీడీపీ రెబల్ అభ్యర్థి ముద్దరబోయిన



నూజివీడు: నమ్మిన సిద్ధాంతాన్ని, నమ్మిన పార్టీని మోసం చేసే సంస్కృతి, ఇతర పార్టీలకు అమ్ముడుపోయే అలవాటు నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి కుటుంబానికే ఉందని నూజివీడు టీడీపీ రెబల్ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు విమర్శించారు. నూజివీడులో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అభ్యర్థిని ఓడించడానికి తాను వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద డబ్బు తీసుకున్నట్లు చెబుతుండటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెన్నుపోటు పొడవటం, అమ్ముడుపోవడం వంటివి పార్థసారథి తండ్రి కేపీ రెడ్డియ్య నుంచే ఆ కుటుంబానికి అలవాటని ధ్వజమెత్తారు.

పెనమలూరులో ఎంత దోచుకున్నావ్!

2019 నుంచి 2024 వరకు పార్థసారథి పెనమలూరు నియోజకవర్గంలో ఎంత దోచుకున్నదీ తన దగ్గర ఆధారాలు ఉన్నాయని ముద్దరబోయిన అన్నారు. ఇళ్ల స్థలాలు, ఇసుకతోపాటు బిల్డర్ల నుంచి, రియల్ ఎస్టేట్ వ్యాపారుల నుంచి ఏవిధంగా దోచుకున్నావో పెనమలూరులో ఎవరిని అడిగినా చెబుతారని ఆయన విమర్శించారు. అందుకే అక్కడ టీడీపీ నేతలు కొలుసు పార్థసారథి కాకుండా కాసుల పార్థసారథి అని పిలిచేవారని, అలాంటి వ్యక్తి తనను విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందని చెప్పారు. తాను వైఎస్సార్‌సీపీ నాయకుల వద్ద డబ్బులు తీసుకున్నట్టు నిరూపిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని, నిరూపించలేకపోతే పార్థసారథి రాజకీయ సన్యాసం తీసుకుంటారా అంటూ సవాల్ చేశారు. తాను నూజివీడులో గాని, పెనమలూరులో గాని స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని, తనపై స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసే దమ్ముందా అని నిలదీశారు. నిన్నటి వరకు వైఎస్సార్‌సీపీలో ఎమ్మెల్యేగా ఉండి ఆ పదవికి రాజీనామా కూడా చేయకుండా టీడీపీలో టికెట్ తీసుకున్న పార్థసారథికి మాట్లాడే అర్హతే లేదన్నారు. బినామీలను నూజివీడు నియోజకవర్గానికి తీసుకొచ్చి.. తలా ఒక మండలం అప్పగించిన పార్థసారథికి నియోజకవర్గ ప్రజలు రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పకుండా చెబుతారని పేర్కొన్నారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు

అవనిగడ్డ/ఏలేశ్వరం/పెనుగొండ/నరసాపురం రూరల్/మండవల్లి: కృష్ణా జిల్లా కోడూరు మండలం మాచవరంలో జనసేన, టీడీపీలకు చెందిన 50 కుటుంబాలు అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు సమక్షంలో శనివారం వైఎస్సార్‌సీపీలో చేరాయి. కాకినాడ జిల్లా ఏలేశ్వరం పట్టణానికి చెందిన బాలాజీచౌక్ ధర్మకర్తలు గోపు వెంకటరావు, గోపు శ్రీనివాసరావుతో పాటు 500 మంది వైఎస్సార్‌సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వరుపుల సుబ్బారావు సమక్షంలో పార్టీలో చేరారు. పశ్చిమ గోదావరి జిల్లా సోమరాజు ఇల్లిందలపర్రుకి చెందిన టీడీపీ నేతలు, శెట్టిబలిజ సంఘం నాయకులు భారీగా ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో పార్టీలో చేరారు. నరసాపురం మండలం రుస్తుంబాద గ్రామం మంగళగుంటపాలెంలో జనసేన, టీడీపీల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు ఎమ్మెల్యే ప్రసాదరాజు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. ఏలూరు జిల్లా కానుకొల్లుకు చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్), ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.



అవనిగడ్డలో జనసేన, టీడీపీ వారికి పార్టీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే సింహాద్రి



తూర్పుపాలెంలో ఎమ్మెల్యే చెరుకువాడ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



ఎమ్మెల్యే ముదునూరి సమక్షంలో రుస్తుంబాదలో వైఎస్సార్‌సీపీలో చేరికలు



ఏలేశ్వరంలో పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న వరుపుల సుబ్బారావు

సోషల్ జస్టిస్‌కు నిలువెత్తు సాక్ష్యం..



సాక్షి, అమరావతి: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నిలువెత్తు స్ఫూర్తి సామాజిక న్యాయ మహాశిల్పం రూపంలో సగర్వంగా నిలిచింది. విజయవాడ నగరం నడిబొడ్డున స్వరాజ్ మైదానం 18.81 ఎకరాల్లో రూ.404.35 కోట్లతో విగ్రహ నిర్మాణాన్ని పూర్తిచేయడం విశేషం. అలాగే 81 అడుగుల ఎత్తులో కాంక్రీట్ పీఠం(ఫెడస్టల్)పై 125 అడుగుల ఎత్తుగల ఈ అంబేడ్కర్ కాంస్య విగ్రహం కొలువై ఉంది. స్టాట్యూ ఆఫ్ సోషల్ జస్టిస్(సామాజిక న్యాయ మహా శిల్పం)ను దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దారు. గత టీడీపీ ప్రభుత్వం ఎక్కడో మారుమూల ప్రాంతంలో అంబేడ్కర్ స్మృతి వనాన్ని నిర్మిస్తామని స్థలం ఎంపిక చేసి కనీస కార్యాచరణ లేకుండా గాలికొదిలేసింది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం చెప్పింది చేసి చూపించేలా సామాజిక న్యాయ మహాశిల్పాన్ని ఆవిష్కరించి చరిత్ర సృష్టించారు. దేశీయంగా తయారైన ఈ కాంస్య విగ్రహం ప్రపంచంలోనే ఎత్తయినది, దేశంలోని మతాతీత విగ్రహాల్లో ఇదే అతి పెద్దది కావడం మరో విశేషం. అంతటి స్ఫూర్తివంతమైన సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణంలో అంబేడ్కర్ 133వ జయంతి కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సిద్ధమైంది. దీనికి సంబంధించిన ఏర్పాట్లను ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు శనివారం సమీక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఎన్నికల కోడ్‌కు లోబడి నిర్వహించేలా చర్యలు చేపట్టారు. ప్రజలు, సామాజికవేత్తలు, అంబేడ్కర్ వాదులు విగ్రహాన్ని సందర్శించి నివాళులర్పించేలా ఏర్పాట్లు చేశారు.

దర్శనీయక్షేత్రంగా..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తిని రాష్ట్ర ప్రజలకు అందించేలా ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపట్టింది. ఇది ప్రముఖ దర్శనీయ క్షేత్రంగా అందరికీ అందుబాటులో ఉండాలన్న లక్ష్యంతో విజయవాడ నగర నడిబొడ్డున చరిత్రాత్మక స్వరాజ్ మైదానాన్ని ప్రభుత్వం ఎంచుకుంది. సాధారణ ప్రజలు ఉదయం, సాయంత్రం నడక కోసం ఈ ప్రాంతాన్ని అన్ని సౌకర్యాలతో అభివృద్ధి చేశారు. పచ్చని ప్రకృతి ప్రతిబింబించేలా సౌందర్యవంతంగా దీనిని తీర్చిదిద్దారు. సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంతంలో మరెన్నో ప్రత్యేకతలను ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ ఎక్స్‌పీరియన్స్ సెంటర్, రెండు వేల మంది కూర్చునేలా కన్వెన్షన్ సెంటర్, ఫుడ్ కోర్ట్, చిల్డ్రన్స్ ప్లే ఏరియా, వాటర్ బాడీస్, మ్యూజికల్ ఫౌంటెన్, లాంగ్ వాక్ వేస్‌తో సహా మొత్తం ప్రాంతాన్ని తీర్చిదిద్దడం విశేషం.

మామిడి రైతులకు అండగా ఉంటా

- ఉలవపాడులో మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తా
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి

ఉలవపాడు: మామిడి రైతులకు అన్ని విషయాల్లో అండగా ఉంటానని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి చెప్పారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడులో జాతీయ రహదారి వద్ద సుబ్రహ్మణ్యస్వామి గుడి పక్కన ఉన్న మామిడి తోటలో ఆయన శనివారం మామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలువురు రైతులు మాట్లాడుతూ మామిడి సాగు, మార్కెటింగ్‌లో ఉన్న సమస్యలను విజయసాయిరెడ్డి దృష్టికి తీసుకువచ్చారు. ఉలవపాడులో మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా విజయసాయిరెడ్డి మాట్లాడుతూ మామిడి రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. అధికారులతో మాట్లాడి ఉలవపాడులో మామిడి పరిశోధనా కేంద్రం ఏర్పాటుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ విషయంపై రాజ్యసభలో కూడా చర్చిస్తానని తెలిపారు. మామిడి రైతుల కష్టం మధ్యవర్తులకు వెళ్లకుండా రైతు సంఘాలను ఏర్పాటుచేసి, వాటి ద్వారా మామిడి కొనుగోళ్లు జరిగేలా చూస్తామని వివరించారు. రైతులు సమష్టిగా ఉండాలని పిలుపునిచ్చారు. రైతులందరినీ ఏకం చేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా మామిడి రైతులకు ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందిస్తామని పేర్కొన్నారు. ఎగుమతులకు వీలుగా పంట నాణ్యత పెంచడానికి కృషి చేస్తామన్నారు. ఎంపీ మోపిదేవి వెంకటరమణ మాట్లాడుతూ విజయసాయిరెడ్డి కార్యదక్షత కలిగిన నాయకుడని, ఆయన మామిడి రైతుల సమస్యలు తప్పకుండా పరిష్కరిస్తారన్నారు. ఉలవపాడు ప్రాంతం మామిడికాయలకు ప్రసిద్ధి అని, ఇక్కడ రైతుల సమస్యలు తొలగించి నాణ్యమైన మామిడిపండ్లను ప్రజలకు అందించే కార్యక్రమం చేపడతామన్నారు. కందుకూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుర్రా మధుసూదన్ యాదవ్ మాట్లాడుతూ మామిడి రైతుల సమస్యలను గుర్తించామని, వాటి పరిష్కారానికి శాయశక్తులా కృషి చేస్తామని తెలిపారు. మాజీ ఎమ్మెల్సీ, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు మాట్లాడుతూ మామిడి రైతులకు అండగా ఉండడంలో ముందుంటామన్నారు. అనంతరం వైఎస్సార్ సీపీ ఎన్నికల ప్రచార రథాన్ని వి.విజయసాయిరెడ్డి, మోపిదేవి వెంకటరమణ జెండా ఊపి ప్రారంభించారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఉలవపాడుకు చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు రామాల శింగారెడ్డిని వారు పరామర్శించారు.



మాట్లాడుతున్న ఎంపీ విజయసాయిరెడ్డి

రూ.37 లక్షల నగదు స్వాధీనం

పాణ్యం/నెల్లూరు(క్రైమ్): నంద్యాల, పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో ఏర్పాటు చేసిన చెక్ పోస్టు తనిఖీల్లో రూ.37 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నంద్యాల జిల్లా పాణ్యం సీఐ నల్లప్ప కథనం ప్రకారం... తమ్మరాజుపల్లె చెక్ పోస్టు వద్ద ఎస్ఐ అశోక్, బీఎస్ఎఫ్ సిబ్బందితో కలిసి సీఐ నల్లప్ప శనివారం వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో కర్నూలు నుంచి నంద్యాల వైపు వెళ్తున్న ఓ కారులో ఎటువంటి ఆధారాలు లేకుండా కర్నూలు పట్టణం గౌతమి నగర్‌కు చెందిన కల్లూరి రంగారెడ్డి రూ.20 లక్షల నగదు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. ఆ నగదుకు సంబంధించిన ఆధారాలు చూపకపోవడంతో పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కాగా, నెల్లూరు దర్గామిట్ట ఇన్‌స్పెక్టర్ అల్తాఫ్ హుస్సేన్ తన సిబ్బందితో కలిసి అన్నమయ్య సర్కిల్ వద్ద వాహన తనిఖీలు చేపట్టారు. చిల్డ్రన్స్‌పార్కు సమీపంలోని ఓ జిమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు వాహనాన్ని తనిఖీ చేయగా అందులో రూ.17 లక్షల నగదును పోలీసులు గుర్తించారు. వాటికి సంబంధించి ఎలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నారు.

వారే వీరయ్యారు!

మిత్రులుగా మారిన ప్రత్యర్థులు ● ఎన్నికల వేళ మహారాష్ట్రలో ఆసక్తికరంగా రాజకీయం

ఎలక్షణీయం

రాజకీయాల్లో శాశ్వత మిత్రులు, శాశ్వత శత్రువులు ఉండరనే నానుడిని మహారాష్ట్ర రాజకీయాలు మరోసారి నిరూపించాయి. గతంలో ప్రత్యర్థులుగా ఒకరిపై ఒకరు మాటల తూటాలు పేల్చుకుని, ఎత్తుకు పై ఎత్తులు వేసిన నేతలు ఇప్పుడు హఠాత్తుగా మిత్రులైపోయారు. కొత్త మిత్రుల గెలుపు కోసం లోక్‌సభ సమరాంగణంలో సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గతంలో స్నేహితులుగా ఉన్నవారు కాస్తా ఇప్పుడు శత్రువులుగా మారి రాజకీయ చదరంగంలో కొత్త గెలుపు ఎత్తులు వేస్తున్నారు.

అజిత్ వర్సెస్ కోల్హే

2019 లోక్‌సభ ఎన్నికల్లో శిరూర్ శివసేన సిట్టింగ్ ఎంపీ శివాజీరావ్ అఢాల్‌రావ్ పాటిల్‌ను ఎలాగైనా ఓడించాలని అజిత్ కంకణం కట్టుకున్నారు. టీవీ, సినీ రంగ ప్రముఖుడు అమోల్ రాంసింగ్ కోల్హేను శివసేన నుంచి ఎన్సీపీలో చేర్చుకుని మరీ శివాజీరావ్‌పై పోటీకి దింపారు. విస్తృత ప్రచారం చేసి కోల్హేను గెలిపించారు. కానీ ఎన్సీపీ చీలిక ఎపిసోడ్‌లో కోల్హే అజిత్‌ను కాదని శరద్ పవార్‌కు మద్దతుగా నిలవడంతో వారిద్దరికీ చెడింది. బీజేపీ, శివసేనతో సీట్ల సర్దుబాటులో భాగంగా షిరూర్‌లో సొంత అభ్యర్థిని నిలబెట్టే అవకాశం అజిత్‌కు లభించింది. దాంతో కోల్హేను ఎలాగైనా ఓడించాలని పట్టుదలగా ఉన్నారు. అందుకోసం గత ఎన్నికల్లో తానోడించిన అఢాల్‌రావ్ పాటిల్‌నే కోల్హేపై పోటీకి నిలబెట్టారు! ఆయన తరఫున విస్తృతంగా ప్రచారం కూడా చేస్తున్నారు.

వదినా మరదళ్ల వార్

బారామతిలో చాన్నాళ్లుగా శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే పోటీచేస్తున్నారు. ఎన్సీపీలో చీలిక తర్వాత ఈ స్థానాన్ని ఎలాగైనా దక్కించుకునేందుకు అజిత్ తన భార్య సునేత్రను బరిలో దింపారు. దీంతో వదినా మరదళ్లు ప్రత్యర్థులుగా తలపడుతున్నారు. పైగా అజిత్ తమ్ముడు శ్రీనివాస్, ఆయన కుటుంబీకులు సూలేకు మద్దతుగా ప్రచారం చేస్తున్నారు! ఇది అజిత్ కుటుంబంలో మరో చీలికకు కారణమవుతోంది.

నాడు వేర్వేరు సభలు.. ఇప్పుడు ఒకే స్థానం కోసం పోరు

రాహుల్ రమేశ్ షేవలే, అనిల్ దేశాయ్ అవిభాజ్య శివసేనలో సన్నిహిత మిత్రులుగా మెలిగారు. రాహుల్ రెండుసార్లు సౌత్ సెంట్రల్ ముంబై ఎంపీగా గెలవగా అనిల్ రాజ్యసభ సభ్యునిగా ఉండేవారు. శివసేన చీలాక రాహుల్ షిండే వర్గంలో చేరగా అనిల్ ఉద్ధవ్ వర్గంలోనే కొనసాగారు. ఈసారి ఇద్దరూ సౌత్ సెంట్రల్ ముంబై నుంచి ప్రత్యర్థులుగా బరిలో దిగారు. అనిల్‌కు ముంబై కాంగ్రెస్ చీఫ్ వర్షా గైక్వాడ్ మద్దతు పలికారు. వర్ష తండ్రి ఏక్‌నాథ్‌ను 2014 లోక్‌సభ ఎన్నికల్లో షేవలే ఓడించడమే అందుకు కారణం. ''దేవేంద్ర ఫడ్నవిస్ చాణిక్యంతో చీలికలు తేనంతవరకూ శివసేన, ఎన్సీపీ కుటుంబ పార్టీలుగా నిక్షేపంగా ఉండేవి. వాటిలో చీలికతో లోక్‌సభ ఎన్నికలు మహాభారత యుద్ధాన్నే తలపిస్తున్నాయి. కుటుంబసభ్యులే పరస్పరం పోటీపడుతూ ప్రత్యర్థులకు సాయం చేస్తున్నారు'' అని సీనియర్ పాత్రికేయుడు, రాజకీయ విశ్లేషకులు ప్రకాశ్ అకోల్కర్ అభిప్రాయపడ్డారు.

–సాక్షి, న్యూఢిల్లీ

చిఖ్లీకర్ కోసం చవాన్ ప్రచారం



ప్రతాప్ చిఖ్లీకర్ అశోక్ చవాన్

గురువారం నాందేడ్‌లో కేంద్ర హోం మంత్రి అమిత్ షా ర్యాలీలో మాజీ ముఖ్యమంత్రి అశోక్ చవాన్, బీజేపీ అభ్యర్థి ప్రతాప్ పాటిల్ చిఖ్లీకర్ ఒకే వేదికను పంచుకున్నారు. గత ఫిబ్రవరి దాకా వారిద్దరూ బద్ధ శత్రువులు. చిక్లీకర్ లోహా నుంచి శివసేన ఎమ్మెల్యేగా గెలిచారు. 2019లో బీజేపీలో చేరి లోక్‌సభ ఎన్నికల్లో నాందేడ్ కాంగ్రెస్ సిట్టింగ్ ఎంపీ అశోక్ చవాన్‌ను మట్టికరిపించారు. చవాన్ కూడా తాజాగా బీజేపీలో చేరడంతో వారి మధ్య వైరం మటుమాయమైంది. ఫిబ్రవరిలో బీజేపీలో చేరి రాజ్యసభకు ఎన్నికైన చవాన్ ఇప్పుడు చిక్లీకర్‌కు స్నేహహస్తం అందించారు. చిక్లీకర్ గెలుపు కోసం మరత్వాడాలో తెగ ప్రచారం చేస్తున్నారు.

బరనే కోసం అజిత్...



అజిత్ బరనే

గత లోక్‌సభ ఎన్నికల్లో మావల్ నుంచి ఎన్సీపీ నేత అజిత్ పవార్ కుమారుడు పార్థ్‌పై శివసేన నేత శ్రీరంగ్ బరనే గెలిచారు. నాటినుంచి అజిత్, బరనే మధ్య వైరం పెరిగింది. కానీ తాజా పరిణామాలతో వారి మధ్య స్నేహం చిగురించింది. శివసేనను ఏక్‌నాథ్ షిండే, ఎన్సీపీని అజిత్ చీల్చి బీజేపీతో జట్టుకట్టడం తెలిసిందే. బరనే కూడా షిండే వెంట నడిచారు. దాంతో అజిత్‌తో ఆయన శత్రుత్వం సమసిపోయింది. ఈ నేపథ్యంలో అజిత్ ఈసారి బరనే కోసం ప్రచారం చేస్తున్నారు.

నాడు ఓడించి నేడు ప్రచారం చేస్తూ..

బీజేపీ అధిష్ఠానం ఈసారి బీడ్ నుంచి సిట్టింగ్ ఎంపీ ప్రీతం ముండే స్థానంలో ఆమె సోదరి, మాజీ మంత్రి పంకజా ముండేను ఎంపిక చేసింది. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో పంకజ తన బంధువైన ఎన్సీపీ నేత ధనంజయ్ ముండే చేతిలో ఓడారు. ఇప్పుడాయన అజిత్ ఎన్సీపీలో ఉన్నారు. బీజేపీతో ఎన్సీపీ చెలిమి నేపథ్యంలో పంకజ తరఫున ధనంజయ్ ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు.



పంకజ ధనంజయ్



ఎన్నికల విచిత్రం

ఆటో నడుపుతూ ఎన్నికల ప్రచారం చేస్తున్న ఈయన షానవాజ్ అలీ రైహాన్. పశ్చిమబెంగాల్ రాష్ట్రంలోని సౌత్ మాల్దా లోక్‌సభ నియోజకవర్గం నుంచి తృణమూల్ కాంగ్రెస్ టికెట్‌పై ఈయన పోటీ చేస్తున్నారు.

ఎలక్షన్ బీట్

నేడే బీజేపీ మేనిఫెస్టో విడుదల

- సంకల్ప్ పత్రాన్ని విడుదల చేయనున్న ప్రధాని మోదీ, నడ్డా, అమిత్ షా
- 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా హామీలు ఉండే అవకాశం

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ మేనిఫెస్టోను బీజేపీ అగ్ర నాయకత్వం ఆదివారం విడుదల చేయనుంది. రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో సంకల్ప్ పత్రాన్ని ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఆవిష్కరిస్తారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాన అజెండాలుగా నిలిచిన అయోధ్యలో రామమందిర నిర్మాణం, ఆర్టికల్ 370 రద్దు వంటి హామీలను ఇప్పటికే నెరవేర్చిన తరుణంలో ఈసారి అలాంటి ఏఏ కీలకమైన హామీలకు మేనిఫెస్టోలో చోటుకల్పిస్తారని సర్వత్రా ఆసక్తి నెలకొంది. అయితే మేనిఫెస్టోలో అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట వేస్తారని తెలుస్తోంది. ప్రధాని మోదీ తరచూ ప్రస్తావించే నాలుగు ప్రధాన కులాలు.. పేదలు, రైతులు, మహిళలు, యువత లక్ష్యంగా హామీలను ప్రస్తావించనున్నారని పార్టీ వర్గాలు వెల్లడించాయి. మేనిఫెస్టో రూపకల్పనపై కమిటీ ఛైర్మన్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని 27 మంది సభ్యులతో కూడిన కమిటీ ఇప్పటికే రెండుసార్లు భేటీ అయింది. మేనిఫెస్టోలో పొందుపరచాల్సిన అంశాలకోసం నమో యాప్ సహా 35 రోజుల ప్రత్యేక డ్రైవ్ చేపట్టింది. ఇలా లక్షలాది మంది పార్టీ మద్దతుదారుల నుంచి సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకుని ముఖ్యాంశాలను రూపొందించినట్లు తెలుస్తోంది. 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యానికి అనుగుణంగా మార్గసూచీని ప్రకటించడంతో పాటు మోదీ గ్యారెంటీలకు సంబంధించిన హామీలను మరోమారు ప్రకటించే అవకాశాలున్నాయి. మతపరమైన అంశాలతో పాటు జాతీయవాద అంశాలను ప్రధానంగా మేనిఫెస్టోలో పొందుపరిచే అవకాశాలున్నాయని కమలనాథులు చెబుతున్నారు.

మోదీ మాటల వలలో పడకండి

ప్రజలను హెచ్చరించిన ప్రియాంకా గాంధీ



రూర్కీ(ఉత్తరాఖండ్): ప్రధానమంత్రి మోదీ మాటల గారడీలో చిక్కుకుపోవద్దని కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా ప్రజలను హెచ్చరించారు. గత పదేళ్లలో మోదీ పాలనలో తమ జీవితాల్లో ఏమైనా సానుకూల మార్పులు వచ్చాయా అని ఎవరికి వారు ప్రశ్నించుకోవాలన్నారు. మార్పు కోసం ఓటేయాలని పిలుపునిచ్చారు. ఉత్తరాఖండ్‌లోని రామ్‌నగర్, రూర్కీల్లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమాల్లో ఆమె మాట్లాడారు. దశాబ్దకాలంలో బీజేపీ పాలన కారణంగా దేశంలో నిరుద్యోగం, ద్రవ్యోల్బణంతోపాటు ప్రశ్నపత్రాల లీకేజీ ఉదంతాలు పెరిగిపోయాయని ప్రియాంక చెప్పారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలను పట్టించుకోలేదని, ఓట్ల కోసం మతాన్ని వాడుకుంటోందని ఆరోపించారు. నారీశక్తి గురించి తరచూ మాట్లాడే మోదీ హయాంలోనే మహిళలు మరింత అభద్రతాభావంతో ఉన్నారన్నారు. రాజకీయ లబ్ధి కోసం కాంగ్రెస్ పార్టీ మతాన్ని ఎన్నడూ వాడుకోలేదని స్పష్టం చేశారు. ప్రజల సమస్యలకు పరిష్కారం చూపే ప్రభుత్వానికే ఓటు వేయాలని అన్నారు.

రిజర్వేషన్లను రద్దు చేయం: అమిత్ షా



జైపూర్: రిజర్వేషన్లను తమ బీజేపీ ప్రభుత్వం రద్దు చేయబోదని, ఇతరులను రద్దు చేయనివ్వదని హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఆ మాటకొస్తే..ప్రధాని మోదీయే రిజర్వేషన్లకు అతిపెద్ద మద్దతుదారని వెల్లడించారు. దళితులు, గిరిజనులు, వెనుకబడినవర్గాల రిజర్వేషన్లను అధికార బీజేపీ రద్దు చేయాలనుకుంటోందంటూ కాంగ్రెస్ పార్టీ అపోహను వ్యాప్తి చేస్తోందని అమిత్ షా ఆరోపించారు. అనేక ఏళ్లపాటు వెనుకబడిన కులాలకు అన్యాయం చేసిందన్నారు. గతంలో ఓబీసీ రిజర్వేషన్లపై వచ్చిన కాకా కలేల్కర్ నివేదిక, మండల్ కమిషన్ నివేదిక ముఖ్యమైన వాటిని కాంగ్రెస్ పార్టీ తొక్కిపట్టి ఉంచిందన్నారు. రాజస్తాన్‌లోని ఆల్వార్ జిల్లా హస్రోలీలో శనివారం జరిగిన ఎన్నికల ర్యాలీలో కేంద్ర మంత్రి ప్రసంగించారు. మోదీ అధికారంలోకి వచ్చాకే ఓబీసీ కమిషన్‌కు రాజ్యాంగ గుర్తింపు దక్కిందని చెప్పారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో ఓబీసీ వర్గానికి 27 శాతం రిజర్వేషన్‌ను కల్పించిందని తెలిపారు. పదేళ్ల కాలంలో అసాధ్యమనుకున్న పలు లక్ష్యాలను సుసాధ్యం చేసి చూపామని చెప్పారు.

మండిలో కంగన ప్రత్యర్థి విక్రమాదిత్య





న్యూఢిల్లీ/సిమ్లా: హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానంలో బాలీవుడ్ నటి, బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ ప్రధాన ప్రత్యర్థి ఎవరో తేలిపోయింది. మండి నుంచి తన కుమారుడు విక్రమాదిత్య సింగ్ పోటీ చేస్తారని రాష్ట్ర పీసీసీ చీఫ్ ప్రతిభా సింగ్ శనివారం వెల్లడించారు. మండి సిట్టింగ్ ఎంపీ అయిన ప్రతిభా సింగ్ ఇక్కడి నుంచి మూడు పర్యాయాలు ఎన్నికయ్యారు. నియోజకవర్గ ప్రజలు ఎల్లప్పుడూ తమ వెంటే ఉంటారని ప్రతిభా సింగ్ ధీమా వ్యక్తం చేశారు. కష్ట సమయంలోనూ ఇక్కడ తాను విజయం సాధించినట్లు చెప్పుకున్నారు. తనపై విమర్శలు చేస్తున్న కంగనా ఓటమి ఖాయమని విక్రమాదిత్య సింగ్ చెప్పారు. ఇలా ఉండగా, కాంగ్రెస్ పార్టీ శనివారం సాయంత్రం విక్రమాదిత్య సింగ్ సహా 16 మంది పేర్లతో మరో జాబితా విడుదల చేసింది. ఇందులో కేంద్ర మాజీ మంత్రి మనీశ్ తివారీకి చండీగఢ్ టిక్కెట్ కేటాయించింది.

బీజేపీకి 200 సీట్లు కూడా రావు

పశ్చిమ బెంగాల్ సీఎం మమత

జల్పాయ్‌గురి: సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీకి కనీసం 200 సీట్లు కూడా రావని పశ్చిమ బెంగాల్ సీఎం, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీ స్పష్టం చేశారు. ప్రధాని మోదీ ఇస్తున్న గ్యారంటీలన్నీ బూటకమని కొట్టిపారేశారు. శనివారం జల్పాయ్‌గురిలో ఎన్నికల ప్రచార సభలో ఆమె ప్రసంగించారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని బీజేపీ ప్రభుత్వం ధ్వంసం చేసిందని మండిపడ్డారు. దేశాన్ని అమ్మేసే కుట్రలు సాగించారన్నారు. ప్రధాని మోదీ చెబుతున్న కల్లబొల్లి మాటలు నమ్మొద్దని ప్రజలను కోరారు. ఆయన ఇస్తున్న గ్యారంటీల వలలో పడొద్దని సూచించారు. బెంగాల్‌లో 2021లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 200కుపైగా సీట్లు గెలుచుకుంటామని బీజేపీ నేతలు గొప్పలు చెప్పారని, చివరకు 70 సీట్లే వచ్చాయని గుర్తుచేశారు.

పశ్చిమాసియాలో యుద్ధమేఘాలు

- ఇజ్రాయెల్‌పై ఏ క్షణమైనా దాడి జరిగే అవకాశం ఉందన్న బైడెన్
- ఇజ్రాయెల్ నౌకను స్వాధీనం చేసుకున్న ఇరాన్ కమాండోలు

జెరూసలేం: పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి. యూదు దేశం ఇజ్రాయెల్‌పై ఇస్లామిక్ దేశం ఇరాన్ ప్రతీకారంతో రగిలిపోతోంది. సిరియా రాజధాని డెమాస్కస్‌లో తమ దౌత్య కార్యాలయంపై దాడి చేసి, ఇద్దరు ఉన్నతస్థాయి సైనికాధికారులను పొట్టనబెట్టుకున్న ఇజ్రాయెల్‌కు తగిన బుద్ధి చెప్పాలన్న కృతనిశ్చయంతో ఇరాన్ ఉంది. ఇజ్రాయెల్‌పై ఇరాన్ సైన్యం ఏ క్షణమైనా దాడికి దిగొచ్చని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్వయంగా వెల్లడించారు. ఇజ్రాయెల్‌లోని కీలక నగరాలను లక్ష్యంగా చేసుకొని ఇరాన్ అత్యాధునిక డ్రోన్లు, రాకెట్లు ప్రయోగించే అవకాశం ఉందని వాల్‌స్ట్రీట్ జర్నల్ పత్రిక పేర్కొంది. ఈ నేపథ్యంలో ఇరాన్ దాడులను ఎదుర్కొనేందుకు ఇజ్రాయెల్ సైన్యం సన్నాహాలు ప్రారంభించింది. సరిహద్దుల్లో నిఘాను పటిష్టం చేసింది. ఇజ్రాయిల్ దళాలు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నాయి. యాంటీ మిస్సైల్ మొబైల్ లాంచర్లను రంగంలోకి దించారు. ఇజ్రాయెల్‌పై దాడికి దిగితే సహించబోమని అమెరికా ఇరాన్‌ను హెచ్చరించింది. ఇజ్రాయెల్‌కు రక్షణగా అమెరికా తన యుద్ధ నౌకలను పంపిస్తున్నట్లు తెలిసింది. టెహ్రాన్ నుంచి తమ విమానాల రాకపోకలను ఈ నెల 18వ తేదీ వరకూ రద్దు చేసినట్లు లుఫ్తాన్సా ఎయిర్‌లైన్స్ తెలియజేసింది. ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల్లో ఉన్న తమ పౌరులకు కొన్ని దేశాలు ప్రయాణ అడ్వైజరీలు జారీ చేశాయి.

ఆ నౌకలో భారతీయులు



కంటైనర్‌ను ఇరాన్ కమాండోలు స్వాధీనం చేసుకుంటున్న దృశ్యం

17 మంది భారతీయ నావికులు ఉన్న ఇజ్రాయెల్ కంటైనర్ షిప్‌ను ఇరాన్ పారామిలటరీ రివల్యూషనరీ గార్డు కమాండోలు శనివారం స్వాధీనం చేసుకున్నారు. పర్షియన్ గల్ఫ్‌లోని హొర్ముజ్ జలసంధిలో ఈ సంఘటన జరిగింది. నౌకను ప్రస్తుతం ఇరాన్ జలాల వైపు మళ్లిస్తున్నట్లు స్థానిక మీడియా వెల్లడించింది. ఎంఎస్సీ ఏరీస్ అనే పేరున్న ఈ నౌకపై పోర్చుగీస్ జెండా ఉంది. ఇది ఇజ్రాయెల్‌లోని జొడియాక్ గ్రూప్‌నకు చెందిన నౌక. ఇరాన్ కమాండోలు సోవియట్ కాలం నాటి మిల్ ఎంఐ–17 హెలికాప్టర్ నుంచి తాడు సహాయంతో నౌకపై దిగిన దృశ్యాలు సోషల్ మీడియాలో ప్రత్యక్షమయ్యాయి. ఇరాన్ కమాండోల దుశ్చర్యపై ఇజ్రాయెల్ తీవ్రంగా స్పందించింది. పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చవద్దని హెచ్చరించింది. ఇరాన్ కమాండోలు స్వాధీనం చేసుకున్న కంటైనర్ నౌకలో ఉన్న 17 మంది భారతీయ నావికుల భద్రతకు చర్యలు తీసుకుంటున్నామని భారత వర్గాలు తెలిపాయి. దౌత్యమార్గాల్లో ఇరాన్‌ను అధికారులను సంప్రదిస్తున్నామని పేర్కొన్నాయి.

వాళ్లది దాడి తంత్రం మాది పరిరక్షణ మంత్రం

రాజ్యాంగం విషయంలో బీజేపీపై రాహుల్ విమర్శలు



బస్తర్‌లో జరిగిన ర్యాలీలో ప్రసంగిస్తున్న రాహుల్

జగ్దల్‌పూర్/భండారా: రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు కాంగ్రెస్ పాటుపడుతుంటే దానిని నచ్చినట్లు సవరించే కుట్రకు బీజేపీ బరితెగించిందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆరోపణలు చేశారు. లోక్‌సభ సమరంలో విజయం సాధించి అధికారం చేపట్టగానే దేశవ్యాప్త కులగణనకు శ్రీకారం చుడతామని రాహుల్ పునరుద్ఘాటించారు. శనివారం ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ జిల్లాలోని బస్తర్ గ్రామంలో ఎన్నికల ప్రచార ర్యాలీలో రాహుల్ ప్రసంగించారు. ''ఈసారి జరుగుతున్న ఎన్నికలు రాజ్యాంగ పరిరక్షణ, రాజ్యాంగ విధ్వంసక సిద్ధాంతాల మధ్య పోరాటం. ఓవైపు కాంగ్రెస్, విపక్షాల 'ఇండియా'కూటమి రాజ్యాంగ పరిరక్షణకు ప్రయత్నం చేస్తుంటే మరోపక్క మోదీ, అదానీ రాజ్యాంగంపై దాడి చేస్తున్నారు. గిరిజన మహిళ అని కనీస గౌరవం కూడా ఇవ్వకుండా రాష్ట్రపతి ద్రౌపది ముర్మును అయోధ్య రామమందిరం ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి రాకుండా మోదీ ప్రభుత్వం అడ్డుకుంది. ఇది బీజేపీ ఆలోచనాధోరణికి అద్దంపడుతోంది'' అని రాహుల్ ఆరోపించారు. షెడ్యూల్ తెగలకు కేటాయించిన బస్తర్ ఎంపీ స్థానంలో బరిలో దిగిన కాంగ్రెస్ అభ్యర్థి కవాసీ లఖ్మాకు మద్దతుగా రాహుల్ ఈ సభకు వచ్చి మాట్లాడారు.

ఆదివాసీ.. వనవాసీ

''ఆదివాసీ పదాన్నే ప్రధాని వాడుక నుంచి తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. మేం ఆదివాసీ అంటే బీజేపీ వాళ్లు వనవాసీ అంటున్నారు. రెండు పదాల అర్థాల్లో చాలా బేధముంది. ఆదివాసీ అంటే అడవితో మమేకమైన వాళ్లు అని అర్థం. ఆ పదం మీకు జలం, జంగిల్(అడవి), జమీన్(భూమి)పై మీకున్న హక్కులను ఎలుగెత్తి చాటుతుంది. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు గిరిజనప్రాంతాల్లో స్వయంపాలనకు బాటలువేస్తూ గ్రామసభలకు అనుమతినిస్తూ పంచాయతీ చట్టాన్ని తెచ్చాయి. కానీ బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్ గిరిజనుల మత విశ్వాసాలు, సిద్ధాంతాలు, చరిత్రను వక్రీకరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. అటవీ భూములను అదానీ లాంటి వాళ్లకు బీజేపీ ధారాదత్తం చేస్తోంది. ఇప్పటికే దేశంలో అడవులు కుచించుకుపోతున్నాయి'' అని రాహుల్ అన్నారు.

మేమొస్తే రైతు రుణమాఫీ

మహారాష్ట్రలోని భండారా జిల్లా సకోలీ పట్టణంలో పార్టీ ర్యాలీలోనూ రాహుల్ ప్రసంగించారు. ''అధికారంలోకి రాగానే రైతుల రుణాలను మాఫీచేస్తాం. నిరుద్యోగం, అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న సాధారణ జనం జీఎస్టీ కడుతున్నారు. కోట్లు గడిస్తున్న వాళ్లూ అంతే జీఎస్టీ కడుతున్నారు. మోదీ హయాంలో 22 మంది బడా పారిశ్రామికవేత్తల వద్ద పోగుబడిన సంపద 70 కోట్ల మంది భారతీయుల ఆస్తితో సమానం. ఈ విషయం వదిలేసి మోదీ ఎప్పుడూ మతం గురించే మాట్లాడతారు'' అని రాహుల్ అన్నారు.

ఆస్ట్రేలియాలో కత్తిపోట్లకు ఆరుగురు బలి

- సిడ్నీ షాపింగ్ మాల్‌లో దుండగుడి ఘాతుకం
- 8 మందికి గాయాలు
- పోలీసుల కాల్పుల్లో నిందితుడు హతం

సిడ్నీ: షాపింగ్ కోసం వచ్చిన జనంపై ఓ దుండగుడు కత్తితో విచక్షణారహితంగా దాడికి దిగాడు. దీంతో కత్తిపోట్లకు ఆరుగురు బలైపోయారు. దుండగుడి కిరాతకానికి 9 నెలల చిన్నారి సహా 8 మంది గాయపడ్డారు. ఆస్ట్రేలియాలో సిడ్నీ నగర శివారులోని బొండీ జంక్షన్ సమీపంలో అత్యంత రద్దీగా ఉండే వెస్ట్‌ఫీల్డ్ షాపింగ్ సెంటర్‌లో శనివారం ఈ దారుణం జరిగింది. దుండగుడి దాడి గురించి సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. కత్తి పట్టుకొని భయభ్రాంతులకు గురిచేస్తున్న నిందితుడిని అదుపులోకి తీసుకొనేందుకు ప్రయత్నించగా, పోలీసులకు ఎదురుతిరిగాడు. కత్తి దూసేందుకు ముందుకు రాగా, ఓ మహిళా ఇన్‌స్పెక్టర్ కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నిందితుడు అక్కడికక్కడే మరణించాడని న్యూ సౌత్‌వేల్స్ సహాయక పోలీసు కమిషనర్ ఆంథోనీ చెప్పారు. ఆరుగురిని పొట్టనపెట్టుకున్న గుర్తుతెలియని దుండగుడి వయసు 40 సంవత్సరాలు ఉంటుందని అన్నారు. అతడు ఎవరు? ఎందుకు ఈ దాడి చేశాడన్నదానిపై దర్యాప్తు ప్రారంభించామని తెలిపారు. అయితే, ఇది ఉగ్రవాద దాడి కాదని పోలీసు కమిషనర్ కరెన్ వెబ్ స్పష్టం చేశారు. కాల్పులు జరిపి దుండగుడిని మట్టుబెట్టడం సరైన చర్య అని చెప్పారు. లేకపోతే మరికొన్ని ప్రాణాలు పోయేవని అన్నారు. దాడిలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. 9 నెలల చిన్నారికి వైద్యులు శస్త్రచికిత్స చేసినట్లు పోలీసులు చెప్పారు. షాపింగ్ మాల్‌లో నిందితుడు కత్తితో దాడి చేస్తున్నప్పుడు తాము అక్కడే ఉన్నామని భారత సంతతి దంపతులు షోయి ఘోషాల్, దేవశీష్ చక్రవర్తి చెప్పారు. వెంటనే స్టోర్ రూమ్‌కు చేరుకొని, కార్డ్‌బోర్డు పెట్టెలను రక్షణకవచంగా మార్చుకొని ప్రాణాలు కాపాడుకున్నామని తెలిపారు.

మహిళా ఇన్‌స్పెక్టర్ సాహసం

కత్తి దూసిన నిందితుడిని అంతం చేయడంలో మహిళా ఇన్‌స్పెక్టర్ ప్రదర్శించిన ధైర్య సాహసాల పట్ల ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆమె ఒంటరిగానే ఆ దుండగుడిని ఎదుర్కొన్నారు. కత్తి దాడి నుంచి చాకచక్యంగా తప్పించుకున్నారు. తుపాకీ ఎక్కుపెట్టి, ఒక తూటాతోనే అతడిని నేలకూల్చారు. మహిళా ఇన్‌స్పెక్టర్ పేల్చిన తూటా దుండగుడిని ఛాతీని చీల్చేసింది. ఇదంతా ఆమె ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా నింపాదిగా పూర్తిచేశారని ప్రత్యక్ష సాక్షులు చెప్పారు. నిజానికి ఆస్ట్రేలియాలో ఇలా కత్తితో పొడిచి చంపే సంఘటనలు చాలా అరుదు.

సర్వోదయ నేత మురారీ లాల్ కన్నుమూత



గోపేశ్వర్: సామాజిక కార్యకర్త, సర్వోదయ, చిప్కో ఉద్యమ నేత మురారీ లాల్(91) కన్నుమూశారు. శ్వాసలో ఇబ్బందులు తలెత్తడంతో మూడు రోజుల క్రితం రిషికేశ్‌లోని ఎయిమ్స్‌లో చేర్పించారు. పరిస్థితి విషమించి శుక్రవారం మురారీ లాల్ తుదిశ్వాస విడిచారు. చమోలి జిల్లా గోపేశ్వర్‌కు సమీపంలోని పాఫియానా గ్రామంలో 1933లో మురారీ లాల్ జన్మించారు. చిప్కో ఉద్యమ మాతృసంస్థ అయిన దశోలీ గ్రామ స్వరాజ్య మండల్‌కు మురారీ లాల్ అధ్యక్షుడిగా పనిచేశారు. మురారీ లాల్ తన స్వగ్రామంలోని బంజరు భూములను సస్యశ్యామలంగా మార్చడంతోపాటు సహజ వనరుల సంరక్షణ, వినియోగానికి సంబంధించి వినూత్న విధానాలను రూపొందించి గుర్తింపు పొందారు. చమోలీ జిల్లా మద్య నిషేధం కోసం ఉద్యమించారు. 1975–76 కాలంలో భూమి లేని పేదలకు లీజుపై భూమి దక్కేలా చేశారు. శ్రమదానంతో స్వగ్రామంలో పాఠశాలను ఏర్పాటు చేశారు.

సంక్షోభం వేళ ఎంపీల మౌనం!

- కేజ్రీవాల్ అరెస్ట్‌పై ఆప్ రాజ్యసభ ఎంపీల స్పందన అంతంతే
- నిరసనలు, ర్యాలీలకు దూరంగా రాఘవ్ చద్దా, స్వాతి మలివాల్

సాక్షి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల వేళ ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ కేజ్రీవాల్ అరెస్ట్‌తో ఆ పార్టీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ఈ సమయంలో ఆ పార్టీ ఎంపీలు మాత్రం మౌన వ్రతం పాటిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. పార్టీకి చెందిన 10 మంది రాజ్యసభ ఎంపీల్లో కేవలం ఇద్దరే కేజ్రీవాల్ అరెస్టును ఖండిస్తూ నిరసన కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. మిగతా వారి వ్యవహారంపై పార్టీ సమావేశంలో చర్చించాలనే డిమాండ్లు అంతర్గతంగా ఊపందుకున్నాయి.

ఎనిమిది మంది గాయబ్..

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేజ్రీవాల్ గత నెల 21న అరెస్టయ్యారు. అప్పటి నుంచి ఆ పార్టీ ఢిల్లీసహా పలు రాష్ట్రాల్లో నిరసనలు, ర్యాలీలు చేపట్టింది. ఈ కార్యక్రమాల్లో ఇద్దరు ఆప్ రాజ్యసభ సభ్యులు సంజయ్‌సింగ్, సందీప్ పాఠక్‌లు మాత్రమే చురుగ్గా ఉంటున్నారు. మిగతా 8 మంది సభ్యులు అంటీముట్టనట్లుగా ఉంటున్నారు. సంజయ్ సింగ్ ఈ కేసులో బెయిల్‌పై బయటకు వచ్చిన మరునాటి నుంచే బీజేపీని, దర్యాప్తు సంస్థల పనితీరును తప్పుపడుతూ ప్రకటనలు చేస్తున్నారు. సందీప్ పాఠక్ సైతం సోషల్ మీడియాతో పాటు జాతీయ మీడియాలో ఆప్ గొంతుక వినిపిస్తున్నారు. పార్టీ కోశాధికారి, ఎంపీ ఎన్‌డీ గుప్తా అడపాదడపా మాత్రమే నిరసనల కార్యక్రమాల్లో కనిపిస్తున్నారు. పూర్తిస్థాయి కార్యక్రమాలకు మాత్రం ఆయన దూరంగానే ఉంటున్నారు. మీడియా భేటీల్లో, సభల్లో మోదీ ప్రభుత్వాన్ని గట్టిగా ఎదుర్కొంటున్న ఎంపీ రాఘవ్ చద్దా ఆచూకీ కనిపించడం లేదు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడిన తర్వాత ఆయన ఢిల్లీలో లేరు. గత నెల మొదటి వారంలో లండన్ వెళ్లి కంటికి చికిత్స చేసుకున్నారని సన్నిహితులు చెబుతున్నారు. మార్చి చివరి వారంలోనే ఆయన ఢిల్లీ రావాల్సి ఉన్నా, వైద్యుల సూచన మేరకు అక్కడే ఉండిపోయారంటున్నారు. మరో కీలక నేత స్వాతి మలివాల్ సైతం అమెరికాలో ఉన్నారు. అక్కడి నుంచి కేజ్రీవాల్ అరెస్టును సామాజిక వేదికలపై ఖండిస్తున్నారు. ప్రత్యక్ష నిరసల్లో ఇంతవరకూ పాల్గొనలేదు. తన సోదరి అనారోగ్యం దృష్ట్యా అమెరికాలో ఉండాల్సి వస్తోందని, తిరిగి వచ్చాక ప్రజాస్వామ్య వ్యవస్థపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా పోరాడుతానని అంటున్నారు. పంజాబ్‌కు చెందిన పార్టీ ఎంపీ సంజీవ్ అరోరా కేజ్రీవాల్ అరెస్ట్ తర్వాత ఆయన భార్య సునీతతో భేటీ అయ్యారు. అది మినహా రాంలీలా మైదానంలో జరిగిన ర్యాలీ, జంతర్ మంతర్ వద్ద జరిగిన నిరసన కార్యక్రమాల్లోగానీ పాల్గొనలేదు. మరో ఇద్దరు ఎంపీలు అశోక్‌కుమార్ మిట్టల్, క్రికెటర్ హర్భజన్‌సింగ్‌లు కేజ్రీ అరెస్ట్ మినహా ఇతర అంశాలపై సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారు. పర్యావరణ వేత అయిన ఎంపీ బల్బీర్‌సింగ్ సీచేవాల్, మరో ఎంపీ విక్రమ్‌జీత్ సింగ్ చాహ్నీలు సైతం తమ వ్యక్తిగత వ్యవహారాల్లో బిజీగా ఉన్నారు. ఇలా..పార్టీ ఎంపీలు మౌనవ్రతం దాల్చడంపై సీనియర్ నేతలు గుర్రుగా ఉన్నారు. ఒకట్రెండు రోజుల్లో జరిగే కీలక భేటీలో ఎంపీల తీరుపైచర్చిస్తామని సంజయ్ సింగ్ చెప్పారు.

తీహార్ జైల్లో కేజ్రీవాల్ హక్కులకు భంగం

ఆప్ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపణ

న్యూఢిల్లీ: తీహార్ జైలులో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు కుటుంబసభ్యులతో వ్యక్తిగతంగా భేటీ అయ్యేందుకు అధికారులు అనుతివ్వడం లేదని ఆప్ రాజ్యసభ ఎంపీ సంజయ్ సింగ్ ఆరోపించారు. కేజ్రీవాల్ హక్కులకు భంగం కలిగిస్తూ ఆయన్ను మానసికంగా దెబ్బకొట్టేందుకు జరుగుతున్న ప్రయత్నమిదని అన్నారు. సాధారణ 'ములాఖత్ జంగ్లా'లో భాగంగానే కుటుంబసభ్యులను కేజ్రీవాల్ కలుసుకునేందుకు అవకాశమిస్తున్నారన్నారు. కరడుగట్టిన నేరగాళ్లకూ వ్యక్తిగత సమావేశాలకు అనుమతులున్నాయన్నారు. సీఎంగా ఎన్నికైన వ్యక్తిని సాధారణ ఖైదీగా చూస్తున్నారన్నారు. ఇలా ఉద్దేశపూర్వకంగా అవమానించడం, అమానవీయమని పేర్కొన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కనుసన్నల్లోనే ఇలా జరుగుతోందని ఆయన విమర్శించారు. జైలులోని ఓ గదిలో ఇనుప మెష్‌కు ఒక వైపు ఖైదీ, మరోవైపు సందర్శకులుంటారు. ఇలా ఇద్దరూ ఎదురెదురుగా ఉండి మాట్లాడుకునే ఏర్పాటు పేరే 'ములాఖత్ జంగ్లా'.

సాక్షి విజయవాడ సిటీ

ఎన్టీఆర్ జిల్లా

ఆదివారం । 14 । ఏప్రిల్ । 2024



వసంత నవరాత్రులు

బెజవాడ దుర్గమ్మ సన్నిధిలో వసంత నవ రాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. శని వారం అమ్మవారికి తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువంతో అర్చన చేశారు. -8లో



సాహిత్యం.. సమాజ హితం

సాహిత్యం సమాజహితాన్ని కోరుతుందని సాహిత్య పురస్కార గ్రహీతల పరిచయ కార్య క్రమంలో కేంద్ర యువ సాహిత్య పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ తెలిపారు. -8లో



ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్



అభిమాన కెరటం : విజయవాడ బందరు రోడ్డులోకి ప్రవేశిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం బస్సుయాత్రను అనుసరించి సాగుతున్న అభిమానులు



అభివాదం: ప్రజలకు అభివాదం చేస్తున్న, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో వైఎస్సార్ సీపీ విజయవాడ ఎంపీ, తూర్పు, సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, దేవినేని అవినాష్, వెలంపల్లి శ్రీనివాస్

అభిమాన ప్రభంజనం

జననేత రాకతో ప్రకృతి పులకించింది.. తెమ్మెరల చల్లదనంతో వడగాడ్పులు సద్దుమణిగాయి.. సుర్రుమంటున్న సూరీడును నీలిమేఘాలు కమ్మేశాయి.. సెగలు పుట్టించాల్సిన మండుటెండ చిన్నబోయింది.. అభిమాన నేత అడుగులో అడుగై కదులుతున్న అభిమాన తరంగాలను వర్షపు జల్లులు సేదతీర్చాయి.. కృష్ణమ్మ తీరాన, దుర్గమ్మ చెంతకు చేరిన సంక్షేమ సారథిని ప్రకృతి మాత జయీభవ అంటూ దీవించింది.. నేను ఉన్నాను.. నేను విన్నాను.. అని తమకు అభయమిస్తూ రథసారథిగా తమ మధ్యకు వచ్చిన జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని అనుసరిస్తూ అశేష అభిమాన సంద్రం ఉరకలెత్తి ముందుకు కదిలింది.. దారిపొడవునా పూలజల్లులు కురిపించి, చేతులెత్తి నమస్కరించి అభిమానం చాటుకుంది.

- ఎన్టీఆర్ జిల్లాలో ఉత్సాహంగా సాగిన వైఎస్ జగన్ బస్సు యాత్ర
- విజయవాడ చేరుకున్న జననేతకు వరుణుడి స్వాగతం
- జోరు వానను సైతం లెక్కచేయక నిరీక్షించిన అభిమానులు
- కనకదుర్గ వారధిపై ఎదురేగి స్వాగతం పలికిన జనం
- దారిపొడవునా పూలవర్షం.. మార్మోగిన జై జగన్ నినాదం
- విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో సాగిన యాత్ర
- కృష్ణా జిల్లా కేసరపల్లిలో రాత్రి బసచేసిన సీఎం వైఎస్ జగన్

సాక్షి ప్రతినిధి, విజయవాడ: జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అశేష జనవాహిని బ్రహ్మరథం పట్టింది. తమ గుండెల్లో కొలువైన అభిమాన నేతను చూసేందుకు ప్రజలు పోటెత్తారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్ర శనివారం సాయంత్రం విజయవాడ తూర్పు నియోజకవర్గంలోకి ప్రవేశించింది. బస్సు యాత్రలో భాగంగా 14వ రోజు గుంటూరు జిల్లాలో పర్యట నను ముగించుకొని కనకదుర్గ వారధి మీదుగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించారు. జననేతకు ఘనస్వాగతం పలికేం దుకు మండుటెండను సైతం లెక్కచేయక మధ్యాహ్నం రెండు గంటల నుంచే ప్రజలు వారధి వద్ద పెద్ద సంఖ్యలో నిరీక్షించారు. వైఎస్ జగన్ జిల్లాలో ప్రవేశించే సమయంలో జోరువర్షం కురిసింది. మహిళలు, యువతీయువకులు, పిల్లలు, వృద్ధులు వానలో తడుస్తూనే వైఎస్సార్ సీపీ జెండాలు చేబూని జై జగన్ అంటూ నినదించారు.

స్వాగతించిన వరుణుడు

కృష్ణమ్మ చెంత జిల్లాలోకి ప్రవేశించిన జననేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి అభిమానులతోపాటు వరుణుడు అపూర్వ స్వాగతం పలికారు. సంక్షేమ సారథికి ప్రజలు నీరాజనాలు పలికారు. తమ అభిమాన నేతను చూసి పులకించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివాదం చేయగానే కేరింతలు కొట్టారు. దారిపొడవునా మహిళలు గుమ్మడికా యలతో దిష్టితీసి, హారతులు పట్టారు. ప్రజలు భారీ గజమాలలతో అభిమానం చాటుకున్నారు. డప్పు వాయిద్యాలు, బాణసంచా వెలుగులు, మహిళల కోలాటాలతో బస్సుయాత్ర ఉత్సాహంగా ముందుకు సాగింది. యువకులు పెద్ద పెద్ద జెండాలు చేబూని జై జగన్ అని నినదిస్తూ సంక్షేమ రథసారథిని అనుసరించారు. అభిమాన నేతను కనులారా చూసేందుకు అవ్వాతాతలు, మహిళలు, యువతీ యువకులు, విద్యార్థులు, చిన్నారులు గంటలతరబడి బస్సుయాత్ర సాగే మార్గంలో రోడ్డుకు రెండువైపులా బారులు తీరారు. తమ కళ్ల ముందుకొచ్చిన జననేత జగన్‌మోహన్‌రెడ్డిని చూసి చేతులెత్తి అభివాదం చేశారు. 'మా ఆశ, శ్వాస నీవే. నువ్వే మళ్లీ సీఎం కావాలి' అంటూ నిండు మనసుతో దీవెనలు అందించారు.

తూర్పులో ఘన స్వాగతం

తొలుత విజయవాడ తూర్పు నియోజకవర్గంలోకి కనకదుర్గ వారధి వద్ద బస్సుయాత్ర ప్రవేశించింది. నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, అభిమానులు, నేతలు, కార్యక ర్తలు తమ అభిమాన నేతకు ఘనస్వాగతం పలికారు. విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని), ఎమ్మెల్సీలు తలశిల రఘురాం, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణకుమార్, ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే, సెంట్రల్ వైఎస్సార్ సీపీ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస్, మచిలీపట్నం ఎమ్మెల్యే పేర్ని నాని, నందిగామ ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహన్ రావు, విజయవాడ పశ్చిమ, మైలవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థులు షేక్ ఆసిఫ్, సర్నాల తిరుపతిరావు, పార్టీ నాయకులు పోతిన మహేష్, అడపా శేషు తదితరులు జననేతకు ఘన స్వాగతం పలికారు. వారధి వద్ద అరగంటకు పైగా కురిసిన జోరువానలో తడిసి ముద్దయినా ప్రజలంతా రోడ్డుపైనే నిలబడి తమ అభిమానం చాటుకొ న్నారు. కనకదుర్గమ్మ వారధి, సాయిబాబా టెంపుల్, రమేష్ ఆస్పత్రి,



అపూర్వ స్వాగతం : కనకదుర్గ వారధి వద్ద జననేతకు స్వాగతం పలుకుతున్న ప్రజలు

వాటర్ ట్యాంక్ రోడ్డు, శిఖామణి సెంటర్, మెట్రో, చుట్టుగుంట మీదుగా బస్సు యాత్ర సాగింది. శిఖామణి సెంటర్‌లో దేవినేని అవినాష్ ఆధ్వ ర్యంలో ఫ్లెక్సీలతో ఏర్పాటు చేసిన గజమాల విశేషంగా ఆకట్టుకుంది.



సెంట్రల్‌లో జన నీరాజనం

షెడ్యూల్ కన్నా మూడు గంట లకుపైగా ఆలస్యంగా విజయ వాడ సెంట్రల్ నియోజకవ ర్గంలోకి బస్సుయాత్ర ప్రవేశించింది. ఎంత ఆలస్యమైనా అభిమాన నేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు, విజయీభవ అని ఆశీర్వ దించేందుకు ప్రజలు రోడ్లపైనే నిరీక్షించారు. సంగీత కళాశాల, ఫుడ్ జంక్షన్, భగత్‌సింగ్ రోడ్డు, గవర్నమెంట్ ప్రెస్, బుడమేరు, సింగ్‌నగర్ ఫ్లై ఓవర్, డాబాకొట్ల సెంటర్, కృష్ణా హోటల్ సెంటర్, పైపుల రోడ్డు, ప్రకాష్‌నగర్, పాయకాపురం, కండ్రిక మీదుగా అశేష జనవాహిని మధ్య జైత్ర యాత్రను తలపించేలా బస్సు యాత్ర సాగింది. అక్కడి నుంచి రామవరప్పాడు, నిడమానూరు మీదుగా కేసరపల్లి బైపాస్ శివారులో రాత్రి బసకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేరుకున్నారు.

ఆప్యాయంగా పలకరిస్తూ..

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు నుంచి దారి పొడవునా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తన రాక కోసం వేచివున్న ప్రజ లను ఆప్యాయంగా పలుకరించారు. దీంతో వారి ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. 'మన అందరి ప్రభుత్వం మళ్లీ వస్తుంది. మన ప్రభుత్వంలో మీకు తగిన మేలు జరుగుతుంది' అని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు హామీ ఇచ్చారు. తూర్పు నియోజక వర్గంలో సాయిబాబా ఆలయం వద్ద ప్రజలు అర్జీలతో నిలబడి ఉండ టాన్ని వైఎస్ జగన్ చూసి వాహనాన్ని నిలిపి, వారి నుంచి అర్జీలు స్వీక రించారు. అనారోగ్యంతో బాధపడుతున్న వారిని గుర్తించి, వారికి సత్వర న్యాయం జరిగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. శిఖామణి సెంటర్‌లో ముఖ్యమంత్రికి జూనియర్ లాయర్లు స్వాగతం పలికారు.

కృష్ణాజిల్లాలో ప్రవేశించిన బస్సు యాత్ర

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర శని వారం రాత్రి కృష్ణాజిల్లాలోకి ప్రవేశించింది. రాత్రి 9.15 గంటల వరకు ఎన్టీఆర్ జిల్లాలోని విజయవాడ తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో బస్సు యాత్ర కొనసాగి, 9.20 గంటలకు కృష్ణాజిల్లా సరిహద్దులోని రామవరప్పాడు రింగ్ వద్దకు చేరుకుంది. రామవరప్పాడు రింగ్ వద్ద మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖర్, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీమోహన్ సీఎం జగన్‌కు ఘనంగా స్వాగతం పలికారు. జననేత వైఎస్ జగన్‌ను చూసేందుకు గన్నవరం నియోజక వర్గం నుంచి పెద్ద ఎత్తున ప్రజలు రామవరప్పాడు రింగ్ వద్దకు స్వచ్ఛందంగా తరలివచ్చారు. అశేష జన సందోహం నడుమ గజమా లతో ముఖ్యమంత్రిని ఎమ్మెల్యే వంశీ కృష్ణా జిల్లాలోకి ఆహ్వానిం చారు. అనంతరం బస్సు యాత్ర గన్నవరం నియోజకవర్గంలో కొనసాగింది. అప్పటికే అక్కడ వేచిన ప్రజలు యాత్రలో అడుగులు కలిపారు. రామవరప్పాడు రింగ్ నుంచి ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమా నూరు, గూడవల్లి మీదుగా కేసరపల్లి రాత్రి బసకు బస్సు యాత్ర చేరుకుంది. బస్సు యాత్ర ఆద్యంతం జన కేరింతల నడుమ సాగింది. రామవరప్పాడు రింగ్ నుంచి కేస రపల్లి వరకు జాతీయ రహదారికి రెండు వైపులా ప్రజలు బారులు తీరారు. వారికి సీఎం జగన్ అభివాదం చేశారు. తమకు అభివాదం చేస్తున్న జననేతను ప్రజలు తమ సెల్ ఫోన్‌లతో చిత్రీకరిం చారు. సింగ్‌నగర్‌లో కొందరు టీడీపీ గుండాల రాయి దాడిలో గాయ పడినా, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బస్సు యాత్రను కొన సాగించారు. తన కోసం వేచి చూస్తున్న వేలాది మంది అభిమానులను నిరుత్సాహ పర్చకుండా ముందుకుసాగారు. సమయాభావం అవు తుందని, ఎన్నికల కోడ్ అమలుకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. రాత్రి పది గంటల తర్వాత కేసరపల్లి బస ప్రాంగణానికి చేరింది. కాగా ఆదివారం మేమంతా సిద్ధం బస్సు యాత్రకు విరామం ప్రకటించారు.



వస్తూనే.. చల్లదనం తెచ్చావయ్యా..



వర్షాతిరేకం : వర్షంలో నృత్యం చేస్తున్న మహిళలు

విజయవాడస్పోర్ట్స్: 'వస్తూనే చల్లదనం తెచ్చావయ్యా.. నువ్వు చల్లగా ఉండాలి' అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని విజయవాడ ప్రజలు దీవించారు. పది రోజు లుగా ఎండ వేడితో విజయవాడ మండు తున్న విషయం తెలిసిందే. శనివారం ఉదయం నుంచి మధ్యాహ్నం మూడు గంటల వరకు మండుటెండ, ఉక్కపోతతో ప్రజలు అల్లాడారు. బస్సు యాత్రలో భాగంగా శనివారం సాయంత్రం విజయ వాడకు సీఎం జగన్ చేరుకోవడానికి సరిగ్గా 40 నిమిషాల ముందే విజయవాడ వాతావ రణం ఒక్క సారిగా చల్లబడింది. ముందస్తు షెడ్యూల్ ప్రకారం బస్సు యాత్ర మధ్యాహ్నం మూడు గంటలకు విజయ వాడ చేరుకుంటుందని తెలుసుకున్న ప్రజలు సీఎం జగన్‌కు స్వాగతం పలికేం దుకు కనకదుర్గ వారధి వద్దకు భారీ ఎత్తున చేరుకున్నారు. అప్పటి వరకు ఉన్న ఎండను సైతం లెక్క చేయకుండా వచ్చిన ప్రజలతో వారధి నిండిపోయింది. సాయంత్రం వీచిన చల్ల గాలులతో ప్రజలు సేదదీరారు. కొద్ది సేపటి తరువాత జోరు వర్షం కురిసింది. జననేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాలోకి ప్రవేశిస్తున్న సమయంలోనే వర్షం కురి సింది. 'వస్తూ.. వస్తూనే చల్లదనం తెస్తున్నా వయ్యా.. నువ్వు చల్లగుండాలి' అంటూ అక్కడున్న ప్రజలు జగన్‌ను ఆశీర్వదిం చారు. అనంతరం బస్సుయాత్రను అనుస రించి ముందుకు కదిలారు.

బెజవాడ.. జనవాడ

బస్సు యాత్ర సాగిన బెజవాడ వీధులన్నీ జనంతో కిక్కిరి సిపోయాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేప ట్టిన బస్సు యాత్ర తూర్పు, సెంట్రల్ నియోజకవర్గాల్లో కొనసాగింది. చిన్నారుల కేరింతలు, విద్యార్థుల సంబ రాలు, యువత ఆనందోత్సాహాలు, మహిళల కోలాటంతో అద్యంతం ఉత్సాహభరిత వాతావరణంలో బస్సుయాత్ర ముందుకు సాగింది. కిలోమీటర్ల కొద్దీ ప్రజలు బారులు తీరడంతో బస్సు యాత్ర జనజాతరను తలపించింది. ట్వంటీ ట్వంటీ ఫోర్(2024).. జగనన్న వన్స్ మోర్.. అనే నినాదాలతో వైఎస్సార్ సీపీ జెండాలు, ప్లకార్డులు చేబూని సీఎం జగన్‌తో కలిసి అభిమానులు ముందుకు సాగారు.



ఆశీర్వదించండి : రామవరప్పాడు రింగ్ వద్ద మచిలీపట్నం ఎంపీ, గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థులు సింహాద్రి చంద్రశేఖరరావు, వల్లభనేని వంశీతో వైఎస్ జగన్





జోష్ : జగన్‌మోహన్‌రెడ్డిని చూసిన ఆనందంలో ప్రజలు



జనహారతి : వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళలు

క్లుప్తంగా

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన ఘటన కృష్ణలంక పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు గుంటూరు నల్లచెరువులో నివసిస్తున్న సయ్యద్ మున్వర్(48) గోనె సంచులు కుడుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు భార్య నజీమా, ఇద్దరు కుమారులు ఉన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా సయ్యద్ మున్వర్ శుక్రవారం ఉదయం గన్నవరంలోని బంధువుల ఇంటికి వెళ్లాడు. తిరిగి వెళ్లే క్రమంలో రాత్రి 9.30 గంటలకు గన్నవరం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరాడు. రాత్రి సుమారు 10 గంటలకు జాతీయ రహదారి మీదుగా బెంజిసర్కిల్ నుంచి వారధి వైపు వెళ్తుండగా రాణిగారితోటలోని గుడ్ మార్నింగ్ హోటల్ సెంటర్‌లో ఫీడర్ రోడ్డు నుంచి నేతాజీ వంతెన వైపు వెళ్లేందుకు జాతీయ రహదారిని దాటుతున్న ఒక వ్యక్తిని సయ్యద్ వాహనం ఢీకొట్టింది. ద్విచక్ర వాహనాన్ని అదుపు చేసుకోలేక వాహనంతో పాటు మున్వర్ కింద పడిపోగా తలకు బలమైన గాయమైంది. స్థానికులు 108 ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి 12 గంటలకు మున్వర్ మృతిచెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్య

పెనమలూరు: అనుమానాస్పద స్థితిలో వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై స్థానిక పీఎస్‌లో శనివారం కేసు నమోదైంది. సీఐ టీవీవీ రామారావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీపతి శ్రావ్య, ఈడుపుగల్లుకు చెందిన విశ్వనాథ్ ఫణీంద్ర భార్యాభర్తలు. భర్త సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. వారు హైదరాబాద్‌లో నివసిస్తున్నారు. ఆమె మరిది అనిరుధ్ వివాహం కారణంగా గతేడాది డిసెంబరులో ఈడుపుగల్లులోని అత్తగారింటికి వచ్చింది. అదే నెల 10న శ్రీపతి శ్రావ్య తల్లి శ్రీపతి రజని అపార్టుమెంట్ నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. ఆమె వెన్నెముకకు గాయమైంది. తల్లి మంచాన పడటంతో శ్రావ్య మనస్తాపానికి గురైంది. ఈ నెల 12న శ్రావ్య ఎలుకల మందు కొనుగోలు చేసి పోరంకి సాలిపేట సమీపంలోని దుకాణం వద్ద చెరకు రసంతో కలుపుకుని తాగింది. అనంతరం ఈడుపుగల్లులోని అత్తవారింటికి వచ్చింది. జరిగిన విషయాన్ని అత్తవారికి చెప్పటంతో మెరుగైన వైద్యం నిమిత్తం ముందుగా పోరంకి, తర్వాత కానూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మేమంతా సిద్ధం

- గుడివాడలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి భారీ బహిరంగ సభ
- ఏర్పాట్లు పూర్తి చేసిన నేతలు
- వేదిక ముందు భాగంలో పార్టీ ఎన్నికల గుర్తు ఫ్యాన్ ఆకారంలో వాక్ ర్యాంప్, గ్యాలరీలు
- సభ ఏర్పాట్లను పరిశీలించిన గుడివాడ ఎమ్మెల్యే కొడాలి నాని



సిద్ధమవుతున్న సభా ప్రాంగణం

గుడివాడరూరల్: 'మేమంతా సిద్ధం' భారీ బహిరంగ సభ కృష్ణా జిల్లా గుడివాడ శివారులో జరగనుంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా నాగవరప్పాడు జాతీయరహదారి పక్కన సోమవారం సభ నిర్వహించనున్నారు. దీనికి జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆధ్వర్యంలో సభకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వేదిక ముందుభాగంలో పార్టీ గుర్తు ఫ్యాన్ ఆకారంలో వాక్ ర్యాంపును ఏర్పాటు చేశారు. గ్యాలరీలు నిర్మించారు. ఈ సభ ద్వారా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ప్రజలకు చేసిన మేలును వివరించనున్నారు. సీఎం జగన్ ప్రసంగం ప్రత్యక్షంగా వినేందుకు భారీగా ప్రజలు సభకు హాజరుకానున్నారు.

అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తారు

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గన్నవరం నుంచి రోడ్ షోగా బయల్దేరతారు. హనుమాన్‌జంక్షన్ మీదుగా గుడివాడ నియోజకకవర్గంలోని నందివాడ మండలం పెదలింగాల, పుట్టగుంట మీదుగా జనార్దనపురం(జొన్నపాడు)చేరి అక్కడ మధ్యాహ్నం భోజన విరామానికి సమయం తీసుకుంటారు. అక్కడ నుంచి రోడ్ షోగా నాగవరప్పాడులోని మేమంతా సిద్ధం సభ వేదిక వద్దకు మధ్యాహ్నం 3గంటలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చేరుకుంటారు. అక్కడ ప్రజలకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చేసిన మేలు, అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తారు.

సభానంతరం నాగవరప్పాడు వద్ద నుంచి ఏలూరు రోడ్డు మీదుగా నెహ్రూచౌక్ సెంటర్, మార్కెట్ సెంటర్, బస్టాండ్ సెంటర్, కోతిబొమ్మ సెంటర్ మీదుగా పెదకాల్వ సెంటర్‌కు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రోడ్ షో చేస్తారు. అక్కడ నుంచి బొమ్ములూరు, అంగలూరు, గుడ్లవల్లేరు, కొతవరం, వేమవరం, వడ్లమన్నాడు మీదుగా పెడన నియోజకవర్గంలోని రెడ్డిపాలెంకు చేరుకుంటారు.

భద్రతా ఏర్పాట్లు పరిశీలన

గుడివాడ టౌన్: గుడివాడలో నిర్వహించనున్న మేమంతా సిద్ధం సభాప్రాంగణంలో భద్రతా ఏర్పాట్లను ఏలూరు ఐజీ జీవీజీ అశోక్ కుమార్ శనివారం సాయంత్రం పరిశీలించారు. జిల్లా ఎస్పీ నయీమ్‌అస్మితో కలిసి ప్రాంగణాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీకాంత్, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సభాస్థలిని పరిశీలిస్తున్న ఐజీ అశోక్‌కుమార్

లక్ష మందితో సభను విజయవంతం చేస్తాం: ఎమ్మెల్యే కొడాలి

నాగవరప్పాడు సమీపంలో జరిగే సిద్ధం బహిరంగ సభను లక్షమందితో విజయవంతం చేస్తామని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తెలిపారు. సభలో ఆయన చెప్పే మాటను ప్రజలకు చేరవేసి రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ఘన విజయం సాధించడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉన్నారన్నారు. గుడివాడ చరిత్రలో నిలిచిపోయేలా సభను నిర్వహిస్తామన్నారు.

వైభవంగా వసంత నవరాత్రులు

దుర్గమ్మకు జిల్లేడు, మారేడు, తులసితో అర్చన


దుర్గగుడిలో అమ్మవారి అర్చన నిమిత్తం సేకరించిన పుష్పాలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో వసంత నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో 5వ రోజు శనివారం అమ్మవారికి తెల్లజిల్లేడు, మారేడు, తులసి, మరువంతో అర్చన చేశారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ఉత్సవమూర్తికి పుష్పార్చన జరిగింది. ఆలయ ఈవో కె.ఎస్. రామరావు, వైదిక కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, వేద పండితులు పుష్పాలతో ఊరేగింపుగా వేదిక వద్దకు చేరుకున్నారు. మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య అమ్మవారికి పుష్పార్చన జరిగింది. అనంతరం ఆలయ అర్చకులు అమ్మవారి ఉత్సవ మూర్తికి పంచహారతుల సేవ, హారతిని ఇవ్వగా ఉభయదాతలు, భక్తులు సేవలో పాల్గొన్నారు. అర్చన అనంతరం అమ్మవారికి ఉపయోగించిన పుష్పాలను భక్తులకు పంపిణీ చేశారు.

సినీ ఫక్కీలో సెల్‌ఫోన్ల చోరీ



చల్లపల్లి: ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు సినీ ఫక్కీలో శనివారం చల్లపల్లిలో ఇద్దరు వృద్ధుల నుంచి సెల్‌ఫోన్లు చోరీ చేశారు. నారాయణరావు నగర్‌కు చెందిన వృద్ధుడు తహసీల్దార్ కార్యాలయం వద్ద నుంచి ఇంటికి వెళ్తున్నారు. అప్పుడు ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి పడిపోతున్నట్లు నటించారు. ఆయన వారిని లేపడానికి ప్రయత్నిస్తుండగా, వృద్ధుని జేబులో నుంచి స్మార్ట్ ఫోన్ లాక్కుని పారిపోయారు. ఈ యువకులు అరగంట వ్యవధిలో ఆర్యవైశ్య బజారులోని గీతామందిరం సమీపంలో మరొక వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్‌తో ఉడాయించారు. ఆ వృద్ధులు పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు. ఎస్ఐ సీహెచ్.చినబాబు సీసీ కెమెరా ఫుటేజీ సేకరించి విచారణ చేస్తున్నారు.

సాహిత్యం.. సమాజ హితం

కేంద్ర యువ సాహిత్య పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్


పురస్కార గ్రహీతలు వేంపల్లి షరీఫ్, నాగరాజు, బాల సుధాకర్, బండ్ల మాధవరావు, చిన్మయి

విజయవాడ కల్చరల్: సాహిత్యం.. సమాజహితాన్ని కోరుతుందని కేంద్ర యువ సాహిత్య పురస్కార గ్రహీత వేంపల్లి షరీఫ్ చెప్పారు. మొగల్రాజపురంలో సిద్ధార్థ కళాపీఠం వేదికపై శనివారం కేంద్ర యువ సాహిత్య పురస్కారగ్రహీతల పరిచయం, ఆత్మీయ సత్కారం, తెలుగు సాహిత్య వైశిష్ట్యం.. సాహితీ సమాలోచన కార్యక్రమం నిర్వహించారు. ముమ్మనేని సుబ్బారావు సిద్ధార్థ కళాపీఠం, ప్రపంచ తెలుగు సమాఖ్య, సిద్ధార్థా విద్యాసంస్థల తెలుగు విభాగం ఆధ్వర్యంలో ఉగాది సందర్భంగా సిద్ధార్థ కళాపీఠం వ్యవస్థాపక కార్యదర్శి నాగళ్ల గురుప్రసాద్‌ను సాహిత్యసేవలను స్మరించుకుంటూ కార్యక్రమం జరిగింది. షరీఫ్ మాట్లాడుతూ జుమ్మా కథల సంపుటికి కేంద్ర యువ సాహిత్య పురస్కారం లభించినట్లు తెలిపారు. మరో పురస్కార గ్రహీత బాల సుధాకర మౌళి మాట్లాడుతూ శ్రీకాకుళం జిల్లాలోని అనేక వాస్తవ సంఘటనలు ప్రేరణ కలిగించాయి. వాటి ఆధారంగానే 'ఆకు కదలని చోటు' కవితా సంపుటి రాశామని దానికి పురస్కారం లభించిందన్నారు. కేంద్ర యువ పురస్కార గ్రహీత పల్లిపట్టు నాగరాజు మాట్లాడుతూ రాయలసీమలో మనసును కదిలించి చైతన్య పరిచే సంఘటనలు నేపథ్యంలో యాలై పూచింది (సమయమైపోయింది) కవితా సంపుటిని రచించానని తొలి పుస్తకానికే పురస్కారం లభించిందన్నారు. విద్యావేత్త బండ్ల మాధవరావు సభను సమన్వయ పరిచారు. పురస్కార గ్రహీతలను కళాపీఠం బాధ్యులు లలిత్ ప్రసాద్, బీవీ ప్రకాష్ సత్కరించారు. మహిళా కళాశాల తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ సరళ కార్యక్రమాన్ని నిర్వహించారు. పీఎస్ఎస్ చిన్మయి నవవసంతం విరబూయాలని చేసిన కవితాగానం ఆకట్టుకుంది.

తెలుగు సాహిత్య వైశిష్ట్యంపై..

డాక్టర్ పాపినేని శివశంకర్ నేతృత్వంలో తెలుగు సాహిత్య వైశిష్ట్యంపై పలువురు ప్రసంగించారు. జానపద సాహిత్యంపై డాక్టర్ దామోదర గణపతి రావు, పద్యకవిత్వంపై డాక్టర్ గుమ్మా సాంబశివరావు, అవధానం అంశంపై డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, కృష్ణవేణి శతక సాహిత్యం, కృష్ణేశ్వరరావు తెలుగు నాటకం, పాపినేని శివశంకర్ వచన కవిత్వంపై ప్రసంగించారు.

'కేబీఎన్'కు నాక్ ఏ డబుల్ ప్లస్ గ్రేడ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎన్ కళాశాల యూజీసీ అనుబంధ సంస్థ నాక్ నుంచి ఏ డబుల్ ప్లస్ గ్రేడ్‌ను సాధించిందని ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రధాన కార్యదర్శి గోపిశెట్టి మల్లయ్య, ఆ కాలేజీ అధ్యక్ష, కార్యదర్శులు తొమ్మండ్రు శేషయ్య, తూనికుంట్ల శ్రీనివాసులు చెప్పారు. కళాశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. 59 ఏళ్లుగా రాష్ట్రంలో ఉన్నత విద్యారంగ వ్యాప్తికి, సామాజిక వికాసానికి కేబీఎన్ కళాశాల అద్వితీయమైన సేవలందిస్తోందన్నారు. నేడు ఆరు వేల మంది విద్యార్థులతో రాష్ట్రంలో అతి పెద్ద కళాశాలలో ఒకటిగా గణతికెక్కిందన్నారు. విద్యా ప్రమాణాలు, బోధనా పద్ధతులు, పాలకవర్గ నిర్ణయాలు, ఉపాధి అవకాశాలు, నిర్వహణ, సామాజిక సేవలు, విద్యార్థుల వికాసం తదితర అంశాలను పరిశీలించి తగిన గ్రేడింగ్ ఇవ్వడానికి కేంద్ర ప్రభుత్వానికి యూజీసీకి అనుబంధంగా నేషనల్ అసిస్మెంట్ అండ్ అక్రిడిటేషన్ (నాక్) పని చేస్తోందన్నారు.



గుర్తింపు పత్రాలను చూపుతున్న కళాశాల యాజమాన్యం

'నాక్' బృందం ఫిబ్రవరిలో రెండు రోజుల పాటు తమ కళాశాలను పరిశీలించిందన్నారు. ఆ క్రమంలో నాక్ అందించే అత్యుత్తమ గ్రేడ్ 'ఏ డబుల్ ప్లస్' ను తమ కాలేజీకి ప్రకటించిందన్నారు. సమావేశంలో హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ల బాబావిజయకుమార్, కోశాధికారి అన్నం రామకృష్ణారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ రామకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జీ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

పెనమలూరు: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటనపై పెనమలూరు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు బందరుకాలువలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం ఉండటాన్ని గమనించిన స్థానికులు పెనమలూరు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. మృతుడికి 40 నుంచి 50 సంవత్సరాల మధ్య వయస్సు ఉంటుందని, మృతుని ఆచూకీ తెలియలేదని వారు తెలిపారు. ఘటనపై సీఐ రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న జైత్రయాత్ర.. తూర్పున పులకింత

- మేమంతా సిద్ధం బస్సు యాత్ర సూపర్‌సక్సెస్
- అడుగడుగున పెద్ద సంఖ్యలో స్వాగతం పలికిన ప్రజలు
- జోరు వానలోనూ సడలని అభిమానం

లబ్బీపేట(విజయవాడతూర్పు): జోరువానలోనూ జగనన్నను చూడాలనే పట్టుదల సడలలేదు. తడిసి ముద్దయినా తమ అభిమాన నేత కోసం మహిళలు సైతం ఎదురు చూశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం గుంటూరు జిల్లా నుంచి ఎన్టీఆర్ జిల్లా తూర్పు నియోజకవర్గంలోని ప్రవేశించింది. తమ అభిమాన నేతకు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చారు. కనకదుర్గమ్మ వారధితో పాటు, బస్సు యాత్ర కొనసాగిన రోడ్లన్నీ జనసంద్రంగా మారాయి. జననేత అభివాదం చేస్తుంటే, ప్రతిగా చేతులు ఊపుతూ ప్రజలు తమ మద్దతు తెలియచేశారు.

తూర్పులో సూపర్‌సక్సెస్...

మేమంతా సిద్ధం బస్సు యాత్ర తూర్పు నియోజకవర్గంలో సూపర్‌సక్సెస్ అయ్యింది. కనకదుర్గమ్మ వారధితో పాటు, ఫ్లె ఓవర్, సాయిబాబా టెంపుల్, నేతాజీ బ్రిడ్జి రోడ్డు, పశువుల ఆస్పత్రి, శిఖామణిసెంటర్, నైస్‌బార్‌జంక్షన్, మెట్రో, చుట్టుగుంట ఇలా అన్ని ప్రాంతాల్లో వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. దారి పొడవునా రోడ్డుకి ఇరువైపులా ప్రజలు భారీ సంఖ్యలో ఉండటంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితో పాటు, పార్లమెంటు అభ్యర్థి కేశినేని శ్రీనివాస్, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాస రావులు సైతం బస్సుపైకి ఎక్కి ప్రజలకు అభివాదం చేశారు. తూర్పులో దాదాపు గంటన్నర పాటు బస్సుయాత్ర కొనసాగింది.

జోరువానలోనూ....

సాయంత్రం 4 గంటలకు జిల్లాలోకి బస్సు యాత్ర ప్రవేశిస్తుందని ప్రకటించడంతో మహిళలతో పాటు, వేలాది మంది కనకదుర్గమ్మ వారధి మధ్యకు చేరుకున్నారు. ఒక్కసారిగా వాతావరణం చల్లబడటంతోపాటు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం వచ్చింది. ఆ వర్షంలోనే తడుస్తూ మహిళలు, ప్రజలంతా వారధిపైనే తమ అభిమాన నేత కోసం ఎదురు చూశారు. సుమారు 20 నిమిషాలకు పైగా వర్షం పడినప్పటికీ ఒక్కరు కూడా వెనక్కి వెళ్లకుండా అలాగే ఉండిపోయారు. వారితో పాటు దేవినేని అవినాష్ సైతం వర్షంలోనే తడుస్తూ ఉండిపోయారు.

అన్ని ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజలు...

జగనన్నను చూసేందుకు తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్ల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ప్రతి జంక్షన్‌లో నాలుగు వేల మంది వరకూ వేచి ఉన్నారు. వారితో పాటు, దారి పొడవున ప్రజలు బారులు తీరారు. మేమంతా సిద్ధం యాత్ర విజయవంతం చేయడంతో దేవినేని అవినాష్‌తో పాటు, కార్పొరేటర్లు కొండారెడ్డి, పుప్పాల కుమారి, అడపా శేషు, వెంకట సత్యనారాయణ, రామిరెడ్డి, చింతల సాంబయ్య, రెహానా నాహిద్, మెరకనపల్లి మాధురి, కలపాల అంబేద్కర్, వియ్యపు అమర్‌నాథ్, అంబడిపూడి నిర్మలకుమారి, భీమిశెట్టి ప్రవల్లిక, డెప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, ఉమ్మడిశెట్టి రాధిక తమ వంతు కృషి చేశారు.



అశేష జన సందోహంతో వారధి నుంచి తూర్పులోకి అడుగుపెట్టిన మేమంతా సిద్ధం జగనన్న బస్సు యాత్ర



ప్రజలకు అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి

అభిమాన నేత జగనన్న కోసం ....

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): గజమాలలు, తీన్‌మార్ డప్పు వాయిద్యాలు, నృత్యాలతో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు శిఖామణి సెంటర్‌లో వైఎస్సార్ సీపీ శ్రేణులు శనివారం సాయంత్రం స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఇన్‌చార్జి దేవినేని అవినాష్ ఆధ్వర్యంలో శిఖామణి సెంటర్, నైస్‌బార్ సెంటర్లలో గజమాలను ఏర్పాటు చేశారు. వైఎస్సార్ సీపీ ఎన్నికల గుర్తు అయిన ఫ్యాన్‌లను గజమాలకు అమర్చారు. తీన్‌మార్ డప్పులు, నృత్యాలతో శిఖామణి సెంటర్ దద్దరిల్లింది. మధ్యాహ్నం 2 గంటల నుంచే అధిక సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానిక మహిళలు శిఖామణి సెంటర్‌కు చేరుకున్నారు. సాయంత్రం నాలుగు గంటలకు పడిన వర్షంలోనూ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఏ మాత్రం వెనుతిరగకుండా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలకడానికి నిలబడ్డారు. కార్యకర్తల మొండి ధైర్యం ముందు వరుణుడే వెనుకడుగు వేసి కొద్దిసేపటికి వాన జోరు తగ్గింది. జగనన్నను చూసిన తర్వాతే అక్కడ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు వెనుతిరిగారు. వైఎస్సార్ సీపీ జెండా రంగుల పేపర్ల షాట్స్, పూలతో అభిమానులు కేరింతలు కొట్టారు. చాలా మంది మహిళలు, యువకులు తమ అభిమాన నేతను వారి సెల్‌ఫోన్లలో ఫొటోలు, వీడియోలు తీసుకుని జగనన్నను చూసిన మధుర క్షణాలను పదిలపరుచుకున్నారు. శిఖామణి సెంటర్‌లో జగన్మోహన్‌రెడ్డికి గుమ్మడికాయతో మహిళలు దిష్టి తీశారు.



అరచేతిలో హారతి ఇస్తున్న అభిమాని



అభిమాన నేత జగనన్నకు అభివాదం చేస్తున్న మహిళలు



జగనన్నను చూసేందుకు వీక్షిస్తున్న అభిమానులు

మళ్లీ మీరే రావాలి జగనన్న

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఉత్సాహం ఉరకలేసింది... జై జగన్ నినాదాలతో నగరం హోరెత్తింది. యువతలో జోష్ నింపింది. తమ అభిమాననేత చూసిన ఆనందంతో కేరింతలు కొట్టారు. ఆ మధుర స్మృతులను సెల్‌ఫోన్‌లలో బంధించారు. ఇలా నగరంలో సాగిన మేమంతా సిద్ధం బస్సు యాత్రకు కార్యకర్తలు, ప్రజల నుంచి అపూర్వ స్వాగతం లభించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సైతం ప్రతి ఒక్కరికీ అభివాదం చేస్తూ ముందుకు సాగారు. అంతేకాదు రోజూ ఉక్కపోతతో ఉక్కిరి బిక్కిరి అవుతుండగా, జననేత అడుగు పెట్టే సమయంలో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలంతా రోడ్లపైకి వచ్చి ఎదురేగి స్వాగతం పలికారు. వైఎస్సార్ సీపీ జెండాలు రెపరెపలాడించారు. గజమాలలతో అభిమాన నేతకు స్వాగతం పలికారు. పిల్లలు, యువత, వృద్ధులు, మహిళలు, పురుషులు ఇలా అన్ని వర్గాల వారు జగనన్నను చూసేందుకు ఎదురు చూశారు. బస్సు యాత్ర వారి వద్దకు చేరుకోగానే జగనన్నను చూసిన ఆనందంతో పరవశించిపోయారు. మళ్లీ నీవే రావాలి జగనన్న అంటూ నినాదాలు హోరెత్తించారు. జగనన్న నాయకత్వం పదికాలాల పాటు వర్ధిల్లాలి అంటూ వృద్ధులు ఆశీర్వాదాలు అందచేశారు.



జనంతో కలిసి కేరింతలు కొడుతున్న వైద్య విభాగం నేతలు



వైఎస్సార్ కటౌట్ తో నిలబడిన అభిమాని

బస్సు యాత్రకు
విశేష స్పందన

గుణదల(విజయవాడ తూర్పు): సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తలపెట్టిన మేమంతా సిద్ధం బస్సుయాత్రకు విశేష స్పందన లభించింది. విశాలాంధ్రరోడ్డు మెట్రో సెంటర్, చుట్టుగుంట కూడళ్ల మీదుగా శనివారం బస్సుయాత్ర సాగింది. ఈ యాత్రకు మద్దతు ప్రకటించేందుకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చారు. దీంతో ఆయా రోడ్లు కోలాహలంగా మారాయి. సీఎం జగన్ వెంట పేదలు, వృద్ధులు, మహిళలు, యువతీ యువకులు బస్సు యాత్రకు మద్దతుగా ముందుకు సాగారు. ప్రజలకు అభివాదం చేస్తూ జగనన్న ముందుకు సాగారు. మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి కటౌట్‌తో మెట్రో సెంటర్ వద్ద ఓ అభిమాని ఆకర్షణగా నిలిచాడు. రాజన్న రాజ్యం జగనన్నతోనే సాధ్యం అంటూ కటౌట్‌కు క్షీరాభిషేకం చేశారు.



జననేత పోస్టర్లతో అభిమానుల కోలాహలం



పేపర్ షాట్స్‌తో స్వాగతం



జేసీబీ తొట్టెలో ఎక్కి యువకుల సందడి

సీఎం జగన్‌కు స్వాగతం పలికిన వరుణుడు

ఆటోనగర్(విజయవాడతూర్పు): మేమంతా సిద్ధం యాత్ర సభకు ప్రజలు పోటెత్తారు. బస్సు యాత్ర విజయవాడలో అడుగు పెట్టడంతో వర్షం సైతం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి స్వాగతం పలికింది. బెజవాడ వర్షంతో పులకరించింది. వర్షాని సైతం లెక్కచేయకుండా రోడ్డు మీద సీఎం జగన్ కోసం పడిగాపులు కాశారు. డప్పుల శబ్దంతో డ్యాన్స్‌లు వేశారు. రమేష్ ఆసుపత్రి కూడలి వద్దకు సాయంత్రం 3 గంటలకు కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో వచ్చారు. బస్సు యాత్ర ఎప్పుడు వస్తుందో.. జగన్‌ను చూడాలని మహిళలు, వృద్ధులు, చిన్నారులు సైతం ఎదురు చూశారు. సాయంత్రం 6 గంటలకు రావడంతో ఒక్కసారిగా జనం కేరింతలు కొట్టారు. విజయవాడ నగరం అడుగు అడుగునా జనసంద్రంతో నిండిపోయింది. చిన్నారులు.. వృద్ధులు స్టెప్పులు వేసి జనాన్ని ఉత్సాహపర్చారు.



మెట్రో వద్ద అభిమానుల సందడి



జగనన్నకు హారతులిచ్చేందుకు వేచి ఉన్న మహిళలు



బస్సు యాత్ర వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి అవినాష్, సెంట్రల్ అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు



వారధి మీదుగా విజయవాడ తూర్పులోకి వస్తున్న జగనన్న బస్సు యాత్ర



జగనన్నను సెల్‌ఫోన్లలో బంధిస్తున్న దృశ్యం

విద్యార్థులను అభినందించిన దేవినేని అవినాష్

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): విద్యార్థులు చక్కగా చదువుకుని రాష్ట్రానికి మంచి పేరు తేవాలని వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ అన్నారు. శుక్రవారం విడుదలైన ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో అత్యధిక మార్కులు సాధించిన నారాయణ గర్ల్స్ ఐఐటీ కళాశాల బెంజ్ సర్కిల్ క్యాంపస్‌లో జూనియర్ ఇంటర్ ఎంపీసీ విద్యార్థిని పి.మేఘన (467 మార్కులు), జూనియర్ బైపీసీ విభాగంలో కే.ప్రసన్న (466 మార్కులు) పొందిన విద్యార్థులను దేవినేని అవినాష్ కళాశాలకు వెళ్లి శనివారం అభినందించారు. నారాయణ విద్యాసంస్థల రీజనల్ జనరల్ మేనేజర్ పి.శ్రీనివాసరెడ్డి, డీన్ సీవీ.రెడ్డి, ప్రిన్సిపాల్ ఎమ్.శ్రీనివాసరావు, ఏజీఎం తాతినేని వినయ్ విద్యార్థులను అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న దేవినేని అవినాష్

ఇంటర్మీడియెట్ ఫలితాల్లో
మాస్టర్ మైండ్స్ విద్యార్థుల ప్రతిభ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఇంటర్మీడియట్ ఫలితాల్లో తమ విద్యా సంస్థకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించారని మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ విజయవాడ బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో టి.ఫాల్గుణీలక్ష్మి 500గాను 488 మార్కులు, సీహెచ్ మేఘన, కె.శ్రీసత్యనాగ పూజిత-486 మార్కులు, ఎం.నాగ వెంకట సాయినవ్య-485, పి.హరీష్, జి.నాగవెంకట సత్య విహారిక-484 మార్కులు పొందారని తెలిపారు. సీనియర్ ఇంటర్ ఎంఈసీలో వెయ్యి మార్కులకు గాను సీహెచ్ యశశ్విని-982 మార్కులు, బి.వర్షిత-979, ఎస్.భవిత-977, ఎం.సాయి లక్ష్మీప్రణీత-974, పి.తేజేష్-973, డి.హర్షిత-973, ఈ.మనీష్‌బాబు-972 మార్కులు పొందారని తెలియజేశారు. తమ విద్యా సంస్థ అకడమిక్ ప్రణాళిక, అత్యుత్తమైన విద్యాబోధన పద్ధతుల వల్లనే పరీక్షల్లో ఇంతటి ఘన విజయాలను సాధించగలుగుతున్నామని పేర్కొన్నారు. పరీక్షా ఫలితాల్లో ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులను మాస్టర్ మైండ్స్ విద్యా సంస్థ అకడమిక్ ప్రిన్సిపాల్ షేక్ మాబూ షరీఫ్‌తో పాటుగా అధ్యాపకులు అభినందించారు.

గురుద్వార్‌లో అవినాష్ ప్రత్యేక ప్రార్థనలు

గుణదల(విజయవాడ తూర్పు): సిక్కుల ఆధ్యాత్మిక సంప్రదాయాలు, భక్తి విశ్వాలు భగవంతుని సంతృప్తి పరిచే విధంగా ఉంటాయని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్‌చార్జ్ దేవినేని అవినాష్ అన్నారు. 4వ డివిజన్ గురునానక్ కాలనీలోని సిక్కుల దేవాలయం గురుద్వార్‌లో బైశాఖి పండుగ సందర్భంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన దేవినేని అవినాష్ మాట్లాడుతూ బైశాఖి పండుగను సిక్కుల అత్యంత పవిత్రంగా చేసుకుంటారని తెలిపారు. సిక్కుల ఆధ్యాత్మిక సంప్రదాయాలు, భక్తి విశ్వాసాలు ఆచరణ యోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. సిక్కులు ఆచరించే ఆధ్యాత్మిక విధానాలు క్రమశిక్షణ, నిబద్ధతను నేర్పిస్తాయని వివరించారు. శిక్కులకు పండుగ శుభాకాంక్షలు తెలియచేశారు. కార్యక్రమంలో మైనారిటీ కమిషన్ మెంబర్ జెజె సింగ్, డివిజన్ అధ్యక్షుడు గల్లా రవి, ఆలయ సభ్యులు హరిమోహన్ సింగ్, కాన్వల్జిత్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సిక్కులతో దేవినేని అవినాష్

నేతన్నకు నాయకత్వం

మంగళగిరిలో చేనేతలతో ముఖాముఖిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- రాజకీయంగా ఎదిగేలా అవకాశాలిచ్చి ప్రోత్సహిస్తున్నాం
- చేనేతలకు అండగా ఉంటా
- కుప్పం, మంగళగిరిలో బీసీలకే సీట్లు ఇచ్చాం
- సూర్యోదయాన్ని, పేదల జీవితాలు బాగుపడటాన్ని ఎవరూ ఆపలేరు

సాక్షి ప్రతినిధి, గుంటూరు


మంగళగిరిలో సీఎం జగన్‌తో జరిగిన ముఖాముఖి కార్యక్రమానికి హాజరైన చేనేతకారులు

నేతన్న నేస్తం అనే ఒక్క పథకం ద్వారానే చేనేతకారులకు రూ.970 కోట్ల మేర లబ్ధి చేకూరుస్తూ ఏకంగా 1.06 లక్షల మందికి వర్తింపజేశామని సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. మగ్గం ఉన్న ప్రతి కుటుంబానికీ ఏటా నేతన్న నేస్తం అందిస్తూ ఏ ఒక్కరూ మిస్ కాకుండా అర్హులందరికీ పారదర్శకంగా ప్రయోజనం దక్కేలా చర్యలు తీసుకున్నామన్నారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా శనివారం గుంటూరు జిల్లా మంగళగిరి సీకే కన్వెన్షన్ హాల్‌లో చేనేతకారులతో నిర్వహించిన ముఖాముఖిలో ముఖ్యమంత్రి జగన్ మాట్లాడారు. ఆ వివరాలివీ..

బతుకులు మార్చినవాడే నాయకుడు..

బస్సు యాత్రలో భాగంగా పలు వృత్తులు, వ్యాపకాల్లో నిమగ్నమైన వారిని కలుస్తూ వస్తున్నాం. ఆ వర్గాలకు జరిగిన మంచితోపాటు ఐదేళ్లలో వారి జీవితాలు ఎలా బాగుపడ్డాయో నేరుగా తెలుసుకుంటూ అడుగులు ముందుకు వేస్తున్నాం. ఇంకా మెరుగ్గా, సమర్థంగా చేయడంపై సూచనలు, సలహాలు ఈ కార్యక్రమం ద్వారా స్వీకరిస్తున్నాం. ప్రజలకు చేదు అనుభవాలను మిగిల్చిన చంద్రబాబు మాదిరిగా కాకుండా ప్రతి పేదవాడు గుండెల్లో పెట్టుకుని చూసుకునేలా 58 నెలలుగా మీ బిడ్డ ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఒక నాయకుడు అనేవాడు ఎలా ఉండాలో ప్రతి ఒక్కరూ ఆలోచన చేయాలి. ఒక నాయకుడిని మనం ఎన్నుకుంటే, ఆ నాయకత్వ స్థానంలో నిలబెట్టినందుకు మన బతుకులు మారాలి. అలాంటి నాయకుడు ఆ స్థానంలో ఉంటేనే మన బతుకులు మారతాయి. ఎన్నుకునేటప్పుడు మనం పొరపాటు చేస్తే రాబోయే ఐదేళ్లు మళ్లీ మనం చేయగలిగింది ఏమీ ఉండదు. మరోసారి మోసపోయి మన బతుకులు అంధకారంలోకి వెళ్లిపోతాయి.

నేతన్నకు వెన్నుపోటు.. 98 శాతం ఇంటూ గుర్తులే

ఇప్పుడు సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ అంటూ హామీలు గుప్పిస్తున్న చంద్రబాబు 2014 ఎన్నికలకు ముందు మేనిఫెస్టో 21, 22వ పేజీల్లో చేనేతలకు కాస్తంత స్థలం కేటాయించారు. ఇప్పటి మాదిరిగానే కూటమిగా ఏర్పడి దత్తపుత్రుడు, ప్రధాని మోదీ ఫొటోలతో హామీలిచ్చి 98 శాతం ఎగ్గొట్టారు. నూటికి 2 మార్కులు కూడా రాలేదు. అదీ చంద్రబాబు ట్రాక్ రికార్డు. ఆ హామీలు ఒక్కసారి గమనిస్తే చేనేత సహకార సంఘాల భవనాలకు ఆస్తిపన్ను నుంచి మినహాయింపు ఇచ్చింది సున్నా. చేనేత కార్మికులకు గుర్తింపు కార్డులు గతంలోనే ఇచ్చారు. జరీపై వ్యాట్ రద్దు చేయలేదు. ఒక్కో చేనేత కుటుంబానికి రూ.లక్ష మేర సంస్థాగత రుణ సౌకర్యం కల్పించలేదు. చేనేత కార్మికులకు రూ.వెయ్యి కోట్లతో ప్రత్యేక నిధి, బడ్జెట్‌లో ఏటా రూ.1,000 కోట్లు కేటాయించలేదు. చేనేత సహకార సంస్థను పటిష్టం చేసి అంతర్జాతీయ స్థాయిలో మార్కెటింగ్ కల్పిస్తామంటూ ఆప్కోకే బకాయిలు పెట్టాడు. జిల్లాకో చేనేత పార్కు ఏర్పాటు చేయలేదు. వృద్ధ చేనేత కార్మికుల కోసం ఉరవకొండ, చీరాల, మంగళగిరి, పెడన, ధర్మవరం మొదలైన ప్రాంతాల్లో ఆస్పత్రులు, ప్రత్యేకంగా వృద్ధాశ్రమాలు ఏర్పాటు కాలేదు. సగం ధరకే జనతా వస్త్రాలు, జనతా వస్త్రాల పథకం పునరుద్ధరణ హామీ అమలు చేయలేదు. కేంద్రం ఇస్తోంది కాబట్టి చేనేత సొసైటీలకు 20 శాతం రాయితీపై ముడి సరుకుల సరఫరా కొద్దో గొప్పో జరిగింది. ఉచితంగా ఇల్లు, మగ్గం, షెడ్డు ఏర్పాటు ఒక్కరికన్నా ఇచ్చారా? ఇలా 98 శాతం ఇంటూ గుర్తులే ఉంటే రెండు శాతం మాత్రమే టిక్కులు కనపడతాయి. ఇంత దారుణంగా మోసం చేసిన వ్యక్తి మళ్లీ ఈరోజు ఎన్నికలు రావడంతో మరోసార వంచనకు తయారయ్యాడు.

బుద్ధీ జ్ఞానం ఉందా? అని నిలదీయండి

"చేనేతలకు అన్ని విధాలా అండగా ఉంటూ వారు రాజకీయంగా కూడా ఎదిగేందుకు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మున్సిపల్ చైర్మన్ పదవుల్లో పెద్దపీట వేశాం. మంగళగిరి ప్రజలకు ఇచ్చిన 54 వేల ఇళ్లను చంద్రబాబు కోర్టులకు వెళ్లి అడ్డుకున్నారు. సామాజిక సమతుల్యత దెబ్బ తింటుందంటూ కేసులు వేశారు. వాళ్లు మీ దగ్గరకు వచ్చి ఓట్లు అడిగితే.. 54 వేల మందికి జగనన్న ఇళ్ల పట్టాలు ఇస్తే నువ్వెందుకు అడ్డుకున్నావ్..! బుద్ధీ జ్ఞానం ఉందా? అని నిలదీయండి. రాజకీయాల్లో ఉన్నప్పుడు ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సింది ఏమిటంటే.. జగన్ చేయవచ్చు, ఇంకొకరు చేయవచ్చు! బాగుపడేది పేదవాడు అయినప్పుడు అడ్డు పడాలని చూసిన ఏ నాయకుడైనా రాజకీయాలకు అనర్హుడు"

– సీఎం జగన్


సీఎం జగన్‌కు జ్ఞాపికను అందజేస్తున్న మురుగుడు లావణ్య, హనుమంతరావు, ఎమ్మెల్యే ఆర్కే తదితరులు

58 నెలల్లో రూ.3,706 కోట్లు

నేతన్నల సంక్షేమం కోసం గతంలో ఎప్పుడూ లేని విధంగా 58 నెలల వ్యవధిలో రూ.3,706 కోట్లు ఖర్చు చేశామని గర్వంగా చెబుతున్నా. ఇవన్నీ పారదర్శకంగా కనిపిస్తున్నాయి. మీ బ్యాంకు ఖాతాలకు గత 58 నెలల్లో ఎన్ని డబ్బులు జమ అయ్యాయి? చంద్రబాబు హయాంలో ఎన్ని డబ్బులు పడ్డాయో ఒక్కసారి ఖాతాలను పరిశీలిస్తే తేడా మీకే తెలుస్తుంది. మన ప్రభుత్వం వచ్చాక నేతన్న నేస్తం ద్వారానే రూ.970 కోట్లు 1.06 లక్షల మందికి అందచేశాం. 94,410 చేనేత కుటుంబాలు ఆత్మగౌరవంతో ఇంటివద్దే పెన్షన్ అందుకున్నాయి. నేతన్నలకు 50 ఏళ్లకే పెన్షన్ అందిస్తున్న పరిస్థితి వచ్చిందంటే దివంగత నేత వైఎస్సార్ చలువే. తొలిసారిగా చేనేత వస్త్రాలకు అంతర్జాతీయ మార్కెటింగ్ సౌకర్యం కల్పించింది మన ప్రభుత్వమే. అమెజాన్, మింత్ర, ఫ్లిప్‌కార్ట్, మీరా, పేటీయం లాంటి సంస్థలతో ఒప్పందాలు చేసుకుని వారి ఫ్లాట్‌ఫామ్స్‌లో మన వస్త్రాలను చేర్చాం. మనం రాకముందు ఆప్కో బకాయిలే రూ.120 కోట్లు ఉంటే వాటిని క్లియర్ చేయడమే కాకుండా రూ.469 కోట్లు ఆప్కోకు ఇచ్చి చేనేతలకు ఆదుకున్నాం. విద్యాకానుక ద్వారా 44 లక్షల మంది స్కూలు పిల్లలకు యూనిఫాం అందిస్తుండగా తొలి ప్రాధాన్యతగా చేనేతకారులకే ఆర్డర్లు ఇవ్వాలని ఆదేశించాం.

బీసీల కోటలో బాబు కుటుంబం తిష్ట

చేనేతకారులు అధికంగా ఉండే మంగళగిరి ప్రాంతంలో వారికి రాజకీయంగా కూడా పెద్దపీట వేశాం. స్థానిక ఎమ్మెల్యే ఆర్కేను పిలిచి మాట్లాడి నా చేనేత చెల్లెమ్మకు సీటు ఇచ్చేందుకు సహకరించాలని కోరా. ఆర్కే కూడా మంచి మనసుతో తాను సిద్ధంగా ఉన్నానంటూ ముందుకొచ్చాడు. లావణ్యమ్మకు మంగళగిరిలో, బుట్టమ్మకు ఎమ్మిగనూరులో ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చాం. సునీతమ్మ, హనుమంతన్న ఎమ్మెల్సీలుగా ఉన్నారు. ప్రొద్దుటూరు, రాయదుర్గం, వెంకటగిరి, ఎమ్మిగనూరు, జగ్గయ్యపేట, చీరాల, ధర్మవరం, పెడన లాంటి 8 చోట్ల మున్సిపల్ చైర్మన్లుగా ఉన్నది నేతన్నలే. దీనికి కారణం మీ బిడ్డ రూల్ తెచ్చాడు కాబట్టే. ఒకవైపు మీ బిడ్డ చేనేతకారులకు రాజకీయంగా ప్రాధాన్యం కల్పిస్తూ అడుగులు వేస్తుంటే మరోవైపు చంద్రబాబు ఆయన కుమారుడు ఏం చేస్తున్నారు? బీసీలు ఎక్కువగా ఉన్నచోట్ల కూడా వారికి సీట్లు ఇవ్వకుండా ఆ స్థానాల్లో తిష్ఠ వేసి రూ.కోట్లు వెదజల్లుతున్నారు. కుప్పంలో బీసీలే ఎక్కువ. చంద్రబాబు బీసీల కోటలో పాగా వేసి డబ్బులతో నెగ్గేందుకు ప్రయత్నిస్తున్నాడు. మీ బిడ్డ మాత్రం కుప్పంలో బీసీనే నిలబెట్టాడు. చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా 175 అసెంబ్లీ, 25 ఎంపీ సీట్లు కలిపి మొత్తం 200 స్థానాలకుగానూ 50 శాతం అంటే 100 సీట్లు నా ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, మైనార్టీలకే కేటాయించి సామాజిక సాధికారతపై చిత్తశుద్ధి చాటుకున్నాం.

మంగళగిరికి మంచి జరిగిందిలా..

మంగళగిరి నియోజకవర్గంలో 1,20,187 ఇళ్లు ఉండగా 1,08,408 ఇళ్లు అంటే 90.1 శాతం గృహాలకు లబ్ధి చేకూర్చాం. నా అక్కచెల్లెమ్మల కుటుంబాల ఖాతాల్లోకి రూ.1,530 కోట్లు జమ చేశాం. మంగళగిరి నియోజకవర్గంలో నెలకొల్పిన 83 సచివాలయాల్లో ఈ వివరాలను పారదర్శకంగా ప్రదర్శించాం. ఇక నాన్ డీబీటీతో మరో రూ.735 కోట్ల మేర ప్రయోజనం చేకూర్చాం. అంటే మొత్తం రూ.2,265 కోట్లు మేర మేలు చేశాం. ఇవన్నీ ఎందుకు చెబుతున్నానంటే మన అభ్యర్థి లావణ్యమ్మ దగ్గర చంద్రబాబు కుమారుడి వద్ద ఉన్నంత డబ్బులు లేవు. ఎన్నికలొచ్చేసరికే ఆయన ఓటుకు రూ.4 వేలు, రూ.5 వేలు, రూ.6 వేలు అంటాడు. ఇస్తే తీసుకోండి. ఓటు వేసేటప్పుడు మాత్రం ఒక్కటి గుర్తుపెట్టుకోండి. మళ్లీ ప్రతి ఏడాది నేతన్న నేస్తం ఇచ్చే వారికే ఓటు వేయండి. ఎవరు ఉంటే మన పిల్లల చదువులు, బడులు, హాస్పిటళ్లు బాగుంటాయో వారికే ఓటేయండి. ఎవరు ఉంటే పేదవాడు అప్పుల పాలు కాకుండా వైద్యం అందుతుందో, మన ఇంటికే పెన్షన్ డబ్బులు నడుచుకుంటూ వస్తాయో ఆలోచించి ఓటేయండి. ఎవరు ఉంటే అక్కచెల్లెమ్మల ముఖాల్లో చిరునవ్వులు విరబూస్తాయో వారికే ఓటు వేయాలని కోరుతున్నా.

చేయగలిగిందే చెబుతాం..

మన ప్రభుత్వం ఏదైతే చేయగలుగుతుందో అది మేనిఫెస్టోలో క్లియర్‌గా చెబుతాం. అబద్ధాలాడటం తప్పు. మేనిఫెస్టో హామీల్లో 99 శాతం నెరవేర్చి ఈ రోజు మళ్లీ మీ ఆశీస్సులు కోరుతున్నాం. నేతన్నలకు ఏటా రూ.24 వేలు చొప్పున ఐదేళ్లలో రూ.1.20 లక్షలు అందిస్తున్నాం. ఈ డబ్బులతో ఎవరైనా మగ్గం కొనుక్కోవచ్చు. ఇంట్లో మగ్గం పెట్టుకోవచ్చు. మీరు కోరుతున్నట్లుగా అద్దె మగ్గందారులకూ ప్రయోజనాలు అందించాలని నాకూ ఉంది. కానీ అలా చేయగలుగుతామా? ఎందుకంటే అద్దె మగ్గంలో ఎవరు ఉంటున్నారో, ఎవరు వాడుకుంటున్నారో ఎలా చెప్పగలం? ఈరోజు ఒకరు ఉంటారు.. రేపు మరొకరు ఉండవచ్చు. ఏది చేసినా పారదర్శకంగా ఉండాలి. మన పాలసీ ఏమిటంటే.. ఏ పార్టీవారైనా సరే అర్హత ఉంటే పారదర్శకంగా లబ్ధి చేకూర్చాలి.

ఆదుకుని ఆదరించారు...



చేనేత వృత్తిని గత ప్రభుత్వాలు గుర్తించలేదు. దివంగత వైఎస్సార్ మాత్రమే చేనేతకారులకు 50 ఏళ్లకే పెన్షన్ సదుపాయం, ఆప్కోస్ ద్వారా సబ్సిడీలు కల్పించారు. సీఎం జగనన్న ఎక్కడా లేనివిధంగా చేనేతలకు ఏటా రూ.24 వేలను సాయంగా అందిస్తున్నారు. నవరత్నాల సంక్షేమాల్లో అగ్రభాగం అందుకుంటున్నది మన చేనేతలే. టీడీపీ హయాంలో చేనేతలను నట్టేట్లో ముంచితే ఆప్కోను ఆదుకుని రూ.180 కోట్లు అందించారు. కరోనా కష్టకాలంలో రెండుసార్లు రూ.24 వేలు ఇచ్చారు. మనకు జగనన్న లాంటి నాయకుడు ఉండటం ఎంత అవసరమో అందరూ ఆలోచన చేయాలి. మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థిగా పద్మశాలి సోదరి లావణ్యను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి.

– జింకా విజయలక్ష్మి, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్

నేతన్నల జీవితాలను బాగు చేశారు..



మంగళగిరిలో తయారయ్యే చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉంది. వైఎస్సార్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రోశయ్యను, నన్ను పిలిచి చేనేత పరిశ్రమ గురించి ఆరా తీశారు. రంగులు, రసాయనాల వల్ల త్వరగా వృద్ధాప్యం బారిన పడుతున్న చేనేతకారులకు 50 ఏళ్లకే పెన్షన్ అందించేలా నిర్ణయం తీసుకున్నారు. మేం కోరిన మరో 17 డిమాండ్లు కూడా నెరవేర్చారు. చేనేతల థ్రిఫ్ట్ ఫండ్‌ను రెట్టింపు చేసి 16%కి పెంచారు. చంద్రబాబు ప్రభుత్వం రిబేట్‌ను తొలగిస్తే వైఎస్సార్ పునరుద్ధరించారు. డైస్, కెమికల్స్‌పై సబ్సిడీ ఇచ్చారు. రూ.100 కోట్లు ఆప్కోకి విడుదల చేయడంతో చేనేత పరిశ్రమ నిలబడింది. మంగళగిరిలో ఇళ్లులేని చేనేత కార్మికుల కోసం 25 ఎకరాలు ఇచ్చారు. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చాక 150 మంది మగ్గాలకు షెడ్లు వేశాం. నవరత్నాల్లో భాగంగా చేనేతకారులకు ఏటా రూ.24 వేలు చొప్పున అందిస్తున్నారు. చేనేత కార్మికుల జీవితాలను బాగుచేసింది నాడు వైఎస్సార్ అయితే నేడు వైఎస్ జగన్ మాత్రమే. ఆప్కోకి రూ.100 కోట్లు రిలీజ్ చేశారు. మంగళగిరిలో మార్కెటింగ్ సౌకర్యం కోసం రూ.3 కోట్లతో 40 షాపులను నిర్మించారు.

– మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్సీ

షెడ్లు వేయించారు



జగనన్న మా చేనేతలకు షెడ్లు వేశారు. నాకు చేయూత వస్తోంది. మావారికి పెన్షన్ ఇస్తున్నారు. నేతన్న నేస్తం ఇప్పిస్తామని ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్న చెప్పారు.

– నందం దుర్గ, చేనేత మహిళ

అధైర్యపడవద్దు.. అండగా ఉంటా

అనారోగ్య సమస్యలు విన్నవించుకున్న బాధితులకు సీఎం భరోసా

పెదకాకాని: మేమంతా సిద్ధం బస్సు యాత్ర చేస్తున్న సీఎం జగన్ శనివారం తనను కలిసిన పలువురు బాధితులకు నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. వారి సమస్యలను సావధానంగా విని.. 'అధైర్యపడవద్దు.. అండగా ఉంటా'నంటూ వారి కన్నీళ్లు తుడిచారు. గుంటూరు రూరల్ మండలం చౌడవరం గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ పార్వతి తన కుమార్తె డింపుల్‌తో కలిసి సీఎం జగన్‌ను కలిశారు. తన కుమార్తె వినికిడి లోపంతో బాధపడుతోందని.. మాటలు కూడా రావని.. చికిత్సకు సాయమందించాలని పార్వతి కోరగా.. సీఎం జగన్ ఆదుకుంటానంటూ భరోసా ఇచ్చారు. పాపకు దివ్యాంగ పింఛన్ వస్తుందా అని ఆరా తీశారు. సర్జరీ చేయించడంతో పాటు వినికిడి మిషన్ ఉచితంగా అందజేస్తానని భరోసా ఇచ్చారు.

రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి..

'నా బిడ్డకు రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయి.. ఆదుకోండయ్యా' అంటూ గుంటూరు జిల్లా కొప్పురావూరుకు చెందిన గోపాలం సుజాత తన కుమార్తె సౌజన్యతో కలిసి నంబూరు అడ్డరోడ్డు వద్ద సీఎం వైఎస్ జగన్‌ను కలిసింది. సీఎం జగన్ వారిని ఓదార్చి.. ప్రభుత్వం నుంచి పింఛన్ అందుతుందా అని ఆరా తీశారు. సమస్య తెలిసి నాలుగు నెలలవుతుందని వారు బదులివ్వగా.. వెంటనే పింఛన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. తెలిసిన వారు ఎవరైనా కిడ్నీ ఇస్తామంటే ఆరోగ్యశ్రీ ద్వారా సర్జరీ చేయిస్తానని హామీ ఇచ్చారు. కిడ్నీ దానం చేసిన వారికి ప్రభుత్వం నుంచి రూ.5 లక్షలు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు.


తల్లితో కలిసి సీఎం జగన్‌ను కలిసిన డింపుల్


సీఎం జగన్‌ను కలిసిన కొప్పురావూరు వాసులు

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి



చేనేత కార్మికులకు 100 యూనిట్లు ఉచితంగా విద్యుత్ ఇస్తే ఎంతో మేలు జరుగుతుంది. రత్నాలచెరువు ప్రాంతంలో చాలామంది అద్దె మగ్గాలతో నేత పనులు చేస్తున్నారు. వారికి కూడా సాయం చేయాలని కోరుతున్నా. మాకూ ఇళ్ల పట్టాలు ఇవ్వాలి.

– కొండేటి కుమారి, చేనేత మహిళ, రత్నాలచెరువు, మంగళగిరి

సీఎం వైఎస్ జగన్ దీనికి సమాధానం ఇస్తూ... 'మంగళగిరి నియోజకవర్గంలో లే అవుట్లు రూపొందించి 54 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే ఆ అక్కచెల్లెమ్మలు జగన్‌ను ఎక్కడ గుండెల్లో పెట్టుకుంటారో అనే భయంతో చంద్రబాబు, లోకేష్ కోర్టుకు వెళ్లి కులాల మధ్య సమతుల్యం దెబ్బతింటుందంటూ కేసులతో అడ్డుపడ్డారు. మీ బిడ్డ సుప్రీం కోర్టుకు వెళ్లి మరీ పోరాటం చేయడంతో ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇళ్ల పట్టాలిచ్చి ఇళ్లు కూడా శాంక్షన్ చేయించాం. కట్టడం ప్రారంభించే సమయానికి చంద్రబాబు మళ్లీ సుప్రీం కోర్టుకు వెళ్లి కేసు వేయడంతో మేటర్ హియరింగ్ కోసం పోస్ట్ పోన్ చేస్తోంది. ప్రతి అక్కచెల్లెమ్మ చేతిలో రూ.10 లక్షల నుంచి రూ.15 లక్షల విలువ చేసే ఆస్తిని పెడుతుంటే అడ్డుకున్నది చంద్రబాబు, లోకేష్' అని పేర్కొన్నారు.

చేనేతల కోసమే లావణ్యకు టికెట్
సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: బీసీలు ఎక్కువ ఉన్న చోట్ల కూడా చంద్రబాబు, ఆయన కుమారుడే పోటీ చేస్తున్నారని సీఎం జగన్ మండిపడ్డారు. మంగళగిరిలో చేనేతలు ఎక్కువ కనుక.. తాము మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చామని చెప్పారు. ఈ తేడాను గమనించాలని ప్రజలను కోరుతూ సీఎం జగన్ శనివారం ట్వీట్ చేశారు. 'మంగళగిరిలో చేనేతలు ఎక్కువ.. అందుకే ఆళ్ల రామకృష్ణారెడ్డితో మాట్లాడి చేనేత కుటుంబానికి చెందిన నా చెల్లెమ్మ మురుగుడు లావణ్యకు టికెట్ ఇచ్చాం. మరోవైపు చంద్రబాబు, ఆయన కొడుకు ఏం చేస్తున్నారు? బీసీలు ఎక్కువగా ఉన్న ఈ ప్రాంతంలో వాళ్లే నిలబడి రూ.కోట్లకు కోట్లు డబ్బు ఖర్చు చేస్తున్నారు. కుప్పంలోనూ బీసీలు ఎక్కువ. అయినా అక్కడ కూడా ఇదే పరిస్థితి. తేడా గమనించాలని కోరుతున్నాను' అంటూ శనివారం సీఎం జగన్ సామాజిక మాధ్యమం ఎక్స్(ట్విట్టర్)లో పోస్టు చేశారు.


ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన ఆడిటర్ రామరాజు శ్రీనివాస్, చందు సాంబశివరావు, వీరశెట్టి సుబ్బారావు, టీవీ రావు, యార్లగడ్డ వెంకటరమణ, జియావుర్ రెహమాన్

సీఎం సమక్షంలో వైఎస్సార్‌సీపీలోకి ముఖ్య నేతలు

వైఎస్సార్‌సీపీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్

- పార్టీలో చేరిన వారిలో జనసేన రాష్ట్ర కన్వీనర్ వీరశెట్టి సుబ్బారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, టీడీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ అజయ్‌బాబు, కాంగ్రెస్ గుంటూరు నగర అధ్యక్షుడు షేక్ ఉస్మాన్ తదితరులు

సాక్షి, అమరావతి: టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన పలువురు ముఖ్య నాయకులు శనివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా గుంటూరు జిల్లా నంబూరు బైపాస్ స్టే పాయింట్ వద్ద ఉన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పు, ప్రత్తిపాడు, మంగళగిరి నియోజకవర్గాలకు చెందిన టీడీపీ, బీజేపీ, జనసేన, కాంగ్రెస్ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సీఎం జగన్ వారికి కండువాలు వేసి సాదరంగా వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానించారు. జనసేన రాష్ట్ర కన్వీనర్ వీరశెట్టి సుబ్బారావు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చందు సాంబశివరావు, బీజేపీ స్టేట్ కో–కన్వీనర్ డాక్టర్ టీవీ రావు, టీడీపీ గుంటూరు జిల్లా కన్వీనర్ బైరా అజయ్‌బాబు, టీడీపీ కార్మిక సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు నాగగౌడ్, మైనార్టీ నేత షేక్ షాజిత్ వైఎస్సార్‌సీపీలో చేరారు. అలాగే గుంటూరు నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, 2019లో గుంటూరు తూర్పు జనసేన అభ్యర్థి, ముస్లిం ఐక్యవేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు షేక్ జియావుర్ రెహ్మాన్, ప్రత్తిపాడు నియోజకవర్గానికి చెందిన జనసేన నాయకులు డాక్టర్ కె.శివకుమార్, కె.నాగరాజు, కందుల రాజా, భరత్, సునీల్‌రెడ్డి, మంగిరెడ్డి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. గుడివాడకు చెందిన ఎన్ఆర్ఐ, తానా ఫౌండేషన్ చైర్మన్ యార్లగడ్డ వెంకటరమణ కూడా సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీ కండువా కప్పుకున్నారు. మంగళగిరి నియోజకవర్గానికి చెందిన టీడీపీ సీనియర్ నేత, మార్కెటింగ్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.రఘుపతిరావు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ టి.సురేంద్ర కుమార్, కాపు సంఘం యువజన విభాగం అధ్యక్షుడు పెండ్యాల వెంకటరమణ వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో గుంటూరు లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కిలారి రోశయ్య, ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బాలసాని కిరణ్‌కుమార్, మంగళగిరి అభ్యర్థి మురుగుడు లావణ్య, వైఎస్సార్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు పి.గౌతమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ జిల్లా సిద్ధమా?

వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన మేమంతా సిద్ధం బస్సు యాత్ర శనివారం ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా 'ఎన్టీఆర్ జిల్లా సిద్ధమా? అంటూ సీఎం జగన్ ట్వీట్ చేశారు.

– సాక్షి, అమరావతి

నేడు బస్సు యాత్రకు విరామం

విజయవాడలో సింగ్‌నగర్ డాబా కొట్ల సెంటర్‌లో టీడీపీ మూకల దాడిలో సీఎం జగన్ ఎడమ కంటి కనుబొమ్మపై బలమైన గాయం కావడంతో వైద్యుల సలహా మేరకు ఆదివారం మేమంతా సిద్ధం బస్సు యాత్రకు విరామం ప్రకటించారు. తదుపరి షెడ్యూల్‌ను ఆదివారం ప్రకటిస్తామని వైఎస్సార్‌సీపీ వెల్లడించింది.

– సాక్షి, అమరావతి


ఖాజ: సీఎం జగన్ అభిమానులు, పార్టీ శ్రేణులతో నిండిపోయిన టోల్ ప్లాజా ప్రాంతం


ఖాజ: అభిమానికి ఆటోగ్రాఫ్..



విజయవాడ: కనకదుర్గ వారధిపై అశేష జనవాహిని

విజయవాడ: జోరువానలో యువకుల హుషారు...





తాడేపల్లి: జనం మధ్యలో నిలబడి సీఎం జగన్‌ను చూసిన ఆనందంలో ఆయన సతీమణి వైఎస్ భారతీరెడ్డి

కృష్ణా తీరం..

పోటెత్తిన జనప్రవాహం

విజయవాడలో 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు జననీరాజనం





విజయవాడ: కృష్ణలంక నుంచి పశువుల ఆసుపత్రి వైపు వెళ్లే వంతెన వద్ద సీఎం జగన్ బస్సుయాత్రకు తరలివచ్చిన జనసందోహం, సింగ్‌నగర్ ప్రాంతంలో బస్సుయాత్రకు హాజరైన జనసందోహానికి సీఎం జగన్ అభివాదం

(మేమంతా సిద్ధం బస్సుయాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

ఆకాశం నిప్పులు చిమ్మినా.. మేఘాలకు చిల్లులు పడినా.. నీపై మా అభిమానం తగ్గదు అన్నా.. నింగి, నేల ఉన్నంతకాలం నీతోనే మేమంతా జగనన్నా.. అంటూ సీఎం వైఎస్ జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గుంటూరు ప్రజల ఘాటైన ప్రేమాభిమానాలను గుండెల నిండా నింపుకుని.. ఎన్టీఆర్ జిల్లా వాసుల ఆప్యాయతలను పంచుకోవడానికి సీఎం వైఎస్ జగన్ బస్సుయాత్ర శనివారం ఎన్టీఆర్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ రెండు జిల్లాలనూ కలిపే కనకదుర్గ వారధి జన ప్రవాహంతో పోటెత్తింది. అడుగుతీసి అడుగువేయలేనంతగా ప్రజలతో నిండిపోయింది.

గుండెల్లో నింపుకున్న గుంటూరు..

గుంటూరు జిల్లా నంబూరు బైపాస్‌లో రాత్రి బస వద్ద మంగళగిరి, పొన్నూరు, ప్రత్తిపాడు, గుంటూరు పశ్చిమ, గుంటూరు తూర్పుతో పాటు గుంటూరు జిల్లాకు చెందిన పలువురు నేతలు జగన్‌ను కలిశారు. పార్టీ నేతలు, సీనియర్ కార్యకర్తలను పేరుపేరునా పలకరిస్తూ సీఎం జగన్ వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం అక్కడి నుంచి ఉ.10.13 గంటలకు మేమంతా సిద్ధం బస్సుయాత్ర ప్రారంభమైంది. జననేత రాక కోసం అప్పటికే జాతీయ రహదారి అభిమానులతో నిండిపోయింది. రహదారికి రెండువైపులా జగన్ రాకకోసం ప్రజలు ఉత్సాహంతో ఎదురుచూశారు. అల్లంత దూరాన సీఎం జగన్ బస్సును చూడగానే ఒక్కసారిగా పరుగు పరుగున ఎదురెళ్లారు. జగనన్నా.. అంటూ బిగ్గరగా నినదిస్తూ.. చేతులు ఊపుతున్న అభిమానులను చూసి జగన్ ప్రతిగా అభివాదం చేశారు. దారిపొడవునా తనకు ఎదురొస్తున్న జన ప్రవాహానికి అభివాదం చేస్తూ.. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ జగన్ బస్సుయాత్ర ముందుకు సాగింది. కంతేరు అడ్డరోడ్డులో అక్కడి గ్రామస్తులు జగన్‌కు గజమాలతో స్వాగతం పలికారు. ఆ తర్వాత చినకాకాని వద్ద మహిళలు వైఎస్సార్‌సీపీ జెండాలతో ఎదురొచ్చారు. వారిని చిరునవ్వుతో పలకరించి కాజా టోల్‌ప్లాజా వద్దకు వచ్చేసరికి ఆ ప్రాంతమంతా అభిమానుల కోలాహలంతో నిండిపోయింది. స్థానికులు భారీ గజమాలతో జగన్‌పై తమకున్న అభిమానాన్ని చాటుకున్నారు. వారిచ్చిన ఆప్యాయతను అందుకుని ఎస్‌ఆర్ఐ సర్కిల్ మీదుగా మంగళగిరి చేరుకున్నారు. హైవేపై బారులు తీరిన జనం జగన్‌కు జేజేలు పలికారు. వారికి అభివాదం చేస్తూ సీకే కన్వెన్షన్ సెంటర్‌కు చేరుకున్న సీఎం అక్కడ చేనేత కార్మికులతో ముఖాముఖి నిర్వహించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ప్రజల మధ్య భారతమ్మ..

శనివారం మధ్యాహ్నం భోజన విరామం అనంతరం తాడేపల్లి జంక్షన్‌కు చేరుకున్న బస్సుయాత్రలో అరుదైన దృశ్యం ఆవిష్కృతమైంది. సీఎం వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతమ్మ బస్సుయాత్రగా వస్తున్న సీఎం జగన్‌కు రోడ్డుపై నిలబడి అభివాదం చేశారు. ప్రజలు, అభిమానుల మధ్య తానూ ఓ సామాన్యురాలిగా చిరునవ్వుతో జగన్‌కు చేతులు ఊపారు. ప్రతిగా సీఎం జగన్ కూడా బస్సులో నుంచే భారతికి అభివాదం చేశారు. మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీసి, హారతులిచ్చారు. అనంతరం మణిపాల్ ఆసుపత్రి జంక్షన్‌కు భారీగా చేరుకున్న అభిమానులు మళ్లీ రా.. అన్నా అంటూ వీడ్కోలు పలికారు.

కనకదుర్గ వారధిపై జనప్రవాహం..

ఇక గుంటూరు జిల్లా నుంచి జగన్ బస్సుయాత్ర వస్తోందని తెలిసి ఎన్టీఆర్ జిల్లా ప్రజలు, పార్టీ అభిమానులు జగన్‌కు స్వాగతం పలికేందుకు కనకదుర్గ వారధిపైకి భారీగా తరలివచ్చారు. వర్షంలోనే గుంటూరు జిల్లా ఘనంగా వీడ్కోలు పలుకగా, ఎన్టీఆర్ జిల్లా ఆత్మీయంగా స్వాగతం చెప్పింది. దుర్గమ్మ నీడలో.. కృష్ణమ్మ సాక్షిగా.. కనకదుర్గ వారధి జనప్రవాహంతో నిండిపోయింది. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా వైఎస్ జగన్ ఇదే వారధిపై పాదయాత్ర చేసిన రోజులను ఈ సందర్భంగా అభిమానులు గుర్తుచేసుకున్నారు. విజయవాడ వైఎస్సార్‌సీపీ నేతలు వెంటరాగా సీఎం జగన్ 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర సా.5.38 గంటలకు వారధి దాటింది.

విజయవాడలో జనజాతర..

నగర చరిత్రలోనే మునుపెన్నడూ లేనంతగా అభిమాన నాయకుడి ఆగమనంతో విజయవాడ నగరం జనజాతరను తలపించింది. మహిళలు, చిన్నారుల కోలాటాలు, స్టిక్ వాకర్స్, డప్పులు, వాయిద్యాలు, బటర్‌ఫ్లై వేషధారణలు, శక్తి వేషాలు, కేరళ సంప్రదాయ నృత్యాలు, బాణాసంచా కాంతులు, డీజే సౌండ్లు, భారీ గజమాలలు, జగన్ నిలువెత్తు కటౌట్లు.. ఇలా ఒకటేమిటి.. దారిపొడవునా కోలాహలం కనిపించింది. వారధి దాటిన దగ్గర్నుంచీ అభిమానులు పోటెత్తడంతో బస్సుయాత్ర ముందుకు కదలడమే కష్టమైంది. అడుగడుగునా పూలవర్షం కురిపించారు. భవనాలన్నీ జనంతో నిండిపోయాయి. కృష్ణలంక సాయిబాబా గుడి నుంచి ప్రతిదారీ ప్రజాభిమానంతో కిక్కిరిసిపోయింది. యాత్ర బందరు రోడ్డు రమేష్ ఆస్పత్రి సెంటర్ నుంచి శిఖామణి సెంటర్‌కు చేరుకోగానే అత్యంత భారీ గజమాలతో అభిమానులు జగన్‌కు స్వాగతం పలికారు. అక్కడి నుంచి మెట్రో సెంటర్, చుట్టుగుంట, రోశయ్యపాలెం, సత్యనారాయణపురం, సింగ్‌నగర్ డాబాకోట్లు సెంటర్ వరకూ ఇసుకేస్తే రాలనంత జనం బస్సుయాత్ర వెంట నడిచారు. సింగ్‌నగర్ వంతెనపైకి చేరుకోగానే మహిళలు గుమ్మడికాయలతో దిష్టితీశారు.

14వ రోజు

స్టార్ క్యాంపెయినర్‌లతో

సీఎం వైఎస్ జగన్

'మేమంతా సిద్ధం యాత్రలో 14వ రోజున నా స్టార్ క్యాంపెయినర్లతో..' అంటూ సీఎం వైఎస్ జగన్ శనివారం పలు ఫొటోలను ట్వీట్ చేశారు. ఓ మహిళ తన సమస్యలు చెప్పుకోగా.. సీఎం జగన్ ఆమె కన్నీటిని తుడిచి ఓదార్చారు. నేనున్నానంటూ భరోసా ఇచ్చారు. అలాగే ఓ వ్యక్తి సీఎం జగన్‌ను కలిసి తన అనారోగ్యం గురించి చెప్పి.. సాయం కోరగా.. ముఖ్యమంత్రి వెంటనే డాక్టర్ హరికృష్ణకు చెప్పి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఓ మహిళ సీఎం వద్దకు వచ్చి 'జగనన్న నేను బాగున్నాను. మీ పథకాలు చాలా బాగున్నాయన్నా' అంటూ తన ఆనందం వ్యక్తం చేశారు. - సాక్షి, అమరావతి





















విజయవాడ: సీఎం జగన్‌పై పూలవర్షం



విజయవాడ: సింగ్‌నగర్ ఫ్లై ఓవర్ వద్ద సీఎం జగన్‌కు హారతులతో మహిళల స్వాగతం



విజయవాడ: రోడ్ షోలో బాణసంచా వెలుగులు



విజయవాడ: శిఖామణి సెంటర్‌లో సీఎం జగన్ రోడ్ షోకు హాజరైన భారీ జనసందోహం



తాడేపల్లి: అవ్వను ఆత్మీయంగా పలకరిస్తూ..



తాడేపల్లి: దివ్యాంగ యువతి సమస్యలు తెలుసుకుంటూ...



ఖాజ టోల్ ప్లాజా: సీఎం జగన్‌తో ఓ మహిళ ఆత్మీయంగా...



నంబూరు: బస్సు యాత్రకు భారీగా తరలివచ్చిన అభిమానులు, పార్టీ శ్రేణులకు సీఎం జగన్ అభివాదం

క్లుప్తంగా...

మే 22 నుంచి ఇంటర్ ప్రవేశాలు

సాక్షి, అమరావతి : ఏపీలోని ఇంటర్ కళాశాలల్లో జూన్ 1 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని ఇంటర్మీడియట్ విద్యా మండలి కార్యదర్శి సౌరభ్ గౌర్ తెలిపారు. అన్ని కాలేజీల్లోను జనరల్, ఒకేషనల్ కోర్సులకు మే 15 నుంచి దరఖాస్తు చేసుకోవాలని, వీరికి అదే నెల 22వ తేదీ నుంచి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. సప్లిమెంటరీ విద్యార్థుల కోసం జూన్ 10 నుంచి రెండో దశ ప్రవేశాలు కల్పించాలన్నారు. ఈమేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కాలేజీల ప్రిన్సిపల్స్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

రూ.3.04 కోట్ల బంగారం, వెండి పట్టివేత

పిఠాపురం సమీపంలో గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద స్వాధీనం



పట్టుబడ్డ పార్శిళ్లను పరిశీలిస్తున్న అధికారులు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం సమీపంలోని గొల్లప్రోలు టోల్‌ప్లాజా వద్ద శనివారం రాత్రి అనుమతి పత్రాలు లేకుండా తరలిస్తున్న రూ.3.04 కోట్ల విలువైన బంగారం, వెండి వస్తువులను ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దీనిపై కేసు నమోదు చేయనున్నామని ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి నాయుడు వెంకటేశ్వరరావు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గొల్లప్రోలు టోల్‌గేట్ వద్ద ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో విశాఖ నుంచి కాకినాడ వెళ్తున్న సీక్వెల్ లాజిస్టిక్స్ వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా.. అందులో 13 పార్శిళ్లు కనిపించాయి. వాటిలో 11 పార్శిళ్లలో బంగారం, 2 పార్శిళ్లలో వెండి వస్తువులు ఉన్నాయి. బంగారం, వెండి వస్తువుల రవాణాకు సంబంధించి ఆ వాహనానికి సాధారణ అనుమతి మాత్రమే ఉంది. అయితే ఎన్నికల నియమావళి ప్రకారం ప్రత్యేక అనుమతి పత్రాలు లేవు. దీంతో ఆ వాహనాన్ని పిఠాపురం తహసీల్దార్ కార్యాలయానికి తరలించి, పూర్తి తనిఖీలు చేపట్టారు. వాహనంలోని బంగారం, వెండి వస్తువులను కాకినాడలోని నాలుగు జ్యుయెలరీ షాపులకు తీసుకుని వెళ్తున్నట్లు సమాచారం.

టీడీపీ 'ప్రచార మద్యం' పట్టివేత?

మామ అరెస్ట్.. అల్లుడు పరార్..

చిత్తూరు రూరల్: చిత్తూరు మండలం తాళంబేడు పంచాయతీ లక్ష్మీపురం గ్రామంలోని ఓ ఇంట్లో బీఎన్ఆర్‌పేట పోలీసులు కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికల ప్రచారంలో పంచేందుకు టీడీపీ నేతలే ఈ మద్యాన్ని తీసుకొచ్చి నిల్వ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వివరాల్లోకి వెళితే.. లక్ష్మీపురం గ్రామానికి చెందిన నాగరాజులు నాయుడు (62) అల్లుడు సురేంద్ర నాయుడు టీడీపీ ప్రచార సభకు వాహనం పెట్టాడు. ఈ నేపథ్యంలో నాగరాజులు నాయుడు ఇంటి షెడ్డులో శుక్రవారం కర్ణాటక మద్యం పట్టుబడడం సంచలనం రేపింది. 5 బాక్సుల బ్రాంది, ఒక బాక్సు అమృత్ సిల్వర్‌కప్ మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ రూ.36వేలు ఉంటుందని పోలీసులు అంచనా వేశారు. నాగరాజులునాయుడును అరెస్ట్ చేశామని, పరారీలో ఉన్న సురేంద్రనాయుడును త్వరలోనే అరెస్ట్ చేస్తామని బీఎన్ఆర్‌పేట ఎస్ఐ వెంకట సుబ్బమ్మ తెలిపారు.

ఇంటర్‌లో మాస్టర్‌మైండ్స్ విజయకేతనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫలితాల్లో మాస్టర్ మైండ్స్ విజయకేతనం ఎగురవేసినట్లు సంస్థ అడ్మిన్ అడ్వైజర్ మట్టుపల్లి మోహన్ శనివారం తెలిపారు. జూనియర్ ఇంటర్ ఎంఈసీలో జి.గిరీష్ 500 మార్కులకుగాను 492 మార్కులు సాధించినట్లు చెప్పారు. 491కి పైగా మార్కులు నలుగురు, 490 మార్కులు 15 మంది, 480 ఆపైన 176 మంది, 450కి పైగా మార్కులు 561 మంది విద్యార్థులు సాధించారని వివరించారు. అదే విధంగా సీనియర్ ఇంటర్‌లో ఎస్ఎస్ఎస్ హర్షతేజ వెయ్యి మార్కులకు 983 సాధించినట్లు తెలిపారు. 981కి పైగా ఐదుగురు, 970కి పైగా 63 మంది, 950కి పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 205 మంది ఉన్నారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు.

■ తెలంగాణ

170 రైల్వే స్టేషన్లలో 468 కూలర్లు

సాక్షి, హైదరాబాద్: వేసవిని దృష్టిలో పెట్టుకుని రైల్వే ప్రయాణికుల కోసం దక్షిణ మధ్య రైల్వే ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఈసారి ఎండ తీవ్రత ఎక్కువగా ఉంటుందని, వడగాడ్పుల ప్రభావం కూడా తీవ్రంగా ఉంటుందన్న హెచ్చరికల నేపథ్యంలో ప్రయాణికులకు చల్లటి తాగునీరు నిరంతరం అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేస్తోంది. దక్షిణ మధ్య రైల్వే జోన్ వ్యాప్తంగా 170 స్టేషన్లలో 468 చల్లటి తాగునీటిని అందించే కూలర్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేసింది. అంతకుముందు నుంచి ఉన్న తాగునీటి వ్యవస్థలో లోపాలు లేకుండా నిరంతరం పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేసింది. సరఫరా చేస్తున్న నీటి నాణ్యతను పరిశీలించేందుకు కూడా బృందాలను నియమించింది.

సర్కారు చేయూత..

చదువుల తల్లి కల సాకారం

- పేదరికంతో చదువుకు దూరమైన కర్నూలు జిల్లా బాలిక నిర్మల
- పదో తరగతిలో 537 మార్కులు సాధించినా ఆర్థిక పరిస్థితులతో చదువుకు దూరం
- తల్లిదండ్రులతో కలిసి కూలిపనులకు వెళ్తున్న బాలికకు అండగా నిలిచిన ప్రభుత్వం
- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే దృష్టికి సమస్య
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే చొరవతో కేజీబీవీలో చేర్పించిన కలెక్టర్ సృజన
- తాజాగా ఇంటర్ ఫలితాల్లో బైపీసీలో 440కి 421 మార్కులు సాధించిన నిర్మల
- చదువుల్లోనే కాదు ఆటల్లోనూ మేటి.. రాష్ట్ర స్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక
- ఐపీఎస్ సాధించడమే తన లక్ష్యమని వెల్లడి



గతేడాది జూన్‌లో పెద్దహరివాణంలో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'లో తన ఇంటికి వచ్చిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డితో చదువుకుంటానని చెబుతున్న విద్యార్థిని నిర్మల (ఫైల్)

ఆదోని రూరల్/ఆస్పరి: చదువుల్లో అత్యుత్తమంగా రాణిస్తున్న ఆ బాలికను పేదరికంతో తల్లిదండ్రులు చదువు మానిపించారు. ఆ చదువుల తల్లి పదో తరగతిలో 537 మార్కులు సాధించినా.. ఉన్నత చదువులు చదవాలనే ఆశ ఉన్నా.. ఆర్థిక పరిస్థితుల రీత్యా చదువుకు దూరమైంది. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన 'గడప గడపకు మన ప్రభుత్వం' ఆమెకు వరమైంది. ఈ కార్యక్రమంలో భాగంగా కర్నూలు జిల్లా ఆదోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సాయిప్రసాదరెడ్డి గతేడాది జూన్‌లో బాలిక ఇంటికి వచ్చారు. ఈ క్రమంలో తాను చదువుకుంటానంటూ బాలిక ఆయనకు మొరపెట్టుకోవడంతో ఎమ్మెల్యే ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన ప్రత్యేక చొరవ తీసుకున్నారు. బాలికను కర్నూలు జిల్లా ఆస్పరి కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం(కేజీబీవీ)లో చేర్పించారు. అడుగడుగునా ప్రభుత్వ ప్రోత్సాహం అందించడంతో తాజాగా విడుదలైన మొదటి ఏడాది ఇంటర్ ఫలితాల్లో బైపీసీ విభాగంలో 440 మార్కులకు 421 మార్కులు సాధించి ఆ బాలిక టాపర్‌గా నిలిచింది. 'కార్పొరేట్ కళాశాలల్లో చదివితేనే ఎక్కువ మార్కులు' అనే అపోహను తుడిచిపెట్టేసి ప్రభుత్వ విద్యాసంస్థలో చదివి అత్యుత్తమ మార్కులను సొంతం చేసుకుంది. వైఎస్ జగన్ ప్రభుత్వ ప్రోత్సాహంతో ఐపీఎస్ సాధించడమే లక్ష్యంగా ముందుకెళ్తోంది చదువుల తల్లి నిర్మల.

కూలి పనుల నుంచి కాలేజీకి పంపిన ప్రభుత్వం

కర్నూలు జిల్లా ఆదోని మండలం పెద్దహరివాణం గ్రామానికి చెందిన నిరుపేద దంపతులు హనుమంతమ్మ, శీనప్ప దంపతులకు నలుగురు ఆడపిల్లలు. ముగ్గురు కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి అత్తారింటికి పంపించారు. నాలుగో కుమార్తె నిర్మలను స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి వరకు చదివించారు. పదో తరగతిలో 600కి 537 మార్కులు సాధించి నిర్మల సత్తా చాటింది. అయితే నిరుపేద కుటుంబం కావడంతో ఉన్నత చదువులు చదివించేందుకు నిర్మల తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత సరిపోలేదు. దీంతో ఆమెను చదువు మానిపించి తమతోపాటే కూలిపనులకు తీసుకెళ్లారు. ఈ క్రమంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన.. 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా ఆదోని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, అధికారులు ఆమె ఇంటికి వెళ్లారు. ఈ క్రమంలో ఇంటిలోనే ఉన్న నిర్మల 'సార్ నేను చదుకుంటాను. నాకు సీటు ఇప్పించండి. మా అమ్మానాన్నలు పేదవాళ్లు. డబ్బులు పెట్టి చదివించలేని పరిస్థితి' అని వేడుకుంది. చలించిపోయిన ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి వెంటనే ఆమెను కాలేజీలో చేర్పించాలని అప్పటి ఎంపీడీవో గీతావాణి, తహసీల్దార్ వెంకటలక్ష్మిని ఆదేశించారు. మరోవైపు నిర్మలపై 'సాక్షి'లో కథనం రావడంతో కర్నూలు జిల్లా కలెక్టర్ సృజన నిర్మలను తన కార్యాలయానికి పిలిపించారు. నిర్మల ఉన్నత చదువులకు ప్రభుత్వం సాయం అందిస్తుందని చెప్పి ఆమెను ఆస్పరి కేజీబీవీలో చేర్పించారు. ప్రభుత్వం అండగా నిలవడంతో రూపాయి కూడా ఫీజు కట్టకుండానే నిర్మల చదువుకుంది. అంతేకాకుండా ఆమెకు మెటీరియల్, పుస్తకాలను కూడా కలెక్టర్ అందించారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఓవైపు చదువుల్లోనే కాకుండా మరోవైపు ఆటల్లోనూ నిర్మల రాణిస్తోంది. గతేడాది కబడ్డీ పోటీల్లో రాష్ట్ర స్థాయి జట్టుకు ఎంపికైంది. ఈ క్రమంలో నిర్మలను జిల్లా కలెక్టర్ సృజన ప్రత్యేకంగా అభినందించారు.

ఐపీఎస్ కావాలన్నదే నా జీవిత ఆశయం



ఎమ్మెల్యే సాయి ప్రసాద్‌రెడ్డితో పాటు జిల్లా కలెక్టర్ సృజన నన్ను ఎంతగానో ప్రోత్సహించారు. కలెక్టర్ మాటలను ఎప్పటికీ మర్చిపోలేను. నా చదువుకు మేడమ్ అన్నివిధాల సహకరిస్తున్నారు. ఐపీఎస్ కావాలన్నదే నా లక్ష్యం.

– నిర్మల, విద్యార్థిని

చాలా గర్వంగా ఉంది..

నిర్మల ఎంతో క్రమశిక్షణతో ఉంటుంది.. పాఠ్యాంశాలపై ఆసక్తి చూపుతోంది. స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ రూపకల్పన చేసిన పంచతంత్ర ప్రోగ్రామ్ ద్వారా డైలీ, వీక్లీ, గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నాం. నిరంతర మూల్యాంకనంతోపాటు విద్యార్థుల సందేహాలను నివృత్తి చేస్తున్నాం. ఈ టెస్టుల్లో నిర్మల మంచి మార్కులు తెచ్చుకుంది. ఆమె సాధిస్తున్న విజయాల పట్ల ఎంతో గర్వంగా ఉంది.

– శారున్ సైమ్లీ, ప్రిన్సిపాల్, కేజీబీవీ, ఆస్పరి, కర్నూలు జిల్లా

జగన్ రుణం తీర్చుకోలేనిది

రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు



రౌండ్‌టేబుల్ సమావేశంలో అంగిరేకుల ఆదిశేషు, దేవళ్ల రేవతి, తదితర నాయకులు

నరసరావుపేట: వచ్చే ఎన్నికల్లో పోటీచేసేందుకు ఓసీలు గెలిచే స్థానాల్లో 48మంది బీసీ అభ్యర్థులను నిలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బీసీలంతా మద్దతు పలకాలని రాష్ట్ర బీసీ వెల్ఫేర్ జేఏసీ అధ్యక్షుడు అంగిరేకుల ఆదిశేషు కోరారు. శనివారం బీసీ వెల్ఫేర్ జేఏసీ పల్నాడు జిల్లా శాఖ ఆధ్వర్యంలో వినుకొండరోడ్డులోని జూపల్లిసెంటర్ కాన్ఫరెన్స్‌హాలులో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా వచ్చిన ఆదిశేషు బీపీ మండల్ వర్ధంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బీసీలంతా ఐకమత్యంతో సంఘాలు, కులాలను పక్కనపెట్టి సీఎం జగన్ గెలుపునకు కృషి చేయాలని చెప్పారు.పల్నాడులో పార్లమెంటు అభ్యర్థిగా బీసీ ఎమ్మెల్యే డాక్టర్ పి.అనిల్‌కుమార్‌యాదవ్‌ను నిలబెట్టారని, ఇది బీసీల విజయమని చెప్పారు. వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50శాతంపై చిలుకు స్థానాలను కేటాయించి చరిత్రను సృష్టించారన్నారు. జంగం కార్పొరేషన్ చైర్మన్ ప్రసన్నా, ముదిరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ ఐయం.స్వామి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట అధ్యక్షుడు గూడూరు నాని, వెనుకబడిన సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు బత్తుల వెంకటేష్, బీసీ వెల్ఫేర్ జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సాంబశివరావు, నాయీ బ్రాహ్మణుల సంఘ జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యం నాయీ, బీసీ వెల్ఫేర్ సంఘం జిల్లా కార్యదర్శి బొందిలి శ్రీనివాససింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌డీఏ అంటే నారా డిజాస్టర్ అలయెన్స్

- 2014లో 650 హామీలిచ్చి పట్టించుకోని అట్టర్‌ఫ్లాప్ కూటమి ఇది
- టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి మోసాలను ఇంకా ప్రజలు మర్చిపోలేదు
- చెప్పుకోవడానికి చేసిందేమీ లేకే.. సీఎం జగన్‌పై విషం కక్కుతున్నారు
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి



సాక్షి, విశాఖపట్నం: జాతీయ స్థాయిలో ఎన్‌డీఏ అంటే నేషనల్ డెమోక్రటిక్ అలయెన్స్ అయితే... ఏపీలో మాత్రం నారా డిజాస్టర్ అలయెన్స్‌గా ప్రజలు అభివర్ణిస్తున్నారని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి అన్నారు. విశాఖ సిరిపురంలోని తన కార్యాలయంలో శనివారం వరుదు కల్యాణి మీడియాతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో 650 హామీలు ఇచ్చిన టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి ఒక్కటీ నెరవేర్చలేదనే విషయాన్ని ప్రజలు ఇంకా మరిచిపోలేదని, ఇది అట్టర్ ఫ్లాప్ కూటమి అని చెప్పారు. మళ్లీ అధికారం కోసం చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, పురందేశ్వరి ఒక కూటమిగా ఏర్పడి ప్రజలను మోసం చేసేందుకు కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు చెప్పుకోవడానికి ఆయన అధికారంలో ఉండగా ప్రజలకు చేసిన ఒక్క మంచి పనీ లేకపోవడంతోనే సీఎం వైఎస్ జగన్‌పై విషం కక్కుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. విశ్వసనీయత లేని టీడీపీ, జనసేన, బీజేపీ వంటి పార్టీలు ఎన్ని కలిసినా, నాయకులు ఎంతమంది ఏకమైనా ఓటమి తప్పదన్నారు. విశ్వసనీయతకు కేరాఫ్ అడ్రస్ అయిన సీఎం వైఎస్ జగన్‌తోనే ప్రజలంతా ఉన్నారని తెలిపారు. 'మేమంతా సిద్ధం' బస్సుయాత్రకు అన్ని ప్రాంతాల్లో ప్రజలు బ్రహ్మరథం పడుతుండటమే ఇందుకు నిదర్శనమన్నారు. ఈ ఎన్నికల్లో ప్రజాతీర్పుతో ఉండవల్లి కరకట్టమీద ఉన్న నారా వారి కబ్జా ప్యాలెస్ బద్దలవుతుందని, తెలుగుదేశం, బీజేపీ, జనసేన పార్టీల కార్యాలయాలు మూతపడక తప్పదని కల్యాణి పేర్కొన్నారు.

చంద్రబాబుకు జైలు తప్పదని పవన్ గ్రహించాలి

'పవన్ కళ్యాణ్ నిన్న మోదీ గ్యారెంటీ పేరిట ఒక ట్వీట్ చేశారు. అవినీతిపరుల్ని జైలుకు పంపడంలో మోదీ గ్యారెంటీ అయితే.. చంద్రబాబు కచ్చితంగా జైలుకు వెళతాడు. ఎందుకంటే గతంలో ఇదే ప్రధాని మోదీ ఏపీకి వచ్చినప్పుడు చంద్రబాబు కరప్షన్ కింగ్ అని.. పోలవరం ప్రాజెక్టును ఏటీఎంగా మార్చుకుని కేంద్రం పంపిన సొమ్మంతా దోచుకున్న దొంగ అని చెప్పారు. నాడు ఆయన అన్నమాటల ప్రకారం చంద్రబాబును ముందుగా జైలుకు పంపుతారని పవన్‌కళ్యాణ్ అర్థం చేసుకోవాలి' అని వరుదు కల్యాణి సూచించారు.

'జయహో జగన్' అంటూ నినదించిన మహిళా లోకం

విజయనగరంలో 8 వేల మంది మహిళల భారీ ర్యాలీ



విజయనగరంలో జయహో జగన్ అంటూ నినదిస్తున్న మహిళలు

విజయనగరం: మహిళా లోకం కదలి వచ్చింది. 'జయహో జగన్' అంటూ నినదించింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 58 నెలల పాలనలో తమకెంతో మేలు జరిగిందంటూ మహిళలు వివరించారు. వైఎస్సార్‌సీపీ విజయనగరం ఎమ్మెల్యే అభ్యర్థి కోలగట్ల వీరభద్రస్వామి, ఎంపీ అభ్యర్థి బెల్లాన చంద్రశేఖర్‌కు మద్దతుగా విజయనగరంలో శనివారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి మహిళా సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చేసిన కృషిని వివరించారు. వైఎస్సార్ కూడలి నుంచి కోట కూడలి వరకు సాగిన ర్యాలీలో సుమారు 8 వేల మంది మహిళలు పాల్గొన్నారు. ర్యాలీని ప్రారంభించిన రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ రీజినల్ కో-ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. మహిళలు తలెత్తుకుని జీవించేలా చేసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటేసి మరోసారి జగన్‌ను సీఎం చేసుకుందామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, విజయనగరం మేయర్ వి.విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పాల్గొన్నారు.

గ్రూప్-1 ప్రిలిమ్స్ ఫలితాలు విడుదల

▶ మొదటి పేజీ తరువాయి

కీలకమైన 81 గ్రూప్-1 పోస్టుల భర్తీకి ఏపీపీఎస్సీ గతేడాది డిసెంబర్ 8న నోటిఫికేషన్ విడుదల చేసింది. అభ్యర్థులకు 3 నెలలు సమయమిచ్చి ప్రిలిమ్స్‌ను మార్చి 17న రాష్ట్రంలోని 18 జిల్లాల్లో నిర్వహించగా, 91,463 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరయ్యారు. వీరికి మరో ఐదున్నర నెలల సమయం ఇచ్చి సెప్టెంబర్‌లో మెయిన్స్ నిర్వహిస్తారు. నోటిఫికేషన్‌లో పేర్కొన్న 81 పోస్టులకు అనంతరం మరో 8 పోస్టులను చేర్చడంతో గ్రూప్-1 పోస్టుల సంఖ్య 89కి పెరిగింది. ఇటీవల గ్రూప్-2 ఫలితాలను వెల్లడించిన ఏపీపీఎస్సీ 1:100 నిష్పత్తిలో 905 పోస్టులకు 92,250 మంది అభ్యర్థులను మెయిన్స్ కోసం ఎంపిక చేసింది. చరిత్రలో ఇంత మంది అభ్యర్థులకు అవకాశం కల్పించడం ఇదే తొలిసారి.

ఫలించని ఎల్లో బ్యాచ్ వ్యూహం

మార్చి 17న నిర్వహించిన గ్రూప్-1 ప్రిలిమ్స్‌ను అడ్డుకునేందుకు చంద్రబాబు బృందం చేయని ప్రయత్నం లేదు. దీనికోసం రాష్ట్రానికి ప్రధాని మోదీ వస్తున్న నేపథ్యంలో పరీక్షను వాయిదా వేయాలని కోర్టులో హౌస్ మోషన్ పిటిషన్ వేయించారు. ఈ ప్రయత్నం కూడా ఫలించకపోయేసరికి బాబుకు దిక్కుతోచలేదు. చివరికి 2018 గ్రూప్-1 పోస్టుల భర్తీపై ఎన్నోసార్లు ఢిల్లీ హైకోర్టు, సుప్రీంకోర్టులో కేసులు వేసి, ఓడిపోయిన అంశాన్ని తెరపైకి తెచ్చారు. ఏపీపీఎస్సీ నిర్వహించిన 2018 గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల్లో అక్రమాలు జరిగాయని పరీక్షను రద్దు చేయమని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుతో చంద్రబాబు చెలరేగిపోయారు. పరీక్షల్లో అక్రమాలు జరిగాయంటూ మీడియాకు స్క్రీన్ ప్రెజెంటేషన్ కూడా ఇచ్చారు. గత మూడేళ్లలో ఏపీపీఎస్సీ నిర్వహించిన అన్ని పరీక్షలను సకాలంలో నిర్వహించి, ముందే ప్రకటించిన షెడ్యూల్ మేరకు పోస్టులను భర్తీ చేసింది. అయినప్పటికీ ఏపీపీఎస్సీ ఇచ్చిన పలు నోటిఫికేషన్లు, పోస్టుల భర్తీని అడ్డుకునేందుకు చంద్రబాబు బృందం చేయని ప్రయత్నమంటూ లేదు. గత ఫిబ్రవరిలో గ్రూప్-2 ప్రిలిమ్స్‌ను అడ్డుకునేందుకు కోర్టుల్లో కేసులు వేశారు. అప్పటికే తన బృందంతో కేసులు వేయించి పరీక్షను రద్దు చేయించాలని యత్నించారు. ఆ చిక్కులను అధిగమించి ఏపీపీఎస్సీ ఫిబ్రవరి 25న గ్రూప్ 2 ప్రిలిమ్స్‌ను నిర్వహించింది. తాజాగా గ్రూప్-1 విషయంలోనూ తన కుట్రలు ఫలించకపోవడంతో బాబు కంగుతిన్నారు.

మళ్లీ జగనే అవసరం

- ఆయన గెలిస్తే ఏపీ మరో సింగపూర్‌గా మారుతుంది
- ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి జరిగింది
- దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా సంక్షేమం అందుతోంది
- ఏపీ ప్రభుత్వ పౌర సేవలు దేశానికే ఆదర్శం
- అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలన సీఎం జగన్‌ది
- బాబు హయాంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతమే
- 'జగన్ పాలన–ప్రవాసాంధ్రుల స్పందన'లో ఎన్ఆర్ఐలు
- విశాఖలో ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ రౌండ్‌టేబుల్ సమావేశం



'ఏపీ నీడ్స్ జగన్ ఎగైన్' అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ప్రవాసాంధ్రులు

సాక్షి, విశాఖపట్నం: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో గడిచిన ఐదేళ్లలో ఆంధ్రప్రదేశ్‌లో శరవేగంగా అభివృద్ధి జరిగింది. దేశంలో మరే రాష్ట్రంలోనూ లేని విధంగా సంక్షేమ పథకాలు అమలవుతున్నాయి. ఏపీ ప్రభుత్వ పౌర సేవలు దేశానికే ఆదర్శం. అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలన అందుతోంది. విద్య, వైద్య రంగాల్లో పశ్చిమ దేశాలకు దీటుగా ఏపీ అభివృద్ధి చెందింది. అందుకే ఆంధ్రప్రదేశ్‌కు మళ్లీ జగనే అవసరం. ఆయన గెలిస్తే ఏపీ మరో సింగపూర్‌గా మారుతుంది' అంటూ పలువురు ప్రవాసాంధ్రులు కొనియాడారు. ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 'జగన్ పాలన – ప్రవాసాంధ్రుల స్పందన' అనే అంశంపై శనివారం విశాఖలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో 15 దేశాల నుంచి 50 మందికి పైగా ప్రవాసాంధ్రులు ప్రత్యక్షంగా, మరికొన్ని దేశాల నుంచి వర్చువల్‌గా పాల్గొన్నారు. రాష్ట్రంలో సంక్షేమంపై ప్రవాసాంధ్రులు రూపొందించిన అభివృద్ధి నివేదికను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా పలువురు ప్రవాసాంధ్రులు మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రభుత్వ పాఠశాలల భవనాలు, వాటిలో మౌలిక సదుపాయాలు పశ్చిమ దేశాల్లో స్కూళ్లను తలపిస్తున్నాయని పేర్కొన్నారు. విలువైన ట్యాబ్‌లు, అత్యుత్తమ సిలబస్‌ను ఆ దేశాల్లో ఏ ప్రభుత్వమూ విద్యార్థులకు ఉచితంగా ఇవ్వడంలేదన్నారు. ఏపీలో మాత్రం లక్షలాది విద్యార్థులు వీటిని ఉచితంగా పొందుతున్నారన్నారు. సుమారు కోటీ నలభై లక్షల కుటుంబాలు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా వైద్య సదుపాయాలు పొందుతున్నాయని, ఇలాంటి సదుపాయం అగ్రదేశం అమెరికాలో కూడా లేదని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్ ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా 12 కోట్ల పౌర సేవలు అందడం విశేషమని చెప్పారు. ఈ ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని, సంక్షేమ పథకాలను ఏపీ ఎడిటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వీవీఆర్ కృష్ణంరాజు గణాంకాలతో సహా వివరించారు. సీఎం జగన్ రాష్ట్రంలో సుమారు 31 లక్షల మంది మహిళలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేశారని, వీటి విలువ రూ.7.75 లక్షల కోట్లని చెప్పారు. నిరుద్యోగం 4.5 శాతానికి తగ్గిందని, కొత్త పరిశ్రమల ద్వారా గతేడాది 14 లక్షల పీఎఫ్ ఖాతాలు కొత్తగా చేరాయని, 18 లక్షల మంది ఆదాయ పన్ను చెల్లింపుదార్లు పెరిగారని తెలిపారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రవాసాంధ్రులు ఏమన్నారంటే..

ముందు చూపు ఉన్న నేత జగన్

విద్యారంగంలో వైఎస్ జగన్ చేపట్టిన సంస్కరణలతో విద్యార్థులు ఏ రంగంలోనైనా రాణించే నైపుణ్యాన్ని సాధిస్తున్నారు. నైపుణ్య వనరులుంటే పెట్టుబడులకు ముందుకు వస్తారు. అలాంటి వనరులను సీఎం జగన్ ఏపీలో సమకూర్చారు. ఇలాంటి ముందు చూపు అంబేడ్కర్‌కే సొంతం. మళ్లీ ఇప్పుడు జగన్‌లో అంబేడ్కర్‌ను చూస్తున్నా. రాష్ట్రంలో రూ.10 వేల మెగావాట్ల విద్యుత్ ప్రాజెక్టులతో పాటు ఐటీ కంపెనీలు, అమెరికాలో మాదిరిగా రూ.2 వేల కోట్ల విలువైన ఎంఎస్ఎంఈలు వస్తున్నాయి. తీరప్రాంతంలో కొత్తగా పోర్టులు, హార్బర్లు నిర్మిస్తున్నారు.

– శివ, టెక్సాస్

స్వాతంత్య్రం వచ్చాక ఇంతలా అభివృద్ధి లేదు

వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఏపీలోకి చాలా పరిశ్రమలు వస్తున్నాయి. నాడు–నేడులో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా మారాయి. స్వాతంత్య్రం వచ్చాక రాష్ట్రంలో ఇంతలా అభివృద్ధి జరగలేదు. వైఎస్ జగన్‌కు మళ్లీ అవకాశం ఇస్తే ఈ అభివృద్ధి కొనసాగుతుంది. ఈ బాధ్యత రాష్ట్ర ప్రజలపై ఉంది.

– వెంకట్ కల్లూరి, కాలిఫోర్నియా

మరే నాయకుడైనా ఇలా పాలించాడా?

ఏపీలో నాడు–నేడుతో ప్రభుత్వ స్కూళ్ల రూపురేఖలు మారిపోయాయి. పేద విద్యార్థులను అమ్మ ఒడి ద్వారా ఆదుకుంటున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ఉన్నత విద్యకు దోహదపడుతున్నారు. మరే నాయకుడైనా ఇలా పరిపాలన చేశారా? ఏపీని ముందుకు తీసుకెళ్తున్న జగన్‌ను మరోసారి సీఎంగా ఎన్నుకోవాలి.

– కార్తీక్ ఎల్లాప్రగడ, నెదర్లాండ్స్

మహిళా సాధికారిత భేష్

ముఖ్యమంత్రి జగన్ మహిళా సాధికారితకు పెద్దపీట వేశారు. గతంలో ఎవరూ చేయని విధంగా అన్నింటా అవకాశాలు కల్పించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని వర్గాలకు ప్రయోజనం చేకూరుతోంది. ఉద్దానం సమస్యకు శాశ్వత పరిష్కారం చూపారు.

– పాలకుర్తి నీలిమ, యూఏఈ

అవినీతి గురించి విన్నామా?

విద్యావంతులు పుష్కలంగా ఉంటే పరిశ్రమలు వాటంతట అవే వస్తాయి. ఇప్పుడు రాష్ట్రంలో అదే పరిస్థితి ఉంది. గత టీడీపీ ప్రభుత్వం హయాంలో స్కాంలు, ఆశ్రిత పక్షపాతం గురించే వినే వాళ్లం. ఈ ఐదేళ్లలో ఒక్క అవినీతి గురించైనా విన్నామా? వలంటీర్ల వ్యవస్థతో ప్రజల వద్దకే పాలన అందుతోంది. ప్రజలకు మంచి చేసే ప్రభుత్వానికి మద్దతు అవసరం. సీఎంగా మళ్లీ జగన్‌నే గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత రాష్ట్ర ప్రజలకు ఉంది.

– వెంకట్ ఇక్కుర్తి, యూఎస్

సీఎం విప్లవాత్మక మార్పులు తెచ్చారు

వైద్య రంగంలో సీఎం విప్లవాత్మక మార్పులు తెచ్చారు. 17 మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేస్తున్నారు. వనరులు తక్కువ ఉన్నా కోవిడ్ సమయంలో సమర్థవంతంగా మరణాల సంఖ్యను బాగా తగ్గించగలిగారు. అగ్రదేశం అమెరికాలో సైతం ఇంతలా చేయలేకపోయారు. మరో పదేళ్లు వైఎస్ జగన్ సీఎంగా కొనసాగితే రాష్ట్రం మరింత అభివృద్ధి చెందుతుంది.

– డాక్టర్ పవన్ పాముకుర్తి, టెక్సాస్

సామాజిక న్యాయం చేసి చూపారు

సామాజిక న్యాయం నినాదం కాదు.. చేతల్లో చూపించారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్. అన్ని పార్టీలు ధనవంతులకే అవకాశాలు కల్పిస్తే.. జగన్ మాత్రం పేదలు, సామాన్యులకు టికెట్లు ఇచ్చారు. బీసీ ముస్లింను ఉప ముఖ్యమంత్రిని చేశారు. బీసీ ముస్లింలకు వైఎస్ రాజశేఖర్‌రెడ్డికంటే మిన్నగా ఆయన తనయుడు జగన్ ఎన్నో మేళ్లు చేస్తున్నారు.

–ఇలియాస్, కువైట్

ప్రతి స్కూలూ స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీనే

ఏపీ సీఎం జగన్ 40 వేల ప్రభుత్వ స్కూళ్లను అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ స్కూళ్లలో పేద, ధనిక తేడా లేకుండా అందరూ వారి పిల్లల్ని చదివించుకోవచ్చు. రాష్ట్రంలో ఇప్పుడు ప్రతి ప్రభుత్వ పాఠశాల స్టాట్యూ ఆఫ్ ఈక్వాలిటీగానే చెప్పవచ్చు. జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే మరిన్ని అద్భుతాలు జరుగుతాయి. ఆయన్నే మరోసారి గెలిపించుకోవలసిన బాధ్యత అందరికీ ఉంది.

– కోటిరెడ్డి, సింగపూర్

సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలిస్తోంది

ఏపీలో సంక్షేమం, అభివృద్ధి విశేషంగా జరిగింది. ఐదేళ్లలో రాష్ట్రంలో 280 కొత్త కంపెనీలు ఏర్పాటయ్యాయి. వీటి ద్వారా రూ.15 వేల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. రాష్ట్రంలో సచివాలయ వ్యవస్థ సత్ఫలితాలనిస్తోంది. ఆరోగ్యశ్రీ పరిమితి రూ.25 లక్షలకు పెంపు ఎంతో గొప్ప విషయం. కొత్తగా 4 లక్షల ఎంఎస్ఎంఈలు వచ్చాయి. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారు.

– వెంకట్ మేడపాటి, అమెరికా

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



పెనుగంచిప్రోలు/ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): గ్రామంలో వేంచేసిన శ్రీతిరుపతమ్మ వారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి శనివారం విజయవాడ, మొగల్రాజపురం ప్రాంతానికి చెందిన ఎస్.బాలకృష్ణ తన మనవడు, మనవరాలు కార్తీక్, మీనాక్షి పేరు మీద రూ.లక్ష విరాళం సమర్పించారు. ఈ విరాళం చెక్కును ఆలయ ఈఓ తిరుమలేశ్వరరావుకు అందజేశారు. గుంటూరు, నల్లచెరువు బొమ్మల సెంటర్, ఏటుకూరుకు చెందిన భక్తులు 290 గ్రాముల వెండి శఠగోపం, ఉద్ధరణి, గ్లాసు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి కిస్మత్‌పూర్‌కు చెందిన పాలవర్తి నరసింహారావు కుటుంబం రూ.లక్ష విరాళాన్ని అందజేసింది. అనంతరం నరసింహారావు కుటుంబ సభ్యులు అమ్మవారిని దర్శించుకున్నారు. దాతలకు ఆలయ అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

జైత్రయాత్రకు కృష్ణా సన్నద్ధం

- జిల్లాలో రేపు వైఎస్ జగన్ బస్సు యాత్ర
- గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల్లో రోడ్‌షో
- జననేత రాక కోసం ఎదురుచూస్తున్న ప్రజలు



గుడివాడలో మేమంతా సిద్ధం సభావేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, విజయవాడ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు కృష్ణాజిల్లా సన్నద్ధమైంది. ఎన్టీఆర్ జిల్లా సరిహద్దుల నుంచి బస్సు యాత్ర శనివారం రాత్రి కృష్ణా జిల్లాలోకి ప్రవేశించింది. వైఎస్సార్ సీపీ అధినేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'సిద్ధం' పేరుతో ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా నాలుగు ప్రాంతాల్లో భారీ బహిరంగ సభలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పాలనలో ప్రజలకు చేసిన మేలును వివరించారు. ప్రజల కోసం పనిచేస్తున్న తమ ప్రభుత్వంపై ప్రతిపక్షాల మూకుమ్మడి కుట్రలను ఎండగట్టారు. ఆ సభలు చరిత్రలో నిలిచేలా విజయవంతమైన విషయం తెలిసిందే. అదే ఉత్సాహంతో 'మేమంతా సిద్ధం' పేరిట ఇడుపులపాయ నుంచి ఇచ్ఛాపురం వరకు బస్సు యాత్రగా బయలుదేరారు. ఆయన రాక కోసం పార్టీ శ్రేణులు, అభిమానులు, లక్షలాది మంది ప్రజలు ఎదురుచూస్తున్నారు. యాత్రకు ఆదివారం విరామం ప్రకటించారు. సోమవారం ఉదయం బస్సు యాత్ర బయలుదేరి గన్నవరం, హనుమాన్‌జంక్షన్ మీదుగా గుడివాడ చేరుతుంది. గుడివాడ పట్టణంలోని నాగవరప్పాడు వైఎస్సార్ కాలనీ సమీపంలో 'మేమంతా సిద్ధం' బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు కృష్ణాజిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు చెందిన ప్రజలు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పెద్ద ఎత్తున ఏర్పాట్లు జరుగుతున్నాయి.

ఎదురు చూస్తున్న అభిమానులు

ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రచారానికి రావడంతో వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో కదనోత్సాహం కనిపిస్తోంది. గత ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా జిల్లాలో 16 స్థానాల్లో 14 స్థానాలను పార్టీ గెలుచుకుంది. ఐదేళ్లపాటు సంక్షేమం, అభివృద్ధి పాలన చూసిన ప్రజలు మరోసారి వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసేందుకు ఉత్సాహంగా ఉన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అన్ని స్థానాలను క్లీన్ స్వీప్ చేసే దిశగా వైఎస్సార్ సీపీ అడుగులు వేస్తోంది. ఈ తరుణంలో జననేత చేపట్టిన బస్సు యాత్ర జిల్లాలోకి ఎప్పుడొస్తుందా అని ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. వైఎస్ జగన్ బస్సు యాత్ర జరిగే మార్గంలో ఘన స్వాగతం పలికేందుకు గన్నవరం, గుడివాడ నియోజకవర్గాల అభిమానులు సిద్ధమయ్యారు. తమ అభిమాన నేత రాక కోసం వెయ్యి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

సజావుగా ఈవీఎంల కేటాయింపు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



ఈవీఎంల కేటాయింపు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ర్యాండమైజేషన్ ద్వారా తొలి విడత పార్లమెంటరీ, అసెంబ్లీ నియోజకవర్గాలకు ఈవీఎంల కేటాయింపు ప్రక్రియ సజావుగా జరిగినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన ర్యాండమైజేషన్ ప్రక్రియ గొల్లపూడిలోని ఈవీఎం గోడౌన్ వద్ద శనివారం కూడా కొనసాగింది. కలెక్టర్ ఢిల్లీరావుతోపాటు జేసీ సంపత్‌కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఇతర అధికారులతో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ర్యాండమైజేషన్‌లో నియోజకవర్గాలకు అనుసంధానమైన ఈవీఎంలను వేరు చేసి ప్రత్యేక నంబరింగ్ ఇవ్వడం, స్కానింగ్ చేయడం, బాక్సింగ్, తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్స్‌కు ట్రాన్స్‌పోర్టింగ్ ఇలా ప్రతి దశలోనూ అప్రమత్తంగా వ్యవహరించినట్లు తెలిపారు. మొత్తం 1,781 పోలింగ్ స్టేషన్లకు సంబంధించి 20 శాతం రిజర్వ్‌తో కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్లు అందిస్తారని తెలిపారు. 30 శాతం రిజర్వ్‌తో వీవీప్యాట్‌లను అందుబాటులో ఉంచనున్నట్లు పేర్కొన్నారు. హమాలీలు మంచి సేవలు అందించారని కొనియాడారు. ప్రక్రియలో భాగస్వాములైన ఆర్‌ఓలు, సహాయ సిబ్బంది ప్రతి ఒక్కరినీ అభినందించారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ వి.శ్రీనివాసరావు, విజయవాడ ఆర్డీఓ విజయవాడ తూర్పు నియోజకవర్గ ఆర్‌ఓ బీహెచ్ భవానీ శంకర్, కేఆర్‌సీ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఆర్‌ఓ కిరణ్మయి, తిరువూరు ఆర్డీఓ కె మాధవి, నందిగామ ఆర్డీఓ ఎ.రవీంద్రరావు, జగ్గయ్యపేట ఆర్‌ఓ జి.వెంకటేశ్వర్లు, ఈవీఎం నోడల్ అధికారి జి.మహేశ్వరరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ ఎం.దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక న్యాయ మహాశిల్పం ప్రాంగణంలో నేడు అంబేడ్కర్ జయంతి ఏర్పాట్లు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భారత రాజ్యాంగ రూపకల్పనలో కీలక పాత్ర పోషించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి సందర్భంగా నివాళులర్పించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా స్వరాజ్య మైదానంలోని 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం ప్రాంగణంలో సందర్శకులు, సామాజికవేత్తలు, అంబేడ్కర్ వాదులు ఆయనకు నివాళులు అర్పించేలా తాత్కాలిక విగ్రహాన్ని ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో ఇక్కడకు విచ్చేసే అంబేడ్కర్ అభిమానులు, సామాజిక సంఘాల నాయకులు ప్రవర్తన నియమావళిని దృష్టిలో పెట్టుకుని నివాళులు అర్పించాలని కోరారు. సామాజిక న్యాయ మహా శిల్పం పాదాల వద్దకు ఇప్పటి వరకు సందర్శకులను అనుమతించ లేదని, 14వ తేదీ కూడా ఇదే పద్ధతి కొనసాగిస్తామని తెలిపారు.

విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా సేవలు

వీసీ ఆచార్య పి రాజశేఖర్

ఏఎన్‌యూ: విద్యార్థుల ప్రయోజనాలే లక్ష్యంగా ఆచార్య నాగార్జున యూనివర్సిటీ దూరవిద్యాకేంద్రం ద్వారా సేవలు అందిస్తున్నామని వీసీ ఆచార్య పి.రాజశేఖర్ అన్నారు. ఏఎన్‌యూ దూరవిద్యా కేంద్రం నిర్వహిస్తున్న కోర్సుల్లో 2024 క్యాలెండర్ ఇయర్ బ్యాచ్‌లో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు శనివారం ఆన్‌లైన్‌లో మోటివేషనల్ ప్రోగ్రాం నిర్వహించారు. కార్యక్రమానికి దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరాజు అధ్యక్షత వహించారు. వీసీ ఆచార్య రాజశేఖర్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో సెమిస్టర్ విధానంలో దూరవిద్య కోర్సులను నడుపుతున్న తొలి యూనివర్సిటీగా ఏఎన్‌యూ నిలుస్తోందన్నారు. ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల నిర్వహణ, స్టడీ మెటీరియల్ రూపకల్పన, విద్యార్థులకు సకాలంలో స్టడీ మెటీరియల్ అందజేయడం, పరీక్షల నిర్వహణ, ఫలితాల విడుదల వంటి అంశాల్లో ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. రెక్టార్ ఆచార్య పి.వరప్రసాద మూర్తి మాట్లాడుతూ ఏఎన్‌యూ దూరవిద్య కేంద్రం స్టడీ మెటీరియల్‌కు ఐఎస్‌బీఎన్ గుర్తింపు తెచ్చినందుకు సంచాలకులు డాక్టర్ నాగరాజును అభినందించారు. రిజిస్ట్రార్ బి.కరుణ, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ డాక్టర్ నాగరాజు తదితరులు మాట్లాడారు. పలువురు దూరవిద్యాకేంద్రం అధికారులు, అకడమిక్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి అగ్నిమాపక వారోత్సవాలు

గాంధీనగర్ (విజయవాడసెంట్రల్): ఈ నెల 14 నుంచి 20వ తేదీ వరకు అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తామని ఏపీ స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్, ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ డి.మురళీమోహన్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ వారోత్సవాల్లో భాగంగా 14వ తేదీ అగ్నిమాపక కేంద్రాల వద్ద అమరవీరుల సంస్మరణ కార్యక్రమం, 15న బస్టాండ్, రైల్వే స్టేషన్లు, మాల్స్, మార్కెట్లు, థియేటర్లు వంటి బహిరంగ ప్రదేశాల్లో ప్రదర్శనలు, 16న ఎల్‌పీజీ భద్రత, విద్యుత్ భద్రత, అపార్ట్‌మెంట్లలో అగ్ని ప్రమాద నివారణ, తనిఖీలు, ప్రదర్శనలు, 17న పాఠశాలలు, కళాశాలల్లో అగ్ని నివారణ అవగాహన తరగతులు, ఫైర్ డ్రిల్స్, 18న పరిశ్రమలు, పెట్రోల్ బంకులు, ఎల్‌పీజీ స్టోరేజ్ గోదాముల వద్ద అగ్ని నివారణ అవగాహన సదస్సు, డ్రిల్స్, 19న హాస్పిటల్స్‌లో ఫైర్ సేఫ్టీ తనిఖీలు, ప్రథమ చికిత్స, అగ్ని మాపక చికిత్స, 20న అగ్ని భద్రతపై వర్క్‌షాపులు, సెమినార్లు జరుగుతాయని వివరించారు. ప్రజలకు అగ్నిమాపక భద్రతను అందించడం, అగ్నిమాపక, రెస్క్యూ కార్యకలాపాలను నిర్వహించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని తగ్గించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పేర్కొన్నారు.

కొండలమ్మ సన్నిధిలో దేవదాయ శాఖ ఆర్జేడీ



గుడ్లవల్లేరు: వేమవరం శ్రీ కొండలమ్మ అమ్మవారిని దేవదాయ శాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ ఎం.విజయరాజు శనివారం దర్శించుకున్నారు. ఆయన్ని ఆలయ ఈఓ సురేష్, చైర్మన్ శేషం గోపి ఆహ్వానించి అమ్మవారి చిత్రపటంతో పాటు లడ్డూ ప్రసాదాలను అందించారు. తొలుత ఆయన పేరిట అమ్మవారికి వేద పండితులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన ఆలయ రికార్డులను పరిశీలించారు.

క్లుప్తంగా...

బాలయ్య.. అభిమాని గూబ గుయ్యి ..!

కదిరి ప్రచార సభలో రెచ్చిపోయిన వైనం

కదిరి టౌన్: బాలయ్య చేయి మళ్లీ లేచింది.. అభిమాని గూబ గుయ్యమంది. బాలయ్య ప్రచారంలో పాల్గొనాలంటేనే అభిమానులు, పార్టీ కార్యకర్తలు భయపడిపోతున్నారు. షరా మామూలుగా.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురం ఎమ్మెల్యే, సినీహీరో నందమూరి బాలకృష్ణ మరోసారి రెచ్చిపోయారు. సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించిన అభిమాని చెంప ఛెళ్లుమనిపించారు. వివరాల్లోకి వెళితే.. ఎన్నికల ప్రచారంలో భాగంగా బాలకృష్ణ శనివారం కదిరి పట్టణానికి వచ్చారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న బాలయ్యతో సెల్ఫీ దిగేందుకు ఓ అభిమాని ప్రయత్నించాడు. దీంతో ఒక్కసారిగా ఆగ్రహించిన ఆయన.. అభిమానిని చెంపదెబ్బ కొట్టారు. పక్కనే ఉన్న బౌన్సర్లు కలుగజేసుకుని అభిమానిని పక్కకు తోసేశారు. బాలయ్య తరచూ అభిమానులపై చేయి చేసుకుంటూ వార్తల్లో నిలుస్తున్న విషయం విదితమే. కదిరి ఘటనతో ఆయన మరోసారి విమర్శల పాలయ్యారు.

ఎన్నికల విధుల్లో దేవదాయ సిబ్బంది వద్దు

ఎన్నికల సంఘానికి ఏపీ బీజేపీ లేఖ

సాక్షి,అమరావతి: ఎన్నికల విధులకు దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే సిబ్బందిని వినియోగించుకోవాలన్న నిర్ణయాన్ని ఎన్నికల సంఘం పునః సమీక్షించుకొని, వారిని ఎన్నికల విధుల నుంచి దూరంగా ఉంచే అంశంపై సహకరించాలని ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి కోరారు. ఈ మేరకు ఆమె ఈసీకి రాసిన లేఖను పార్టీ ప్రతినిధులు రాష్ట్ర సచివాలయంలోని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయంలో అందజేశారు. ప్రతి జిల్లాలో ఎన్నికల విధులు నిర్వహించడానికి వేలాది మంది ఉపాధ్యాయులు అందుబాటులో ఉన్నారని ఆమె పేర్కొన్నారు.

పవన్‌కళ్యాణ్‌పై ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు

నెహ్రూనగర్ (గుంటూరుఈస్ట్): వలంటీర్లపై అనుచిత వ్యాఖ్యలు చేసిన జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌పై రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ బి.అనిల్‌కుమార్ జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కమిషన్... పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలపై దర్యాప్తు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా ఎస్పీకి ఆదేశాలు జారీ చేసినట్లు అనిల్‌కుమార్ శనివారం గుంటూరులో వెల్లడించారు.వలంటీర్ వ్యవస్థపై కొద్ది నెలల కిందట ఏలూరు బస్టాండ్ సమీపంలో జరిగిన బహిరంగ సభలో పవన్‌కళ్యాణ్ అనుచిత వ్యాఖ్యలు చేశారని తెలిపారు. దీనిపై జాతీయ ఎస్సీ కమిషన్‌కు ఫిర్యాదు చేశానని, పూర్తిస్థాయిలో విచారణ జరిపి పవన్‌పై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

పథకాల వల్ల ప్రజలు సోమరులవుతారు

కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి వ్యాఖ్యలు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ అభ్యర్థి ప్రశాంతిరెడ్డి అక్కసు వెళ్లగక్కారు. మండలంలోని రెడ్డిపాళెంలో శనివారం ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రశాంతి మాట్లాడుతూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. సంక్షేమ పథకాల వల్ల ప్రజలు సోమరులవుతారన్నారు. ప్రభుత్వం వివిధ పథకాల ద్వారా ప్రజలకు అందజేస్తున్న నగదు దేనికీ పనికి రాదని విమర్శించారు. ఈ మాటలతో అక్కడున్నవారంతా ఒక్కసారిగా విస్తుపోయారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో సచివాలయాలు, వలంటీర్ల ద్వారా అన్ని సంక్షేమ పథకాలు ఇంటి ముంగిటకే చేరుతున్నాయి. ప్రజలకు సుపరిపాలన అందించడం, అభివృద్ధి పనులు చేయడం ఇష్టం లేకే ప్రశాంతిరెడ్డి ఈ వ్యాఖ్యలు చేశారని స్థానికులు చర్చించుకున్నారు.

పునరుత్పాదక ఇంధన పరిశ్రమలకు శుభవార్త!

ప్రస్తుత టారిఫ్‌లు మరో ఐదేళ్ల కొనసాగింపునకు కసరత్తు!

సాక్షి, అమరావతి: పునరుత్పాదక ఇంధన రంగంలోని పలు పరిశ్రమలకు శుభవార్త. ఆయా పరిశ్రమలకు ప్రస్తుతం కొనసాగుతున్న టారిఫ్‌లను రానున్న ఐదేళ్లు కొనసాగించే అవకాశం ఉంది. బయోమాస్, పారిశ్రామిక వ్యర్థాలు, బగాస్సే(చెరకు పిప్పి) వేరియబుల్ ఖర్చుల ఆధారంగా 2024–25 నుంచి 2028–29 ఆర్థిక సంవత్సరాలకు టారిఫ్‌లను నిర్ణయించేందుకు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) చర్యలు చేపట్టింది. గతంలో 2019–20 నుంచి 2023–24 వరకు నిర్ణయించిన టారిఫ్‌లు ప్రస్తుతం అమలులో ఉన్నాయి. టారిఫ్‌ను నిర్ణయించినప్పుడే వార్షిక ఇంధన ధర 5 శాతం పెరుగుదలతో లెక్కిస్తారు. ఈ లెక్కన 2023–24కి ఇంధన ధరలు బయోమాస్, పారిశ్రామిక వ్యర్థాల యూనిట్‌కు రూ.5.8, బగాస్సేకు యూనిట్ రూ.3.82 చొప్పున అమలు చేస్తున్నారు. తాజాగా 2024–29 నియంత్రణ కాలానికి టారిఫ్‌లను నిర్ణయించేందుకు కమిషన్ కసరత్తు ప్రారంభించింది. 2023–24కి ఆమోదించిన అదే వేరియబుల్ ఖర్చులను కొనసాగించాలనే ప్రతిపాదన కమిషన్ పరిశీలనలో ఉంది. బగాస్సే కోసం నిర్ణయించిన ధరలు మరో ఐదేళ్లు కొనసాగే అవకాశం ఉంది.

వారిద్దరిదీ

అసూయ, ద్వేషం

▶ మొదటి పేజీ తరువాయి

వాళ్లు చూశారా? సీఎం జగన్‌పై కూడా దుష్ప్రచారం చేస్తున్నారు. ఎవరు హత్యచేశారో షర్మిల, సునీతే నిర్ణయించేస్తే ఇక కోర్టులు, జడ్జీలు ఎందుకు?' అని ఆమె సూటిగా ప్రశ్నించారు. విజయవాడలో శనివారం విమలమ్మ మీడియా సమావేశంలో మాట్లాడుతూ పలు కీలక అంశాలపై ఇలా సూటిగా స్పందించారు. ఆమె ఇంకా ఏమన్నారంటే..



విమలమ్మ

వైఎస్సార్ శత్రువుల చేతుల్లో కీలుబొమ్మలుగా షర్మిల, సునీత..

వైఎస్ రాజశేఖరరెడ్డి శత్రువులంతా ఒక్కటయ్యారు. ఈ తరుణంలో వైఎస్ కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండాలి. కానీ, వైఎస్ శత్రువుల చేతుల్లో షర్మిల, సునీత కీలుబొమ్మలయ్యారు. వాళ్లిద్దరి చుట్టూ ప్రస్తుతం వైఎస్ కుటుంబ శత్రువులే ఉన్నారు. షర్మిల, సునీతలకు చెబుతున్నా.. వారు నోరు మూసుకోవాలి. పేద ప్రజలకు మంచి చేస్తున్న జగన్ ప్రభుత్వాన్ని పడగొట్టాలని చూడటం సరికాదు. వారిద్దరూ ఎందుకిలా చేస్తున్నారో అర్థం కావడంలేదు. డబ్బు కోసమో పదవి కోసమే తెలీడం లేదుగానీ అసూయ, ద్వేషంతో వ్యవహరిస్తున్నారు. ఏదో ఆశించే ఇదంతా చేస్తున్నారు. జగన్ సీఎం అయ్యాక బంధువులు ప్రభుత్వ వ్యవహారాల్లో జోక్యం చేసుకోవద్దని దూరం పెట్టారు. వాళ్ల పనులు కావడంలేదనే ఇలా ప్రవర్తిస్తున్నారనిపిస్తోంది. వారికి మంచి చెప్పాలని చూశాను. అప్పటి నుంచి నాతో మాట్లాడటం మానేశారు.

హంతకుడు దస్తగిరి దర్జాగా తిరుగుతున్నాడు..

షర్మిల, సునీత తామేది మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటున్నారు. మా ఇంట్లో అమ్మాయిలు ఇలా అన్యాయంగా మాట్లాడుతుంటే బాధ కలుగుతోంది. వివేకానందరెడ్డిని కిరాతకంగా హత్య చేశాను అని చెప్పిన దస్తగిరి మాత్రం బయట దర్జాగా తిరుగుతున్నాడు. అతని మాటలు నమ్మి అవినాష్‌రెడ్డిని విమర్శిస్తారా? ఏ తప్పూ చేయని వైఎస్ భాస్కర్‌రెడ్డి ఏడాదిగా జైల్లో ఉన్నారు. అవినాష్ బెయిల్ రద్దుచేయాలని షర్మిల, సునీత కోర్టులో కేసులు వేశారు. కానీ, వివేకాను హత్య చేశాను అని చెప్పిన దస్తగిరి బెయిల్‌పై ఉన్నా వారెందుకు పట్టించుకోవడంలేదు? షర్మిల, సునీత ఎన్ని మాటలంటున్నా అవినాష్ ఒక్క మాట కూడా అనడం లేదు.

జగన్‌ను మళ్లీ సీఎంను చేయండి..

ఇక వైఎస్ రాజశేఖరరెడ్డి కోట్లాది మంది ప్రజల గుండెల్లో దేవుడిగా ఉన్నారు. వైఎస్, వివేకా ఇద్దరూ ఫ్యాక్షన్ రాజకీయాలకు వ్యతిరేకం. మా నాన్నను హత్యచేసిన తరువాత కూడా ఎలాంటి ప్రతీకార రాజకీయాలకు పాల్పడకుండా వారు ఫ్యాక్షన్‌ను అంతంచేశారు. కానీ, ప్రశాంతంగా ఉన్న పులివెందులలో ప్రస్తుతం కొందరు అల్లర్లు రేకెత్తించేందుకు యత్నిస్తుండటం బాధ కలిగిస్తోంది. తండ్రి రాజశేఖర్‌రెడ్డి ఆశయాలను సాధించేందుకు జగన్ ప్రజలకు ఎన్నో మంచి పనులు చేస్తున్నారు. పేద ప్రజలకు అంత మంచి చేస్తున్న జగన్ మరోసారి సీఎం కావాలి. అందుకోసం రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అందరినీ గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నా.

వైఎస్‌కు వివేక ఎలాగో.. జగన్‌కు అవినాశ్ అలా..

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, వివేకానందరెడ్డి ఎంతో అన్యోన్యంగా ఉండేవారు. రాజశేఖర్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసేవారు. అందుకే పులివెందుల, కడప జిల్లాలో పార్టీ బాధ్యతలను వివేకాకు అప్పగించారు. వారిద్దరిలో ఒకరు ఎంపీగా పోటీచేస్తే మరొకరు ఎమ్మెల్యేగా పోటీచేసేవారు. అలా ఓటమి అన్నది లేకుండా గెలుస్తూ వచ్చారు. నాడు వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి వివేకానందరెడ్డి ఎలానో ప్రస్తుతం వైఎస్ జగన్‌కు వైఎస్ అవినాశ్ అలా అండగా ఉన్నారు. కానీ, వైఎస్ హఠాన్మరణం తర్వాత మారిన పరిస్థితుల్లో వైఎస్ జగన్ తన తండ్రి ఆశయ సాధన కోసం పార్టీ పెట్టారు. దురదృష్టవశాత్తూ ఆనాడు వివేకానందరెడ్డి కాంగ్రెస్ వైపు ఉండిపోయారు. ఆ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా జగన్ రాష్ట్రవ్యాప్తంగా పార్టీ బాధ్యతలు చూసుకోవాల్సి వచ్చింది. అందుకే పులివెందుల, కడప జిల్లాల్లో పార్టీ బాధ్యతలను చూసుకునేందుకు అవినాష్‌రెడ్డిని ఎంపిక చేసుకున్నారు. దీంతో అవినాష్ తనపై పెట్టిన బాధ్యతను ఎంతో చక్కగా నిర్వహిస్తున్నారు. పులివెందులను, కడప జిల్లాను అభివృద్ధి చేస్తున్నారు. అసలు అవినాష్‌ను ఎంపీగా గెలిపించాలనే వివేకానందరెడ్డి చివరివరకూ ప్రచారం చేశారు కదా. ఈ విషయాన్ని గుర్తించయినా షర్మిల, సునీత అవినాష్ మీద దుష్ప్రచారాన్ని మానుకోవాలి. ప్రజలకు మంచి చేస్తున్న జగన్‌కు అండగా నిలవాలి. వారిద్దరూ మరోసారి కూర్చుని చర్చించి జగన్‌కు అనుకూలంగా నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నా. ఎందుకంటే జగన్ శత్రువులంతా ఒక్కటయ్యారు. బయట శత్రువులంతా ఒక్కటైతే కుటుంబం అంతా కలిసికట్టుగా ఉండి ఎదుర్కోవాలి. ఆ కుటుంబ ధర్మాన్ని పాటించాలని షర్మిల, సునీతలకు సూచిస్తున్నా.

వైఎస్సార్‌సీపీపై విష ప్రచారమే ప్రతిపక్షాలకు ప్రచారాస్త్రాలు

- కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజం
- బెంగళూరులో ఐటీ వింగ్ కడప ఆత్మీయ భేటీకి హాజరు



మాట్లాడుతున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

బనశంకరి: ప్రస్తుత ఎన్నికల్లో అభివృద్ధి ఒకవైపు.. కుట్రలు, కుతంత్రాలు మరో వైపు అని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, శాసనసభ ఎన్నికల నేపథ్యంలో శనివారం బెంగళూరులోని మారతహళ్లిలోని ఎస్‌బీఆర్ ప్యాలెస్‌లో ఐటీ వింగ్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కడప పార్లమెంట్ పరిధి ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథి అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై విష ప్రచారాన్నే ప్రచారాస్త్రాలుగా మార్చుకుని కుట్రలు, కుతంత్రాలకు పాల్పడుతున్నాయని, మనందరం కలిసికట్టుగా దుష్ప్రచారాలను ఎండగట్టాలని పిలుపునిచ్చారు. జగనన్న పాలనలో రాష్ట్రంలో ఎనలేని అభివృద్ధి జరిగిందని, పరిశ్రమలు క్యూ కట్టాయన్నారు. కరోనా సమయంలో రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం రాకున్నా ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. ఏపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని చెప్పారు.

సునీత, చంద్రబాబుల కుమ్మక్కు

చిన్నాన్న వివేకానందరెడ్డి కేసుకు సంబంధించి సునీత సిట్ వద్దు సీబీఐ విచారణ కావాలని కోరిందని.. అయితే సీబీఐ విచారణ సక్రమంగా జరగడం లేదని అవినాష్‌రెడ్డి ఆరోపించారు. విపక్షాల కుట్రతోనే సునీత సీబీఐ విచారణను కోరినట్టు ఆరోపించారు. దస్తగిరి అప్రూవర్ కాకముందే వాచ్‌మేన్ గంగన్న జూలై 2021లో సీబీఐకి వాంగ్మూలం ఇచ్చారని, కానీ సీబీఐ అరెస్ట్‌చేసి వారిని విచారణ చేయలేదన్నారు. దస్తగిరిని నెల రోజుల పాటు అరెస్ట్ చేయలేదని.. 161ఏ స్టేట్‌మెంట్ తీసుకున్నారని చెప్పారు. అక్టోబర్ వరకు అరెస్ట్ చేయకపోగా దస్తగిరి ముందస్తు బెయిల్ కోసం కోర్టులో పిటిషన్ వేశారని, ఇదంతా కుమ్మక్కు కాదా అని అవినాశ్‌రెడ్డి ప్రశ్నించారు. దస్తగిరే చంపాడని తెలిపినప్పటికీ అతనికి సునీత మద్దతుగా నిలిచిందని, సునీత, చంద్రబాబు ఒక్కటై వివేకానందరెడ్డి కేసులో కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. సీబీఐ విచారణ పక్కదారి పడుతోందని, దస్తగిరిని సునీత కాపాడుతోందన్నారు. హత్య కేసులో చట్టప్రకారం ఒక వ్యక్తిని జైల్లో పెట్టినప్పుడు అప్రూవర్‌గా మారితే కేసు పూర్తయ్యేవరకు బెయిల్ ఇవ్వకూడదన్నారు. చట్టంలోని లొసుగులను వాడుకుని కేసును మలుపులు తిప్పుతున్నారని దుయ్యబట్టారు. మీ ఆశీస్సులు, అండదండలు వైఎస్.జగన్‌కు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు, పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

దళితుల మధ్య బాబు చిచ్చు

మాలమహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మంచా నాగమల్లీశ్వరి



మాట్లాడుతున్న డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి

సీతంపేట: స్వార్థప్రయోజనాల కోసం దళితుల మధ్య వర్గీకరణ చిచ్చుపెట్టిన దళిత ద్రోహి చంద్రబాబునాయుడని మాలమహానాడు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు డాక్టర్ మంచా నాగమల్లీశ్వరి ధ్వజమెత్తారు. శనివారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో విలేకరులతో ఆమె మాట్లాడారు. దళితునిగా పుట్టాలని ఎవరు కోరుకుంటారన్న చంద్రబాబు.. ఎన్నికల వేళ దళితులపై ప్రేమ చూపించడం దారుణమని విమర్శించారు. దళితులను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిన చంద్రబాబు.. వారిని గుర్రాలతో తొక్కించి ఘనత చాటుకున్నాడని చెప్పారు. పాయకరావుపేటలో ఏ ముఖం పెట్టుకుని పర్యటిస్తారని చంద్రబాబును ప్రశ్నించారు. ఎందుకూ పనికిరాని లోకేశ్‌ను ముఖ్యమంత్రి చెయ్యాలన్న చంద్రబాబు ఆలోచన హాస్యాస్పదమన్నారు. దళితుల ఆరాధ్యుడు బాబా సాహెబ్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహం ఏర్పాటు చేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని చెప్పారు. దళితులంతా వైఎస్సార్ సీపీకి ఓటేసి గెలిపించుకోవాలని కోరారు. రామలక్ష్మి, ఝాన్సీ, సంతోషి పాల్గొన్నారు.

షర్మిల సభలకు మళ్లీ అద్దె కూలీలే గతి

సాక్షి ప్రతినిధి, కడప/జమ్మలమడుగు/ముద్దనూరు/ప్రొద్దుటూరు క్రైం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలే లక్ష్యంగా షర్మిల చేస్తున్న ప్రసంగాలకు జనం మద్దతు పలకడంలేదు. ఎంతగా ప్రయత్నించిన ఆమె సభలకు రావడంలేదు. దీంతో షర్మిల బస్సు యాత్రకు జనాల్ని తేవడానికి కాంగ్రెస్ కేడర్ ఆపసోపాలు పడుతోంది. అద్దె వాహనాలు, అద్దె మనుషులతో సరిపెడుతోంది. శనివారం తొలుత వైఎస్సార్ జిల్లా ముద్దనూరులో జరిగిన బహిరంగ సభకు ఎస్ఎస్‌పీఆర్ కన్‌స్ట్రక్షన్ కంపెనీ కూలీలతో మమ అన్పించారు. జమ్మలమడుగు మీటింగ్‌కు ప్రొద్దుటూరుకు చెందిన అమృతానగర్ నుంచి కూలీలను తెచ్చారు. సమావేశానికి ముందు జెండాలు కట్టేది వారే, తర్వాత సమావేశంలో జై కొట్టేదీ వారే అవుతున్నారు.



సభకు వాహనంలో నుంచి దిగుతున్న స్థానికేతరులు

ఇదేం ఖర్మ మనకి

'మన పార్టీకి ప్రజల్లో ఆశించిన మద్దతు లేదు. వైఎస్సార్ కుమార్తెగా షర్మిల పట్ల జనం ఆకర్షితులవుతారనే ఆలోచన భ్రమగా మారింది. రోజూ ఏదో ఒక ప్రాంతానికి చెందిన కూలీలను పిలిపించాల్సి వస్తోంది' అని ప్రొద్దుటూరు సభాస్థలి వద్ద కాంగ్రెస్‌కు చెందిన ఓ మైనార్టీ నాయకుడు, కడపకు చెందిన మరో నాయకుడి వద్ద ఆవేదన వెళ్లగక్కారు. తెచ్చిన వాళ్లందరికీ ఖర్చులు కూడా పూర్తిగా ఇవ్వడంలేదని, జేబులో డబ్బులు పడుతున్నాయని, మనకి ఇదేం ఖర్మ అని ఆ మైనార్టీ నేత వాపోయారు. 'ఈ రోజుతో జిల్లాలో ముగుస్తుంది. తర్వాత చూద్దాం' అని కడప నాయకుడు సర్దిచెప్పారు.

ఇద్దరు సీఎంలు శంకుస్థాపనలకే పరిమితం : షర్మిల

రాష్ట్రానికి ముఖ్యమంత్రులైన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు ఇద్దరూ కడప స్టీల్‌ప్లాంట్‌కు శంకుస్థాపనలు చేశారే తప్ప పనులు ప్రారంభించలేదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల విమర్శించారు. ఆమె శనివారం వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు, ముద్దనూరు, ప్రొద్దుటూరులో జరిగిన రోడ్‌షోలో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా ఉంటూ తండ్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశయాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. రైతులను వైఎస్సార్ రాజుగా చేస్తే వైఎస్ జగన్ అప్పుల పాలు చేస్తున్నారని విమర్శించారు. డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తానని చెప్పి నోటిఫికేషన్ ఇచ్చారే తప్ప పరీక్షలు మాత్రం జరగలేదన్నారు. సీఎం వైఎస్ జగన్ ఐదేళ్లు నిద్రపోయి ఎన్నికల సమయంలో నిద్ర లేచారని అన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధం చేస్తామని చెప్పి నేడు ప్రభుత్వమే ఇష్టారాజ్యంగా మందు అమ్ముతోందన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో వైఎస్ఆర్ ఉన్నాడా అని ప్రశ్నించారు. చివరికి ప్రభుత్వ పథకాల్లో కూడా వైఎస్ఆర్‌ను కనుమరుగు చేస్తున్నారని అన్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రశ్నించడంలో విఫలమయ్యారన్నారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ఒక్క రోజు కూడా కడప స్టీల్ ప్లాంట్‌పై పోరాటం చేయలేదని, ఒక్కసారి కూడా పార్లమెంట్‌లో మాట్లాడలేదని అన్నారు. ముద్దనూరు బహిరంగ సభలో కోనసీమ జిల్లా పి.గన్నవరం ఎమ్మెల్యే చిట్టిబాబు కాంగ్రెస్ పార్టీలో చేరారు. షర్మిల ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

షర్మిల వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరం

- ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- ఈసీఐకి వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు సురేష్ బాబు ఫిర్యాదు
- సీఎం జగన్, వైఎస్ అవినాష్‌రెడ్డిల వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నారు
- యథేచ్ఛగా కోడ్ ఉల్లంఘిస్తూ సీఎం పేరు ప్రతిష్టలకు కళంకం తెస్తున్నారు
- ఆమె వ్యాఖ్యల ద్వారా శాంతియుత వాతావరణం దెబ్బతింటుంది




కడప కార్పొరేషన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప లోక్‌సభ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వైఎస్ అవినాష్‌రెడ్డిలపై ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల చేస్తున్న ఆరోపణలపై వైఎస్సార్ జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.సురేష్ బాబు భారత ఎన్నికల సంఘాని(ఈసీఐ)కి ఫిర్యాదు చేశారు. స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ఆటంకాన్ని కలిగిస్తున్న ఆమెపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. శనివారం మెయిల్ ద్వారా ఆయన ఫిర్యాదు చేశారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలపై అమర్యాదకరంగా, వారి పరువుకు నష్టం కలిగించే విధంగా అనుచిత వ్యాఖ్యలు చేయడం ద్వారా షర్మిల యథేచ్ఛగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘిస్తున్నారని చెప్పారు. కడప లోక్‌సభ అభ్యర్థిగా అవినాష్‌రెడ్డిని వైఎస్సార్ సీపీ ప్రకటించడాన్ని తీవ్రంగా తప్పుబట్టడమేకాకుండా, మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు విషయంలో అవినాష్‌రెడ్డిని వైఎస్ జగన్ కాపాడుతూ ముఖ్యమంత్రి పదవిని దుర్వినియోగం చేస్తున్నారంటూ ఈనెల 2న ఇడుపులపాయలో ఆమె ఆరోపణలు చేశారన్నారు. ప్రస్తుతం వివేకా హత్య కేసు హైదరాబాద్ నాంపల్లిలోని సీబీఐ కోర్టులో విచారణలో ఉందన్నారు. నేరం రుజువయ్యే వరకు కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని నిందితుడిగా మాత్రమే చూడాలన్న న్యాయ సూత్రాలకు విరుద్ధంగా అవినాష్‌రెడ్డిని హంతకుడిగా షర్మిల సంబోధించడం తీవ్ర అభ్యంతరకరమన్నారు. కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తి ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. ఇవేమీ పట్టించుకోని షర్మిల వ్యక్తిత్వ హననానికి పాల్పడే విధంగా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. అవినాష్‌రెడ్డి వ్యక్తిగత జీవితంపై దాడికి పాల్పడుతున్నారని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పట్ల ద్వేషంతో ఉద్రిక్తత పెంచే ఏకైక లక్ష్యంతో నిరాధార ఆరోపణలు గుప్పించడం ద్వారా షర్మిల ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు పాల్పడుతున్నారన్నారు. ఆమె చేసిన చట్టవిరుద్ధమైన ఆరోపణలు సోషల్ మీడియా ఛానల్స్, శాటిలైట్ చానల్స్‌లో ప్రసారమయ్యాయని చెప్పారు. వైఎస్ జగన్‌కు ఉన్న పేరు ప్రతిష్టలకు కళంకం తెచ్చే విధంగా ఆమె విమర్శలు ఉన్నాయని, ఇది ఎన్నికల నియమావళి స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధమన్నారు.

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు

ఈనెల 5న కాశినాయన మండలంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో కూడా షర్మిల అవే ఆరోపణలు చేశారని, పలు టీవీ ఛానళ్లు వీటిని ప్రసారం చేశాయన్నారు. ఈనెల 12న వేంపల్లెలో నిర్వహించిన ఎన్నికల సభలో షర్మిల, సునీత ఇరువురు కలిసి వైఎస్ అవినాష్‌రెడ్డిని హంతకుడిగా సంబోధిస్తూ కించపరిచే విధంగా విమర్శలు చేశారన్నారు. తాము ఇప్పటికే ఈ విషయాలపై చీఫ్ ఎలక్షన్ కమిషనర్, చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, జిల్లా ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేశామని.. అయితే ఇంతవరకు ఆమెపై ఎన్నికల కమిషన్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. దీంతో ఆమె ఎన్నికల సభల్లో పదేపదే నిరాధారమైన ఆరోపణలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు చర్యలు తీసుకోకపోతే ఆమె అవే ఆరోపణలను కొనసాగిస్తుందన్నారు. షర్మిల పాల్పడుతున్న కోడ్ ఉల్లంఘనల కారణంగా అలజడులు చెలరేగి శాంతియుత వాతావరణం దెబ్బతినే పరిస్థితి ఏర్పడుతుందని, ఇది స్వేచ్ఛాయుత ఎన్నికల నిర్వహణకు ఆటంకాన్ని కలిగిస్తుందని చెప్పారు. ఇందుకు సంబంధించి సమాచారాన్ని చూపెట్టే వెబ్‌సైట్ల వివరాలు, పెన్‌డ్రైవ్‌లు, వీడియోలను జతపరుస్తూ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్నామని, ఈనెల 5వ తేదీ తర్వాత ఆమె ఎన్నికల సభల ఉపన్యాసాలను కూడా జతపరిచామన్నారు. రాజకీయ పార్టీలు, నాయకులు ఎలాంటి నిరాధార ఆరోపణలకు పాల్పడరాదని, ప్రజలను పక్కదారి పట్టించే తప్పుడు ప్రకటనలు చేయరాదని భారత ఎన్నికల సంఘ నియమావళి చెబుతోందన్నారు. కాబట్టి ఈసీఐ తక్షణమే స్పందించి షర్మిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

'ఆరణి'ని బాబుగారే పంపించారు

- ఆయనే జనసేనలోకి పంపి టికెట్ ఇవ్వమన్నారు
- మేం చాలా త్యాగాలు చేశాం.. మీరూ చేయాల్సిందే
- జనసేన అభ్యర్థికి సహకరించాల్సిందే
- కూటమి నేతలకు పవన్‌కళ్యాణ్ హుకుం
- జనసేన అధినేత మాటలతో కూటమి నేతల మండిపాటు



సాక్షి, తిరుపతి: జనసేనకు కేటాయించిన సీట్లలో అభ్యర్థులను కూడా చంద్రబాబే నిర్ణయించారని తేలిపోయింది. స్వయానా పవన్‌కళ్యాణే ఈ విషయాన్ని వెల్లడించడం ఇప్పుడు కలకలం రేపుతోంది. తిరుపతి కూటమి అభ్యర్థి ఆరణి శ్రీనివాసులను చంద్రబాబే జనసేనలోకి పంపించి టికెట్ ఇవ్వమని చెప్పారని ఆయన కుండబద్దలు కొట్టారు. పవన్ వ్యాఖ్యలతో ఇటు టీడీపీ, అటు జనసేన శ్రేణులు షాక్‌కు గురయ్యారు. తిరుపతిలో జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు టీడీపీ నేతలు.. శ్రీకాళహస్తి టీడీపీ అభ్యర్థి బొజ్జల సుధీర్‌రెడ్డికి జనసేన శ్రేణులు సహకరించకపోవడంతో పవన్ శుక్రవారం రాత్రి తిరుపతికి చేరుకున్నారు. అప్పటి నుంచి శనివారం ఉదయం వరకు కూటమి నేతలతో ఆయన విడివిడిగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా.. తిరుపతిలో అసంతృప్తిగా ఉన్న టీడీపీ శ్రేణులతో పవన్ అసలు విషయాన్ని బయటపెట్టారు. 'జనసేన అభ్యర్థి ఆరణి శ్రీనివాసులుకు ఎందుకు సహకరించడంలేదు? మేం చాలా త్యాగాలు చేశాం .. మీరు కూడా త్యాగాలు చేయాల్సిందే. జనసేన అభ్యర్థికి సహకరించాల్సిందే. ఎందుకంటే.. ఆరణి శ్రీనివాసులును జనసేనలోకి పంపించి, టికెట్ ఇవ్వమని చెప్పింది చంద్రబాబు నాయుడుగారే. అలాంటి వ్యక్తికి టీడీపీ నేతలు సహకరించకపోతే ఎలా?'.. అని వారితో అన్నట్లు సమాచారం. దీంతో.. పవన్‌కళ్యాణ్ మాటలకు కూటమి నేతలంతా షాక్‌కు గురయ్యారు. నిజానికి.. తమ అసంతృప్తిని తెలుసుకుని అభ్యర్థిని మార్చేందుకు పవన్ వచ్చారని భావించామని, అయితే ఇలా నిరుత్సాహపరుస్తారని అనుకోలేదని టీడీపీ, జనసేన శ్రేణులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. తాము ఇన్నేళ్లు పార్టీ కోసం పనిచేసింది వృథానేనా? అని వారు మండిపడుతున్నారు. మరోవైపు.. బీజేపీ నేతలను కూడా పిలిపించిన పవన్ వారిని పట్టించుకోలేదు. వారే పవన్ గదిలోకి వెళ్లేందుకు యత్నించారు. కానీ, తాళాలు వేయడంతో వారు అలిగి వెళ్లిపోయారు. దీంతో పవన్ శనివారం వారిని పిలిపించి టీడీపీ నేతలకు చెప్పిందే చెప్పారు.

చేతకాని దద్దమ్మలమా?

ఇదిలా ఉంటే.. మొన్న శ్రీకాళహస్తిలో చంద్రబాబు.. నేడు తిరుపతిలో పవన్ కళ్యాణ్ ఆయా పార్టీ నేతలతో మాట్లాడిన విధానం సరిగ్గాలేదని కూటమి నేతలు రగిలిపోతున్నారు. అసంతృప్తిగా ఉన్నవారిని ఒప్పించాల్సిందిపోయి బెదిరించడమేమిటని వారు మండిపడుతున్నారు. తమకు విలువ ఇవ్వనప్పుడు అధినేతలకు తామెందుకు విలువ ఇవ్వాలి? తామేమి చేతకాని దద్దమ్మలం కాదని వారు తేల్చిచెబుతున్నారు.

బీజేపీ రంగు బయటపడింది

- ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటులో ఏపీ ప్రజల్ని మోసగించింది
- సీపీఎం రాష్ట్ర కమిటీ మండిపాటు



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రాజధాని విషయంలో బీజేపీ అసలు నాటకం బయటపడిందని, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుపై బీజేపీ రంగు తేటతెల్లమైందని సీపీఎం రాష్ట్ర కమిటీ మండిపడింది. ఈ మేరకు సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖపట్నంలో రిజర్వు బ్యాంకు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేసేందుకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 2022లో నిర్ణయం తీసుకుందని తెలిపారు. రెండేళ్ల కిందట తీసుకున్న ఆ నిర్ణయాన్ని అమలుచేయకుండా తాత్సారం చేసిన బీజేపీ ఇప్పుడు ఎన్నికల వేళ మెలిక పెట్టిందని ఎద్దేవా చేశారు. రాజధాని ఎక్కడో తేల్చాకే ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటును నిర్ణయిస్తామని బీజేపీ పేర్కొనడం రాష్ట్ర ప్రజల్ని మోసం చేయడం, అవమానపర్చడమేనని దుయ్యబట్టారు. రాష్ట్ర రాజధాని అమరావతి అని గతంలోనే కేంద్ర ప్రభుత్వం గెజిట్‌లో నోటిఫై చేయడంతోపాటు పార్లమెంటులోను పలుమార్లు తెలిపిందని గుర్తుచేశారు. మోదీ అమరావతికి పిడికెడు మట్టి, చెంబుడు నీళ్ల గుమ్మరించి పోయారని పేర్కొన్నారు. మూడు రాజధానులను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఏనాడు వ్యతిరేకించలేదని తెలిపారు. రాజధానుల విషయం రాష్ట్ర ప్రభుత్వ ఇష్టమని హైకోర్టులో కేంద్రం అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. రాష్ట్ర రాజధాని విషయంలో ఆనాటి నుంచి బీజేపీ అస్పష్టత కొనసాగించడంతోపాటు దొంగనాటకాలు ఆడుతూనే ఉందని విమర్శించారు. ఇప్పుడు ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయ ఏర్పాటుకు దాన్ని ఒక షరతుగా పేర్కొనడం అసంబద్ధమని పేర్కొన్నారు. ఇప్పటికైనా రాష్ట్రంలో ఆర్బీఐ ప్రాంతీయ కార్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.

సాక్షి 2024
జైత్రయాత్ర
ఆదివారం
ఏప్రిల్, 14

గుసగుస

వణుకుతున్న వసంత కృష్ణప్రసాద్



పాము తన గుడ్లను తానే తింటుందట. చంద్రబాబు కూడా కాస్త అటూఇటుగా అంతేనని ఆ పార్టీ నేత దేవినేని ఉమా వర్గం గుర్రుగా ఉంది. బాబుకు ప్రియశిష్యుడిగా ఉన్న ఆయనకే సీటు నిరాకరించడంతో పార్టీని పట్టుకు వేలాడటం సరికాదన్న ఆలోచనలో పడ్డారట. దీంతో అధికార పక్షం నుంచి వలస వచ్చిన వసంత కృష్ణప్రసాద్‌కు అసమ్మతి సెగ తగులుతోందట. ఈ మధ్యన కృష్ణప్రసాద్ ఎక్కడ ఏ సభ, సమావేశంలో మాట్లాడినా దేవినేని ఉమాను త్యాగరాజుగా తెగ పొగిడేస్తున్నారు. దీనంతటికీ కారణం రానున్న ఎన్నికల్లో బొమ్మసాని సుబ్బారావు వర్గంతోపాటు, దేవినేని ఉమా వర్గం కూడా కృష్ణప్రసాద్‌కు హ్యాండిచ్చేందుకు భీకరమైన ప్లాన్లు వేస్తుండటమేనట. నమ్ముకున్నవారిని నట్టేట ముంచే చంద్రబాబు వైఖరినే తాము కూడా అనుసరించేందుకు బొమ్మసాని, దేవినేని సిద్ధమయ్యారట. దీంతో వసంత కృష్ణప్రసాద్‌లో వణుకు రోజురోజుకూ పెరుగుతోంది.

తెనాలిలో నో..దెండ్ల



మీది తెనాలి.. మాది తెనాలి.. మనది తెనాలి అంటూ టీడీపీ నేత ఆలపాటి రాజేంద్రప్రసాద్‌ను బుట్టలో వేసుకునేందుకు జనసేన అభ్యర్థి నాదెండ్ల మనోహర్ చేస్తున్న ప్రయత్నాలు ఫలించట్లేదట. ఇద్దరూ ఒకే సామాజిక వర్గం. పొత్తుల్లో భాగంగా కూటమి అభ్యర్థిగా ముందుగానే తెనాలి సీటుపై నాదెండ్ల కర్చీఫ్ కాకుండా ఏకంగా దుప్పటే పరిచేశారు. అయితే ఆ దుప్పటి నీడన ప్రచారానికి ఆలపాటి వర్గం ససేమిరా అంటోంది. ఇప్పటికే ఈ స్థానంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రచారంలో దూసుకెళ్తున్నారు. నాదెండ్లకు మాత్రం ఆలపాటి వర్గం తీరు మింగుడు పడట్లేదు. ఎన్నికల్లో ఆయన సహకరించకపోయినా, పార్టీ ఫిరాయించినా డిపాజిట్లు గల్లంతవడం ఖాయమట. ఆలపాటి కూడా తన నిర్ణయాన్ని కార్యకర్తల మీదకే వదిలేశారు. దీంతో టీడీపీ, జనసేనలకు బుద్ధి చెప్పేందుకే ఆలపాటి వర్గం తీర్మానించిందట.

ఏ రాయైతే ఏంటి..?

ఏ రాయైతే ఏంటి పళ్లూడగొట్టుకోవడానికి! తంబళ్లపల్లె నియోజకవర్గంలో కూటమి పరిస్థితి ఇందుకు ఏ మాత్రం భిన్నంగా లేదట. ప్రస్తుతం ఈ స్థానాన్ని టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డికి కేటాయించారు. ఆయన ఇప్పటికే ప్రచారం కూడా చేసుకుంటున్నారు. అనపర్తి రాజకీయాల నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా బీజేపీ కన్ను ఈ సీటుపై పడింది. ఇక్కడ బీజేపీ తరపున సీనియర్ నేత చల్లపల్లి నరసింహారెడ్డి లేదా కొండా నరేంద్రలో ఒకరిని నిలపవచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఇందుకు మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి ఒత్తిడి కూడా ఓ కారణమట. చల్లపల్లి ఇన్నేళ్ల రాజకీయంలో ఒక్కసారీ గెలిచింది లేదు. గతంలో ఆయన వెనకున్న యూత్ ఇప్పుడు పట్టించుకోని పరిస్థితి. ఎలానూ ఓడిపోయే సీటే కాబట్టి బీజేపీకి ఇచ్చేసి, చేతులు దులిపేసుకోవాలన్నది టీడీపీ ఆలోచనట.

కొలికపూడికి మెలిక



అవకాశం రావడం గొప్పకాదు.. దాన్ని నిలబెట్టుకోవడమే గొప్ప. అలా నిలబెట్టుకోలేని వారు రాజకీయ యవనికలో చాలా మంది. వారిలో టీడీపీ నుంచి తిరువూరు ఎమ్మెల్యే సీటు దక్కించుకున్న కొలికపూడి శ్రీనివాస్ కూడా చేరక తప్పదేమో? అనుకోని అవకాశం వచ్చినా ఆయన క్షేత్రస్థాయిలో రాణించలేక చతికిలపడుతున్నారు. కొలికపూడికి అంత సీన్ లేదని, ఆయన్ని వెంటనే మార్చేసి వేరేవారికి ఆ సీటు కేటాయించాలని స్థానిక పార్టీ శ్రేణులు అధినేత చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారట. ప్రచారం కోసం జనాల్లోకి వెళ్లినప్పుడు పార్టీ లైన్ దాటి, సొంత అజెండాతో ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారట. పార్టీ శ్రేణులతో ఆయన మాట తీరు కూడా సరిగా లేదన్న ఆక్షేపణలున్నాయి. దీంతో ఆ సీటును మార్చే ఆలోచనలో చంద్రబాబు ఉన్నట్లు సమాచారం.

వ్యూహం కాదిది.. ద్రోహం!



కూటమిలో త్యాగం చేయాల్సి వస్తే బలవుతున్నది బీజేపీ, జనసేనే

- చంద్రబాబు, ఆయన బంధువర్గంలో మాత్రం అందరికీ టికెట్లు
- రాత్రికి రాత్రి వచ్చేవారిని కూడా.. అటూ ఇటూ పంపిస్తున్న బాబు
- 'పచ్చ' నేతలకు టికెట్లిచ్చి సొంత నేతలకు బీజేపీ, జనసేన ద్రోహం
- ప్రకటించిన వారిని కూడా బాబు ఆదేశాలతో మార్చేస్తున్న తీరు
- ఆఖరికి మాజీ సైనికుడికి ఇచ్చామంటున్న అనపర్తిపైనా బాబు కన్ను
- ఆ సీటును బీజేపీ నుంచి తీసుకోవటానికి ఎత్తుగడ.. వదినమ్మ ఓకే!
- బాలకృష్ణ వియ్యంకుడి కోసం విశాఖ నుంచి బీజేపీని పంపేసిన వైనం
- అనకాపల్లి ఇచ్చి.. అది తన బంటు సీఎం రమేశ్‌కే వచ్చేలా ఎత్తుగడ
- మొదటి నుంచీ బీజేపీని నమ్ముకున్న అగ్రనేతలకూ మొండిచెయ్యి
- జనసేనకు ఇచ్చిన సీట్లలో 70 శాతం టీడీపీ, ఇతర పార్టీల వారికే
- ఆరణి శ్రీనివాసులను బాబే పంపినట్లు తిరుపతిలో చెప్పిన పవన్
- బాబు మార్కు రాజకీయాలతో కుదేలవుతున్న బీజేపీ, జనసేన శ్రేణులు
- అందుకే ఆగ్రహంతో వరసగా రాజీనామాలు

ఎన్నికల వ్యూహమంటే..? పొత్తుల్లో రాజీ పడటమా? ఏళ్లకేళ్లు తమ పార్టీ జెండా మోసిన వారికి ద్రోహం చెయ్యటమా? ఒకవైపు కొత్త తరం రాజకీయాల్లోకి రావాలని చెప్పే పవన్ కళ్యాణ్.. చంద్రబాబు నాయుడు చెప్పిన వాళ్లకే.. ఆ పాత తరం నాయకులకే జనసేన టికెట్లు కూడా ఇచ్చుకుంటూ పోతుంటే కొత్త తరం ఎలా వస్తుంది? మాజీ సైనికుడికి టికెట్టిచ్చామని ఘనంగా చెప్పుకుంటున్న బీజేపీ ఆ ఒక్క సీటును కూడా రాత్రికి రాత్రి వచ్చే తెలుగుదేశం నాయకులకే ఇచ్చేయాలని చూస్తూ.. దానిక్కూడా వ్యూహమని పేరు పెడుతుంటే అంతకన్నా ద్రోహం మరొకటి ఉంటుందా? ఇక్కడ చంద్రబాబు వ్యూహం మేరకు జనసేన, బీజేపీ జెండా మోసిన నాయకులకు ద్రోహం జరుగుతోంది.

చంద్రబాబు కోరిక మేరకు.. ఇప్పటికే కేటాయించిన సీట్లను కూడా బీజేపీ, జనసేన మార్చేస్తున్నాయంటే అర్థమేంటి? చంద్రబాబు చెబితేనే ఆరణి శ్రీనివాసులకు సీటిచ్చానని సాక్షాత్తూ పవన్ కళ్యాణే చెప్పారంటే ఏమనుకోవాలి? అనపర్తి సీటు మార్చాలని బాబు చెబితే.. దానిక్కూడా బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు తలూపారంటే అక్కడ సీటు దక్కించుకున్న మాజీ సైనికుడిని మోసం చేసినట్లు కాదా? వాస్తవానికి జెండా మోసిన నాయకులు, కార్యకర్తలు అడుగుతున్న ఈ ప్రశ్నల్లో వేటికీ అటు పవన్ దగ్గర కానీ, ఇటు పురందేశ్వరి దగ్గర కానీ సమాధానాలు లేవు. 'వ్యూహంలో భాగంగా' అని తమకిచ్చిన స్క్రిప్టును చదువుతున్నారంతే!

సాక్షి, అమరావతి : టీడీపీ– బీజేపీ– జనసేన కూటమిలో ఏ త్యాగం చేయాల్సి వచ్చినా బీజేపీ, జనసేన పార్టీల నాయకులే బలి అవుతున్న పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోంది. మూడు పార్టీల పొత్తులో ఒక్క చంద్రబాబు కుటుంబం, వారి బంధువులే ఏకంగా ఐదుగురు పోటీ చేస్తూ.. వారెవరూ తమ సీట్లను వదులుకోకుండా.. పైపెచ్చు వారి కోసం పార్టీని నమ్ముకున్న మిగిలిన నాయకులను ఒక్కొక్కరినీ బలి చేసుకుంటూ పోతున్నారని బీజేపీ, జనసేన పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. ఒకే కుటుంబం, బంధువర్గానికి చెందిన చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్, నందమూరి బాలకృష్ణ, బాలకృష్ణ రెండో అల్లుడు భరత్‌తో పాటు దగ్గుబాటి పురందేశ్వరిలు ఈ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులుగా పోటీ చేయబోతున్నారు. ఈ పొత్తులో ఆ కుటుంబం, వాళ్ల బంధువర్గం మాత్రం ఒక్క సీటు వదులుకోవడానికి కనీసం ఆలోచన కూడా చేయడం లేదు. అయితే బీజేపీ, జనసేనలోని సాదాసీదా నాయకుల సీట్లకు మాత్రం వారందరూ కలిసి ఎసరు పెడుతున్నారు. చంద్రబాబు నేతృత్వంలో కూటమి నాయకుల సమావేశం జరిగిందంటే బీజేపీ, జనసేన పార్టీలనే నమ్ముకున్న నాయకులకు, శ్రేణులకు ఏదో అన్యాయం జరిగినట్లేనని.. పొత్తులు కుదిరిన నాటి నుంచి తాము ఇలాంటి ముళ్లబాటలోనే ముందుకు సాగుతున్నామని ఆయా పార్టీ నాయకులు శ్రేణులు వాపోతున్నారు.

సమావేశం అంటేనే ఎవరికో ఎసరు పెట్టినట్టే..

టీడీపీ – బీజేపీ – జనసేన పొత్తులో తొలి నుంచి పార్టీనే నమ్ముకొని బీజేపీలో కొనసాగుతున్న వందలాది మంది నాయకుల్లో రాష్ట్రమంతటా కలిపి కేవలం ముగ్గురంటే ముగ్గురు నాయకులకే సీట్లు దక్కితే.. అందులో ఇద్దరు సీట్లకు చంద్రబాబు శుక్రవారం జరిగిన సమావేశంలో ఎసరుపెట్టేశారు. ఈ పొత్తులో బీజేపీకి ఆరు లోక్‌సభ, పది అసెంబ్లీ స్థానాలు కేటాయించగా, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలిగా కొనసాగుతున్న పురందేశ్వరిని చెప్పు చేతల్లో


- మిగతా III లో

నరసాపురం లోక్‌సభ, అనపర్తి అసెంబ్లీ స్థానాలకు బీజేపీ నాయకత్వం ప్రకటించిన అభ్యర్థులకు ఆయా స్థానాల్లో పట్టులేదని చంద్రబాబు కొత్త వాదనను తీసుకొచ్చినట్టు బీజేపీ వర్గాలు పేర్కొంటున్నాయి. ఎందుకంటే అక్కడ తన వాళ్లు లేరన్నది బాబు అంతరంగం. 'బీజేపీకి కేటాయించిన అనకాపల్లి నుంచి పోటీ చేస్తున్న సీఎం రమేశ్‌కు ఆ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏమైనా పట్టు ఉందా..? 'పురందేశ్వరి పోటీ చేస్తున్న రాజమండ్రి లోక్‌సభ స్థానంలో ఆమెకు పట్టు ఉందా? సుజనా చౌదరి పోటీ చేస్తున్న విజయవాడ పశ్చిమ అసెంబ్లీ స్థానంలో అతనికి ఏమన్నా పట్టు ఉందా? ధర్మవరంలో పోటీ చేస్తున్న సత్యకుమార్‌కు అక్కడ పట్టు ఉందా?' అని బీజేపీలో చర్చ సాగుతోంది. చంద్రబాబు, పురందేశ్వరిలు కలిసి తాము అనుకున్నట్టు జాతీయ నాయకత్వానికి ప్రతిపాద

రాజమండ్రిలో పురందేశ్వరికి పట్టుందా?

నలు పంపి కుట్ర చేశారని బీజేపీ నాయకులు ఆరోపిస్తున్నారు. అనకాపల్లిలో మాజీ ఎమ్మెల్సీ పీవీఎన్ మాధవ్ పోటీకి ఎంతగానో ఆసక్తి చూపినా, ఆయన్ను కాదని రాయలసీమ ప్రాంతానికి చెందిన సీఎం రమేశ్‌కు అనకాపల్లి, రాజమండ్రిలో స్థానికంగా మాజీ రాష్ట్ర పార్టీ అధ్యక్షుడు సోము వీర్రాజును కాదని పురందేశ్వరికి సీట్లు ఇచ్చారు. ఉత్తర భారత దేశానికి చెందిన రాష్ట్రాల వారు ఎక్కువగా ఉండడం తదితర కారణాలతో విశాఖ లోక్‌సభ పరిధిలో బీజేపీకి సొంతంగా కాస్తోకూస్తో బలం ఉంది. అలాంటి ఈ సీటును బాలకృష్ణ రెండో అల్లుడు, లోకేశ్ తోడల్లుడు భరత్‌కు ఏ లెక్కన కేటాయించారని కమలం నేతలు, కార్యకర్తలు ప్రశ్నిస్తున్నారు. దీని వెనుక చంద్రబాబు, పురందేశ్వరి చక్రం తిప్పడమేనని స్పష్టం చేస్తున్నారు.

రాజధానిని మింగేసిన బాబు భూదండా



అదిగో రాజధాని అంటూ లీకులిచ్చి అరచేతిలో వైకుంఠం

అమరావతిలో బాబు బినామీల భూ మాఫియా వ్యవస్థీకృతం

అంతర్జాతీయ స్థాయి రాజధాని.. ఆకాశ హర్మ్యాల నగరం అంటూ గాలిలో మేడలు

రైతుల కాళ్ల కిందున్న భూమి కంపించేలా ఎత్తులు పైఎత్తులు

బరితెగించి ప్రపంచ చరిత్రలోనే అతి పెద్ద భూ దోపిడీ.. రాజధాని ప్రచారం పేరిట భూ మాయాజాలం

భూసమీకరణ ముసుగులో అసైన్డ్, ప్రభుత్వ, ప్రైవేట్, లంక భూముల దురాక్రమణ

ఇన్నర్ రింగ్ రోడ్డు పేరిట అవినీతి మలుపులు

సింగపూర్‌తో ఒప్పందం పేరిట బురిడీ..

స్విస్ చాలెంజ్ ముసుగులో దోపిడీ

అస్మదీయులకు యథేచ్ఛగా భూ పందేరాలు

పచ్చ దండు దండ యాత్రతో ఏకంగా రూ.2 లక్షల కోట్ల విలువైన భూముల దురాక్రమణ

అన్యాయంగా విభజనకు గురై కొత్తగా ఏర్పడిన రాష్ట్రానికీ బాబు వెన్నుపోటు..

బాబు అండ్ గ్యాంగ్ మోసాలకు ఎల్లో మీడియా వెన్నుదన్ను.. ఇదంతా గుర్తించే 2019 ఎన్నికల్లో కర్రు కాల్చి వాత పెట్టిన జనం

అయినా బుద్ధి తెచ్చుకోక అక్రమాలను సమర్థించుకునేందుకు విఫలయత్నం

సినిమా క్లైమాక్స్‌లో విలన్ తన
ఆచూకీని హీరోకు చెప్పే ముందు
ముప్పతిప్పలు పెడుతుంటాడు..
ఇక్కడున్నాను.. అబ్బే.. మరోచోట ఉన్నానంటూ
కన్ఫ్యూజ్ చేస్తుంటాడు.. చంద్రబాబు తీరు
కూడా అచ్చం ఇలానే ఉంది. అమరావతిని
రాజధానిగా ప్రకటించే ముందు
ఈ పెద్దమనిషి కూడా
రాష్ట్ర ప్రజానీకంతో ఓ ఆట ఆడుకున్నాడు.
ఈ ఆటలో ఎక్కువగా నష్టపోయింది
బాబు మాయాజాలం తెలియని
సామాన్య రియల్టర్లు, ప్రజలే.
అదిగో అక్కడే రాజధాని..
అరెరె కాదు కాదు.. దొనకొండ..
అబ్బే అక్కడా కాదు.. నూజివీడు..
తూచ్.. అక్కడొద్దన్నారు..
ఏలూరు సమీపంలో పెడుతున్నాం..
లేదు నాగార్జున యూనివర్సిటీ వద్ద అయితే
మేలు.. అక్కడే ఫిక్స్.. ఇలా తన ఎల్లో మీడియాకు
రోజుకో లీకు ఇచ్చి కథనాలు రాయించారు..
చివరికి లోపాయికారీగా తన రియల్ ఎస్టేట్
వ్యాపారానికి బ్రోచర్ సిద్ధం చేసుకుని..
మన రాజధాని 'అమరావతి' అంటూ బాంబు
పేల్చారు.. బాబు అండ్ గ్యాంగ్, ఆయన వంది
మాగధులంతా సూపర్.. డూపర్.. అంటూ
కీర్తనలు ఆలపిస్తూ భజనలు చేయసాగారు..

ఇదంతా బాబు అండ్ కోకు మాత్రమే వినోదం. రాజధాని ఎక్కడ ఏర్పాటవుతుందో వారికి ముందే తెలుసు కనుక, వారు ముందస్తుగా అమరావతి చుట్టుపక్కల భూములను కొనేశారు. అదీ రూ.2 లక్షల కోట్ల విలువైన భూములపై పచ్చదండు భూ దండయాత్ర చేసింది. చంద్రబాబు కుట్రలు గ్రహించలేని రియల్టర్లు దారుణంగా మోసపోయి, కోట్లకు కోట్లు నష్టపోయారు. కొందరి జీవితాలు విషాదాంతంగా మిగిలాయి. బాబు అండ్ కో మాత్రం తమ పాచిక పారినందుకు.. రూ.లక్షల కోట్ల భూములను చౌకగా కొట్టేయగలిగినందుకు పగలబడి నవ్వుకుంటూ డబ్బులు లెక్కబెట్టుకునే పనిలో బిజీ అయ్యారు. ఒక్క మాటలో చెప్పాలంటే ఎన్ని రకాలుగా భూ దోపిడీకి పాల్పడవచ్చో ప్రపంచానికి చాటారు.

శ్రీకృష్ణ కమిషన్, శివరామకృష్ణన్ కమిటీ సూచనలను బుట్టదాఖలు చేశారు. స్విస్ చాలెంజింగ్ విధానం అంటూ ఊదేశారు. సినిమా సెట్టింగుల్లో పేరుగాంచిన దర్శకుడు రాజమౌళిని రప్పించి ఇదిగిదిగో రాజధాని అంటూ గ్రాఫిక్స్‌తో మాయ చేశారు. మిడతల దండు దాడి చేసి పచ్చని పంటలను నాశనం చేసినట్టు చంద్రబాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులు, నాటి టీడీపీ ప్రభుత్వంలో మంత్రులు, టీడీపీ నేతలు, వారి బినామీలు అమరావతి భూములపై దాడికి తెగబడ్డారు. చంద్రబాబు, లోకేశ్‌లతో పాటు టీడీపీ నేతలు, నారాయణ, సుజనా చౌదరి, ప్రత్తిపాటి పుల్లారావు, మాగంటి మురళీ మోహన్, కొమ్మాలపాటి శ్రీధర్, కోడెల శివప్రసాద్ కుమారుడు శివరామకృష్ణ, ధూళిపాళ్ల నరేంద్ర, పయ్యావుల కేశవ్, బాలకృష్ణ వియ్యంకుడు ఎంఎస్‌పీ రామారావులతో కూడిన పచ్చ దండు భూములను కొల్లగొట్టింది. రాజధాని విషయంలో నాడు బాబు అండ్ గ్యాంగ్ ఎంత అరాచకంగా, దుర్మార్గంగా, అశాస్త్రీయంగా వ్యవహరించిందో గుర్తు చేస్తూ ఆ బాగోతాలను రేపటి నుంచి 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

భూ 'దండు' పాళ్యం బ్యాచ్–1


రేపటి సంచికలో..

తొండ ముదిరితే ఊసరవెల్లి అవుతుంది.. రౌడీ ముదిరితే రాజకీయ నాయకుడవుతాడు..

ఇందుకు బొండా ఉమా నిలువెత్తు నిదర్శనం..

నుదుట బొట్టు.. మడత నలగని దుస్తులు.. చూడ్డానికి బొండా చాలా పెద్దమనిషనే జనం అనుకునేలా ఆహార్యం ఉంటుంది.. అతని అంతరంగాన్ని ఎక్స్‌రే తీస్తే దుర్మార్గాలన్నీ అణువణువునా కనిపిస్తాయి.. ఈ మాజీ ఎమ్మెల్యే అక్రమాలను విజయవాడ సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటుంటారు.. అయిదేళ్ల కాలంలో రూ.వందల కోట్లను ఆర్జించాలంటే సామాన్యులకు సాధ్యమేనా? బొండాకు సాధ్యమే.. ఎలాగంటే.. కాల్‌మనీ విధానంలో జనాన్ని ఎలా పీల్చిపిప్పిచేయాలో ఆ నరకాన్ని ఈ రౌడీ నేత విజయవాడ వాసులకు చవిచూపించారు.. భూ కబ్జాలు.. దాడులు.. దందాలు.. తన పేరు వింటేనే విజయవాడ హడలెత్తిపోయేలా చేశాడీ దుర్మార్గ నేత.. నీ స్నేహితుడెవరో చెప్పు.. నీ గురించి నేను చెబుతా.. అనే నానుడి బొండా ఉమాను చూసి చెప్పొచ్చు.. ఇతని స్నేహ బృందం రౌడీషీటర్లమయం.. సామాన్యుల స్థలాలపై బొండా కన్ను పడిందంటే అది అతని ఖాతాలో జమకావాల్సిందే.. తండ్రికి తగ్గ తనయులుగా ఉమా కొడుకులూ దౌర్జన్యాల్లో ఆరితేరిపోయారు.. ఉమా ఆగడాలను చూసిన తర్వాత ఇతన్ని ఎమ్మెల్యేగా చూడాలని ఎవరైనా అనుకుంటారా?.. అందుకే 2019 అసెంబ్లీ ఎన్నికల్లో ఉమాను చిత్తుగా ఓడించారు సెంట్రల్ నియోజకవర్గ వాసులు.. బొండా ఆగడాలకు వెన్నుదన్నుగా టీడీపీ, దాని అధినేత చంద్రబాబు నాయుడు ఉంటే ఇలాంటి రౌడీ నేతలు చెలరేగిపోతూనే ఉంటారు.. బొండా ఉమా రౌడీ చరిత్ర పారాయణంలో కొన్ని ఘట్టాలు...

'బొండా' గిరీ



బెజవాడ సెంట్రల్లో కాల్‌కేయుడు

-వివరాలు II లో

ఓటు హక్కు వజ్రాయుధం



ప్రజలకు ఓటుహక్కు వజ్రాయుధం వంటిది. ఐదేళ్లకోసారి మన చేతికి వచ్చే ఈ ఆయుధాన్ని జాగ్రత్తగా వినియోగించాలి. మన బాగోగులు, రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేసే ప్రభుత్వాన్నే ఎన్నుకోవాలి. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి, సామాన్యుల హక్కుల రక్షణకు కృషి చేయాలి. గత ప్రభుత్వాలకూ ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి చాలా తేడా ఉంది. విద్య, వైద్యం, సంక్షేమం, అభివృద్ధి దిశగా ప్రస్తుత ప్రభుత్వ పాలన చాలా బాగుంది. పేదరికం తగ్గడం శుభపరిణామం.

– పల్నాటి నాగరాజు, కోస్తాంధ్ర అధ్యక్షుడు, హెచ్‌ఆర్‌సీ, గుంటూరు

మీరూ స్పందించండి

పబ్లిక్ వాయిస్

ఎన్నికల గురించి మీరేం అనుకుంటున్నారు.. గత ప్రభుత్వానికి, ప్రస్తుత ప్రభుత్వానికి మధ్య తేడా ఏమిటి? పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెరగాలంటే మీ సూచనలేంటి? అభివృద్ధికి మీరిచ్చే నిర్వచనం ఏమిటి? ప్రజలకు, రాజకీయ పార్టీలకు మీరేమైనా చెప్పాలనుకుంటున్నారా? ఇలా ఎన్నికలకు సంబంధించి ఏ అంశంపై అయినా సరే మీ అభిప్రాయాలను **73867 92224** నంబర్‌కు మీ ఫొటో సహా వాట్సాప్ ద్వారా పంపిస్తే ప్రచురిస్తాం.

బూటకపు హామీలను నమ్మరు



పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే న్యాయం జరిగింది. సంక్షేమ పథకాల లబ్ధిలో గత ప్రభుత్వాలతో పోల్చుకుంటే ఈ ప్రభుత్వానిదే పైచేయి. గతంలో సంక్షేమ పథకాలను ఎలా అమలు చేశారో అందరికీ తెలుసు. ఈ ప్రభుత్వంలో సచివాలయం, వలంటీర్లను పెట్టి మంచి పని చేశారు. ఎంతో మంది వృద్ధులు, వికలాంగులు, వ్యాధి పీడితులకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్దకే వచ్చి పింఛన్లు ఇవ్వడంతో లబ్ధిదారుల ఆనందం అంతా ఇంతా కాదు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం ఏదో విధంగా పథకాల లబ్ధి పొందారు. మంచి చేస్తున్న ఈ సర్కారునే మళ్లీ ఎన్నుకుంటారు. బూటకపు హామీలిచ్చేవారిని నమ్మరు.

– చింతలపల్లి కోటేష్, చిత్రకారుడు, నంద్యాల

దోచింది బాబు.. నీళ్లిస్తోంది జగన్

ఫ్యాక్ట్ చెక్

- కుప్పం కెనాల్‌లో రూ.250 కోట్లు కొట్టేసిన చంద్రబాబు
- కెనాల్‌ను పూర్తి చేసి నీళ్లిచ్చిందే సీఎం జగన్
- హంద్రీ–నీవా ద్వారా భారీగా నీటి తరలింపు
- సీమలో 6 జిల్లాలకు ప్రయోజనం
- లక్షల ఎకరాల్లో పంటల సాగు
- అయినా బాబు కోసం రామోజీ తప్పుడు రాతలు




ఎన్ని మొట్టికాయలు వేయాలి జగన్?

సాక్షి, అమరావతి: సీఎంగా వైఎస్ జగన్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి హంద్రీ–నీవా సుజల స్రవంతి పథకం సామర్థ్యం 40 టీఎంసీల కంటే ఏటా అధికంగా తరలించడం ద్వారా రాయలసీమను సస్యశ్యామలం చేశారు. గత ఎన్నికల తరహాలోనే ఈ ఎన్నికల్లోనూ చంద్రబాబుకు ప్రజలు మొట్టికాయలు వేయడం ఖాయమని ఆందోళన చెందుతున్న రామోజీరావు పచ్చి అబద్ధాలు వల్లె వేస్తూ సీఎం జగన్‌పై బురదజల్లుతూ 'ఎన్ని మొట్టికాయలు వేయాలి జగన్?' శీర్షికతో శనివారం 'ఈనాడు'లో తప్పుడు కథనాన్ని అచ్చేశారు.

అసలు నిజం ఇదీ..

- 2014–19 మధ్య చంద్రబాబు హంద్రీ–నీవాలో అడ్డగోలుగా అవినీతికి పాల్పడ్డారు. అప్పటికే పనులు చేస్తున్న కాంట్రాక్టర్లపై 60–సీ నిబంధన కింద వేటు వేసి.. మిగిలిన పనుల అంచనాను పెంచి తన బినామీ సీఎం రమేష్, ప్రస్తుత కళ్యాణదుర్గం టీడీపీ అభ్యర్థి అమిలినేని సురేంద్ర బాబులకు కట్టబెట్టి ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు.
- చంద్రగిరి నియోజకవర్గ ప్రజలు 1983 ఎన్నికల్లో ఘోరంగా ఓడిస్తే.. 1989లో కుప్పానికి చంద్రబాబు వలస వెళ్లారు. 1989 నుంచి వరుసగా గెలిపిస్తూ వస్తున్న కుప్పానికి కృష్ణా జలాలు అందిస్తాననే ముసుగులో అంచనాల దశలోనే రూ.120 కోట్లు చంద్రబాబు కొట్టేశారు. ఆ తర్వాత పనులను రూ.430.26 కోట్లకు సీఎం రమేష్‌కు కట్టబెట్టారు. సీఎం రమేష్‌కు రూ.460.88 కోట్ల బిల్లులు చెల్లించారు. అయినా పనులు పూర్తి కాలేదు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌లోనే చంద్రబాబు రూ.250 కోట్లకు పైగా కొట్టేశారు.
- చంద్రబాబు నైజాన్ని పసిగట్టిన రాయలసీమ ప్రజలు గత ఎన్నికల్లో టీడీపీని చిత్తు చిత్తుగా ఓడించి, మొట్టికాయలు వేశారు.
- వైఎస్ జగన్ సీఎం అయ్యాక ఏటా ప్రస్తుత సామర్థ్యం కంటే అధికంగా హంద్రీ–నీవా ద్వారా కృష్ణా జలాలను తరలిస్తున్నారు. తొలి దశ కిందే లక్ష ఎకరాలకు నీళ్లందిస్తున్నారు. తొలి, రెండో దశల్లో రాయలసీమ జిల్లాల్లోని ఆయకట్టుకు నీళ్లందించారు.
- శ్రీశైలానికి తొలి 60 రోజుల్లోనే వరదనీటిని ఒడిసిపట్టి హంద్రీ–నీవా ద్వారా 40 టీఎంసీలు తరలించేలా కాలువ, ఎత్తిపోతల సామర్థ్యం **పెంపు పనులను వడివడిగా పూర్తి చేస్తున్నారు. దీంతో రాయలసీమ లో సీఎం పై నమ్మకం మరింత పెరిగింది.**

బెజవాడ సెంట్రల్లో కాల్‌కేయుడు



కాల్ మనీ, సెక్స్ రాకెట్ కింగ్	భూ కబ్జాలకు కేరాఫ్ అడ్రస్	రౌడీషీటర్లతో సత్సంబంధాలు	బెజవాడలో చీకటి సామ్రాజ్యం

- ఇదీ మాజీ ఎమ్మెల్యే, టీడీపీ నేత బొండా ఉమామహేశ్వరరావు అరాచకాల చిట్టా
- ఇటీవల గీతాంజలి ఆత్మహత్య కేసులోనూ బొండా అనుచరుడి అరెస్ట్

అకృత్యాలెన్నున్నా కేసులు మూడే..

బొండా ఉమా మూడు కేసుల్లో నిందితుడిగా ఉన్నారు. 2011 మార్చి1న సెక్షన్ 9, 9ఏఏ ఆఫ్ సెంట్రల్ ఎక్సైజ్ యాక్ట్ ప్రకారం బొండాపై కేసు నమోదైంది. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో ఎఫ్ఐఆర్ నంబర్ 462/2008పై సెక్షన్ 143 కేసు ఉంది. విజయవాడ 2వ అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో సెక్షన్ 143 కింద కేసు ఉన్నట్టు బొండా అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

సాక్షి ప్రతినిధి, విజయవాడ:

టీడీపీ ప్రభుత్వ హయాంలో బెజవాడలో బొండా ఉమామహేశ్వరరావు ఆయన అనుచరుల ఆగడాలకు అడ్డూ అదుపూ లేకుండా పోయింది. భూకబ్జాలు, దౌర్జన్యాలు, కాల్‌మనీ, సెక్స్ రాకెట్.. ఆయన చేయని దందా లేదు. ఫలితంగా 2019 ఎన్నికల్లో ప్రజలు గట్టిగానే బుద్ధి చెప్పారు. ఇప్పుడు మళ్లీ ఓట**ర్లను మభ్య**పెట్టి గెలిచేందుకు ప్రయత్నిస్తు**న్నారు.** ఈ నేపథ్యంలో గతంలో ఆయన **ఎమ్మెల్యే**గా ఉన్న సమయంలో చేసిన **అ**రాచకాలను సెంట్రల్ నియోజకవర్గ ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.

- 2014–19 మధ్య బెజవాడ సెంట్రల్ ఎమ్మెల్యేగా ఉన్న బొండా ఉమా ఏకంగా ఓ అవినీతి సామ్రాజ్యాన్నే నిర్మించారు. నియోజకవర్గం మొత్తాన్ని కనుసైగతో శాసించారు. **భూ**కబ్జాలు, దందాలు, దౌర్జన్యాలతో **పే**ట్రేగిపోయారు. అధికార యంత్రాం**గం కూడా ఆయ**న అవినీతి దం**దాకు వంత**పాడింది. **నియో**జకవర్గ వ్యాప్తంగా **రూ.**వందల కోట్లు విలువైన భూమిని బొండా కబ్జా చేశారు. సెటిల్ మెంట్లతోపాటు ప్రభుత్వంలో జరగాల్సిన పనులకు కూడా **క**ప్పం వసూలు **చే**శారు. ప్రజల నుంచి **రూ.వం**దల కోట్లు కొల్లగొట్టారు.
- **కాల్‌మనీ, సెక్స్ రాకెట్ వ్యవహారాల్లో బొండాపై అనేక ఆరోపణలు వచ్చాయి. కాల్‌మనీ కింగ్‌గా ఉమా పేరొందారు. ఎందరో బాధితులు బొండా** కబంధ హస్తాల్లో చిక్కుకుని విలవిల్లాడారు.
- సత్యనారాయణపురంలోని భువనేశ్వరి పీఠానికి చెందిన సీతారామ కల్యాణ మండప కబ్జాకు బొండా వర్గీయులు యత్నించారు.
- న్యూ రాజరాజేశ్వరిపేటలోని అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న స్వాతంత్య్ర సమరయోధులకు సంబంధించిన స్థలాన్ని ఆక్రమించేందుకు ప్రయత్నించి బొండా భంగపడ్డారు.
- రామకృష్ణాపురం బుడమేరులో బొండా ఉమా అనుచరులు, టీడీపీ డివిజన్ అధ్యక్షుడు కలిసి వెంచర్ వేసి విక్రయించారు. స్థానిక టీడీపీ నేతలు కూడా బుడమేరు లోపలకు ఇళ్లు నిర్మించి విక్రయించారు.
- ముత్యాలంపాడులో ఇరిగేషన్ స్థలాన్ని టీడీపీ నేత కుమారుడి వ్యాయామశాలకు ధారాదత్తం చేశారు.
- అప్పటి 44వ డివిజన్ కార్పొరేటర్ రైల్వే, ప్రభుత్వ స్థలాలనూ విక్రయించారు.
- విజయవాడ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన రూ.30 కోట్లు భూదందాలో కూడా మాగంటి బాబు కీలక పాత్రధారి. ఈ వ్యవహారాన్ని అక్కడి ప్రజలు ఇప్పటికీ మరచిపోలేదు.
- కండ్రిక కాలనీలో జర్నలిస్టుల ఇళ్ల పేరిట ఎమ్మెల్యే అతని అనుచరులు కార్పొరేషన్‌కు చెందిన 1,720 గజాల స్థలాన్ని ఆక్రమించి, నిర్మాణాలు చేసేందుకు ప్రయత్నించారు. స్థానికుల ఆందోళనతో వెనక్కి తగ్గారు.
- పాయకాపురం బర్మాకాలనీ ప్రాంతంలో మూడు ఎకరాల వరకూ ఉన్న కాలనీ కామన్ సైట్‌ను తన అనుచరులతో ఆక్రమించి, వాటి కి ఇంటి పట్టాలను సృష్టించేందుకు తెగబడ్డారు. స్థానికులు అడ్డం తిరగడంతో తోకముడిచారు.

దుర్గాపురంలోని ఓ అపార్ట్‌మెంటులో క్యాన్సర్ బాధితురాలు మాదంశెట్టి సాయిశ్రీకి చెందిన ఫ్లాట్‌ను బొండా అనుచరులు కబ్జాకు యత్నించారు. ఆమె తన వైద్యం కోసం ఆ ఫ్లాట్ విక్రయానికి యత్నించగా జాలి లేకుండా బొండా అడ్డుకున్నారు. చివరకు వైద్యం అందక సాయిశ్రీ మరణించారు.

గీతాంజలి కేసులో బొండా అనుచరుడి అరెస్ట్

ఇటీవల తెనాలికి చెందిన వివాహిత గీతాంజలి ఆత్మహత్య కేసులో బొండా అనుచరుడు పసుమర్తి రాంబాబు అరెస్టయ్యాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనను ప్రశంసించిన గీతాంజలి వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో రాంబాబు ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ కామెంట్లు పెట్టాడు. అతడితో పాటు టీడీపీ కార్యకర్తల అనుచిత వ్యాఖ్యలకు మనస్తాపానికి గురైన గీతాంజలి ఆత్మహత్యకు పాల్పడ్డారు.

కొడుకులదీ అదే తీరు

బొండా కుమారు**లు** ఇద్దరూ దౌర్జన్యాలు చేయ**డంలో** ఘనులే. బొండా కుమారు**డు** నిర్వహించిన కారు రేస్‌**లో** మనోరమ హోటల్‌లో పని చేసే మేనేజర్ కుమారుడు మరణించాడు. అప్పట్లో ఈ విషయం సంచలనం సృష్టించింది. అధికారాన్ని అడ్డం పెట్టుకుని కుక్క అడ్డురావడంతో కారు ప్రమాదం జరిగిందని కేసు**ను** తప్పుదారి పట్టించారు.

తెనాలికి చెందిన రౌడీషీటర్ సుబ్బుతో బొండాకు సత్సంబంధాలున్నాయి. సుబ్బు హైదరాబాద్‌లో తుపాకీ కొనుగోలు చేస్తూ పట్టుబడి బొండా, మరికొందరి టీడీపీ నేతల పేర్లు బయట పెట్టాడు. ఆ తర్వాత విజయవాడలోని మాచవరంలో పట్టపగలే సుబ్బు దారుణ హత్యకు గురయ్యాడు. ఈ కేసులో అధికార పార్టీ నేతల పేర్లు బయటకు రాకుండా పాత కక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు కేసును తారుమారు చేశారు.

బొండా ఉమాకు మాగంటి బాబు అత్యంత సన్నిహితుడు. అప్పట్లో స్వాతంత్య్ర సమరయోధుడి భూమిని తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో బొండా ఉమా భార్య సుజాతతోపాటు మాగంటి బాబు కూడా ఉన్నారు. బొండా ఉమా అక్రమ దందాలన్నింటిలో మాగంటి బాబు కీలకంగా వ్యవహరించారనేది బహిరంగ రహస్యం.

కల్లు తాగిన కోతి.. రామోజీ

ఫ్యాక్ట్ చెక్

మద్యంపై పైత్యపు రాతలు



సాక్షి, అమరావతి: కల్లు తాగిన కోతిలా చిందులు వేయడం అంటే ఏమిటో ఈనాడు రామోజీరావును చూస్తుంటే తెలుస్తోంది. రానున్న ఎన్నికల్లో టీడీపీకి మరోసారి ఘోర పరాజయం తప్పదన్న బాధతో ఆయనలో పచ్చ పైత్యం ప్రకోపిస్తోంది. ఆ ఆక్రోశంతో నిద్రపట్టని రాత్రులు గడుపుతున్న రామోజీ చిత్త చాపల్యంతో మతి స్థిమితం కోల్పోతూ మత్తు రాతలు రాస్తున్నారు. ఈనాడు పత్రిక నిండా అసత్యా**లతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై విష ప్ర**చారం చేస్తున్నారు. రాష్ట్రంలో మద్యం **అమ్మకాలు భారీగా పెరిగాయంటూ తా**జాగా 'తాగించారు.. తూగించారు' **శీర్షికతో కట్టుకథను అల్లారు. వైఎ**స్సార్‌సీపీ ప్రభుత్వం దశలవారీ **మద్య నియంత్రణను సమర్థం**గా అమలు చేస్తున్నా కల్లు తాగిన **కోతిలా చిందులు తొ**క్కారు.

మద్యం విక్రయాలు తగ్గించేందుకే షాక్ కొట్టేలా ధరలు..

మద్యం విక్రయాలను నిరుత్సాహపర్చడమే తమ పార్టీ విధానమని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఎన్నికల సందర్భంగా స్పష్టంగా చెప్పారు. పేదలను మద్యం వ్యసనానికి దూరం చేసేందుకే ఆ నిర్ణయమన్నారు. అందుకే అధికారంలోకి వచ్చాక మద్యంపై అదనపు రిటైల్ ఎక్సైజ్ ట్యాక్స్ (ఏఆర్ఈటీ) పన్నునూ విధించారు. దాంతో మద్యం విక్రయాలు గణనీయంగా తగ్గాయి. మరోవైపు.. మద్యం వ్యసనాన్ని నిరుత్సాహ పరిచేందుకు విధించిన ఏఆర్ఈటీ పన్నుతో మద్యం రాబడి పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. ఈ వాస్తవాన్ని రామోజీ వక్రీకరిస్తూ రాష్ట్రంలో మద్యం విక్రయాలు పెరిగాయని ప్రజలను తప్పుదారి పట్టించేందుకు యత్నించారు.


దాచేస్తే దాగని సత్యాలు

చంద్రబాబు హయాంలో

- రాష్ట్రంలో టీడీపీ మద్యం సిండికేట్ యథేచ్ఛగా చెలరేగిపోయింది. మూడు పర్మిట్ రూమ్‌లు.. ఆరు బెల్ట్ దుకాణాలు అన్నట్టుగా మద్యం ఏరులై పారింది.
- ఉ. 10 నుంచి రాత్రి 11 వరకు విక్రయాలు. అనధికారికంగా 24 గంటలూ షాపులు.
- 4,380 మద్యం దుకాణాలకు అనుబంధంగా అంతే సంఖ్యలో పర్మిట్ రూమ్‌లకు అనుమతి. వీటికి తోడు 43 వేలకుపైగా బెల్ట్ దుకాణాలు.
- ఎమ్మార్పీ ధరల కంటే 25 శాతం వరకు అధిక ధరలకు అమ్మకాలు.
- ఏటా బార్ల సంఖ్య పెంపు.
- మొక్కుబడిగా మద్యం నాణ్యత పరీక్షలు. ఐదేళ్లలో 96,614 శాంపిల్స్ మాత్రమే సేకరణ.
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ప్రకారం 2015–16లో 34.9 శాతం పురుషులు, 0.4 శాతం మహిళలకు మద్యం అలవాటు ఉంది.

జగన్ హయాంలో

- మద్యం మాఫియా అరాచకాలను ఒక్క విధాన నిర్ణయంతో తుడిచిపెట్టేశారు.
- ప్రైవేటు మద్యం దుకాణాల విధానం రద్దు.
- 2019, అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలన్నీ ప్రభుత్వపరం.
- మద్యం దుకాణాల వేళలు కుదింపు. ఉ.10 నుంచి రాత్రి వరకే విక్రయాలు.
- 4,380 పర్మిట్ రూమ్‌లు రద్దు. 43వేల బెల్ట్ దుకాణాలు పూర్తిగా తొలగింపు. మద్యం దుకాణాలు క్రమంగా తగ్గింపు. ప్రస్తుతం ఉన్నవి 2,934 ప్రభుత్వ మద్యం దుకాణాలే.
- కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు. నోటిఫికేషన్ జారీ చేసి ఈ–వేలం ప్రక్రియ ద్వారా బార్ల కేటాయింపు.
- నగదు చెల్లింపులతోపాటు డిజిటల్ చెల్లింపుల విధానం.
- మద్యం నాణ్యత పరీక్షల కోసం బెవరేజస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.12.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక లేబరేటరీల ఏర్పాటు. సగటున ఏడాదికి 1,26,083 శాంపిల్స్ పరీక్ష.
- అక్రమ మద్యం అరికట్టేందుకు 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ)ఏర్పాటు.
- 2019–21 నాటికి ఇది పురుషులు 31.2 శాతానికి, మహిళలు 0.2 శాతానికి తగ్గింది.



వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం విక్రయాల తగ్గుదల ఇలా.. (కేసుల్లో)

ఏడాది	ఐఎంఎల్ (మద్యం) విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు	బీరు విక్రయాలు	2018-19తో పోలిస్తే.. తగ్గిన విక్రయాలు
2019-20	3.08 కోట్లు	20 శాతం	2.12 కోట్లు	23 శాతం
2020-21	1.87 కోట్లు	50 శాతం	57 లక్షలు	79 శాతం
2021-22	2.63 కోట్లు	28 శాతం	82 లక్షలు	70 శాతం
2022-23	3.35 కోట్లు	13 శాతం	1.16 కోట్లు	58 శాతం
2023-24	3.32 కోట్లు	14శాతం	1.12 కోట్లు	60 శాతం



కళసాకారం..

ప్రభుత్వ బడులకు పండుగొచ్చింది. స్కూళ్లు పిల్లలతో కళకళలాడుతున్నాయి. ఐదేళ్ల క్రితం ఎవరూ కలలో కూడా ఊహించనిదీ విప్లవాత్మక మార్పు.మార్పులో మేము సైతం అంటూ పాలుపంచుకుంది హైదరాబాద్ కు చెందిన యువ ఆర్టిస్ట్ విజయ్,స్వాతి జంట. పిల్లల నవ్వులతో మమేకమైంది.. బడి ప్రాంగణాలే కాన్వాసుగా వారి ఆటపాటలే కుంచెలుగా మలచి వర్ణచిత్రాలను 'రంగ'రించింది. పాఠశాలకు జీవం ఉట్టిపడే చిత్రాలతో కొత్త కళ తెచ్చింది. ఆ యువ ఆర్టిస్టు జంటతో 'సాక్షి' ముచ్చటించింది. వారి మాటల్లోనే..

అలా మొదలైంది: మేం ఇద్దరం ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుకున్నాం వాటితో అనుబంధం ఉంది. **గత** 2017లో ఒక ప్రభుత్వ పాఠశాలను దత్తత తీసుకుని మాకు చేతనైన విధంగా రంగులద్దాం. ఆ **సమ**యంలో ఎవరైనా చొరవ తీసుకుని అన్ని స్కూళ్లకు ఇలాగే రంగులద్దితే ఎంత బావుండో అనుకున్నాం. **పూజా**రి కోరిందీ దేవుడు ఇచ్చిందీ ఒకటే అన్నట్టు ఆంధ్రప్రదేశ్ స్కూల్‌లో లార్జ్‌స్కేల్ ఆర్ట్ వర్క్స్ కోసం **మమ్మల్ని** చింతూరు ఐటీడీఏ పీవో అప్రోచ్ అయ్యారు. అలా 2020లో జులై నెలలో నాడు–నేడు కోసం మా **వర్క్ స్టార్ట్** అయింది. అది కేవలం మా బొమ్మల వరకే కాదనీ, మొత్తం పాఠశాలల రూపు రేఖలే మార్చే **కార్యక్రమం అ**నీ తెలిశాక మా ఆనందం రెట్టింపయింది. మా కల నిజం అవుతోందని సంబరపడ్డాం. ఆర్ట్ వర్క్ **కోసం రోజుల తర**బడి ఆయా స్కూళ్లలో గడిపాం. పిల్లలు చదువుకుంటున్నప్పుడు, ఆడుకుంటున్నప్పుడు.. హ్యాపీగా ఫీలైన జాయ్ మూమెంట్స్‌ని క్యాప్చర్ చేసి వాటినే ఆర్ట్ వర్క్స్‌గా మలిచాం. తద్వారా పిల్లలు మరింతగా వాటితో కనెక్ట్ **అయ్యా**రు. వాళ్లని వాళ్లు 30–30 స్కేల్ ఆర్ట్ వర్క్‌లో చూసుకుని థ్రిల్ అయ్యేవారు. పదే పదే చూసుకోవడం, పేరెంట్స్‌కి, **ఫ్రెండ్స్‌కీ** చూపించే సమయంలో వాళ్ల ముఖంలో సంతోషం అమూల్యం. మాటల్లో వర్ణించలేం. అలా హెడ్ మాస్టర్, టీచర్లు, **స్టాఫ్.. మా** స్కూల్‌కు బెస్ట్ ఆర్ట్ వర్క్ చేయండి అంటూ అడిగి మరీ చేయించుకున్నారు. చాలా వరకూ ట్రైబల్ ఏరియా స్కూల్స్‌లో **చేశాం. ప్రతీ** స్కూల్‌లో వర్క్ ముగించుకుని వచ్చేటప్పుడు చుట్టాలను వదిలి వెళ్తున్న ఫీలింగ్ కలిగింది. ప్రభుత్వ పాఠశాలల **పునర్వైభవ** విజయంలో మాకు కూడా చిన్న పాత్ర ఉండడం జీవితంలో మేం మర్చిపోలేని మధుర జ్ఞాపకం.

– సత్యార్థ్

నాడు అలా..

ఇక్కపై ఎవరైనా ప్రభుత్వ పాఠశాలల గురించి మాట్లాడాలంటే నాడు–నేడుకు ముందు, ఆ తర్వాత అని విభజించి మాట్లాడాల్సిందే. సర్కారు బడులంటే టాయిలెట్స్ కనిపించవు, పైనా కిందా గచ్చు పెచ్చులూడుతూ ఉంటుంది. వానపడితే పుస్తకాలు బల్లల కింద దాచుకోవాలి. ఫ్యాన్లు శబ్దాలు చేస్తాయి తప్ప తిరగవు. బాగా పాఠాలు చెప్పే టీచర్లు కరువు. ప్రాంగణం పందులు, పశువులకు ఆలవాలం. అందువల్లే పిల్లలను చేర్చలేని దుస్థితి.

నేడు ఇలా..

బెస్ట్ బెంచీలు, గ్రీన్ బోర్డ్స్, ఫ్లోరింగ్, ఫ్యాన్స్, టాయిలెట్స్, క్రీడా పరికరాలతో సహా ప్లే గ్రౌండ్, పుస్తకాలు, బ్యాగ్స్, ట్యాబ్స్.. పూటకో మెనూతో మధ్యాహ్న భోజనం.. ఇలా కార్పొరేట్ స్కూళ్లను తలదన్నేలా చక్కటి వసతులు సమకూరాయి. పిల్లలు, టీచర్లలో నవోత్సాహం కనిపిస్తోంది. ఇప్పుడు ఏ మాత్రం అవకాశం ఉన్నా ప్రభుత్వ పాఠశాలల్లోనే జాయిన్ చేయాలి అనే పరిస్థితి వచ్చింది.



శేషన్ కట్టడికి రాజ్యాంగ సవరణ

స్వతంత్ర భారతావనిలో ఎన్నికల కమిషన్ సత్తాను చాటిచెప్పిన వ్యక్తి టీఎన్ శేషన్. ఎన్నికల సంఘానికి ఉన్న విశేష అధికారాలను చాలా వరకు ఉపయోగించి ప్రభుత్వాలకు చెమటలు పట్టించారు. 1993లో తమిళనాడు ఎన్నికల సందర్భంగా కేంద్ర బలగాలను పంపాలని కేంద్రాన్ని ఆయన కోరారు. దీనికి కేంద్ర హోం శాఖ ససేమిరా అనడంతో శేషన్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఎన్నికల సంఘం అధికారాన్ని గుర్తించే వరకు ఎన్నికలు నిర్వహించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. దీంతో శేషన్‌ను కట్టడి చేసేందుకు ఏకంగా రాజ్యాంగ సవరణ చేశారు. ఈ సవరణ ద్వారా ఎన్నికల కమిషన్‌లో మరో ఇద్దరు కమిషనర్లను నియమిస్తూ ఆయనకు చెక్ పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వ సిబ్బందిని ఎన్నికల సమయంలో డిప్యుటేషన్ మీద తన పరిధిలోకి తీసుకునే విషయంలో కూడా ప్రభుత్వాలకు, శేషన్‌కు మధ్య యుద్ధమే నడిచింది. దీనికి కేంద్ర ప్రభుత్వం అభ్యంతరం తెలపడంతో దీనిపై సుప్రీంకోర్టును శేషన్ ఆశ్రయించారు. ఆయనకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది.



నెహ్రూ వర్సెస్ పుచ్చలపల్లి

1952లో రాజ్యసభ సమావేశాల్లో ప్రతిపక్ష నాయకుడు, సీపీఐ పార్లమెంటరీ పక్షనాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య సభలో మాట్లాడుతూ.. 'అధ్యక్షా.. లేడీ మౌంట్ బాటన్ భారత పర్యటనకు ఎందుకు వస్తున్నారో ప్రధానమంత్రి నెహ్రూ చెప్పాలి. మన అంతర్గత వ్యవహారాలలో బ్రిటిష్ వాళ్ల జోక్యాన్ని అంగీకరించబోం అంటూ మండిపడ్డారు. వెంటనే నెహ్రూ జోక్యం చేసుకుని.. సుందరయ్య గారూ. మీరేం మాట్లాడుతున్నారో తెలుసా? మీ వ్యాఖ్యల్ని ఉపసంహరించుకోండి అనడంతో సభలో దుమారం చెలరేగింది. సభ చైర్మన్ సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆదేశంతో గొడవ సద్దుమణిగింది. మర్నాడు ఉదయం సుందరయ్యను సర్వేపల్లి అల్పాహారానికి ఆహ్వానించి.. నెహ్రూకు అంత కోపం ఎందుకొచ్చిందో మీకు తెలియదా.. లేడీ మౌంట్ బాటన్‌తో ఆయనకు సన్నిహిత సంబంధం ఉన్నట్టు అందరూ మాట్లాడుకోవడం నెహ్రూకు నచ్చదు. అందుకే అంత కోపం వచ్చింది'అని సర్వేపల్లి చెప్పారు.

మీకు తెలుసా?

ఒక్క ఓటు తేడాతో గెలుపు

2004లో కర్ణాటకలోని సంతేమరహళ్లి అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఎన్నికల్లో జేడీఎస్ నుంచి ఏఆర్ కృష్ణమూర్తి, కాంగ్రెస్ అభ్యర్థిగా ఆర్.ధ్రువనారాయణ పోటీపడ్డారు. ఆ ఎన్నికల్లో కృష్ణమూర్తికి 40,751 ఓట్లు, ధ్రువనారాయణకు 40,752 ఓట్లు రాగా.. ఒక్క ఓటుతో ధ్రువనారాయణ విజేతగా నిలిచారు. 9 ఓట్ల తేడాతో ఇద్దరు 1989 ఎన్నికల్లో అనకాపల్లి లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున కొణతాల రామకృష్ణ కేవలం తొమ్మిది ఓట్ల తేడాతో గెలుపొందారు. 1998లో జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో బిహార్‌లోని రాజ్‌మహల్ నియోజకవర్గం నుంచి పోటీ చేసిన బీజేపీ అభ్యర్థి సోమ్ మారండి కూడా 9 ఓట్ల తేడాతో గెలిచారు.

అప్పట్లో ఎమ్మెల్యే పదవి ఏడేళ్లు


1956లో ఆంధ్ర, తెలంగాణ కలిసి ఆంధ్ర ప్రదేశ్‌గా ఏర్పడ్డాయి. నీలం సంజీవరెడ్డి మొదటి సీఎం అయ్యారు. 1957లో దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఆంధ్ర ప్రాంతంలోని 196 అసెంబ్లీ నియోజకవర్గాల్లో అప్పటికే మధ్యంతర ఎన్నికలు జరగడంతో తెలంగాణలోని 104 అసెంబ్లీ నియోజకవర్గాలకు మాత్రమే ఎన్నికలు నిర్వహించారు. దీంతో ఆంధ్ర, రాయలసీమకు చెందిన 196 మంది ఎమ్మెల్యేలు 1962 వరకూ ఏడేళ్లు ఎమ్మెల్యేలుగా కొనసాగారు.

స్పీకర్లకు అడ్డా... శ్రీకాకుళం గడ్డ

రాష్ట్ర శాసనసభ స్పీకర్లకు పెట్టిందిపేరు శ్రీకాకుళం జిల్లా. ఈ జిల్లా నుంచి ఎన్నికైన ఎన్నికైన నలుగురు ఎమ్మెల్యేలు శాసన సభ స్పీకర్లుగా వ్యవహరించారు. 1955లో రొక్కం లక్ష్మీనర్సింహం దొర, తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించాక 1983లో ఎన్.టి.రామారావు ముఖ్యమంత్రిగా వ్యవహరించిన శాసనసభకు శ్రీకాకుళం ఎమ్మెల్యేగా ఎన్నికైన తంగి సత్యనారాయణ స్పీకర్‌గా వ్యవహరించారు. అటు తరువాత తెలుగుదేశం హయాంలోనే నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి ఎన్నికైన కావలి ప్రతిభాభారతి, తాజాగా విభజిత ఆంధ్ర ప్రదేశ్‌లో వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆమదాలవలస శాసనసభ స్థానం నుంచి ఎన్నికైన తమ్మినేని సీతారాం స్పీకర్‌గా వ్యవహరించారు.

మరికొన్ని అభివృద్ధి పనులు

- రూ.43 కోట్లతో శ్రీకాకుళం-ఆమదాలవలస నాలుగులైన్ల రోడ్డు
- రూ.28 కోట్లతో పొందూరు రైల్వే బ్రిడ్జి నిర్మాణం
- రూ.48 కోట్లతో అలికాం ఆమదాలవలస మధ్య రైల్వే బ్రిడ్జి నిర్మాణం
- ప్రసాదం స్కీమ్ కింద శ్రీముఖలింగం టెంపుల్ సర్క్యూట్ అభివృద్ధి
- 1,10,825 మందికి ఉచితంగా ఇళ్ల స్థలాలు, అందులో 83,456 ఇళ్ల నిర్మాణాలు
- శ్రీకాకుళం, పలాస, పాలకొండలో ఆక్వా హబ్‌లు
- నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు 27 ఫిష్ ఆంధ్ర డెలిషియస్ యూనిట్లు



ప్రగతి పథం... శ్రీకాకుళం గమనం...

- గడచిన ఐదేళ్లలో శ్రీకాకుళం జిల్లాలో ఊహించని అభివృద్ధి
- గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రత్యేక ప్రాజెక్టులు మంజూరు
- వ్యవసాయం, పారిశ్రామిక, మత్స్యకార రంగాల్లో ప్రగతి పరుగులు
- ప్రతి గ్రామంలోనూ కళ్లెదుటే కనిపిస్తున్న భవనాలు
- పెరిగిన పంటల దిగుబడి... ప్రభుత్వ మద్దతుతో రైతుకు రాబడి
- వేలాది మందికి కొత్తగా ఉద్యోగావకాశాలు
- కొత్త ప్రాజెక్టుల పుణ్యమాని మారుతున్న జిల్లా రూపురేఖలు


పలాసలో నిర్మించిన కిడ్నీ రీసెర్చ్ సెంటర్

రూ.141.70 కోట్లతో 650 రైతు భరోసా కేంద్ర భవనాలు మంజూరు కాగా రూ.67.67 కోట్లతో 270 భవనాలు పూర్తి

రూ.282 కోట్లతో 654 గ్రామ సచివాలయ భవనాలు మంజూరు కాగా రూ.146.74 కోట్లతో 380 భవనాలు పూర్తి

రూ.31.20 కోట్లతో 195 డిజిటల్ లైబ్రరీ భవనాలు మంజూరుకాగా 22 భవనాల నిర్మాణం.

రూ.93.62 కోట్లతో 535 విలేజ్ క్లినిక్ భవనాలు మంజూరు కాగా రూ.48.42 కోట్లతో 122 భవనాలు పూర్తి.. ఐదు రూరల్ పీహెచ్‌సీలు, 11 అర్బన్ హెచ్‌సీలు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :


ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చొరవతో శ్రీకాకుళం జిల్లా అభివృద్ధి దిశగా పయనిస్తోంది. కిడ్నీ వ్యాధులు అధికంగా ప్రబలుతున్న ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకు అండగా నిలిచారు. పలాసలో రూ.50 కోట్లకుపైగా ఖర్చు చేసి 200 పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కిడ్నీ వ్యాధులపై రీసెర్చ్ సెంటర్, అతిపెద్ద డయాలసిస్ సెంటర్ నిర్మించారు. ఇక్కడి కిడ్నీ వ్యాధులకు ప్రధాన కారణం తాగునీరే అని తేలడంతో పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల పరిధిలోని ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో 807 గ్రామాలకు ఉపరితల రక్షిత మంచినీరు అందించేందుకు రూ.700 కోట్లతో ప్రాజెక్టు నిర్మించారు. సుమారు 5,57,633 మందికి తాగునీరు అందించారు. మూలపేట పోర్టు నిర్మాణంతో మత్స్యకారులకు ఆసరా దొరికింది.

సాగుకు సాయం

- జిల్లాలో రైతుల కోసం 642 రైతుభరోసా కేంద్రాలు, 7 ఇంటిగ్రేటెడ్ ల్యాబ్‌లు నిర్మించారు. వైఎస్సార్ రైతు భరోసా కింద 3.21 లక్షల మందికి రూ.1,919.46 కోట్లు, వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద 87,158 మందికి రూ.85.14 కోట్లు అందజేశారు.
- రూ.424.74 కోట్లతో 2,89,197 క్వింటాళ్ల విత్తనాలు సబ్సిడీపై అందించారు.
- 82,745 మెట్రిక్ టన్నుల ఎరువులు, 5592 లీటర్ల నానో యూరియా వంటివి అందించారు.
- చిన్న, సన్నకారు రైతుల కోసం 505 ట్రాక్టర్లు, మల్టిపుల్ క్రాప్ థ్రెసర్స్, పాడిరేపర్స్, రోటావేటర్స్, 57 క్లస్టర్లలో వరి కంబైన్డ్ హార్వెస్టర్స్ వంటివి అందించారు.
- 10వేల భూసార పరీక్షలు చేశారు. 27,049 కౌలు రైతులకు గుర్తింపు కార్డులిచ్చారు.

ఉద్యోగాల కల్పన


- సచివాలయాల ఏర్పాటు ద్వారా 7880 మందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. - ప్రతి పీహెచ్‌సీకి అదనంగా ఒక్కో డాక్టర్ వంతున 66 మంది నియామకం
- పీహెచ్‌సీల్లో 108, 104 వాహనాల్లో కొత్తగా 2199 మంది నియామకం
- ఎంప్లాయిమెంట్ కార్యాలయం, స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా 9018 ఉద్యోగాలు



	ఖరీఫ్ విస్తీర్ణం (హెక్టార్లలో)	ఖరీఫ్ దిగుబడి (మెట్రిక్ టన్నులు)	రబీ విస్తీర్ణం (హెక్టార్లలో)	రబీ దిగుబడి (మెట్రిక్ టన్నులు)
2018-2019	166593	515772	4179	16240
2019-2020	167926	709823	8414	35431
2020-2021	154295	586478	13302	59021
2021-2022	157566	604896	8157	32873
2022-2023	150942	715465	8145	36270

జలయజ్ఞానికి ఊతం

- జిల్లాను సస్యశ్యామలం చేసేందుకు వంశధార ఫేజ్ 2లోని స్టేజ్ 2 పనులు పూర్తి చేయడమే కాకుండా నేరడి బ్యారేజీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులను అధిగమించేలా రూ.176.35 కోట్లు వెచ్చించి లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ నిర్మిస్తున్నారు. మహేంద్ర తనయపై నిర్మిస్తున్న ఆఫ్ షోర్ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.852 కోట్లు మంజూరు చేశారు. మడ్డువలస రెండో దశ పనులకు రూ.26.65 కోట్లు మంజూరు చేశారు.
- మత్స్యకారుల సంక్షేమం, వివిధ ఎగుమతులు, దిగుమతులకు అనుకూలంగా మూలపేటలో రూ.2,949.70 కోట్లతో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఈ ప్రాజెక్టు పూర్తయితే 25 వేల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. మత్స్యకారుల కోసం రూ.365.81 కోట్లతో బుడగట్లపాలెంలో ఫిషింగ్ హార్బర్, వజ్రపుకొత్తూరు మండలంలోని నీళ్లపేటలో రూ.11.95 కోట్లతో జెట్టీ నిర్మిస్తున్నారు.


నిర్మాణంలో ఉన్న మూలపేట పోర్టు

మెరుగుపడిన మార్గాలు

- గడచిన ఐదేళ్లలో ఆర్అండ్‌బీ పరిధిలో రూ.526.69 కోట్లతో 633.4 కిలోమీటర్లకు సంబంధించి 432 రోడ్లు మంజూరు చేయగా చాలా వరకూ పూర్తయ్యాయి. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో ఏఐఐబీ కింద రూ.352.78 కోట్లతో 484.43 కిలోమీటర్ల మేర 312 రోడ్లు మంజూరు కాగా 266 రోడ్ల పనులు జరుగుతున్నాయి.
- ఆర్‌సీపీఎల్‌డబ్ల్యూ కింద రూ.70.96 కోట్లతో 94.30 కిలోమీటర్ల పొడవున 23 రోడ్లు మంజూరు చేయగా వాటిలో రూ.55.55 కోట్లతో 21రహదారుల నిర్మాణం పూర్తయింది.
- పీఎంజీఎస్‌వై బ్యాచ్ 1 కింద రూ.51.27 కోట్లతో 11 పనులు మంజూరు కాగా 10 పనులు, బ్యాచ్ 2లో రూ.38.23 కోట్లతో 8 పనులు మంజూరు కాగా 6 పూర్తయ్యాయి.
- ఏపీ రూరల్ రోడ్డు ప్రాజెక్టు వర్క్స్ కింద రూ.350 కోట్లతో 480 కిలోమీటర్ల పొడవు గల 312 పనులు చేపడుతున్నారు. రెన్యువల్ వర్క్స్ కింద రూ.50 కోట్లతో 200 కిలోమీటర్ల పొడవున 83 పనులు చేపడుతున్నారు.
- గిరిజన ప్రాంతాల్లో రూ.56.35 కోట్లతో 102 గ్రామాలకు ఉపయోగపడేలా 42 సీసీ, బీటీ రోడ్లు వేశారు. నగరపాలక, పురపాలక సంఘాల్లో రూ.16.60 కోట్లతో 115 రహదారులను అభివృద్ధి చేశారు. మరో రూ.300 కోట్లతో జిల్లాలో 12 భారీ వంతెనలు నిర్మించారు. బలసలరేవు బ్రిడ్జి నిర్మాణానికి రూ.87 కోట్లు మంజూరు చేశారు.
- పాతపట్నం 50 పడకల సామాజిక ఆస్పత్రిని రూ.4.2 కోట్లతో, జొన్నవలస ఆస్పత్రిని రూ.2.45 కోట్లతో, లావేరులో రూ.1.2 కోట్లతో, సోంపేట సామాజిక ఆస్పత్రిని రూ.4.60 కోట్లతో, బారువ సామాజిక ఆస్పత్రిని రూ.5.60 కోట్లతో అభివృద్ధి చేస్తున్నారు. నాడు నేడు కింద 83 ఆస్పత్రులను రూ.47 కోట్లతో అభివృద్ధి చేశారు. నరసన్నపేట ఆస్పత్రిని 100 పడకలకు అప్‌గ్రేడ్ చేశారు.
- ఇంటింటికి తాగునీరు సరఫరాకు రూ.1552.36 కోట్లతో 4822 పనులు ప్రారంభించగా, ఇప్పటికే కొన్ని పనులు పూర్తయ్యాయి. జగనన్న హౌసింగ్ కాలనీలో తాగునీరు అందించేందుకు 791 పనులను రూ.38.4 కోట్లతో చేపడుతున్నారు.



సుపరిపాలన సుసాధ్యమయ్యేలా...

- జాతిపిత కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనే లక్ష్యంగా జిల్లాలో 835 గ్రామ సచివాలయాలు, 95 వార్డు సచివాలయాల ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నారు.
- వీటి ద్వారా మొత్తం 512 రకాల సేవలు అందిస్తుండగా, ఇప్పటివరకూ 47,27,732 మందికి సేవలందాయి.
- విలేజ్ హెల్త్ క్లినిక్స్ ద్వారా సామాన్య, పేద వర్గాలకు గ్రామాల్లోనే వైద్య సేవలు అందుతున్నాయి. జగనన్న ఆరోగ్య సురక్ష పేరిట ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. కొత్తగా రూరల్ ప్రాంతాల్లో 5 పీహెచ్‌సీలు, శ్రీకాకుళం, ఆమదాలవలస తదితర అర్బన్ ప్రాంతాల్లో 11 పీహెచ్‌సీలు నిర్మించారు.

శ్రీకూర్మం ఆస్పత్రిలో చాలా మార్పులొచ్చాయి



గతంలో శ్రీకూర్మం ఆస్పత్రి వద్దకు వచ్చేవాడిని. కూర్చోడానికి కూడా అవకాశం ఉండేది కాదు. పాడుబడిన భవనం ఉండేది. ఇరుకైన గదులు, ఎవ్వరూ కూడా సరిగ్గా ఉండేవారు కాదు. ఇప్పుడు ఎక్కడికో వెళ్లినట్టుంది. ఈ ప్రభుత్వం వచ్చాక గదులు అందంగా తయారు చేశారు. అన్ని పరీక్షలు రూపాయి ఖర్చు లేకుండా చేస్తున్నారు. అన్ని సలహాలు చెబుతూనే మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. అలాగే మా గ్రామంలోకి డాక్టరమ్మలు వచ్చి ఆరోగ్యం కోసం అడుగుతున్నారు. అవసరమైన మందులు కూడా ఇంటి వద్దనే ఇస్తున్నారు.

-గేదెల తవుడు, దువ్వపేట, గార మండలం

జగన్ ఏలిక... ఆంధ్రావనికి ఏరువాక!

జనం బాధలు తమవిగా భావించే నేతలే ప్రజా సమస్యల పరిష్కారానికి తపిస్తారు. అలా తపించే నాయకులే నేటి సమాజానికి కావాలి. ఎవరికి ఏ కష్టమొచ్చినా చలించే మనసు ఉండాలి. చలించడంతో సరిపోదు... ఆ బాధలను తీర్చాలన్న పట్టుదల... ఆ కష్టం తీరేదాకా జనం వెన్నంటి ఉన్నప్పుడే రాజకీయ నాయకుడికి గుర్తింపు. అలాంటి గుర్తింపును తండ్రీ తనయులైన దివంగత సీఎం డాక్టర్ వైఎస్సార్, ప్రస్తుత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలోనూ అతి దగ్గరగా చూసిన ఒక వ్యవసాయ శాస్త్రవేత్త మనోగతమిది... రైతులకు ఏం చేస్తే వారి బతుకులు బాగుపడతాయని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వేర్వేరు సందర్భాల్లో ఈ శాస్త్రవేత్తను సలహాలు అడిగారు. తాను చెప్పిన వాటన్నిటినీ తూచా తప్పకుండా ఆచరించడమే జగన్‌లోని ఆదర్శ నాయకుడిని చూపించాయని ఆ శాస్త్రవేత్త చెబుతున్నారు. జగన్‌లోని వినే గుణం, విన్న తర్వాత ఆచరణలోకి తీసుకురావడమనేది ఈ రాష్ట్ర వ్యవసాయ రంగానికి పట్టిన అదృష్టమని ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ పూర్వపు వీసీ, భారత వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) గవర్నింగ్ బాడీ మాజీ సభ్యుడు, ఏపీ అగ్రి మిషన్ సభ్యుడు...ప్రొఫెసర్ పోలి రాఘవరెడ్డి కొనియాడారు... జగన్‌తో తన స్ఫూర్తిదాయక అనుభవాలను ఇలా 'సాక్షి' తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

– సాక్షి, అమరావతి

- రైతు జనబాంధవుడు డాక్టర్ వైఎస్సార్...
- తండ్రి బాటలోనే సీఎం జగన్ వందడుగులు ముందుకు..
- పరిశోధనా కేంద్రాల్లో మౌలిక వసతులకు రూ.50 కోట్లు
- రైతు ముంగిటకే సాగు ఉత్పాదకాల పంపిణీ
- ఉత్పత్తులకు మద్దతు ధర.. ధాన్యం కొనుగోలు
- వైఎస్ మాదిరిగానే రైతు పక్షపాతిగా నిలిచిన వైఎస్ జగన్
- సాక్షితో ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం పూర్వ వీసీ, ఐసీఏఆర్ గవర్నింగ్ బాడీ మాజీ సభ్యుడు ప్రొ.పోలి రాఘవరెడ్డి



ఇంటర్వ్యూ

'నాడు ఆ మహానేత వైఎస్సార్.. నేడు ఆయన తనయుడు ఏపీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి.. రైతుల కోసం ఆలోచించే విధానం.. స్పందించే తీరు ఒకే రీతిలో ఉంది. ప్రతీ అడుగులోనూ రైతులకు మేలు చేయాలన్న తపన వారిద్దరిలోనూ కన్పించింది. ఇద్దరి పాలనా తీరును దగ్గర నుంచి చూశాను. నాన్న ఒక అడుగు వేస్తే నేను నాలుగడుగులు వేస్తానన్న సీఎం వైఎస్ జగన్.. ఐదేళ్లలో రైతుల కోసం ఏకంగా వంద అడుగులు వేశారనే చెప్పాలి. మహానేత హయాంలో రైతులు ఎంత సుభిక్షంగా ఉన్నారో అంతకు రెట్టింపు సంతోషంగా ఈ ఐదేళ్లలో ఉన్నారని వ్యవసాయ రంగ నిపుణుడిగా నేను కచ్చితంగా చెప్పగలను. ఎందుకంటే ఈ ఐదేళ్లలో ఈ రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు, విప్లవాత్మక మార్పులు..నాకు తెలిసి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఈ 77 ఏళ్లలో ఎన్నడూ చూడలేదు. ఒక విధంగా చెప్పాలంటే ఈ ఐదేళ్లలో వ్యవసాయ, అనుబంధ రంగాల్లో సమ్మిళిత అభివృద్ధికి బాటలు పడ్డాయని చెప్పొచ్చు.

శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు ...

రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు పడుతున్నాయి. పాదయాత్రలో రైతుల కష్టాలను దగ్గర నుంచి చూసిన నేతగా వైఎస్ జగన్ వారి ప్రతీ సమస్య పట్ల స్పష్టమైన అవగాహనతో ఉన్నారు. ప్రతీ విషయాన్ని పాజిటివ్‌గా తీసుకుంటున్నారు. సమస్యలను ఆకళింపు చేసుకోవడమే కాదు వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. వ్యవసాయం లాభసాటి కావాలంటే సాగుకు అవసరమైన పెట్టుబడి, సారవంతమైన నేల, అవసరమైన మేరకు నీరు, సాగు ఉత్పాదకాలు, సాంకేతిక బదలాయింపు, గిట్టుబాటు ధర కల్పన, సరైన మార్కెటింగ్ వ్యవస్థ ఏర్పాటు అవసరం. ఈ ఐదేళ్లలో వీటిపైనే ప్రధానంగా దృష్టి కేంద్రీకరించారు. ఎన్నో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చారు.

పరిశోధనలకు పెద్ద పీట...

మహానేత వైఎస్సార్ సీఎంగా ఉన్నప్పుడు నేను మార్టేరు పరిశోధనా స్థానం ప్రధాన శాస్త్రవేత్తగా ఉండేవాణ్ని. సీఎంగా పగ్గాలు చేపట్టిన తొలి నాళ్లలో మా పరిశోధనా స్థానానికి వచ్చినప్పుడు రైతుల కోసం ఏం చేస్తే బాగుంటుందని సలహా అడిగారు. పరిశోధనలు బాగా పెరగాలి. వాటి ఫలాలు క్షేత్ర స్థాయిలో రైతులకు చేరువ చేసిన రోజు కచ్చితంగా వారికి మేలు జరుగుతుందని చెప్పాను. అంతే.. క్షణం ఆలోచించకుండా పరిశోధనా కేంద్రాల్లో మౌలిక వసతుల కల్పన కోసం అక్కడికక్కడే రూ.50 కోట్లు మంజూరు చేశారు. ఫలితంగా కొత్త రకాలు సృష్టించగలిగాం. ఉత్పత్తిని పెంచేందుకు బలమైన అడుగు వేయగలిగాం. ఆ తర్వాత డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్‌గా, వీసీగా ఆయన హయాంలో పనిచేసే అవకాశం కలిగింది. ఆ సమయంలో నేను ఇచ్చిన సలహాలు, సూచనలకు ఎంతో విలువ ఇచ్చేవారు. ఆచరణలో పెట్టేందుకు కృషి చేశారు. ఆ మహానేత కంటే మిన్నగా నేడు సీఎం వైఎస్ జగన్ తాను అమలు చేసే ప్రతీ కార్యక్రమం రైతు సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకునే చేస్తున్నారు.

రైతులకు మేలు చేయాలన్నదే ఆయన తపన

మహానేత మాదిరిగానే వైఎస్ జగన్ రైతుకు మేలు చేసేందుకు ఎవరు ఏ సలహా ఇచ్చినా తీసుకుంటున్నారు. అగ్రిమిషన్ తొలి సమావేశంలో పెట్టుబడి సాయం ఇచ్చేటప్పుడు ఎంత విస్తీర్ణం ఉండాలి. ఎవరిని రైతులుగా గుర్తించాలని అడిగారు. అప్పుడు నేను చెప్పిన రెండు సూచనలు ఆచరణలో పెట్టారు. తమలపాకు రైతులు చాలా తక్కువ విస్తీర్ణంలో సాగు చేస్తారు. పైగా మెజార్టీ సాగుదారులకు ఎకరం కంటే తక్కువ భూమే ఉందని చెప్పాను. ఒక రైతుకు ఇద్దరు ముగ్గురు కొడుకులుంటారు. పెళ్లయిన తర్వాత వారికి పొలాలు వాటాలు పంచినా ఒకే ఇంట్లో ఉంటారు. అలాంటప్పుడు వారందరినీ ఒకే కుటుంబంగా పరిగణించడం సరికాదన్నా.. అని చెప్పాను. అలా చెప్పిన మరుక్షణమే.. రైతుకు 15 సెంట్లున్నా పెట్టుబడి సాయం ఇవ్వాలని, పెళ్లయితే చాలు ఒక ఇంట్లో ఎంత మంది ఉన్నా వేర్వేరు కుటుంబాలుగా పరిగణించి రైతు భరోసా ఇద్దామని సీఎం జగన్ ప్రకటించి ఆచరణలో పెట్టారు. రైతులకు ఒక్క రూపాయి అయినా అదనంగా మేలు చేయాలన్న తపన, తాపత్రయం పెద్దాయనలో మాదిరిగానే వైఎస్ జగన్‌లోనూ చూశాను.



ప్రచారంలో పదనిసలు

విజయనగరం జిల్లా రాజాం వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ తలే రాజేష్ రాజాం మండలం పెనుబాక గ్రామంలో ముర్రి సూర్యం ఇంటి వద్ద చేనేత రాట్నం తిప్పి, నూలు వడికారు. నేతన్న నేస్తం పథకం లబ్ధిని ఆ కుటుంబానికి వివరించారు. -రాజాం

వ్యూహం కాదిది.. ద్రోహం!

▶ మొదటి పేజీ తరువాయి

పెట్టుకొని ఆ పార్టీకి కేటాయించిన సీట్లలో కూడా చంద్రబాబు.. తమ మనుషులకే సీట్లు దక్కించుకున్న పరిస్థితి. అరకు, అనపర్తి అసెంబ్లీ స్థానాలతో పాటు నరసాపురం లోక్‌సభ స్థానంలో మాత్రమే తొలి నుంచి బీజేపీని నమ్ముకున్న నాయకులకు సీట్లు దక్కాయని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అందులో అనపర్తి అసెంబ్లీ, నరసాపురం లోక్‌సభ స్థానాలకు పార్టీ జాతీయ నాయకత్వం అభ్యర్థులను ప్రకటించిన తర్వాత ఇప్పుడు ఆ స్థానాలను తిరిగి టీడీపీకి అప్పగించేందుకు పురందేశ్వరి సూత్రప్రాయంగా అంగీకారం తెలుపుతూ తిరిగి జాతీయ నాయకత్వానికి ప్రతిపాదనలు పంపడంపై బీజేపీ నేతలు మండిపడుతున్నారు.

జనసేనకు సైతం ఇదే అన్యాయం

టీడీపీతో పొత్తు పెట్టుకున్న జనసేనది సైతం బీజేపీలాంటి పరిస్థితే. చంద్రబాబు అవినీతి ఆరోపణల కేసులో అరెస్టయి జైలులో ఉన్న సమయంలో పవన్‌కళ్యాణ్ రాజమండ్రి జైలుకు వెళ్లి పరామర్శ అనంతరం అధికారికంగా రెండు పార్టీల మధ్య పొత్తు పొడిచిందని ప్రకటించారు. రాష్ట్రంలో దాదాపు మూడో వంతు సీట్లు జనసేనకే కేటాయిస్తామని టీడీపీ హామీ ఇచ్చినట్టు పవన్ తమతో చెప్పినట్టు ఆ పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే ఆచరణలో జరిగింది వేరు. చంద్రబాబుతో మూడు నాలుగు విడతలుగా పవన్ భేటీల తర్వాత కేవలం 24 అసెంబ్లీ, మూడు లోక్‌సభ స్థానాలకు పరిమితం చేశారు. ఆ తర్వాత అందులో ఒక లోక్‌సభ, మూడు అసెంబ్లీ స్థానాలకు కోతలు పెట్టారు. తుదకు మిగిలిన 21 అసెంబ్లీ స్థానాల్లో ఎక్కువ చోట్ల ఆ నియోజకవర్గ టీడీపీ నాయకులనే పార్టీలో చేర్చుకొని టికెట్లు కట్టబెట్టారు. ఈ వ్యవహారంపై జనసేన నేతలు కొద్ది రోజులుగా బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు.



స్టేట్ స్కాన్

పాత కత్తులు.. కొత్త పొత్తులు

బిహార్‌లో హోరాహోరీ

2019లో ఎన్డీఏ క్లీన్‌స్వీప్ ☛ ఈసారి చిక్కని ఓటరు నాడి ☛ ఇండియా కూటమి గట్టిపోటీ
మళ్లీ బీజేపీతో జట్టుకట్టిన నితీశ్ ☛ 'పల్టూరాం'పై జనస్పందనే కీలకం!

కులాల కుంపట్లు, పొత్తుల కత్తులు, కిచిడీ కూటములు, జంపింగ్ జపాంగ్‌లకు పెట్టింది పేరైన బిహార్‌లో రాజకీయాలు ఎప్పుడూ కాక పుట్టిస్తూనే ఉంటాయి. 40 సీట్లతో లోక్‌సభ నియోజకవర్గాల పరంగా దేశంలో నాలుగో స్థానంలో నిలుస్తున్న ఈ తూర్పు రాష్ట్రానిది జాతీయ రాజకీయాల్లో ఆది నుంచీ కీలక పాత్రే. తొలి రాష్ట్రపతి బాబూ రాజేంద్రప్రసాద్ మొదలు జగ్జీవన్‌రాం, నుంచి లాలూ ప్రసాద్, నితీశ్‌కుమార్ దాకా దేశ, రాష్ట్ర రాజకీయాల్లో చక్రం తిప్పిన ఉద్ధండ నేతలకు పుట్టిల్లు బిహార్. అధికారం కోసం ప్రాంతీయ, జాతీయ పార్టీల మధ్య కుమ్ములాటలు, వర్గ పోరు, పవర్ పాలిటిక్స్ ఇక్కడ సర్వసాధారణం.

- సాక్షి, నేషనల్ డెస్క్

రాజకీయంగా చైతన్యవంతమైన బిహార్‌లో లోక్‌సభ ఎన్నికల ముంగిట కొత్త పొత్తులు పొడిచాయి. గత ఎన్నికల్లో బీజేపీ, జేడీ (యూ), లోక్ జనశక్తి పార్టీలతో కూడిన ఎన్డీఏ కూటమి ఏకంగా 39 సీట్లను ఒడిసిపట్టింది. బీజేపీ 17 సీట్లలో పోటీ చేసి అన్నీ గెలుచుకుంది. జేడీ(యూ) 17 సీట్లకు 16 చోట్ల, ఎల్జేపీ ఆరింటికి ఆరూ కైవసం చేసుకున్నాయి. కాంగ్రెస్, ఆర్జేడీ తదితర పార్టీల మహాకూటమి మహా ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ 9 చోట్ల పోటీ చేసి ఒక్క సీటు గెల్చుకోగా ఆర్జేడీ 19 స్థానాల్లో తలపడినా సున్నా చుట్టింది. మిగతా పార్టీలదీ అదే పరిస్థితి. కేంద్రంలో మోదీ 2.0 బలమైన సర్కారు ఏర్పాటులో బిహార్ ఘనవిజయానిది ప్రధాన పాత్ర. ఈసారి పాత మిత్రులతో పూర్వ వైభవానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. బిహార్‌లో 40 స్థానాల్లో ఆరింటిని ఎస్సీలకు కేటాయించారు.

పట్టువదలని విక్రమార్కుడు

విజయ ప్రకాశ్ కొండేకర్. తెల్లగడ్డం, తెల్లని దోతీ, భుజంపై కండువా, ఒంటిపై అంగి కూడా లేకుండా కనిపిస్తాడు. కానీ పట్టు వదలని విక్రమార్కుడనే పదబంధానికి నిలువెత్తు రూపం. మహారాష్ట్రలోని పుణేకు చెందిన ఈయన స్థానిక సంస్థల నుంచి లోక్‌సభ దాకా ఇప్పటికి ఏకంగా 25 సార్లు పోటీ చేశారు. దశాబ్దాలుగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తూనే ఉన్నారు. మహారాష్ట్ర రాష్ట్ర విద్యుత్ బోర్డు నుంచి 1980ల్లో రిటైరయ్యారు.



'బూటు గుర్తునే గెలిపించండి' అని రాసున్న ప్లకార్డును ఓ బండిపై పెట్టుకుని కాలి నడకన ప్రచారం చేస్తుంటారు. నగర వీధుల్లో అతడిని కొందరు పట్టించుకోకుండా వెళ్తే మరి కొందరు సెల్ఫీలు తీసుకుంటారు. సోషల్ మీడియాలో ఉచితంగా ప్రచారం దొరికిందంటూ సంతోషిస్తారాయన. గెలిచే అవకాశం లేదని తెలిసినా ప్రచారం కోసం పూర్వీకుల భూమి, ఇల్లు అమ్మేశాడు. ఎప్పటికైనా ప్రధాని కావాలన్నది ఆయన కలట. దాన్ని నిజం చేసుకోవడానికి ఎన్ని సార్లైనా పోటీ చేస్తూనే ఉంటానంటారు కొండేకర్.

ఆయన కంటే ఘనుడు మరొకరున్నారు. ఆయనే కె.పద్మరాజన్. గిన్నిస్ రికార్డు కోసం 170 కంటే ఎక్కువ ఎన్నికల్లో పోటీ చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో రాహుల్‌గాంధీపైనే బరిలో దిగారు! అలాగే యూపీలోని ఆగ్రా జిల్లాకు చెందిన 78 ఏళ్ల హస్నురామ్ అంబేద్కరి ఇప్పటిదాకా ఏకంగా 98సార్లు ఎన్నికల్లో తలపడ్డారు. ఈసారి కూడా ఆగ్రా, ఫతేపూర్‌సిక్రీ స్థానాల్లో నామినేషన్ వేస్తున్నారు. ఆ రెండింట్లోనూ ఓడి సెంచరీ కొడతారట! 'నీ భార్యే నీకు ఓటేయదు. ఇతరులెలా వేస్తారు' అంటూ ఓ బీఎస్పీ నేత అవమానించడంతో విజయం కోసం కాకుండా ఓట్ల కోసం ఆయన ఇలా పోటీ చేస్తూనే ఉన్నారు!!

నితీశ్ పిల్లిమొగ్గలు...



బిహార్ రాజకీయాల్లో వెలుగు వెలిగిన లాలు అవినీతి కేసుల్లో జైలుపాలైన నాటి నుంచీ రాష్ట్రంపై నితీశ్ కుమార్ పట్టుబిగించారు. ఏదో ఒక పార్టీతో పొత్తుతో 15 ఏళ్లుగా సీఎం పీఠాన్ని అంటిపెట్టుకున్నారు. జాతీయ రాజకీయాల్లోనూ చక్రం తిప్పుతున్నారు. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ, సమాజ్‌వాదీ, జేడీ(ఎస్), కాంగ్రెస్ మహా కూటమిగా పోటీ చేశాయి. ఆర్జేడీ అతి పెద్ద పార్టీగా ఆవిర్భవించినా నితీశ్ సీఎం పదవి దక్కించుకున్నారు. రెండేళ్ల తిరిగేసరికి మహాకూటమికి గుడ్‌బై చెప్పి మళ్లీ బీజేపీతో జట్టుకట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమితో సీట్ల సర్దుబాటు చేసుకుని అత్యధిక ఎంపీ సీట్లను దక్కించుకున్నారు. అదే జోరులో 2020 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఎన్డీఏ భాగస్వామిగా పోటీ చేసి సీఎం పీఠమెక్కారు. జేడీ(యూ) (43) కంటే బీజేపీ (74)కే ఎక్కువ సీట్లు దక్కినా నితీశ్ మళ్లీ సీఎం పదవి దక్కించుకోవడం విశేషం. రెండేళ్లలోనే ఆయన మళ్లీ ప్లేటు ఫిరాయించారు. లోక్‌సభ ఎన్నికల్లో మోదీని ఢీకొట్టడమే లక్ష్యంగా విపక్ష పార్టీలతో కలిసి పోటీ చేస్తామంటూ ఎన్డీఏ కూటమి నుంచి బయటికొచ్చేశారు. మహాకూటమి దన్నుతో మళ్లీ సీఎం అయ్యారు! ఇండియా కూటమి ఏర్పాటు కీలక పాత్ర పోషించారు. తీరా గత జనవరిలో ఎన్డీఏలోకి గెంతి మహాకూటమికి, ఇండియా కూటమికీ కోలుకోలేని షాకిచ్చారు. బీజేపీ దన్నుతో సీఎం పదవిని కాపాడుకున్నారు. లోక్‌సభ ఎన్నికల్లోనూ ఆ పార్టీతో కలిసి పోటీ చేస్తున్నారు.

బీజేపీకి కలిసొస్తుందా...?

నితీశ్‌తో కలిసి 2019 ఫలితాలను రిపీట్ చేయాలని బీజేపీ ఉవ్విళ్లూరుతోంది. కానీ దీర్ఘకాలంగా అధికారంలో ఉన్న నితీశ్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఎన్డీఏ సీట్లకు గండి కొట్టవచ్చని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. రాష్ట్రంలో కులగణన చేపట్టడాన్ని నితీశ్ సొమ్ము చేసుకోవాలనుకుంటున్నారు. అది తమ ఘనతేనని కాంగ్రెస్ ప్రచారం చేసుకుంటోంది. దేశవ్యాప్తంగా ఆ హామీ ఇస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తోంది. బీజేపీ అయోధ్య రామ మందిరంతో హిందుత్వ నినాదాన్ని మళ్లీ తెరపైకి తెచ్చింది. మోదీ ఫ్యాక్టర్, అభివృద్ధి నినాదంపై ఆశలు పెట్టుకుంది. ఈసారి బీజేపీ 17, జేడీయూ 16, చిరాగ్ పాశ్వాన్ సారథ్యంలోని ఎల్జేపీ 5, జితన్ రామ్ మాంఝీకి చెందిన హిందుస్తాన్ ఆవామ్ మోర్చా, రాష్ట్రీయ లోక్ సమతా పార్టీ ఒక్కో స్థానంలో పోటీ చేయనున్నాయి.

కులగణన ఎవరికి ప్లస్!

బిహార్ రాజకీయాలు చిరకాలంగా కులాల చుట్టూనే తిరుగుతున్నాయి. నితీశ్ చేపట్టిన కులగణన మరోసారి రిజర్వేషన్ల తేనెతుట్టెను కదిపింది. రాష్ట్రంలో 94 లక్షల కుటుంబాలు (34.13%) నెలకు రూ.6,000 సంపాదన కూడా లేక పేదరికంలో మగ్గుతున్నాయని కులగణనలో వెల్లడైంది. రాష్ట్రంలో రిజర్వేషన్లను 65 శాతానికి పెంచాల్సిందేనని నితీశ్ పేర్కొన్నారు. రాష్ట్ర జనాభాలో 19.65 శాతం ఎస్సీలు, 1.68 శాతం ఎస్టీలున్నారు. వారిలో ఏకంగా 42.7 శాతం మంది నిరుపేదలని కులగణనలో తేలింది. 27.13 శాతం ఓబీసీలున్నారు. వీరిలో 14.26 శాతం యాదవులు. దాదాపు 17 శాతం మంది ముస్లింలున్నారు. మహాకూటమి యాదవులు, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ ఓట్లపై కాంగ్రెస్ గురిపెట్టింది. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం జరగాలని డిమాండ్ చేస్తోంది. అగ్రవర్ణాలతో పాటు ఓబీసీలు, ఎస్సీ, ఎస్టీలనూ ఆకర్షించేలా బీజేపీ, జేడీయూ పావులు కదుపుతున్నాయి. ప్రధాని మోదీ ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.



సర్వేల సంగతేంటి...?

బిహార్‌లో ఎన్నికల సర్వేల్లో భిన్నాభిప్రాయాలు వెల్లడవుతున్నాయి. నితీశ్ చేరికతో ఎన్డీఏకు 32 నుంచి 35 సీట్లు రావచ్చని కొన్ని సర్వేలు అంచనా వేశాయి. ఇండియా కూటమికి 5–8 సీట్లే వస్తాయని చెప్పాయి. అయితే నితీశ్‌పై ప్రజా వ్యతిరేకత ఇండియా కూటమికి కలిసొస్తుందని ఇండియా కూటమి 15 నుంచి 20 పై చిలుకు దాకా చేజిక్కించుకోవచ్చని మరికొన్ని సర్వేల అంచనా.



యూపీఏ హయాంలో భారత్‌ను బలహీన దేశంగా చూసేవారు. చిన్నాచితకా దేశాల నుంచి కూడా ఉగ్రవాదులు మనపై దాడులకు తెగబడేవారు. కాంగ్రెసేమో చేతకానితనంతో వేరే దేశాలకు ఫిర్యాదు చేస్తుండేది. నేటి భారత్ అలాకాదు, అవసరమైతే ఉగ్రవాదుల ఇళ్లలో దూరి మరీ అంతం చేస్తుంది.

- బిహార్ ఎన్నికల సభలో ప్రధాని మోదీ

మహాకూటమి దెబ్బకు బీజేపీ, ఎన్డీఏ కంగుతిన్నాయి. అందుకే మోదీతో సహా అగ్ర నేతలంతా బిహార్‌లోనే తిరుగుతున్నారు. విపక్షాలపై కత్తిగట్టి ఈడీ, సీబీఐ కూడా ఇక్కడే మరింత ఫోకస్ చేస్తున్నాయి. పేదరికం, ఉపాధి, బిహార్ చిరకాల కోరికైన ప్రత్యేక హోదా గురించి మోదీ మాట్లాడాలి.

- ఎన్నికల ప్రచారంలో ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్

ఇండియా కూటమి పైచేయి సాధిస్తుందా?




ఎన్నికల వేళ వెన్నుపోటు పొడిచిన నితీశ్‌కు గుణపాఠం నేర్పాలని కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియా కూటమి పట్టుదలగా ఉంది. ఆయనది పచ్చి అవకాశవాదమంటూ కాంగ్రెస్, ఆర్జేడీ దుమ్మెత్తిపోస్తున్నాయి. రాష్ట్రంలో కులగణన తమ సంకీర్ణ సర్కారు ఘనతేనని ప్రచారం చేస్తున్నాయి. ఇది దేశానికి ఎక్స్‌రే వంటిదని, కేంద్రంలో అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా కులగణన చేపడతామని రాహుల్ గాంధీ పదేపదే చెబుతున్నారు. మోదీ హయాంలో నిరుద్యోగం, నిత్యావసరాల ధరల పెరుగుదల, కార్పొరేట్ దోపిడీ తదితరాలను ప్రచారాస్త్రాలుగా మలచుకుంటున్నాయి. దేశవ్యాప్తంగా 30 లక్షల ప్రభుత్వోద్యోగాలతో పాటు పలు సంక్షేమ హామీలను ప్రజల్లోకి తీసుకెళ్తున్నారు. 6 న్యాయాలు 25 గ్యారంటీలతో విడుదల చేసిన జాతీయ మ్యానిఫెస్టోను కాంగ్రెస్ ఊరూవాడా ప్రచారం చేస్తోంది. పొత్తులో భాగంగా ఆర్జేడీకి 26, కాంగ్రెస్ 9కి, లెఫ్ట్ పార్టీలకు 5 సీట్లు దక్కాయి. ఆర్జేడీ తమ 26 సీట్లలో మూడింటిని మాజీ మంత్రి ముకేశ్ సాహ్ని సారథ్యంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీ (వీఐపీ)కి కేటాయించింది.

అబ్బాయ్-బాబాయ్ పోరు



బిహార్లో అబ్బాయ్–బాబాయ్ అమీతుమీ అందరి దృష్టినీ ఆకర్షిస్తోంది. ఎల్జేపీ వ్యవస్థాపకుడు రామ్ విలాస్ పాశ్వాన్ మరణం తర్వాత ఆయన వారసత్వం కోసం కుమారుడు చిరాగ్, సోదరుడు పశుపతి పరాస్ హోరాహోరీ తలపడ్డారు. చివరికి పార్టీని పరాస్ చేజిక్కించుకున్నారు. చిరాగ్‌కు ఎల్జేపీ (రాం విలాస్), పశుపతికి రాష్ట్రీయ లోక్ జనశక్తి పార్టీ (ఆర్ఎల్జేపీ) పేర్లను ఎన్నికల సంఘం కేటాయించింది. పశుపతి పార్టీకి బీజేపీ ఒక్క సీటూ ఇవ్వకపోవడంతో ఆయన కేంద్ర మంత్రివర్గం నుంచి వైదొలిగారు. సొంతంగా పోటీ చేస్తామని ప్రకటించారు. చిరాగ్‌కు బీజేపీ ఐదు సీట్లు ఇవ్వగా పట్టుబట్టి పాశ్వాన్ల కంచుకోట అయిన హాజీపూర్‌ను సాధించుకున్నారు. అక్కడ బాబాయ్ పశుపతిపై చిరాగ్ నేరుగా తలపడుతుండటం విశేషం!





నెహ్రూ హవా

1957 కల్లా మరింత బలపడ్డ కాంగ్రెస్

రెండో లోక్‌సభ ఎన్నికల్లో ఘనవిజయం

బలమైన ప్రతిపక్షం లేకపోవడమే కారణం

27 సీట్లతో రెండో అతి పెద్ద పార్టీగా సీపీఐ

స్వాతంత్ర్యం సిద్ధించి అప్పటికి దశాబ్దం గడిచింది. నెహ్రూ పాలనే సాగుతోంది. ముప్పిరిగొన్న సమస్యల నడుమే రెండో లోక్‌సభ ఎన్నికలు ముంచుకొచ్చాయి. ప్రజలకు ఓటు విలువ తెలియజెప్పి ఓటేసేలా చేయడం ఎన్నికల సంఘానికి కీలక సవాలుగా నిలిచింది. అయితే 1952 తొలి ఎన్నికల నిర్వహణ తాలూకు అనుభవం ఈసారి బాగా పనికొచ్చింది. పాకిస్తాన్ రాజ్యాంగ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూ ఉండగానే మనం రెండో ఎన్నికలు కూడా విజయవంతంగా నిర్వహించుకున్నాం. దేశంలో ప్రజాస్వామ్యం గట్టిగా వేళ్లూనుకుందని ప్రపంచానికి చాటాం.

గతం

దేశాన్ని ఎన్నో సమస్యలు వేధిస్తున్నప్పటికీ రెండో లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరోసారి నెహ్రూకే పట్టం కట్టారు. బలమైన ప్రతిపక్షం లేకపోవడమే దీనికి కారణం. 1952లో తొలి ఎన్నికల్లో 364 లోక్‌సభ సీట్లు గెలిచిన కాంగ్రెస్ బలం ఈసారి 371 స్థానాలకు పెరిగింది. ఓట్ల శాతం కూడా 45 శాతం నుంచి 47.8 శాతానికి పెరిగింది. సీపీఐ 27 స్థానాల్లో విజయకేతనం ఎగురవేసింది. 1952తో పోలిస్తే 11 స్థానాలు పెరిగినా ఓట్ల శాతం మాత్రం 32.65 నుంచి 24.55కు క్షీణించింది. కాంగ్రెస్ తర్వాత అధిక స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులే నెగ్గడం విశేషం! వారు 19.3 శాతం ఓటింగ్‌తో 42 స్థానాలు గెలుచుకున్నారు. రాష్ట్రాల స్థాయిలో జనతా, ఫార్వర్డ్ బ్లాక్, గణతంత్ర పరిషత్, అఖిల భారతీయ హిందూ మహాసభ, జార్ఖండ్ పార్టీ, పీపుల్స్ డెమొక్రటిక్ ఫ్రంట్, ప్రజాపార్టీ, పీసెంట్స్ అండ్ వర్కర్స్ పార్టీ, అఖిల భారతీయ రామ్ రాజ్య పరిషత్, రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ, ఆల్ ఇండియా షెడ్యూల్డ్ క్యాస్ట్ ఫెడరేషన్ పోటీ చేశాయి.

సమస్యలు ఎన్నున్నా...


నిరుద్యోగం, ఆహార కొరత, నిత్యావసరాల ధరల పెరుగుదల, రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణ విషయంలో ప్రజల్లో అసంతృప్తి, అవినీతి, ఆశ్రిత పక్షపాతం, ఆశించిన అభివృద్ధి లేకపోవడం, భూసంస్కరణల నత్తనడక, రాష్ట్రాల్లో పాలనా సామర్థ్యం లోపించడం, ఉత్తరాది ఆధిపత్యంపై దక్షిణ భారతీయుల్లో ఆగ్రహం... ఇలాంటి పలు సమస్యలను రెండో లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీలు బలంగా ప్రజల ముందుకు తీసుకెళ్లాయి. ఇన్ని సమస్యలున్నా కాంగ్రెస్‌ను ఢీకొట్టే బలమైన ప్రతిపక్షం లేకపోవడంతో పోటీ ఏకపక్షమేనని ముందే తేలిపోయింది. నెహ్రూ సర్కారుకు ఎన్ని స్థానాలొస్తాయన్నదే కాస్త ఆసక్తి కలిగించిన అంశం. అయితే ఆ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు వచ్చిన సీట్లలో మూడింట రెండొంతులు ఉత్తరాది చలవే! ఒక్క యూపీయే కాంగ్రెస్‌కు ఏకంగా 70 సీట్లు కట్టబెట్టింది!

ఒక స్థానం.. ఇద్దరు ప్రజాప్రతినిధులు

బహుళ అభ్యర్థుల నియోజకర్గాలకు చివరి ఎన్నికలుగా 1957 లోక్‌సభ ఎన్నికలు చరిత్రలో గుర్తుండిపోతాయి. 1957లో 91 స్థానాలు ద్వంద్వ నియోజకవర్గాలున్నాయి. జనరల్ కోటా నుంచి ఒకరు, ఎస్సీ/ఎస్టీ కోటా నుంచి ఒకరు చొప్పున ఆ స్థానాల్లో ఇద్దరు విజేతలుండేవారు. ఆ తర్వాత ఈ విధానాన్ని తొలగించారు. 1952 తొలి ఎన్నికల్లోనైతే పశ్చిమబెంగాల్‌లో ముగ్గురు అభ్యర్థులు ప్రాతినిధ్యం వహించిన నియోజకవర్గం కూడా ఉంది...!

వాజ్‌పేయి అరంగేట్రం...

దిగ్గజ నాయకుడు అటల్ బిహారీ వాజ్‌పేయి 1957 ఎన్నికల్లో నెగ్గి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. ఆయనను గొప్ప వక్తగా నెహ్రూ కొనియాడారు. అంతే కాదు, 'ఏదో ఒక రోజు ప్రధాని అవుతాడు' అంటూ కచ్చితంగా భవిష్యద్దర్శనం కూడా చేశారు! ఇక, సీఈసీగా వరుసగా రెండు సార్లు సార్వత్రిక ఎన్నికలను విజయవంతంగా నిర్వహించిన సుకుమార్ సేన్ 1958 డిసెంబర్ 19న కన్నుమూశారు.



రెండో లోక్‌సభలో పార్టీల బలాబలాలు
(మొత్తం స్థానాలు 494)

పార్టీ	స్థానాలు
కాంగ్రెస్	371
సీపీఐ	27
ప్రజా సోషలిస్ట్ పార్టీ	19
ఆలిండియా గణతంత్ర పరిషత్	7
ఇతరులు	28
స్వతంత్రులు	42

విశేషాలు ఎన్నెన్నో...

- 1957లో రెండో లోక్‌సభ ఎన్నికలు మొత్తం 14 రాష్ట్రాలు, 6 కేంద్రపాలిత ప్రాంతాల పరిధిలో జరిగాయి.
- ఆంధ్రప్రదేశ్, అసోం, బిహార్, బాంబే, కేరళ, మధ్యప్రదేశ్, మద్రాస్, మైసూరు, ఒడిశా, పంజాబ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, జమ్మూ అండ్ కశ్మీర్‌తో పాటు కేంద్రపాలిత ప్రాంతాలైన ఢిల్లీ, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపుర, అండమాన్ నికోబార్, లక్షద్వీప్–మినీకాయ్–మినిందివిల్లో పోలింగ్ జరిగింది.
- మొత్తం 494 లోక్‌సభ స్థానాలకు గాను ఒక్కో చోట సగటు ముగ్గురు అభ్యర్థుల కంటే బరిలో లేరు.
- కాంగ్రెస్ మినహా మరో బలమైన జాతీయ పార్టీ లేనే లేదు. ప్రాంతీయ పార్టీలు అప్పుడప్పుడే మొగ్గ తొడుగుతున్నాయి.
- జాతీయ స్థాయిలో నాలుగే పార్టీలు ఎన్నికల్లో పాల్గొన్నాయి. రాష్ట్రాల్లో మరో 15 పార్టీలు అదృష్టాన్ని పరీక్షించుకున్నాయి.
- 1957 ఫిబ్రవరి 24 నుంచి జూన్ 9 దాకా మూడున్నర నెలల పాటు ఎన్నికల నిర్వహణ క్రతువు సాగింది.
- ఓటు ప్రాధాన్యతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు ఈసీ ఎంతో కృషి చేసినా పెద్దగా ఫలితం కనిపించలేదు.
- 1952 తొలి ఎన్నికల్లో 44.87 శాతం ఓటింగ్ నమోదవగా 1957లో 45.44 శాతానికి పెరిగింది. 19,36,52,179 మంది ఓటేశారు.
- ఈ ఎన్నికలూ తొలి ఎన్నికల ప్రధాన కమిషనర్ సుకుమార్ సేన్ సారథ్యంలోనే జరిగాయి.
- ఎన్నికల నిర్వహణ వ్యయాన్ని బాగా తగ్గించడంతో పాటు వాటిని మరింత సమర్థంగా నిర్వహించారాయన.
- దాంతో సుడాన్ తమ తొలి ఎన్నికల నిర్వహణ బాధ్యతలను సేన్‌కే అప్పగించడం విశేషం...!
- పోలింగ్ బూత్‌లను ఆక్రమించే పెడ ధోరణి 1957 ఎన్నికల్లోనే తొలిసారిగా కనిపించింది!

• బీజేపీ ఫైర్ బ్రాండ్...

క్యోం కి స్మృతీ భీ కభీ అభినేత్రీ థీ



స్మృతి జుబిన్ ఇరానీ. ఇప్పుడు కేంద్ర మంత్రిగా సుపరిచితులు. ఒకప్పుడు హిందీ టీవీ సీరియల్ వీక్షకుల అభిమాన నటి. సంప్రదాయ కుటుంబం నుంచి వచ్చినా మోడల్‌గా, నటిగా రాణించారు. రాజకీయాల్లో స్వయంకృషితో ఎదిగారు. కాంగ్రెస్ కంచుకోట అమేథీలో రాహుల్‌గాంధీనే మట్టికరిపించారు. ఈసారి కూడా అమేథీలో కాంగ్రెస్‌కు సవాల్ విసురుతున్నారు...

పరిచయం

రాజకీయ ప్రయాణం..

నటనతో దేశవ్యాప్త గుర్తింపు తెచ్చుకున్న స్మృతి 2003లో బీజేపీలో చేరారు. మహారాష్ట్ర బీజేపీ యువజన విభాగం ఉపాధ్యక్షురాలిగా చేశారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ నేత కపిల్ సిబల్‌పై ఢిల్లీలోని చాందినీ చౌక్ నుంచి పోటీ చేసి ఓడారు. 2011లో గుజరాత్ నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2014లో యూపీలోని అమేథీ నుంచి రాహుల్ గాంధీపై పోటీ చేసి ఓటమి చవిచూశారు. 2017లో రెండోసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. అమేథీపై బాగా దృష్టి పెట్టారు. నిత్యం స్థానికంగా ప్రజల్లో ఉన్నారు. కాంగ్రెస్‌పై, రాహుల్‌పై విమర్శలతో హోరెత్తించారు. 2019లో అమేథీలో రాహుల్‌ను ఓడించి తొలిసారి లోక్‌సభలో అడుగుపెట్టారు. అమేథీలో స్థిర నివాసం ఏర్పరుచుకుని అక్కడే ఉంటానని ప్రకటించారు. 2021లో మావాయి గ్రామంలో ఇల్లు కట్టుకున్నారు. ఇటీవలే గృహప్రవేశం చేశారు. 'దమ్ముంటే అమేథీ నుంచి పోటీ చేయండి' అంటూ మళ్లీ రాహుల్‌కు సవాలు విసురుతున్నారు. కేంద్రంలో మానవ వనరులు, సమాచార–ప్రసార, జౌళి శాఖ మంత్రిగా చేశారు. ప్రస్తుతం మహిళా సంక్షేమం, శిశు అభివృద్ధి, మైనారిటీ వ్యవహారాల మంత్రి.

బహుభాషా ప్రావీణ్యం...

స్మృతి 1976 మార్చి 23న ఢిల్లీలోని పంజాబీ కుటుంబంలో జన్మించారు. తండ్రి అజయ్ కుమార్ మల్హోత్రా వ్యాపారి. తల్లి శిబానీ నే బాగ్చీ బెంగాలీ. ఢిల్లీలోని హోలీ చైల్డ్ ఆగ్జిలియమ్ స్కూల్లో చదివారు. తండ్రి ఇష్టానికి వ్యతిరేకంగా పాఠశాల విద్య కాగానే మోడలింగ్ వైపు వెళ్లారు. తర్వాత నటనలో అదృష్టం పరీక్షించుకునేందుకు ముంబైలో అడుగుపెట్టారు. పలు ఉత్పత్తులకు మోడల్‌గా చేస్తూనే నటిగా ప్రయత్నించారు. ఆ క్రమంలో సినిమా కష్టాలు పడ్డారు. పెద్ద కూతురుగా ఇంటి బాధ్యతలను తలకెత్తుకున్నారు. పలు సీరియళ్లలో నటించారు. క్యోం కీ సాస్ భీ కభీ బహు థీ సీరియల్‌తో ఎందరో అభిమానులను సంపాదించుకున్నారు. ఒక టీవీ సీరియల్‌కు సహదర్శకత్వంతో పాటు పలు టీవీ షోలకు హోస్ట్‌గా చేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో 'జై బోలో తెలంగాణ' సినిమాతో తెలుగు ప్రజలకూ పరిచయమయ్యారు. 2001లో జుబిన్ ఇరానీని పెళ్లాడారు. వీరికి కొడుకు జోహార్, కూతురు జోయిష్ ఉన్నారు. వైవిధ్యమైన కుటుంబ, సినీ నేపథ్యం కారణంగా ఆమె హిందీ, బెంగాలీ, మరాఠీ, గుజరాతీ, పంజాబీ భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు.

వివాదాలకు కేరాఫ్

రకరకాల కారణాలతో స్మృతి తరచూ వివాదాల్లో పడుతుంటారు. 2004 లోక్‌సభ ఎన్నికల్లో చాందినీచౌక్ నుంచి పోటీ చేసినప్పుడు ఎన్నికల అఫిడవిట్‌లో ఢిల్లీ యూనివర్సిటీ (స్కూల్ ఆఫ్ కరస్పాండెన్స్)లో 1996లో బీఏ చదివానని పేర్కొన్నారు. 2014, 2019ల్లో అమేథీ నుంచి పోటీ చేసినప్పుడేమో 1994లో ఢిల్లీ యూనివర్సిటీలో బ్యాచిలర్ ఆఫ్ కామర్స్‌లో చేరినట్టు వెల్లడించారు. దాంతో ఆమె డిగ్రీలో చేరింది 1994లోనా, 1996లోనా, చదివింది బీఏనా, కామర్సా అనే విమర్శలొచ్చాయి. 2014లో మానవ వనరుల మంత్రి కావడంతో కనీసం డిగ్రీ లేని వ్యక్తి దేశానికి విద్యా మంత్రా అంటూ నిరసనలు వ్యక్తమయ్యాయి. సమస్య కోర్టు దాకా వెళ్లింది. ఈ వివాదాల నేపథ్యంలో ఆమె మానవ వనరుల నుంచి జౌళి శాఖకు మారారు.